

ఈనాడు

హైదరాబాద్ 2-7-2025 బుధవారం సిటీ సంపుటి 51 . సంచిక 323

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



థాయ్ ప్రధానిని సస్పెండ్ చేసిన రాజ్యాంగ న్యాయస్థానం



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ప్రధానమంత్రి పేటోంగ్టార్న్ షినవత్రను రాజ్యాంగ న్యాయస్థానం మంగళవారం సస్పెండ్ చేసింది. పొరుగుదేశమైన కాంబోడియా ప్రధానితో జరిపిన చర్చల్లో ఆమె అతి వినయం ప్రదర్శిస్తూ మాట్లాడి, నైతిక ఉల్లంఘనకు పాల్పడ్డారన్న అభియోగంపై కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. మే 28న కాంబోడియా, థాయ్‌లాండ్‌ల మధ్య జరిగిన పోరులో కాంబోడియా సైనికుడొకరు మరణించాడు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల్ని సడలించేందుకు కాంబోడియా ప్రధాని హున్‌సేన్‌తో థాయ్ ప్రధాని సంప్రదింపులు జరిపారు. ఈ చర్చల ఆడియో లీక్ కావడంతో షినవత్ర అతి వినయంపై విమర్శలు వెల్లువెత్తాయి. తుది తీర్పు వెలువడే వరకూ ఆమెను పదవి నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది.

భారీగా తగ్గిన తృణ ధాన్యాల వాడకం

- పెరిగిన పాలు, గుడ్లు, మాంసం, ఇతర ఆహార పదార్థాల వినియోగం
- పుష్కర కాలంలో ఆహారపు అలవాట్లలో ఎన్నో మార్పులు



ఈనాడు, దిల్లీ: పుష్కర కాలంలో ప్రజల ఆహారపు అలవాట్లలో చాలా మార్పులొచ్చాయి. కేంద్ర గణాంకశాఖ 'న్యూట్రిషనల్ ఇన్‌టేక్ ఇన్ ఇండియా' పేరుతో తాజాగా విడుదల చేసిన ఎన్‌ఎస్‌ఎస్ రిపోర్టు-594 ఈ వివరాలను వెల్లడించింది. తృణ ధాన్యాల వినియోగం గ్రామాల్లో 14%, పట్టణాల్లో 12% పడిపోయింది. మాంసం వినియోగం గ్రామాల్లో, పట్టణాల్లో 6.5% పెరిగింది. పప్పు దినుసుల వాడకం గ్రామాల్లో 0.4%, పెరగ్గా, పట్టణాల్లో 1% తగ్గింది. పాలు, పాల ఉత్పత్తుల వాడకం గ్రామాల్లో 1.6%, పట్టణాల్లో 0.4% పెరిగింది. ఇతర ఆహార పదార్థాల వినియోగం గ్రామాల్లో 5.7%, పట్టణాల్లో 6.8% వృద్ధి చెందింది. ప్రజలు రోజువారీ తీసుకునే క్యాలరీలు గత పుష్కరకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో 3%, పట్టణ ప్రాంతాల్లో 5.5% పెరిగింది. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో 6.% పట్టణ ప్రాంతాల్లో 2% పెరిగింది. జాతీయ సగటుతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తీసుకుంటున్న తలసరి క్యాలరీలు అధికంగా ఉన్నాయి.

తలసరి క్యాలరీల వినియోగం..

సంవత్సరం	జాతీయ సగటు		ఏపీ	
	గ్రామీణ	పట్టణ	గ్రామీణ	పట్టణ
2009–10	2,147	2,123	2,204	2,223
2011–12	2,233	2,206	2,365	2,281
2022–23	2,233	2,250	2,342	2,314
2023–24	2,212	2,240	2,340	2,285

నివాస ప్రదేశంలో మాత్రమే ఓటరుగా నమోదు కావాలి: సీఈసీ



దిల్లీ: ఓటర్లు తాము సాధారణంగా నివాసం ఉంటున్న ప్రదేశంలో ఓటరుగా నమోదు కావాలే తప్ప తమకు సొంతిల్లు ఉన్న ప్రదేశంలో కాదని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ మంగళవారం నొక్కి చెప్పారు. ఈ సంవత్సరం శాసనసభ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సమీక్ష చేపట్టనున్న నేపథ్యంలో ఆయన మంగళవారం బూత్‌స్థాయి అధికారుల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. తెలిసో తెలీకో వేర్వేరు నియోజకవర్గాల్లో ఓటరు కార్డు కలిగివున్నవారిని గుర్తించే ఉద్దేశంతో ఓటరు జాబితా సమీక్ష చేపట్టామని చెప్పారు. "ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఒక వ్యక్తి తాను నివాసం ఉన్న శాసనసభ నియోజకవర్గంలోనే ఓటు వేయడానికి అర్హుడు. ఉదాహరణకు మీరు దిల్లీలో నివాసం ఉంటున్నారనుకుందాం. కానీ మీ సొంతిల్లు పట్నాలో ఉంది. అప్పుడు మీరు దిల్లీలో ఓటరుగా నమోదు కావాలే కానీ పట్నాలో కాదు" అని జ్ఞానేశ్‌కుమార్ అన్నారు. రెండుచోట్ల ఓటరు కార్డు కలిగి ఉండటం నేరమన్నారు.

నాయకత్వ బరువును మోయగలిగేది కొందరే



నాయకత్వ కిరీటాన్ని ఎవరైనా ధరించగలరు! కానీ దాని బరువును సమర్థంగా మోయగలిగేది మాత్రం కొందరే. నాయకత్వం అంటే హోదాను దక్కించుకోవడం కాదు. నాయకత్వం అంటే- ఒత్తిడిలోనూ నిలబడి పనిచేయగలగడం, ఎలాంటి పరిణామాలకైనా బాధ్యత వహించడం, ఫలితాలు అనుకూలంగా రానప్పుడూ పట్టు విడవకుండా పనిని కొనసాగించగలగడం.

– జేన్, లీడర్షిప్ కోచ్

అంతరాలు తొలగించాం

- 'డిజిటల్ ఇండియా'కు పదేళ్లపై మోదీ స్పందన



దిల్లీ: ఉన్నవారికి, లేనివారికి మధ్యనున్న అంతరాలు తొలగించి దేశంలో అవకాశాలను ప్రజాస్వామ్యీకరించామని, ఇప్పుడిది ప్రజల ఉద్యమంగా రూపుదిద్దుకుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 'డిజిటల్ ఇండియా' కార్యక్రమం చేపట్టి మంగళవారానికి సరిగ్గా పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన 'లింక్డ్‌ఇన్'లో సవివరంగా పోస్ట్‌పెట్టారు. "భారతీయులు సాంకేతికతను వాడగలరా, లేదా అనే సందేహంతోనే దశాబ్దాలు గడిచిపోయాయి. మా ప్రభుత్వం వచ్చాక ఈ ధోరణిని మార్చింది. అందరికీ అన్నీ అందుబాటులోకి తీసుకువచ్చి అవకాశాలు కల్పించింది. 2014లో దేశంలో 25 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు ఉంటే ఇప్పుడది 97 కోట్లు దాటింది. మారుమూల గ్రామాలనూ కలిపేలా 42 లక్షల కి.మీ. ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు వేశాం. అత్యంత వేగమైన 5జీని అందుబాటులో తెచ్చేందుకు 4.81 లక్షల బేస్ స్టేషన్లను రెండేళ్లలో అందుబాటులోకి తెచ్చాం. గల్వాన్, సియాచిన్, లద్దాఖ్‌లకూ ఇప్పుడు అధిక వేగ ఇంటర్నెట్ చేరుతోంది. యూపీఐ వంటి వేదికల వల్ల ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో సగం మన దేశంలోనే జరుగుతున్నాయి. దళారుల ప్రమేయాన్ని తొలగించిన ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) వల్ల రూ.3.48 లక్షల కోట్ల డబ్బు ఆదా అయింది. ప్రభుత్వ ఇ-మార్కెట్‌ప్లేస్ ద్వారా సామాన్యులు సయితం దేశం నలుమూలలా తమ సరకుల్ని, సేవల్ని విక్రయించగలుగుతున్నారు. రాబోయే దశాబ్దిలో ఇంకా ముందుకు దూసుకువెళ్లి ప్రపంచంపై మనదైన ముద్ర వేయబోతున్నాం" అని ప్రధాని చెప్పారు.

హామీలు నెరవేరలేదన్న కాంగ్రెస్

డిజిటల్ ఇండియా హామీలను సర్కారు నెరవేర్చలేకపోయిందని కాంగ్రెస్ విమర్శించింది. ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పినా అవన్నీ శుష్క వాగ్దానాలుగానే మిగిలాయని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్' వేదికగా స్పందించారు. 65% గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్ అందుబాటులోకి రాలేదని, ప్రభుత్వరంగ టెలికాం కంపెనీల రుణభారం పెరిగిపోతోందని, సైబర్ నేరాలకు అంతే లేదని చెప్పారు. వీటికి సంబంధించిన గణాంకాలను వివరించారు. ఆధార్, యూపీఐలకు పునాదులు కాంగ్రెస్ పాలనలోనే పడ్డాయన్నారు.

మనిషి 150 నుంచి 200 ఏళ్లు బతకొచ్చు

- యోగా గురు రాందేవ్ బాబా



దిల్లీ: మనిషి జీవితకాలం కేవలం వందేళ్ల వరకు మాత్రమే పరిమితం కాదని యోగా గురు బాబా రాందేవ్ పేర్కొన్నారు. ఇటీవల నటి షఫాలీ జరివాలా ఆకస్మిక మరణం తర్వాత.. ఆమె వినియోగించిన యాంటీ ఏజింగ్ ట్యాబ్లెట్లపై తీవ్రస్థాయిలో చర్చ మొదలైంది. ఈ క్రమంలో రాందేవ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. "సహజంగా మానవుడి జీవితకాలం 100 ఏళ్లు మాత్రమే కాదు. దాదాపు 150-200 ఏళ్ల వరకు ఉంటుంది. ప్రస్తుత కాలంలో మనం మెదడు, గుండె, కళ్లు, కాలేయంపై ఎక్కువ ఒత్తిడి పెడుతున్నాం. 100 ఏళ్లలో తినాల్సిన ఆహారాన్ని కేవలం 25 సంవత్సరాల్లోనే తింటున్నాం" అని అన్నారు. ఈ సందర్భంగా అందరికీ ఆహార క్రమశిక్షణ, మంచి జీవనశైలి ముఖ్యమని నొక్కి చెప్పారు. 2021లో గుండెపోటుతో మరణించిన నటుడు సిద్ధార్థ్ శుక్లా, ఇటీవల మృతి చెందిన నటి షఫాలీ గురించి మాట్లాడుతూ.. మన శరీరంలో ప్రతీ కణానికి సహజమైన జీవిత కాలం ఉంటుందన్నారు. దానిపై ప్రభావం పడేలా ఏదైనా చేసినప్పుడు అది అంతర్గతంగా ఇబ్బందులు తలెత్తేలా చేస్తుందన్నారు.

భాజపా సంస్థాగత ఎన్నికలు 22 రాష్ట్రాల్లో పూర్తి

దిల్లీ: భాజపా మంగళవారం మరో ఆరు రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను ఎన్నుకొంది. దీంతో మొత్తం 22 రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు ముగిసి, అధ్యక్షులు ఎన్నికయ్యారు. ఇక పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా స్థానంలో తదుపరి అధ్యక్షుడి ఎన్నికకు నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుంది. భాజపా నియమానుసారం పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికను ప్రారంభించడానికి మొత్తం 37 సంస్థాగత రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంత విభాగాల్లో కనీసం 19 చోట్ల అధ్యక్షుల ఎన్నికలు పూర్తి కావాలి. 2020 జనవరి నుంచి పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న నడ్డా మూడేళ్ల పదవీకాలం పూర్తిచేసుకొని, పొడిగింపులతో కొనసాగుతున్నారు.

బిహార్‌లో రూ.882 కోట్లతో సీతాదేవి ఆలయం

పట్నా: బిహార్‌లోని సీతామఢీ జిల్లాలో భారీ ఆధ్యాత్మిక ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సీతాదేవి జన్మ స్థలంగా భావించే పనౌరా ధామ్ జానకీ మందిర్ కేంద్రంగా రూ.882 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

సుప్రీం సిబ్బంది నియామకాల్లో రిజర్వేషన్లు

దిల్లీ: సుప్రీం కోర్టులో పని చేస్తున్న కొన్ని తరగతుల సిబ్బంది ప్రత్యక్ష నియామకం, ప్రమోషన్లలో తొలిసారిగా రిజర్వేషన్లను ప్రవేశపెట్టారు. రిజిస్ట్రార్లు, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ లైబ్రేరియన్లు, జూనియర్ కోర్టు అసిస్టెంట్లు, చాంబర్ అటెండెంట్లకు ఈ రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఇందులో భాగంగా ఆయా ఉద్యోగుల నియామకం, పదోన్నతుల్లో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం రిజర్వేషన్లు అమలు పరుస్తారు. ఈ మేరకు జూన్ 24న సుప్రీం కోర్టు ఉద్యోగులందరికీ సర్క్యులర్ జారీ చేశారు.

ట్రంప్ మాటలు ఉత్తుత్తివే

- మోదీతో వాన్స్ మాట్లాడినప్పుడు నేనూ ఉన్నా: జైశంకర్



న్యూయార్క్: వాణిజ్య అవకాశాలను చూపించి భారత్-పాకిస్థాన్‌లు కాల్పుల విరమణ చేసేలా వారిపై ఒత్తిడి తీసుకువచ్చానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలన్నీ ఉత్తుత్తివేనని భారత విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జైశంకర్ కొట్టిపారేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీతో అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చర్చలు జరిపినప్పుడు తాను ఆ గదిలోనే ఉన్నానని సోమవారం న్యూయార్క్‌లో 'న్యూస్‌వీక్' వారపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. "భారత్‌పై పాక్ పెద్దఎత్తున దాడిచేసే అవకాశం ఉందని మే 9న ఫోన్లో వాన్స్ చెప్పారు. ఆ మాటల్ని మోదీ పట్టించుకోలేదు. పైగా తామూ స్పందించాల్సి వస్తుందని సంకేతాలిచ్చారు. ఆ మర్నాడే పాక్ మాపై దాడులకు దిగింది. దానిపై తక్షణం మేం స్పందించాం. మరుసటిరోజు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో నాకు ఫోన్ చేశారు. మాట్లాడేందుకు పాక్ సిద్ధంగా ఉందన్నారు. ఏం జరిగిందో చూశాను కాబట్టి చెప్పగలుగుతున్నాను. మిగిలింది మీకే వదిలేస్తున్నా.." అని చెప్పారు.

'బిగ్ బిల్లు'కు సెనెట్ తుది ఆమోదం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలల బిల్లు అయిన 'బిగ్ బిల్లు' సెనెట్‌లో తుది ఆమోదం పొందింది. పన్నుల్లో కోత, వ్యయ నియంత్రణలకు ఉద్దేశించిన ఈ బిగ్ బిల్లుపై సోమవారం రాత్రంతా తీవ్ర చర్చ జరిగిన అనంతరం మంగళవారం ఓటింగ్ జరిగింది. ఇందులో ముగ్గురు రిపబ్లికన్లు బిల్లుకు వ్యతిరేకంగా ఓటేయడంతో 50-50తో టై అయింది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్.. బిల్లుకు అనుకూలంగా ఓటేసి చివరకు గట్టెక్కించారు. బిల్లును వ్యతిరేకించిన రిపబ్లికన్లలో థామ్ టిల్లిస్ (నార్త్ కరోలినా), సుసాన్ కొలిన్స్ (మైన్), రాండ్ పాల్ (కెంటకీ) ఉన్నారు.

అకస్మాత్తుగా 900 అడుగుల కిందికి విమానం

- విచారణ ప్రారంభించిన డీజీసీఏ



ఇంటర్నెట్‌డెస్క్: దిల్లీ నుంచి వియన్నాకు బయల్దేరిన ఎయిరిండియా విమానం గగనతలంలో ఒక్కసారిగా 900 అడుగుల మేర కిందకు దిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 14న ఈ బోయింగ్-777 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే అకస్మాత్తుగా కిందికి దిగిపోతుండటంతో కాక్‌పిట్‌లో హెచ్చరిక సిగ్నళ్లు మోగాయి. పైలట్లు భద్రతాపరమైన చర్యలు చేపట్టి విమానంపై నియంత్రణ సాధించగలిగారు. 9 గంటల తర్వాత ప్రయాణికులను సురక్షితంగా వియన్నాలో దించారు. 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్' (డీజీసీఏ) ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది.

ఎయిరిండియా, బోయింగ్ సంస్థలపై బాధిత కుటుంబాల దావా!

లండన్: అహ్మదాబాద్‌లో జూన్ 12న జరిగిన విమాన ప్రమాదంలో మరణించినవారి కుటుంబాలు ఎయిరిండియా, బోయింగ్ సంస్థలపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవలి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినవారిలో బ్రిటన్‌వాసులు 52 మంది ఉన్నారు. అదనపు పరిహారం కోసం ఈ రెండు సంస్థలపై కోర్టులో దావా వేయడానికి వీరి కుటుంబ సభ్యులు న్యాయనిపుణులతో చర్చలు జరుపుతున్నారని సమాచారం. ఎయిరిండియా యాజమాన్య సంస్థ- టాటా గ్రూపు ఈ ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ప్రకటించింది. తక్షణ అవసరాలను తీర్చడానికి రూ.25 లక్షల అదనపు పరిహారాన్ని కూడా ప్రకటించింది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం, బాధిత కుటుంబాలకు ఆర్థిక పరిహారం అందిందా? లేదా? అనేది పరిశీలిస్తున్నట్లు కీస్టోన్ లా సంస్థ తెలిపింది.

జీఎస్టీతో ఆర్థిక అన్యాయం: రాహుల్

- సంస్కరణలు అవసరమన్న విపక్షనేత



దిల్లీ: ఎనిమిదేళ్లు పూర్తిచేసుకొన్న జీఎస్టీ (గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్) పన్ను విధానం ఆర్థిక అన్యాయాన్ని, కార్పొరేట్ ఆశ్రిత పక్షపాతాన్ని పెంచి పోషిస్తున్న క్రూరమైన సాధనమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ప్రజలకు తొలి ప్రాధాన్యమిస్తూ వ్యాపారులకు స్నేహపూర్వకంగా, సిసలైన సమాఖ్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా జీఎస్టీలో సంస్కరణలు తీసుకురావాలంటూ మంగళవారం 'ఎక్స్' ద్వారా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. "చిన్న దుకాణదారు నుంచి రైతు వరకు ప్రతి భారతీయుడు దేశ పురోగతిలో భాగస్వామిగా ఉండేలా భారత్‌కు సార్వజనీక పన్ను విధానం అవసరం. మోదీ సర్కారు గత ఎనిమిదేళ్లుగా అమలుచేస్తున్న జీఎస్టీ పేదలను శిక్షించడానికి, సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) మూసివేతకు, రాష్ట్రాలను అణగదొక్కి.. ప్రధానికి ఉన్న కొద్దిమంది బిలియనీర్ మిత్రులు లబ్ధి పొందడానికి ఉపయోగపడుతోంది" అని రాహుల్ మండిపడ్డారు. భారత్‌లో అత్యధికులకు ఉపాధి కల్పిస్తున్న సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు గత ఎనిమిదేళ్లలో 18 లక్షలకు పైగా మూతపడ్డాయన్నారు. "ఈ దేశ పౌరులు చాయ్ మొదలు ఆరోగ్యబీమా దాకా అన్నిటికీ జీఎస్టీ కడుతుండగా, కార్పొరేట్లు ఏటా రూ.లక్ష కోట్లకు పైగా పన్ను మినహాయింపులు పొందుతున్నారు. జీఎస్టీ బకాయిలను ఆయుధంగా మార్చుకొని భాజపాయేతర పాలిత రాష్ట్రాలను కేంద్రం శిక్షిస్తోంది. ఇది మోదీ ప్రభుత్వ సమాఖ్య వ్యతిరేక అజెండాకు నిదర్శనం. భారతదేశ మార్కెట్లను ఏకం చేయడానికి, పన్నుల వ్యవస్థను సరళీకృతం చేయడానికి తీసుకొచ్చిన జీఎస్టీ యూపీఏ సర్కారు చేసిన దార్శనిక ఆలోచన. పేలవమైన అమలు, రాజకీయ పక్షపాతంతో దీన్ని పక్కదోవ పట్టించారు" అని రాహుల్ ధ్వజమెత్తారు.

కోల్‌కతా సామూహిక అత్యాచారం కేసు...

ముగ్గురు నిందితులను బహిష్కరించిన న్యాయ కళాశాల

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో న్యాయ విద్యార్థిని(24)పై జరిగిన సామూహిక అత్యాచార కేసులో నిందితులపై కళాశాల యాజమాన్యం చర్యలు తీసుకుంది. విద్యార్థులు జైబ్ అహ్మద్, ప్రమిత్ ముఖర్జీలను కళాశాల నుంచి బహిష్కరించినట్లు తృణమూల్ కాంగ్రెస్ నేత అశోక్ కుమార్ నేతృత్వంలోని సౌత్ కోల్‌కతా లా కాలేజీ పాలక మండలి మంగళవారం వెల్లడించింది. కేసులో ప్రధాన నిందితుడు, లెక్చరర్‌గా పనిచేస్తున్న మోనోజిత్ మిశ్ర (31) కాంట్రాక్టును తక్షణమే రద్దు చేసినట్లు ప్రకటించింది. అలాగే క్రిమినల్ న్యాయవాదిగా ఆయన ప్రాక్టీసును రద్దు చేయమని కోరుతూ బార్ కౌన్సిల్‌కు దరఖాస్తు చేయనున్నట్లు తెలిపింది. మరోవైపు బాధితురాలు కాలేజీకి ఒంటరిగా వెళ్లడం వల్లే అత్యాచారం జరిగిందంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన టీఎంసీ ఎమ్మెల్యే మాదన్ మిత్రా బేషరతుగా క్షమాపణలు తెలిపారు.

మిశ్రపై మరో న్యాయ విద్యార్థిని లైంగిక ఆరోపణలు

సామూహిక అత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రపై మరో న్యాయ విద్యార్థిని లైంగిక ఆరోపణలు చేసినట్లు ఓ ఆంగ్ల వార్తాసంస్థ కథనాన్ని ప్రచురించింది. మోనోజిత్ రెండేళ్ల క్రితం తనను లైంగికంగా వేధించాడని, ఈ విషయం గురించి ఎవరికైనా చెబితే తన కుటుంబం అంతు చూస్తానని బెదిరించాడని సదరు విద్యార్థిని వాపోయినట్లు ఆ కథనంలో తెలిపింది.

'ది రాయల్ ట్రైన్'కు త్వరలో స్వస్తి

ఉపసంహరణకు కింగ్ ఛార్లెస్ ఆమోదం

లండన్: నిర్వహణ వ్యయం గణనీయంగా ఉంటున్న దృష్ట్యా లండన్‌లో చారిత్రకమైన 'ది రాయల్ ట్రైన్'కు త్వరలో తుది వీడ్కోలు పలకనున్నారు. విక్టోరియా మహారాణి హయాం (1869) నుంచి ఇది నడుస్తూ బ్రిటన్ రాజకుటుంబంలో ప్రత్యేకపాత్రను సొంతం చేసుకుంది. విలాసవంతమైన ఈ రైలును ప్రస్తుత రైల్వే వ్యవస్థలకు తగ్గట్టు మెరుగుపరచాలంటే ఆధునికీకరించాలని, ఖర్చుకూడా చాలా ఎక్కువ అవుతుందని బకింగ్‌హాం ప్యాలెస్ పేర్కొంది. అందుకే దీని సేవలకు స్వస్తి పలికేందుకు కింగ్ ఛార్లెస్-3 ఆమోదించారని తెలిపింది. 9 పెట్టెలుండే ఈ రైలు నిర్వహణ ఒప్పందం 2027 వరకు అమల్లో ఉన్నా ఆలోపే సేవల్ని ఉపసంహరించనున్నారు.



ది రాయల్ ట్రైన్ నుంచి అభివాదం చేస్తున్న కింగ్ ఛార్లెస్–3

సిరియాపై ఆర్థిక ఆంక్షలు సడలించిన అమెరికా

వాషింగ్టన్: సిరియాపై అమెరికా ఆర్థిక ఆంక్షలు సడలించింది. మొత్తం 518 మంది సిరియా పౌరులు, సంస్థలపై నిషేధం ఎత్తివేసింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సోమవారం సంతకం చేశారు. 2011లో సిరియాలో అంతర్యుద్ధం ప్రారంభమైంది. ఆ సమయంలో బషర్ అల్ అసద్ నేతృత్వంలోని ప్రభుత్వంపై అమెరికా ఆంక్షలు విధించింది. ఆరు నెలల క్రితం అసద్ ప్రభుత్వాన్ని దించి అహ్మద్ అల్ షరా నాయకత్వంలో సిరియాలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి ఆర్థిక ఆంక్షలు ఎత్తివేస్తామన్న సంకేతాలను అగ్రరాజ్యం ఇస్తూనే ఉంది. ఇటీవల సౌదీ అరేబియా పర్యటనలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. అల్ షరాతో భేటీ అయ్యారు. అప్పుడే ఆర్థిక ఆంక్షలు ఎత్తివేస్తామని పేర్కొన్నారు.

పుణె విమానాశ్రయానికి ఉత్తుత్తి బాంబు బెదిరింపు

పుణె: మహారాష్ట్రలోని పుణె అంతర్జాతీయ విమానాశ్రయం లోపల, విమానాల్లో శక్తిమంతమైన బాంబులు అమర్చామని, ప్రయాణికుల్ని ఖాళీ చేయకపోతే వారంతా ప్రాణాలు కోల్పోతారని బెదిరిస్తూ ఆదివారం తెల్లవారుజామున ఒక విమానయాన సంస్థకు వచ్చిన ఈ-మెయిల్ కలకలం సృష్టించింది. సీఐఎస్ఎఫ్, బాంబు నిర్వీర్యక దళం, పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఇది ఉత్తుత్తి బెదిరింపు అని తేలింది.

2026లో ఐఎస్ఎస్‌కు నాసా వ్యోమగామి అనిల్ మేనన్

హ్యూస్టన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వచ్చే ఏడాది జూన్‌లో నాసా వ్యోమగామి అనిల్ మేనన్ వెళ్లనున్నారు. అక్కడ ఆయన 8 నెలలపాటు ఉంటారు. ఆయన శాస్త్రీయ పరిశోధనలు చేస్తారు. భారత్, ఉక్రెయిన్ తల్లిదండ్రులకు జన్మించిన మేనన్.. అమెరికా పౌరుడు. 2021లో ఆయన వ్యోమగామిగా ఎంపికయ్యారు. 2024లో 23 ఆస్ట్రోనాట్ క్లాస్ గ్రాడ్యుయేట్ అయ్యారు. అంతకుముందు హార్వర్డ్, మసాచుసెట్స్‌లలో చదువుకున్నారు.

జిన్‌పింగ్ అదృశ్యంపై కలకలం!

దిల్లీ: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్.. మే 21 నుంచి జూన్ 5 వరకూ అదృశ్యమయ్యారన్న వార్త తాజాగా కలకలం రేపింది. అధ్యక్ష మార్పునకు ఇది సంకేతమంటూ కొన్ని నిఘా సంస్థలు అంచనా వేసినట్లు వార్తలు వచ్చాయి. సంస్కరణాభిలాషి, టెక్నోక్రాట్ అయిన వాంగ్ యాంగ్ తదుపరి అధ్యక్షుడు కావొచ్చంటూ ఊహాగానాలు వినిపించాయి. అయితే జిన్‌పింగ్ ఇలా అదృశ్యం కావడం సాధారణమేనని కొన్ని నిఘా సంస్థలు స్పష్టం చేశాయి. అదే సమయంలో అధినేతలను చైనా కమ్యూనిస్టు పార్టీ పక్కనబెట్టడం రివాజేనని అభిప్రాయపడ్డాయి.

ట్రంప్, మస్క్‌ల మాటల యుద్ధం

- 'బిగ్ బిల్లు' ఆమోదం పొందితే కొత్త పార్టీ పెడతానన్న టెస్లా అధిపతి
- ఆయన కంపెనీకి సబ్సిడీలు ఆపేస్తానన్న ట్రంప్



వాషింగ్టన్: పన్నుల్లో కోతలు, వ్యయ నియంత్రణపై అమెరికా ప్రభుత్వం తీసుకొస్తున్న 'బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'పై మరోసారి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్‌ల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. బిల్లు ఆమోదం పొందిన వెంటనే తాను కొత్త పార్టీ పెడతానని మస్క్ వ్యాఖ్యానించగా.. ఆయన విద్యుత్తు కార్లకు సబ్సిడీల్లో కోత వేస్తానని ట్రంప్ స్పష్టం చేశారు.

బిగ్ బిల్లు.. రిపబ్లికన్ పార్టీకి ఆత్మహత్యా సదృశమని శనివారం ఎక్స్‌లో మస్క్ పేర్కొన్నారు. బిల్లుకు అనుకూలంగా ఓటేసే కాంగ్రెస్ సభ్యుల సీట్లకు వచ్చే ఏడాది ఎసరుపెట్టేందుకు పని చేస్తానని హెచ్చరించారు. 'ప్రభుత్వ వ్యయాలను తగ్గించే, దేశ అప్పులను పెంచే బిల్లుకు అనుకూలంగా ఓటేసే ప్రతి సభ్యుడూ.. తలవంచుకుని సిగ్గు పడాలి. వచ్చే ఏడాది ప్రైమరీల్లో వారు అవకాశాన్ని కోల్పోతారు. ఇదే ఈ భూమిపై నేను చేపట్టే ఆఖరి పని' అంటూ మస్క్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల పోస్టుకు 2.6 కోట్ల వ్యూస్ వచ్చాయి. ఈ పోస్టు పెట్టిన కొన్ని గంటల తర్వాత మస్క్ మరో పోస్టు పెట్టారు. బిల్లు ఆమోదం పొందిన మరుసటి రోజే కొత్త పార్టీ పెడతానని అందులో పేర్కొన్నారు. (ఇప్పటికే సెనెట్ ఆమోదం పొందిన ఈ బిల్లు.. ప్రతినిధుల సభలో ఆమోదం పొందాల్సి ఉంది. ఆ తర్వాత ట్రంప్ వద్దకు వెళ్తుంది.) 'ఈ పిచ్చి బిల్లు ఆమోదం పొందితే కొత్తగా అమెరికా పార్టీ అవతరిస్తుంది. మన దేశంలో డెమోక్రాట్లు, రిపబ్లికన్లకు ప్రత్యామ్నాయ పార్టీ అవసరం. ప్రజల గొంతు వినిపించడానికి ఇది తప్పనిసరి' అని మస్క్ వ్యాఖ్యానించారు. ఈ పోస్టుకు 3.2 కోట్ల వ్యూస్ వచ్చాయి.

మస్క్ వ్యాఖ్యలపై మంగళవారం ఉదయం ట్రంప్ కూడా తీవ్రంగానే స్పందించారు. బలవంతంగా విద్యుత్తు వాహనాలను ప్రజలకు అంటగట్టడానికి తాను వ్యతిరేకమనే విషయం మస్క్‌కు తెలుసని వ్యాఖ్యానించారు. 'ప్రపంచ చరిత్రలో ఏ వ్యక్తికీ దక్కనన్ని సబ్సిడీలు ఎలాన్ మస్క్‌కు దక్కాయి. ఈ సబ్సిడీలు లేకపోతే ఆయన దుకాణం మూసేసుకుని సొంత దేశం దక్షిణాఫ్రికాకు వెళ్లిపోవాల్సిందే' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

'రాకెట్ ప్రయోగాలు, శాటిలైట్లు, విద్యుత్తు కార్ల ఉత్పత్తి లేకపోతే దేశానికి ఎంతో మిగులుతుంది. ఈ విషయంలో చర్యలు తీసుకోవడానికి మనకు డోజ్ ఉంది. భారీగా డబ్బు పొదుపు చేసుకోవచ్చు' అని ట్రంప్ పేర్కొన్నారు.

ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో టెస్లా షేర్లు మంగళవారం భారీగా పడిపోయాయి.

ఖగోళంలో కండర క్షీణతపై శుక్లా పరిశోధన



దిల్లీ: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఖగోళంలోని అత్యల్ప లేదా సూక్ష్మ గురుత్వాకర్షణ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై ప్రయోగాలు చేస్తున్నారు. ఈ పరిశోధన కదలలేని పరిస్థితిలో ఉన్న వయసు మళ్లిన వారి కండర క్షీణత కోసం తగిన చికిత్సలను, ఔషధాలను కనుగొనేందుకు దోహదం చేస్తుంది. యాగ్జియం-4 ప్రైవేట్ స్పేస్ మిషన్‌లో భాగంగా శుభాంశు శుక్లా మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి గత వారం ఐఎస్ఎస్ చేరుకున్న సంగతి తెలిసిందే. ఖగోళంలో భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న ఐఎస్ఎస్‌లో శుక్లా చేస్తున్న ప్రయోగాలు మనిషిలో స్కెలెటల్ కండరాలు పనిచేయకుండా పోవడానికి దారితీసే రసాయనిక క్రియలను గుర్తించేందుకు ఉపయోగపడుతుంది. సుదీర్ఘ ఖగోళ యానం కారణంగా సంభవించే కండరాల క్షీణతను నిరోధించగల చికిత్సల్ని కనుగొనేందుకు ఈ ప్రయోగాలు దారితీస్తాయి. ఇది భూ ఉపరితల వాతావరణంలోనూ కండరాల క్షీణతకు ఏ విధమైన చికిత్సలు ఉపయోగపడతాయో కనుగొనేందుకూ దోహదపడుతుంది. మరోవైపు శుక్లా ఖగోళంలో మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక వీడియో భారత విద్యార్థుల కోసం చిత్రించారు. ఈ వ్యోమగాముల బృందం తమ మానసిక ఆరోగ్యంపై సైతం అధ్యయనం నిర్వహించింది. ఖగోళంలో మానసిక ఆరోగ్యానికి సంబంధించిన అనేక ప్రశ్నలకు ఈ అధ్యయనం సమాధానం అందించే అవకాశం ఉంది. మానసిక రుగ్మతల నిర్ధారణ, చికిత్సల కోసం రిమోట్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు ఇది దోహదపడుతుంది.

ఎన్ఐపీసీసీడీకి సావిత్రీబాయి ఫులె పేరు

దిల్లీ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కోఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ (ఎన్ఐపీసీసీడీ) పేరును సావిత్రీబాయి ఫులె జాతీయ మహిళా, శిశు అభివృద్ధి సంస్థగా మార్చినట్లు మహిళా, శిశు సంక్షేమశాఖ వెల్లడించింది. ఈ నిర్ణయం గత నెల 19 నుంచే అమల్లోకి వచ్చినట్లు సోమవారం తెలిపింది. సంఘ సంస్కర్త, విద్యావేత్త, మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి ఫులె సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

76 ఏళ్లలో తొలిసారిగా రోడ్డు.. 76 గంటల్లోనే ధ్వంసం

ఈటీవీ భారత్: దాదాపు ఏడు దశాబ్దాలకు పైగా ఆ గ్రామానికి రహదారికి లేదు. ఎట్టకేలకు అధికారులు కరుణించి రహదారి మంజూరు చేస్తే.. అది మూడు రోజుల్లోనే మాయమైపోయింది. ఛత్తీస్‌గఢ్‌లోని నాగర్ బేడ గ్రామం.. మావోయిస్టులకు కంచుకోట లాంటి బస్తర్ ప్రాంతానికి సమీపంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్'ను ప్రారంభించడంతో అక్కడి ప్రజలకు మావోయిస్టుల నుంచి విముక్తి లభిస్తోంది. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో రూ.కోట్లు ఖర్చు పెట్టి రోడ్లు, విద్యుత్, నీరు వంటి మౌలిక వసతులను అధికారులు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలోనే నాగర్ బేడ గ్రామానికి ఇటీవల 10 కి.మీ మేర రహదారిని రూ.1.5 కోట్లతో నిర్మించారు. 76 ఏళ్ల తర్వాత తొలిసారిగా నిర్మించిన ఆ రోడ్డు 76 గంటల్లోనే పాడైపోయింది. కారణం కాంట్రాక్టరు చేతివాటమే. నాసిరకం సామగ్రితో రోడ్డు నిర్మాణాన్ని మమ అనిపించారని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

దత్తతపై డిజిటల్ పత్రాలూ చెల్లుతాయి

దిల్లీ: పిల్లల్ని దత్తత తీసుకున్నవారు దానికి సంబంధించిన పత్రాలను తమవెంట తీసుకువెళ్లాల్సిన అవసరం లేదని, డిజిటల్‌గా ధ్రువీకరించి ఈ-మెయిల్ ద్వారా పంపిన ఉత్తర్వులూ చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయని 'కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ' (కారా) తెలిపింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకూ లేఖ రాసింది. దత్తత నిబంధనలు-2022లోని 13(8) చెబుతున్న నియంత్రణపై కొంత గందరగోళం తలెత్తడంతో ఈ స్పష్టతనిస్తున్నట్లు పేర్కొంది. ఈ-మెయిల్ ఉత్తర్వులు చెల్లుబాటవుతాయా లేదా అనే అనిశ్చితిలో దత్తత సంస్థలు, శిశు సంరక్షణ విభాగాలు ఉండటం వల్ల దత్తత ప్రక్రియలో జాప్యం చోటుచేసుకుంటోందని తెలిపింది. దత్తత ప్రక్రియ సజావుగా, వేగంగా పూర్తయి, కుటుంబాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడటానికి జిల్లాస్థాయిలో సంస్థలన్నీ సమన్వయంతో పనిచేయాలని కోరింది.

ఈనాడు

హైదరాబాద్ 2-7-2025 బుధవారం సిటీ సంపుటి 51 . సంచిక 323
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

తెలంగాణ రైతుకు..

కేసీఆర్ మరణశాసనం

మన నీటిని ఏపీకి తాకట్టు పెట్టారు • 2015లో కృష్ణా నీటిని రాసిచ్చారు

811 టీఎంసీలకు 299 టీఎంసీలు చాలన్నారు • 2016లో గోదావరిలో 3000 టీఎంసీల వరద నీరుందన్నారు

- చంద్రబాబు గోదావరి నీటి వినియోగంపై సర్వే చేపట్టినా వ్యతిరేకించలేదు
- జగన్‌ను ఇంటికి పిలిచి గోదావరి నీటితో రాయలసీమ సస్యశ్యామలం అన్నారు
- భారాసను బతికించడానికి కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు
- బనకచర్లపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం



ప్రజాభవన్‌లో బనకచర్లపై ప్రజాప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించిన సందర్భంగా మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, భట్టి విక్రమార్క

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి జలాలను కేసీఆర్, హరీశ్‌రావులు ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టుపెట్టి.. తెలంగాణ రైతులకు మరణ శాసనం రాశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు ఉన్న 811 టీఎంసీలలో తెలంగాణకు 555 టీఎంసీలు రావాల్సి ఉండగా.. 299 టీఎం సీలు చాలని 2015లో వారిద్దరూ రాసిచ్చార న్నారు. గోదావరిలో 3,000 టీఎంసీల వరద నీరు సముద్రంలోకి వెళ్తోందని, ఈ నీటిని రాయలసీమకు మళ్లించుకోవచ్చని 2016లో ఎపెక్స్ కౌన్సిల్‌లో చెప్పారని, ఈ విషయాన్ని మినిట్స్‌లో స్పష్టంగా పేర్కొన్నారన్నారు. 2019లో గోదావరి నీటిని మళ్లించి రాయలసీమను రతనాల సీమగా చేయాలని కేసీఆర్ సూచించారని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాలపై రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించకుండా కేంద్రం చోద్యం చూస్తోందని, తెలంగాణ హక్కులను కాలరాయడానికి 8 మంది ఎంపీలను భాజపాకు ఇవ్వలేదని విమర్శించారు. భారాసను బతికించడానికి కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కృష్ణా, గోదావరిలో తెలంగాణ హక్కులను రక్షించుకోవడానికి కేంద్రంపై నిరంతరం ఒత్తిడి తేవాలని, పోరాడాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు, శ్రేణులకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ...మిగతా 10లో

నదీ జలాల్లో వాటాలపై భారాస దగా

- రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడితో కేంద్రం బనకచర్ల ప్రతిపాదనను వెనక్కి పంపింది
- మంత్రి ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్
- హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

10లో

RailOne

రైల్వే సేవలన్నింటికీ ఒకే యాప్

రైల్‌వన్

- సూపర్ యాప్‌ను ఆవిష్కరించిన రైల్వే మంత్రి

ఈనాడు, దిల్లీ: ప్రయాణికులకు రైల్వే సేవలన్నింటినీ ఒకేచోట అందించే సూపర్ యాప్ 'రైల్‌వన్' అందుబాటులోకి వచ్చింది. మంగళవారం ఈ యాప్‌ను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆవిష్కరించారు. ఆండ్రాయిడ్, ఐవోఎస్ యూజర్లందరికీ యాప్ అందుబాటులో ఉంది. ఈ యాప్ ద్వారా ప్రయాణికులకు సేవలన్నీ సులభంగా అందుతాయని ...మిగతా 2లో

అందించే సేవలు

- టికెట్ల బుకింగ్ (రిజర్వుడు, అన్‌రిజర్వుడు)
- ప్లాట్‌ఫాం టికెట్లు
- రైళ్ల సమయాల వివరాలు
- పీఎన్‌ఆర్ విచారణ
- ప్రయాణ ప్లానింగ్
- రైల్వే హెల్ప్‌లైన్ సేవలు
- ఆహారం బుకింగ్
- సరకు రవాణా వివరాలు
- ట్యాక్సీ బుకింగ్
- వీటితోపాటు మరిన్ని సేవలు

మృత్యుదిబ్బ



పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి వెలుపల రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నామరూపాలు కోల్పోయిన సిగాచీ పరిశ్రమ

- 36కు పెరిగిన మరణాలు
- ఆచూకీ లేని 13 మంది కార్మికులు
- క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమం
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- డీఎన్‌ఏ పరీక్షలకు బంధువుల రక్తనమూనాల సేకరణ

ఈనాడు, హైదరాబాద్, సంగారెడ్డి - పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: మొన్నటి వరకు అదొక ఔషధ పరిశ్రమ. ఇప్పుడది శవాల దిబ్బ. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. కాలిపోయి బొగ్గుగా మారినవి కొన్నయితే... శిథిలాల మధ్య ఇరుక్కొని మాంసపు ముద్దలుగా మారినవి మరికొన్ని. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన పేలుడులో 19 మంది కార్మికులు మృతి చెందారని, ఐదుగురి ఆచూకీ తెలియడంలేదని అధికారులు తెలిపిన విషయం తెలిసిందే. కానీ, సహాయక సిబ్బంది మంగళవారం మరో 17 మృతదేహాలను వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య 36కు చేరింది. గాయపడిన 34 మంది నగర శివార్లలోని ...మిగతా 3లో



సిగాచీ పరిశ్రమలో శిథిలాలను తొలగిస్తున్న రెస్క్యూ సిబ్బంది. వీటి కింద మరిన్ని మృతదేహాలు ఉన్నట్టు అనుమానిస్తున్నారు

మృతుల కుటుంబాలకు రూ.కోటి ఆర్థిక సహాయం

సిగాచీ పరిశ్రమ బాధితులకు సీఎం భరోసా

మంత్రులతో కలిసి సంఘటన స్థలం పరిశీలన 3లో

రెండు సంవత్సరాల్లో 3.5 కోట్ల ఉద్యోగాలు



సమావేశ వివరాలు వెల్లడిస్తున్న అశ్వినీ వైష్ణవ్

- దేశంలో ఉపాధి కల్పనకు భారీ ప్రోత్సాహక పథకం
- రూ.99,446 కోట్లతో ఈఎల్‌ఐ • కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- ప్రైవేటు రంగంలో పరిశోధనలకు రూ.లక్ష కోట్లతో సంచిత నిధి
- 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా నూతన 'జాతీయ క్రీడా విధానం'...
- ప్రపంచ స్థాయి శిక్షణ, క్రీడా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

ఈనాడు, దిల్లీ: దేశంలో భారీ సంఖ్యలో ఉద్యోగాల సృష్టితో పాటు ప్రైవేటు రంగంలో పరిశోధనలు, నవ్యావిష్కరణల ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రపంచ స్థాయి శిక్షణలను క్రీడాకారులకు సమకూర్చడం, సంబంధిత పాలనా వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా నూతన జాతీయ క్రీడా విధానం (ఖేలో భారత్ నీతి)-2025కి ఆమోదం తెలిపింది. ...మిగతా 2లో

ఐఎన్ఎస్ తమాల్



అధునాతన యుద్ధనౌకలు, జలాంతర్గామి ప్రవేశంతో భారత నౌకాదళం మరింత పటిష్ఠమైంది. రక్షణ వ్యవస్థను బలోపేతం చేసేలా గత ఏడు నెలల్లో పలు యుద్ధనౌకలు జల ప్రవేశం చేయగా.. తాజాగా రష్యా సహకారంతో నిర్మించిన ఐఎన్ఎస్ తమాల్‌ను మంగళవారం జాతికి అంకితం చేశారు.

- ఈనాడు-విశాఖపట్నం, న్యూస్‌టుడే-సింధియా

భూదాన్ భూముల్లో నిర్మాణాలపై నివేదికివ్వండి

- కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో రంగారెడ్డి కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం
- ప్రతివాదులుగా ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు



ఈనాడు, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో భూదాన్ భూముల్లో ఎలాంటి చర్యలు చేపట్టరాదన్న ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రతివాదులైన ఐఏఎస్, ఐపీఎస్, వారి బంధువులు, ఇతర ప్రైవేటు వ్యక్తులు చేపట్టిన నిర్మాణాలపై నివేదిక సమర్పించాలంటూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నాగారంలోని సర్వే నం.181, 182, 194, 195లలో భూదాన్ భూముల్లో అక్రమాలపై విచారణ జరపాలంటూ రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులకు ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో.. దీనిపై సీబీఐ, ఈడీలతో దర్యాప్తు జరిపించాలంటూ మహేశ్వరం మండలానికి చెందిన బిర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినవిషయం విదితమే. ...మిగతా 2లో



పట్టాభిరామ్ కన్నుమూత

- గుండెపోటుతో ఆసుపత్రిలో తుదిశ్వాస
- ఇంద్రజాలికుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, రచయితగా ప్రఖ్యాతి
- మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి.. కౌన్సెలింగ్‌తో ఎన్నో కుటుంబాలకు బాసట

ఈనాడు డిజిటల్, హైదరాబాద్, రవీంద్రభారతి, పంజాగుట్ట, గాంధీనగర్(కాకినాడ) - న్యూస్‌టుడే: ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంద్రజాలికుడు, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బీవీ పట్టాభిరామ్(75) గుండెపోటుతో కన్నుమూశారు. కొన్నేళ్లుగా ఆయన కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. సోమవారం సాయంత్రం డయాలసిస్ కోసం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఒమేగా ఆసుపత్రికి వెళ్లారు. ఆ తర్వాత ఒక్కసారిగా గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ...మిగతా 2లో

తెలంగాణలో

అధికారమే లక్ష్యం

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడతాం

- భాజపా కొత్త అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు
- బాధ్యతల స్వీకరణ
- హాజరైన కేంద్ర మంత్రులు, రాష్ట్ర నేతలు

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపాకు అధికారమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తానని భాజపా రాష్ట్ర నూతన సారథి ఎన్.రామచందర్‌రావు అన్నారు. విద్యార్థి దశ నుంచి అనేక పోరాటాలు చేశానన్నారు. ఇప్పటివరకు న్యాయవాదులు, విద్యార్థుల కోసం పోరాడానని, ఇకనుంచి తెలంగాణ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మన్నెగూడెంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నూతన అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు రిటర్నింగ్ అధికారిణిగా వ్యవహరించిన కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే... ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి, కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ...మిగతా 2లో



కార్యకర్తలు బహూకరించిన కరవాలంతో రామచందర్‌రావు. పక్కన బండి సంజయ్, కిషన్‌రెడ్డి

కేంద్ర సాయంపై చర్చకు సిద్ధమా?

- 'ఈనాడు' ముఖాముఖిలో సీఎం రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్

2లో



24 డిప్యూటీ ఈఓ ఖాళీల భర్తీ!

- 110 అధ్యాపకులు, 8 పీడీ పోస్టులకు కూడా...
- త్వరలో నోటిఫికేషన్

ఈనాడు, హైదరాబాద్: పాఠశాల విద్యాశాఖ పరిధిలోని 24 డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల(డిప్యూటీ ఈఓ) పోస్టులతో పాటు 110 అధ్యాపకులు, 8 పీడీ పోస్టుల ఖాళీల భర్తీకి త్వరలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయనుంది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు విద్యాశాఖ నుంచి టీజీపీఎస్సీకి అందాయి. వాస్తవానికి పాఠశాల విద్యాశాఖ పరిధిలో డిప్యూటీ ఈఓలు, ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలలు, ఎస్‌సీఈఆర్‌టీలోని అధ్యాపకులు, సీనియర్ అధ్యాపకులు కలిపి... మొత్తం 134 పోస్టులను టీజీపీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ 2022 నవంబరు 12న అనుమతి ఇచ్చింది. ...మిగతా 2లో

మా చెడ్డ ఒత్తిడి!



ఉత్సాహం ఉరకలెత్తే వయసు..
కానీ ఎందుకో ఎక్కడలేని చికాకు..
ప్రతి క్షణం సంతోషంగా సాగిపోవాల్సిన సమయం..
కానీ ఆనందమంతా ఆవిరైన భావన..
కొండల్ని పిండిచేసే యవ్వనం..
కానీ శరీరాన్ని ఆవహించిన నిస్సత్తువ..

నేటి యువతలో కనిపిస్తోన్న లక్షణాలివి! వీటికి ఆదిలోనే అడ్డుకట్ట వేయకుంటే మెదడుతో పాటు అనేక అవయవాలపై దుష్ప్రభావాలుంటాయని హెచ్చరిస్తున్నారు అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ నిపుణులు.. మరి ఈ ఒత్తిడిని జయించేదెలా?

ప్రత్యేక కథనం ...12లో

రెండు సంవత్సరాల్లో 3.5 కోట్ల ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

2036లో ఒలింపిక్ క్రీడల నిర్వహణ మన దేశానికి దక్కేలా చేసుకోవడానికి 'వ్యూహాత్మక మార్గసూచీ'ని ప్రకటించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన మంగళవారం దిల్లీలో కేంద్ర క్యాబినెట్ సమావేశమై తీసుకున్న నిర్ణయాలను సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. కేంద్ర బడ్జెట్ 2024-25లో ప్రకటించిన ఉపాధి అనుసంధాన ప్రోత్సాహక (ఈఎల్ఐ) పథకం అమలుకు తాజాగా రూ.99,446 కోట్లు వెచ్చించడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. వచ్చే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా నిర్ణయించింది. వీరిలో 1.92 కోట్ల మంది తొలిసారి ఉద్యోగాల్లోకి ప్రవేశిస్తారని అంచనా. 2025 ఆగస్టు 1 నుంచి 2027 జులై 31 వరకు ఉద్యోగాలు కల్పించిన యాజమాన్యాలకు, కొత్త ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందుతాయి. ఈ పథకాన్ని రెండు భాగాలుగా అమలుచేస్తారు.

పార్ట్-ఎ (తొలిసారి ఉద్యోగంలో చేరిన వారికి): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ..ఈపీఎఫ్ఓలో తొలిసారి నమోదైన వారిని దృష్టిలో ఉంచుకొని ఈ పథకం అమలుచేస్తారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి రూ.15వేల మొత్తాన్ని రెండు వాయిదాల్లో చెల్లిస్తారు. రూ.లక్ష వరకు వేతనం పొందే ఉద్యోగులు అర్హులు.

పార్ట్-బి (యజమానులకు ఆర్థిక సాయం): ఇప్పటికే ఉన్న ఉద్యోగులకు అదనంగా కొలువులు కల్పించే యాజమాన్యాలకు ఈఎల్ఐ పథకం కింద ఆర్థికసాయం అందిస్తారు. ముఖ్యంగా తయారీ రంగాన్ని దృష్టిలో ఉంచుకొని దీన్ని రూపొందించారు. సంస్థలో ఇప్పుడున్న సిబ్బందికి అదనంగా ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తే అంతమందికి నెలకు రూ.3వేల చొప్పున రెండేళ్ల పాటు యజమానులకు ప్రభుత్వం చెల్లిస్తుంది. రూ.లక్ష వరకు జీతాలు తీసుకుంటున్న ఉద్యోగులను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం ఈ మొత్తాన్ని చెల్లిస్తుంది. అయితే, అదనంగా చేరిన ఉద్యోగులు కనీసం 6నెలలు అదే సంస్థలో పని చేయాలి. ఈపీఎఫ్ఓలో నమోదైన సంస్థలకు మాత్రమే ఇది వర్తిస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

పరిశోధన, అభివృద్ధి, నవకల్పన పథకం

దేశంలో ప్రైవేటు రంగంలో పరిశోధన రంగాన్ని ప్రోత్సహించడానికి రూ.లక్ష కోట్లతో సంచిత నిధి (కార్పస్‌ఫండ్)ని కేంద్ర మంత్రి మండలి ప్రకటించింది. దీని కోసం పరిశోధన, అభివృద్ధి, నవకల్పనల పథకాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. పరిశోధన ప్రాజెక్టులకు దీర్ఘకాల రుణం కింద అతి తక్కువ వడ్డీకీ, లేదంటే వడ్డీ లేకుండానే నిధులు అందించే ఏర్పాట్లు దీనిలో ఉన్నాయి. ప్రపంచ క్రీడా రంగంలో భారత్ ఐదో అగ్రస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో రూపొందించిన జాతీయ క్రీడా విధానం (ఖేలో భారత్ నీతి)-2025కి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. 2036 ఒలింపిక్ క్రీడల నిర్వహణ బిడ్డింగ్‌ను దక్కించుకునే లక్ష్యంతో తీసుకొచ్చారు.

24 డిప్యూటీ ఈఓ ఖాళీల భర్తీ!

(మొదటి పేజీ తరువాయి)

అందులో 24 డిప్యూటీ ఈఓ, 110 అధ్యాపక, సీనియర్ అధ్యాపక పోస్టుల ఖాళీలున్నాయి. గత 134 పోస్టులతో పాటు తాజాగా దోమలగూడలోని ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలోని ఎనిమిది ఫిజికల్ డైరెక్టర్(పీడీ) పోస్టులను కూడా భర్తీ చేయాలని కమిషన్‌కు ప్రతిపాదనలు పంపారు. మొత్తం 142 ఖాళీలకు ఐదు వేర్వేరు నోటిఫికేషన్లు వస్తాయని పాఠశాల విద్యాశాఖవర్గాలు తెలిపాయి.

28 డిప్యూటీ ఈఓ, 21 డీఈఓ పోస్టుల మంజూరుకు...

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పరిధిలో 72 డిప్యూటీ ఈఓ పోస్టులు ఉండేవి. అప్పట్లో రెవెన్యూ డివిజన్‌కు ఒకటి చొప్పున కేటాయించారు. హైదరాబాద్ జిల్లాలో రెవెన్యూ డివిజన్లు రెండే ఉన్నా.. జనాభా, పాఠశాలలు ఎక్కువ అయినందున 12 పోస్టులిచ్చారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం రెవెన్యూ డివిజన్లు పెరగడంతో మరో 28 పోస్టులను మంజూరు చేయాలని రెండు రోజుల క్రితం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దానికితోడు 33 జిల్లాలకుగాను 12 డీఈఓ పోస్టులే ఉన్నాయని, మరో 21 పోస్టులను మంజూరు చేయాలనీ ప్రతిపాదించారు.

ఎవరి మనసులో ఏ బాధలున్నాయో..!



పైకి సంతోషంగా కనిపించే వ్యక్తుల మనసులో ఎన్నో బాధలు ఉండొచ్చు. ఆరోగ్యంగానే ఉన్నారని మనం ఊహించుకునేవారు ఏదైనా తీవ్రస్థాయి అనారోగ్యంతో పోరాడుతుండొచ్చు. బయటకు ఆత్మవిశ్వాసంతో కనిపించే వ్యక్తుల లోలోపల ఎన్నెన్నో ఆందోళనలు ఉండొచ్చు. కాబట్టి- ప్రతిఒక్కరితోనూ మర్యాదగా, దయతోనే ప్రవర్తించండి.

– డేనియల్ ఆరోస్, కంటెంట్ రైటర్


తెలంగాణలో అధికారమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు అధ్యక్షుడిగా కొనసాగిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్టీ జెండాను రామచందర్‌రావుకు అందించారు. సారథ్య బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు ప్రసంగించారు. "14 కోట్ల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ అయిన భాజపాలో తెలంగాణ రాష్ట్ర శాఖకు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గర్వంగా భావిస్తున్నా. అయినా సాధారణ కార్యకర్తగానే పనిచేస్తా. భాజపాలో కొత్త, పాత అనే తేడా ఉండదు. త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయి. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలి. భారాస వాట్సప్ యూనివర్సిటీ, కాంగ్రెస్ ఫేక్ న్యూస్ యూనివర్సిటీలు నాపై ట్రోలింగ్ చేస్తున్నాయి. నేను సౌమ్యుడిని కాదు. 14 సార్లు జైలుకు వెళ్లాను. క్రిమినల్ లాయర్‌ను. ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేస్తే కేసులు పెడతా. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తాం. పార్టీ ఈ స్థాయికి వచ్చిందంటే కార్యకర్తల త్యాగాలు, నాయకుల కృషి కారణం" అని రామచందర్‌రావు పేర్కొన్నారు.

కాంగ్రెస్, భారాసలు రాష్ట్రాన్ని దోచుకున్నాయి: కిషన్‌రెడ్డి

ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను గతంలో భారాస, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుని అప్పులపాలు చేశాయని... భాజపా అధికారంలోకి వస్తేనే అమరవీరుల ఆకాంక్షలు నెరవేరుతాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రామచందర్‌రావు సారథ్యంలో అంతా కలిసికట్టుగా పని చేయాలని కార్యకర్తలు, నేతలకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడెవరైనా ఎవరున్నా.. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని అన్నారు. కేసీఆర్, రాహుల్ గాంధీ కుటుంబాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంటి నేతలు రాష్ట్రాన్ని దోచుకున్నారని... అన్ని రకాలుగా వెనక్కి నెట్టారని ఆరోపించారు. తెలంగాణలో గత పదకొండేళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా నిధులను కేంద్రం అందించిందని చెప్పారు. 40 రైల్వే స్టేషన్లతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దీనిపై రాష్ట్రంలో ఎక్కడైనా చర్చించేందుకు తాము సిద్ధమేనని భారాస, కాంగ్రెస్‌లకు కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు.



ఎన్.రామచందర్‌రావుకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా నియామక పత్రం అందజేస్తున్న శోభా కరంద్లాజే. చిత్రంలో బండి సంజయ్, విద్యాసాగర్‌రావు, యెండల లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, డీకే అరుణ

అధికారంలోకి వస్తే బీసీ సీఎం: బండి సంజయ్

భాజపా రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్, భారాసలకు లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. 'దేశానికి బీసీ ప్రధానిని చేసే దమ్ము కాంగ్రెస్‌కు ఉందా? భారాస అధ్యక్షుడిగా బీసీని ప్రకటించగలదా' అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వస్తే కచ్చితంగా బీసీ ముఖ్యమంత్రిని చేస్తానని రాష్ట్రానికి వచ్చినప్పుడు ప్రధాని మోదీ హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్, భారాస కుమ్మక్కయ్యాయని... అందుకే భారాస నేతలపై అనేక విచారణలు జరుగుతున్నా ఏ ఒక్క దాంట్లోనూ అరెస్టు చేయలేదని ఆరోపించారు.

ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడాలి

కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అనేక హామీలిచ్చి విస్మరించిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను భాజపా కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు, భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. భాజపాలో సంస్థాగత ఎన్నికలు పక్కాగా జరుగుతాయని, కింది స్థాయి నుంచి వచ్చిన వారికి మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. తెలంగాణను గతంలో భారాస దోపిడీ చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ దోచి దిల్లీకి కప్పం కడుతోందని ఆరోపించారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, భాజపాకు అధికారం ఇవ్వాలని చూస్తున్నారని అన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కొత్త అధ్యక్షుడికి సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. మరో ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. పార్టీలో పాత, కొత్త అనే తేడాలు లేకుండా కొత్త అధ్యక్షుడు పనిచేయాలని కోరారు. తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కొత్త అధ్యక్షుడికి ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీనారాయణ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, పదాధికారులు, జిల్లా, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే సేవలన్నింటికీ ఒకే యాప్ రైల్‌వన్

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి తెలిపారు. కేంద్రీయ రైల్వే సమాచార వ్యవస్థ (సీఆర్ఐఎస్) ఏర్పాటై 40 ఏళ్లయిన సందర్భంగా ఈ యాప్‌ను ఆవిష్కరించామని వెల్లడించారు.

సులభంగా.. సరళంగా..

ప్రయాణికులకు అత్యుత్తమ అనుభవాన్ని అందించడంతోపాటు అత్యంత సులభంగా.. సరళంగా ఉండేలా 'రైల్‌వన్' యాప్ ఇంటర్‌ఫేస్‌ను రూపొందించామని రైల్వేశాఖ వెల్లడించింది. 'ఇది అన్ని సేవలందించే యాప్ మాత్రమే కాదు. రైలు సేవల మధ్య సమగ్రమైన కనెక్టివిటీకీ ఉపయోగపడనుంది' అని ఆ శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వివరించింది.

- యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాక.. గతంలో ఉన్న రైల్‌కనెక్ట్, యూటీఎస్‌ఆన్‌మొబైల్ యాప్‌నకు ఉన్న లాగిన్ వివరాలతో రైల్‌వన్‌లో లాగిన్ కావొచ్చు.
- సులభంగా లాగిన్ అయ్యేలా ఎం-పిన్‌తోపాటు బయోమెట్రిక్ సౌకర్యమూ ఇందులో ఉంది.
- కొత్త వినియోగదారులు.. సులభంగా రిజిస్టరయ్యేలా అతి తక్కువ సమాచారం అందిస్తే సరిపోతుంది.
- రిజిస్టరుకాని వినియోగదారులు.. గెస్ట్ లాగిన్ ఆప్షన్‌తో మొబైల్ నంబరు, ఓటీపీ ద్వారా వివరాలను పొందవచ్చు.
- రైల్‌వన్ యాప్‌లో ఆర్-వాలెట్ (రైల్వే ఈ-వాలెట్) సౌకర్యం ఉంది. ముందుగానే అందులో డబ్బును జమ చేసుకుని సేవలకు చెల్లించవచ్చు.
- ఈ యాప్‌ద్వారా ప్లాట్‌ఫాం టికెట్లను 3% డిస్కౌంట్‌తో పొందొచ్చు.

భూదాన్ భూముల్లో నిర్మాణాలపై నివేదికివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై విచారించిన హైకోర్టు.. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేదాకా ఈ భూములను అన్యాక్రాంతం చేయరాదని, లావాదేవీలు జరపకుండా నిషేధిత జాబితాలో చేర్చాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులకు విరుద్ధంగా ఇక్కడ ప్లాట్ల చుట్టూ కాంపౌండ్ల నిర్మాణాలు చేపట్టారని పేర్కొంటూ మల్లేశ్ హైకోర్టులో మరోసారి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ వాటిని గౌరవించకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాల వ్యవహారంపై నివేదిక సమర్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ విచారణను ఈ నెల 11వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌లోనూ ప్రతివాదులుగా వ్యక్తిగత హోదాలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులను పేర్కొంది. ప్రతివాదుల జాబితాలో నవీన్‌మిత్తల్, జ్ఞానముద్ర (మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ భార్య), పావనిరావు (విశ్రాంత ఐపీఎస్ ప్రభాకర్‌రావు భార్య), ఐశ్వర్యరాజ్ (ఐఏఎస్ వికాస్‌రాజ్ భార్య), వసుంధర సిన్హా, ఏకే మహంతి, ఓం అనిరుధ్ (రాచకొండ కమిషనర్ కుమారుడు), నందిన్ మాన్ (ఐపీఎస్ విక్రమ్‌సింగ్‌మాన్ భార్య), రీటా సుల్తానియా (ఐఏఎస్ సందీప్ సుల్తానియా భార్య), రాధిక (ఐపీఎస్ కమలాసన్‌రెడ్డి భార్య), నితేశ్‌రెడ్డి (మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి కుమారుడు), ఐపీఎస్ అధికారులు మహేశ్ భగవత్, సౌమ్యా మిశ్రా, స్వాతి లక్రా, రవి గుప్తా, తరుణ్ జోషి, తోట శ్రీనివాసరావు, సుబ్బారాయుడు, రాహుల్ హెగ్డే, రేఖా షరాఫ్ (ఐపీఎస్ ఉమేశ్‌షరాఫ్ భార్య), రేణుగోయల్ (డీజీపీ జితేందర్ భార్య), దివ్యశ్రీ (ఐఏఎస్ ఆంజనేయులు భార్య), హేమలత (ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి భార్య), ఇందూరావు కావేటి (ఐపీఎస్ లక్ష్మీనారాయణ భార్య), సవ్యసాచి ప్రతాప్‌సింగ్ (ఐపీఎస్ గోవింద్‌సింగ్ కుమారుడు), రాహుల్ (విశ్రాంత ఐఏఎస్ జనార్దన్‌రెడ్డి కుమారుడు), వరుణ్ (ఐపీఎస్ విశ్వప్రసాద్ కుమారుడు), విశ్రాంత డీజీపీ అనురాగ్ శర్మ, ఐఏఎస్‌లు అమోయ్‌కుమార్, రాజర్షి షా, అజయ్‌జైన్ తదితరులున్నారు.

పట్టాభిరామ్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

అరగంటపాటు వైద్యులు శ్రమించినా ఫలితం లేకపోయింది. సోమవారం రాత్రి ఆయన తుదిశ్వాస విడిచారని వైద్యులు ప్రకటించారు. ఆయనకు భార్య జయశేషు, కుమారుడు వెంకటసాయి ప్రశాంత్ ఉన్నారు. పట్టాభిరామ్ సతీమణి కూడా వ్యక్తిత్వ వికాస నిపుణురాలు. అభిమానుల సందర్శనార్థం పట్టాభిరామ్ భౌతికకాయాన్ని ఆసుపత్రి నుంచి ఆనంద్‌నగర్ కాలనీలోని స్వగృహానికి బుధవారం ఉదయం 9 గంటలకు తరలిస్తారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ప్రదర్శనలతో జాగృతం చేశారు..

పట్టాభిరామ్ 1950లో కాకినాడ జిల్లా కాజులూరు మండలం శీల గ్రామంలో జన్మించారు. 'రావ్ సాహెబ్' భావరాజు సత్యనారాయణ, వెంకాయమ్మ దంపతుల 15 మంది సంతానంలో పట్టాభిరామ్ ఒకరు. కౌమార దశలో ప్రమాదంతో కాలి వైకల్యం కలిగి ఇబ్బంది పడ్డారు. ఆ సమయంలో ఆత్మన్యూనతాభావానికి లోనైనా.. తండ్రి ఇచ్చిన ధైర్యంతో దాన్ని జయించారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాలలో బీఏ చదువుతున్న రోజుల్లో ప్రముఖ ఇంద్రజాలికుడు ఎంబార్ రావు వద్ద మెలకువలు నేర్చుకున్నారు. డిగ్రీ అనంతరం కాకినాడలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఉద్యోగ విధులు నిర్వహించారు. కాకినాడలో అనేక స్టేజీలపై ఇంద్రజాల ప్రదర్శనలిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేసే వారు. అనంతరం బదిలీపై హైదరాబాద్ వచ్చారు. ఇక్కడా తన ప్రదర్శనలను కొనసాగించి పేరు తెచ్చుకున్నారు. 1984లో.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ ఉన్న సమయంలో కళ్లకు గంతలు కట్టుకుని రవీంద్రభారతి నుంచి చార్మినార్‌కు.. అక్కడి నుంచి మళ్లీ రవీంద్రభారతికి స్కూటర్ నడిపారు. తన ఇంద్రజాల ప్రదర్శనలతో మూఢనమ్మకాలపై ప్రజలను జాగృతం చేశారు. హిప్నాటిజాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రోత్సాహంతో ప్రభుత్వ పథకాలు, మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలను ఇంద్రజాలంతో ప్రచారం చేశారు. పట్టాభిరామ్ తన రచనలు, ఉపన్యాసాలతో ఎంతో మందిలో స్ఫూర్తి నింపారు. 'భారత్ మ్యాజిక్ సర్కిల్' ఏర్పాటు చేసి ఇంద్రజాలంపై గౌరవం పెంచారు. సినిమాల్లోనూ ఇంద్రజాల నైపుణ్యాన్ని ప్రదర్శించారు. దినపత్రికల్లో వ్యక్తిత్వ వికాస వ్యాసాలు రాశారు. 100కుపైగా వ్యక్తిత్వ వికాస పుస్తకాలు రచించారు. సైఫాబాద్‌లో ప్రశాంతి కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేసి 30 ఏళ్లుగా సేవలందిస్తున్నారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్‌తో వేల కుటుంబాలను నిలబెట్టారు. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రెండుసార్లు కళారత్న పురస్కారాలు అందుకున్నారు. పలువురు ప్రముఖుల చేతుల మీదుగా జాతీయ స్థాయి అవార్డులు స్వీకరించారు. రెండు పీహెచ్‌డీలు పూర్తి చేశారు. ప్రతిష్ఠాత్మక సంస్థల్లో అతిథి అధ్యాపకుడిగా బోధించారు. పలు దేశాల్లో వర్క్‌షాప్‌లు నిర్వహించారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల తండ్రి యుగంధర్ సూచనతో ఇంద్రజాలం, వ్యక్తిత్వ వికాసాన్ని బోధించడం ప్రధాన వృత్తిగా ఎంచుకున్నానని పట్టాభిరామ్ నాలుగేళ్ల క్రితం 'ఈటీవీ'తో ప్రత్యేకంగా మాట్లాడిన సందర్భంలో వెల్లడించారు.

వెంటనే తిరుగుపయనం..

పట్టాభిరామ్ కుమారుడు వెంకటసాయి ప్రశాంత్ అమెరికాలో స్థిరపడ్డారు. అక్కడి ఓ ఐటీ కంపెనీకి వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. తన కుమారుడికి ప్రతిష్ఠాత్మక వర్సిటీలో సీటు వచ్చిందని, ఆ ఆనందాన్ని తన తల్లిదండ్రులతో పంచుకోవాలని ప్రశాంత్ ఇటీవలే హైదరాబాద్‌కు వచ్చారు. మూడు రోజుల క్రితం కుటుంబమంతా కలిసి ఆనందంగా వేడుక చేసుకున్నారు. ప్రశాంత్ సోమవారం అమెరికాకు తిరుగు పయనమయ్యారు. ఆయన అమెరికా చేరుకోకుండానే తండ్రి మరణ వార్త వినాల్సి వచ్చింది. అక్కడ దిగిన వెంటనే హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. బుధవారం ఉదయం చేరుకుంటారు.



నాడు ఎన్టీఆర్ నుంచి పురస్కారం స్వీకరిస్తున్న పట్టాభిరామ్

సీఎం సహా ప్రముఖుల సంతాపం

బీవీ పట్టాభిరామ్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంతాపం ప్రకటించారు. ఇంద్రజాల విద్య ద్వారా మూఢనమ్మకాల నుంచి ప్రజలను జాగృతం చేయడానికి ఆయన ఎంతో కృషి చేశారని సీఎం గుర్తుచేసుకున్నారు. పట్టాభిరామ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు సంతాపం తెలిపారు.

కేంద్ర సాయంపై చర్చకు సిద్ధమా?

- కాంగ్రెస్ పాలన వైఫల్యాల్ని కేంద్రంపై నెడుతోంది
- బీసీ రిజర్వేషన్లతో రాష్ట్రపతికి ఏం సంబంధం?
- వచ్చే ఎన్నికల్లో కమలదళం విజయం ఖాయం.. బీసీనే సీఎం
- 'ఈనాడు' ముఖాముఖిలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

ఈనాడు, హైదరాబాద్: వందలకొద్దీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్... ఏడాదిన్నర పాలనలో అనేక అంశాల్లో ప్రజల్ని మోసం చేసిందని, తన పరిపాలన వైఫల్యాల్ని కేంద్ర ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేస్తోందని భాజపా రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేసిన సాయంపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా? అని ఆయన సవాల్ చేశారు. భాజపాలో కొత్త, పాత నాయకులన్న వివక్ష ఉండదని స్పష్టం చేశారు. మంగళవారం ఆయన 'ఈనాడు'తో ముఖాముఖి మాట్లాడారు.



? తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయట్లేదన్న రాష్ట్ర ప్రభుత్వ విమర్శలపై ఏమంటారు

దేశంలోని అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేస్తోంది. కాంగ్రెస్ తన తప్పిదాల్ని, వైఫల్యాల్ని కేంద్రంపై నెడుతోంది. నిబంధనల మేరకు కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం వస్తోంది. జాతీయ రహదారులు, ఎయిమ్స్, గిరిజన వర్సిటీ సహా అనేకం మంజూరు చేస్తోంది. తెలంగాణకు కేంద్రం ఏం చేసిందో నేను వివరిస్తా. చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా?

? భాజపా రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా మీ లక్ష్యాలేంటి

పోలింగ్ బూత్ స్థాయి నుంచి పార్టీని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో బలోపేతం చేస్తాం. రాష్ట్రంలో భారాసకు భవిష్యత్ లేదు. కాంగ్రెస్‌పై రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతోంది. ప్రజలు భాజపా వైపు చూస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాం. అసెంబ్లీ ఎన్నికలకు రోడ్‌మ్యాప్ రూపొందించుకుంటాం. ఈసారి రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రావడం ఖాయం.

? రాష్ట్ర నాయకత్వం విషయంలో బీసీల్ని విస్మరించారన్న చర్చ జరుగుతోంది. ఈ అంశాన్ని ఎలా ఎదుర్కొంటారు

భాజపానే బీసీల పార్టీ. మూడు విడతలుగా ప్రధాని పదవిలో ఉన్న మోదీ బీసీనే కదా? పార్టీ పరంగా వంద పోస్టులుంటాయి. అందులో ఒకటైన రాష్ట్ర అధ్యక్ష పదవి వేరే సామాజికవర్గానికి ఇస్తే బీసీలకు ప్రాధాన్యం తగ్గినట్లు కాదు. పార్టీలో బీసీ ఎంపీలు, కేంద్ర మంత్రి ఉన్నారు. తెలంగాణలో భాజపా అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి అయ్యేది బీసీనే అని జాతీయ నాయకత్వం ఇప్పటికే ప్రకటించింది. ఆ నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం.

? వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల సవాల్‌ను ఎలా ఎదుర్కొంటారు

స్థానిక సంస్థల ఎన్నికలు మా తొలి లక్ష్యం. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై గతంలో కంటే ఈసారి ఎక్కువ దృష్టి పెడతాం. ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తాం. మున్సిపల్ ఎన్నికలనూ లక్ష్యంగా చేసుకుంటాం. పట్టణాల్లో పట్టును మరింతగా పెంచుకుంటాం.

? పాత, కొత్త నాయకుల మధ్య విభేదాల్ని ఎలా నివారిస్తారు? ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు గుర్తింపు ఉంటుందన్న భావనను ఎలా కలిగిస్తారు

భాజపాలో పాత, కొత్త నాయకులన్న తేడా ఉండదు. అందరికీ పార్టీ తల్లి లాంటిది. బలోపేతానికి కొత్త రక్తం రావాల్సిందే. రామచందర్‌రావుకు భాజపాపై ఎంత అధికారం ఉంటుందో, కొత్తవారికి సైతం అంతే ఉంటుంది.

? 2028 అసెంబ్లీ ఎన్నికలకు మూడేళ్ల సమయమే ఉంది. మీ ప్రణాళిక ఏంటి

ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్ని మోసగిస్తోంది. ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తాం. బీసీలకు 42% రిజర్వేషన్ల పేరుతో వంచిస్తోంది. జనాభాపరంగా రిజర్వేషన్లు ఇస్తే మాకు అభ్యంతరం లేదు. బీసీలకు పెంచిన రిజర్వేషన్లను నేరుగా అమలు చేయకుండా రాష్ట్రపతికి పంపించారు. రిజర్వేషన్ల పెంపుతో రాష్ట్రపతికి ఏం సంబంధం? రైతుభరోసా సొమ్ము ప్రభుత్వం ఆలస్యంగా వేసింది. రుణమాఫీ సరిగా చేయలేదు. భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలతో కలిసి సమష్టి నాయకత్వంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందుకెళ్తాం.

భాజపా జాతీయ మండలి సభ్యులు వీరే

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా పలువురు భాజపా జాతీయ మండలి సభ్యులుగా ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా మన్నెగూడెలో మంగళవారం నిర్వహించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం సందర్భంగా జాతీయ మండలి సభ్యుల పేర్లను రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీనారాయణ ప్రకటించారు. వీరిలో కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు కె.లక్ష్మణ్, డీకే అరుణ, జి.నగేశ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, ఏవీఎన్ రెడ్డి, పాయల్ శంకర్, అంజిరెడ్డి, గీతామూర్తి, పద్మజారెడ్డి, అరుణజ్యోతి, బండారి రాధిక, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, చింతా సాంబమూర్తి, ఎం.ధర్మారావు, ఎస్.కుమార్ తదితరులు ఉన్నారు.

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బంగారు శృతి, దుగ్యాల ప్రదీప్ కుమార్, కాసం వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి వ్యక్తిగత కారణాల వల్ల హాజరు కాలేకపోయానని ఎంపీ ధర్మపురి అర్వింద్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

జూన్‌లో తిరుమలకు పోటెత్తిన భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: జూన్‌లో తిరుమల శ్రీవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. నూతనంగా తీసుకొచ్చిన క్యూలైన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో ఎంత మంది వచ్చినా.. అత్యంత కచ్చితత్వంతో వేగంగా దర్శనాలకు వెళ్లే అవకాశం కలిగింది. జూన్‌లో ఏకంగా 24.08 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీ కానుకలు గతంతో పోల్చుకుంటే అధికంగా లభించాయి. జూన్‌లో శ్రీవారికి కానుకల రూపంలో రూ.120.35 కోట్లు సమర్పించగా గతేడాది ఇది రూ.110 కోట్లుగా ఉంది.

గ్రహం అనుగ్రహం — 2-7-2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, శుక్లపక్షం సప్తమి: మ. 1-16 తదుపరి అష్టమి; ఉత్తర: మ. 1-04 తదుపరి హస్త వర్జ్యం: రా. 10-11 నుంచి 11-55 వరకు; అమృత ఘడియలు: ఉ. 7-04 వరకు దుర్ముహూర్తం: ఉ. 11-37 నుంచి 12-29 వరకు; రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు; సూర్యోదయం: ఉ.5.33; సూర్యాస్తమయం: సా.6.34

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నల్గొండ	33.0	21.4
కరీంనగర్	29.0	24.0
హైదరాబాద్	28.4	20.8
మెదక్	28.4	20.0
ఆదిలాబాద్	28.3	23.0
రామగుండం	27.5	24.0
హనుమకొండ	27.5	21.5
ఖమ్మం	27.4	22.0
నిజామాబాద్	27.3	23.5
మహబూబ్‌నగర్	26.9	23.1
సూర్యాపేట	26.5	25.0




ఘటన తీరును సీఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తున్న అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి. చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, రాజనర్సింహ ★ పరిశ్రమ వద్ద సహాయక చర్యలు

సిగాచీ పరిశ్రమ ప్రతినిధులెక్కడ?

''సిగాచీ పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులెక్కడ? సమీక్ష సమావేశానికి వారెందుకు హాజరు కాలేదు. ఇంత పెద్ద ప్రమాదం చోటుచేసుకుంటే... వారు వచ్చి బాధితులకు అండగా నిలవాలి కదా? ఇక్కడికి రాలేనంత బిజీగా ఉంటే పరిశ్రమను నిర్వహించడం ఎందుకు? మూసేయండి. మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని వారిని పిలిపించాలి. సహాయక చర్యల్లో పాల్గొనేలా చూడాలి. మృతుల కుటుంబాలకు మానవతా దృక్పథంతో పరిహారం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. క్షతగాత్రులకు సంస్థ రంగా లభించే సౌకర్యాలు కల్పించాలి'' అంటూ కంపెనీ ప్రతినిధితోపాటు అధికారులను సీఎం ఆదేశించారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి ఆర్థిక సహాయం

సిగాచీ పరిశ్రమ బాధితులకు సీఎం రేవంత్‌రెడ్డి భరోసా

ఈనాడు, సంగారెడ్డి: హైదరాబాద్ శివారులోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో పేలుడు ధాటికి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం, కర్మాగార యాజమాన్యం సమన్వయంతో రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, వారి పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. ఈ మేరకు మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశ్రమలో పేలుడు జరిగిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. పేలుడుకు కారణాలపై సమీక్షించారు. కర్మాగారంలో పీరియాడికల్ తనిఖీలు చేస్తున్నారా అని ఫ్యాక్టరీస్ భద్రతా విభాగం అధికారులను ఆరాతీశారు. ఎవరి వైఫల్యంతో ఇంత పెద్ద ప్రమాదం జరిగిందో నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి ప్రయత్నరు ఎందుకు తనిఖీ చేయలేదని నిలదీశారు. తర్వాత కంపెనీ ఎదుట ఉన్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో సీఎం మాట్లాడుతూ...

అత్యంత విషాదకరమైన దుర్ఘటన

''ఇది అత్యంత విషాదకరమైన దుర్ఘటన. కర్మాగారంలో ప్రమాదం జరిగే సమయంలో 143 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు నిర్ధారణ జరిగింది. వారిలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. 58 మంది సురక్షితంగా ఉన్నారు. మరికొందరి ఆచూకీ కోసం సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. తీవ్రంగా గాయపడిన వారికి రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు అందిస్తాం. తక్షణ సాయంగా మృతి చెందిన కుటుంబాలకు రూ.లక్ష, క్షతగాత్రులకు రూ.50 వేలు ఇవ్వాలని సంగారెడ్డి కలెక్టర్‌ను ఆదేశించాం. గాయపడిన కార్మికులకు నాణ్యమైన ఉచిత వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాం. మృతదేహాలను వారి సొంతూళ్లకు తరలించేలా చూస్తాం. రెండు రోజుల నుంచి ఇద్దరు మంత్రులు, కలెక్టర్, ఎస్పీలతోపాటు ఇతర యంత్రాంగం కర్మాగారంలోనే ఉండి సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేస్తున్నాం.



పరిశ్రమ వద్ద బాధితులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. పక్కన మంత్రి వివేక్

ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక విధానం

సిగాచీ పరిశ్రమలో ప్రమాదానికి కారణాలను కనుగొనేందుకు సీఎస్ ఆధ్వర్యంలో కమిటీ వేశాం. ఈ పరిశ్రమలో కాలానుగుణంగా(పీరియాడికల్) తనిఖీలు ఎలా జరిగాయో పరిశీలించాలని, తనిఖీలు జరిగితే లోపం ఎక్కడుందనేది తేల్చాలని సూచించాం. వారిచ్చే నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. రసాయన, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని నిర్ణయించాం'' అని వివరించారు. సమావేశంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, కాంగ్రెస్ నాయకులు జగ్గారెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



నిఖిల్‌కుమార్‌రెడ్డి, శ్రీరమ్య దంపతులు

మనసులు కలిసిన చోటే తనువులు చాలించారు!

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- జమ్మలమడుగు, ముద్దనూరు: పాశమైలారంలోని పరిశ్రమలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఏపీలోని వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన నిఖిల్‌కుమార్‌రెడ్డి, శ్రీరమ్య అనే నవ దంపతులు ప్రాణాలు కోల్పోయారు. ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి, మాధవి దంపతుల కుమారుడు నిఖిల్ కుమార్ రెడ్డి(30) తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని సిగాచీ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. అతడికి అక్కడే ఉద్యోగం చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామానికి చెందిన రామాల శ్రీరమ్య(25) పరిచయమైంది. అది తర్వాత ప్రేమగా మారడంతో ఈ ఏడాది ఏప్రిల్ 20న హైదరాబాద్‌లోని ఆర్య సమాజంలో వివాహం చేసుకున్నారు. ఏప్రిల్ 25న సొంత గ్రామమైన పెనికలపాడు గ్రామానికి వచ్చి పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ తర్వాత ముద్దనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ వివాహానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని తిరిగి హైదరాబాద్ వెళ్లారు. ఆషాఢ మాసం వెళ్లాక వీరిద్దరికీ పెద్దల సమక్షంలో వైభవంగా మళ్లీ పెళ్లి చేయాలని కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం ఫార్మా కంపెనీలో చోటుచేసుకున్న ప్రమాదంలో నవదంపతులిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

2 నెలల కిందటే ఉద్యోగం.. అంతలోనే విషాదం



ప్రసన్న

చాగల్లు, న్యూస్‌టుడే: పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన పేలుడులో తూర్పుగోదావరి జిల్లా చాగల్లుకు చెందిన పోలిశెట్టి ప్రసన్న(22) మృత్యువాతపడ్డారు. ఆ మేరకు ఆమె తల్లిదండ్రులకు తాజాగా సమాచారం అందింది. చాగల్లుకు చెందిన శ్రీనివాసరావు, రామలక్ష్మి దంపతులు. వృత్తిరీత్యా శ్రీనివాసరావు తాపీమేస్త్రీగా పని చేస్తూ.. మదర్‌థెరిసా సేవా సమితి పేరిట సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. ఆయనకు ప్రసన్న, ప్రభుకుమారి అనే ఇద్దరు కుమార్తెలు. శ్రీనివాసరావు మేనల్లుడు యాతం జయమహేష్ సిగాచీ ఇండస్ట్రీస్‌లో పని చేస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రసన్నకు అదే సంస్థలో రెండు నెలల కిందట ఉద్యోగం వచ్చింది. త్వరలో సమీప బంధువుతో ఆమెకు వివాహం చేయాలని అనుకుంటుండగా పరిశ్రమలో సోమవారం జరిగిన ప్రమాదంలో ప్రసన్న ప్రాణాలు కోల్పోయారు. దాంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



గురకను అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు

గురక దేనికి సంకేతమంటే..

✦ మెదడుకు సరిపడా ఆక్సిజన్ అందకపోవడం

✦ ఊపిరితిత్తులు పూర్తిస్థాయిలో పనిచేయకపోవడం

✦ నాణ్యమైన నిద్ర లేకపోవడం.

గురక సమస్యను నిర్లక్ష్యం చేస్తే- ఒత్తిడి హార్మోన్లు పెరుగుతాయి. రక్తపోటు అధికమవుతుంది. శరీర బరువు పెరుగుతుంది.

– శ్రద్ధే కటియార్, వైద్యుడు

రసాయన గాయాలతో తనువెల్లా ఛిద్రమే!

- 10–15 శాతమే కాలినా.. తీవ్రత ఎక్కువే
- ప్రాణాలతో పోరాడుతున్న పలువురు 'పాశమైలారం' బాధితులు

ఈనాడు, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారం రసాయన పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో ఎక్కువ మంది పేలుడు ధాటికి, మంటలు అంటుకొని మరణించారు. మరికొందరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. వీరిలో చాలామంది పరిస్థితి విషమంగా ఉంది. పేలుడు కారణంగా రసాయనాలు శరీరంపై పడటం, మంటలు వ్యాపించడం వల్ల చాలామందికి కాళ్లు, చేతులు, ఒళ్లు కాలిపోయాయి. సాధారణ అగ్ని ప్రమాదంలో 30 శాతం శరీరం కాలినా... చికిత్సలతో కోలుకునేందుకు అవకాశం ఉంటుంది. రసాయన పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్లో 10-15 శాతం కాలినా.. అది 50 శాతం గాయాల కింద లెక్క అని నిపుణులు పేర్కొంటున్నారు. ''శరీరంపై కాలిన రసాయన గాయం తీవ్రత లోపలి వరకు కనిపిస్తుంది. తొలుత చర్మంపై ఉన్న ఎపిడెర్మిస్, డెర్మిస్, ఫ్యాట్, ఫేషియా తదితర పొరలు దాటి.. కండరానికి అక్కడి నుంచి ఎముకలకూ చేరుకొని నష్టపరుస్తుంది. కండరాల నుంచి ఆ విష పదార్థం రక్తనాళాల ద్వారా కిడ్నీలు, కాలేయానికి చేరి వాటిని దెబ్బతీస్తుంది. రసాయన గాయాల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి'' అని నిపుణులు సూచిస్తున్నారు.

''అగ్ని ప్రమాదాల్లో రసాయనాల కారణంగా శరీరం కాలితే.. మంటలు ఆర్పడానికి ఆల్కలైన్ లాంటి ఇతర రసాయన పదార్థాలను వాడేస్తుంటారు. దీని వల్ల మంటలు తగ్గినా... ఆ సమయంలో ఎక్కువ వేడి పుట్టి మరింత గాయాలకు కారణమవుతుంది. ఈ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి'' అని వైద్యులు పేర్కొంటున్నారు.

నీళ్లు ధారగా పోయాలి

☛ వివిధ రకాల రసాయనాలతో కాలిన గాయాలైతే తొలుత మంటలు ఆర్పి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేలోపు ఉపశమనం కల్పించాలి. ప్రాథమిక చికిత్స అందించాలి. యాసిడ్స్ మరింతగా శరీరం లోపలకు వెళ్లకుండా గాయాలను నీటితో కడగాలి. ముఖ్యంగా ధారగా పడుతున్న నీటి కింద 15-30 నిమిషాల వరకు అలానే ఉంచడం వల్ల శరీరంపై ఉన్న రసాయనమంతా బయటకు పోతుంది. తద్వారా శరీరం మరింత లోతుగా కాలదు.

☛ విద్యుత్ వైర్ల కారణంగా గాయాలైతే ఆ వైర్లు తొలగించి నీళ్లు పోయాలి. లేకుంటే ఇతరులు కూడా షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

☛ అగ్ని వల్ల కాలిన గాయాల కంటే యాసిడ్స్ కారణంగా అయిన వాటి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. యాసిడ్స్.. చర్మం కింద ఉన్న నాలుగు పొరలను దాటి లోపలకు వెళ్లి శరీర అవయవాలను దెబ్బతీస్తాయి. తక్కువ శాతం కాలినా సరే కొన్నిసార్లు తీవ్రంగా మారుతుంది. చిన్న గాయమని నిర్లక్ష్యం చూపకుండా చికిత్స అందించాలి.

☛ ఉస్మానియాలో కాలిన గాయాలకు ఆధునిక చికిత్సలు అందిస్తున్నాం. 50-60 శాతం కాలిన గాయాలుంటే.. దాతల నుంచి సేకరించిన చర్మంతో గ్రాఫ్టింగ్ చేసి.. శరీరం నుంచి ప్రొటీన్ లీకేజీని అరికట్టి ఇన్‌ఫెక్షన్లు రాకుండా చూస్తాం. ఇలా మూడు వారాల వరకు ఈ చర్మం ఉపయోగపడుతుంది. తర్వాత బాధితుల తొడ, పొట్ట, వీపు భాగాల నుంచి చర్మం సేకరించి తిరిగి వారికే గ్రాఫ్టింగ్ చేసి ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేస్తుంటాం.

– డాక్టర్ నాగప్రసాద్, సీనియర్ ప్రొఫెసర్, ఉస్మానియా ఆసుపత్రి

లీకేజీలను గుర్తించండి... తక్షణం అరికట్టండి!

- పరిశ్రమల్లో ఇక 6 నెలలకోసారి ఎల్‌డీఏఆర్ పరీక్ష
- 'సిగాచీ' ప్రమాదం నేపథ్యంలో పీసీబీ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: సిగాచీ పరిశ్రమలో పేలుడు ఘటన నేపథ్యంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అప్రమత్తమైంది. గ్యాస్, రసాయనాలు, వాయువుల లీకేజీలను గుర్తించి, సరిచేసే పరీక్షలను ఆరు నెలలకోసారి చేయాలని అన్ని పరిశ్రమలను మంగళవారం ఆదేశించింది. ఇప్పటివరకు ఎల్‌డీఏఆర్ (లీక్ డిటెక్షన్ అండ్ రిపేర్) పరీక్షలను పెద్ద పరిశ్రమలు రెండేళ్లకోసారి, చిన్న పరిశ్రమలు ఏడాదికోసారి నిర్వహిస్తున్నాయి. ఈ వ్యవధిని పీసీబీ ఆరు నెలలకు కుదించింది. పరిశ్రమల్లో ఎక్కడైనా రసాయనాలు, గ్యాస్ లీకవుతున్నాయా... అయితే, ఎంత పరిమాణంలో అన్న విషయాలను ఈ పరీక్షలతో గుర్తిస్తారు. ఫలితాలకు అనుగుణంగా మరమ్మతులు చేస్తారు. గ్యాస్ ప్లాంట్లు, కెమికల్ ఫ్యాక్టరీలు, ఆయిల్ అండ్ గ్యాస్ యూనిట్లలో ఎల్‌డీఏఆర్ పరీక్షల అవసరం ఎక్కువగా ఉంటుంది. వీటి ద్వారా కార్మికులు, ఉద్యోగులను ప్రమాదాల బారి నుంచి తప్పించడంతోపాటు వాయు కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు పాటుపడొచ్చు. లీకేజీలతో పరిశ్రమలకు కలిగే ఆర్థిక నష్టాన్నీ నివారించొచ్చు.

అక్కడ ప్రమాదకర వ్యర్థాలున్నాయా?

సిగాచీ పరిశ్రమలో పేలుడు నేపథ్యంలో అక్కడ ప్రమాదకర వ్యర్థాలేమైనా ఉన్నాయేమో తేల్చాలని పీసీబీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పేలుడు ధాటికి కంపెనీ భవనం ధ్వంసమైంది. శిథిలాలను తొలగించిన తర్వాతే... అక్కడున్న వ్యర్థాలపై స్పష్టత వస్తుందని, దీనికి కొంత సమయం పడుతుందని పీసీబీ ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'కు తెలిపారు.

ప్రమాదాలు జరగకుండా కఠినంగా వ్యవహరించాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఈనాడు, సంగారెడ్డి- పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమలో ప్రమాదస్థలిని మంగళవారం రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావుతో కలిసి పరిశీలించడంతోపాటు, పటాన్‌చెరులోని ధ్రువ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారులతో ఓ కమిటీని ఏర్పాటు చేసి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పరిశ్రమల్లో తనిఖీలు లంచాల కోసం జరుగుతున్నాయా..? అని ప్రశ్నించారు. ప్రమాద బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల జాబితా వచ్చిన తర్వాత ఆయా రాష్ట్రాల వారికి తమ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ఎక్కడున్నారో... ఏమయ్యారో...?

- ఫొటోలు పట్టుకొని సిగాచీ పరిశ్రమ వద్ద తల్లడిల్లుతున్న కుటుంబ సభ్యులు

ఈనాడు, హైదరాబాద్: కంపెనీలో పనికి వెళ్లిన తమ కుటుంబ సభ్యులకు ఏం జరిగిందో తెలియక కళ్ల నిండా దుఃఖం.. రోజున్నర గడిచినా వాళ్ల ఆచూకీ చిక్కక గుండెలనిండా వేదన. పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో కొందరు కార్మికుల కుటుంబ సభ్యులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. బాధితుల్లో ఎక్కువగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారున్నారు. భాష అర్థమవక, ఎవరినడగాలో తెలియక తమవారి ఫొటోలు పట్టుకుని ఆచూకీ చెప్పాలంటూ ప్రాధేయపడుతున్నారు. పరిశ్రమ, ఆసుపత్రుల చుట్టూ చెమ్మగిల్లిన కళ్లతో తిరుగుతున్నారు. మంగళవారం పరిశ్రమ దగ్గర బాధిత కుటుంబాల సభ్యులు 'ఈనాడు'తో తమ ఆవేదన పంచుకున్నారు.

రెండురోజుల క్రితం చేరాడు.. అంతలోనే



ఈ చిత్రంలో ఓ వ్యక్తి పట్టుకున్న ఫొటోలోని యువకుడి పేరు జస్టిన్(21). రెండు రోజుల క్రితమే పరిశ్రమ ప్యాకింగ్ విభాగంలో చేరాడు. సోమవారం జనరల్ షిఫ్టులో విధులకు వెళ్లాడు. అతడి ఆచూకీ చిక్కకపోవడంతో జస్టిన్ ఫొటో పట్టుకుని అతనెక్కడున్నాడో చెప్పాలంటూ కుటుంబ సభ్యులు అధికారులను ప్రాధేయపడుతున్నారు. పటాన్‌చెరు, మియాపూర్‌లోని ఆసుపత్రుల్లో, కంపెనీ దగ్గర మంగళవారం తెల్లవారుజాము వరకూ వెతికినా ఎవ్వరూ ఏంచెప్పడం లేదంటూ జస్టిన్ సోదరి, మామ విలపించారు. పోలీసుల సూచనతో డీఎన్ఏ నమూనాలిచ్చినట్లు చెప్పారు.

తమ్ముడి మృతదేహమైనా అప్పగిస్తారా..?



చిత్రంలో రోదిస్తున్న మహిళ పేరు సోని. బిహార్‌లోని దర్భంగా జిల్లాకు చెందిన ఈమె సోదరుడు లక్ష్మీ ముఖియా సిగాచీ పరిశ్రమలో కార్మికుడు. ప్రమాదం తర్వాత నుంచి అతడి ఆచూకీ చిక్కక గుండెలు బాదుకుంటూ విలపిస్తోంది. 'నా సోదరుడికి ఏం జరిగిందో తెలియడంలేదు. ఆసుపత్రుల చుట్టూ తిరిగినా ఎక్కడా లేడు. కనీసం మృతదేహమైనా అప్పగిస్తారా..?' అంటూ చెమ్మగిల్లిన కళ్లతో అడుగుతోంది.

★ ప్రమాదం జరిగినప్పుడు తన బావ పరిశ్రమలోనే ఉన్నాడని, అతడికి ఏం జరిగిందో చెప్పాలని బిహార్‌కు చెందిన పప్పూయాదవ్ అధికారుల్ని నిలదీశారు.

అన్నిచోట్లా వెతికినా లాభంలేక..!



ఈ చిత్రంలోని యువకుడి పేరు గుండుబెల్లి వెంకటేశ్(27). శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలానికి చెందిన ఇతడు సిగాచీలో సీనియర్ కెమిస్ట్‌గా నాలుగేళ్లుగా పనిచేస్తున్నాడు. ''ప్రమాదం తర్వాత నుంచి అతడి ఆచూకీ చిక్కలేదు. క్షతగాత్రుల జాబితాలో వెంకటేశ్ పేరు కనిపించలేదు. కంట్రోల్ రూంలో సంప్రదించినా లాభం లేదన్నారు. శిథిలాల కింద మృతదేహం ఉంటుందని చెబుతున్నారు' అని వెంకటేశ్ సమీప బంధువొకరు వాపోయారు.

భర్త, సోదరుడి జాడ లేదని గర్భిణి కన్నీటి వేదన



ఏడు నెలల గర్భిణి.. ప్రసవ సమయంలో భర్త తోడుగా ఉంటాడని భావించిన ఆమెకు ప్రమాదం తీరని శోకాన్ని మిగిల్చింది. భర్తతోపాటు తోబుట్టువు, ఇద్దరు బంధువుల ఆచూకీ ఇప్పటివరకూ చిక్కలేదని బిహార్‌కు చెందిన గర్భిణి పూజాకుమారి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ''మూడేళ్ల క్రితం నాగ పాసవాన్‌తో వివాహమైంది. ఉపాధి కోసం హైదరాబాద్ వచ్చాం. సిగాచీ పరిశ్రమలో నా భర్తతోపాటు సోదరుడు దీపక్ పాసవాన్, సమీప బంధువులు దిలీప్ గోస్వామి పనిచేస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు పరిశ్రమలోనే ఉన్నారు'' అంటూ ఏడాదిన్నర కుమారుడితో పరిశ్రమ వద్ద కూర్చుని ఆమె విలపిస్తోంది.

మృత్యుదిబ్బ

(మొదటి పేజీ తరువాయి)

వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మిగతా 60 మంది కార్మికుల ఆచూకీ లభించింది, మరో 13 మంది ఆచూకీ తెలియడంలేదని అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 143 మంది పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. భవనం శిథిలాలను పూర్తిగా తొలగిస్తేనే గల్లంతైన వారి వివరాలు లభిస్తాయి. మరోవైపు చనిపోయిన వారిని గుర్తించడానికి వారి బంధువులకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి గుర్తించే ప్రక్రియ చేపట్టారు.

కనిపించని భవనం ఆనవాళ్లు

పరిశ్రమ పూర్తిగా కుప్పకూలడంతో ఘటన జరిగిన 36 గంటల తర్వాత కూడా మొత్తం ఎందరు చనిపోయారన్న దానిపై స్పష్టత రాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సోమవారం ఉదయం ఘటన జరిగిన వెంటనే తొలుత క్షతగాత్రులను, మంటల్లో చిక్కుకొన్న వారిని రక్షించేందుకు, మృతదేహాలను వెలికి తీసేందుకు ప్రాధాన్యమిచ్చిన సహాయక సిబ్బంది నెమ్మదిగా శిథిలాలను తొలగించడం ప్రారంభించారు. మంగళవారం ఉదయానికి పేలుడు జరిగిన ప్రాంతం వరకు జేసీబీలను వెళ్లగలిగేలా చేయగలిగారు.

★ ప్రధాన ద్వారం నుంచి దాదాపు 50 మీటర్ల దూరంలో పరిశ్రమ భవనముంది. అందులోని ఎడమవైపు గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఔషధాన్ని శుద్ధి చేసే స్ప్రేయర్ డ్రయ్యర్ ఉంది. దానికి వెనుకవైపు ముడి పదార్థాన్ని పంపించే అల్యూమినియం పైపులు, ఎయిర్ హ్యాండిల్ యూనిట్లు ఉన్నాయి. సరిగ్గా డ్రయ్యర్ పైఅంతస్తులో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ ఎష్యూరెన్స్ విభాగాలున్నాయి. దానికి ఎడమవైపు గ్రౌండ్‌ఫ్లోర్, దాని పైఅంతస్తులో పరిపాలన, ఎకౌంట్స్ విభాగాలున్నాయి. డ్రయ్యర్ పేలుడు తీవ్రతకు శ్లాబ్ మొత్తం కుప్పకూలింది. అక్కడ ఒక అంతస్తు ఉండేదని చెప్పినా నమ్మలేని పరిస్థితి.

లోనికి వెళ్లాలంటే భయం

పేలుడు జరిగినప్పుడు డ్రయ్యర్ వద్ద సుమారు 50 మంది, దాని పైఅంతస్తులో 20 మంది వరకున్నారని ప్రాథమిక సమాచారం. పేలుడు తీవ్రతకు భవనమంతా కదిలిపోవడంతో గ్రౌండ్‌ఫ్లోర్‌లోని శిథిలాలను తొలగించి... లోనికి అడుగు పెట్టడానికి సహాయక సిబ్బంది జంకుతున్నారు. లోనికి వెళ్లగానే పైనున్న స్లాబ్ కూలిపోతుందన్న భయమే ఇందుకు కారణం. దాంతో మంగళవారం ఉదయం సహాయ చర్యలను నిలిపివేశారు. సాయంత్రం మళ్లీ మొదలైనా చురుకుగా సాగడంలేదు. ప్రత్యామ్నాయంగా భారీ యంత్రాలను తీసుకొచ్చి... శిథిలాలను తొలగించాలని అధికారులు ఆలోచిస్తున్నారు.

50 మీటర్ల దూరం నుంచి ఎగిరిపడి... తన కారువద్దే..

పేలుడు తీవ్రతకు 50 మీటర్ల దూరంలో ఉన్న భద్రతా సిబ్బంది కార్యాలయం కూడా కాలిపోయింది. దానిపక్కనే ప్రధాన ద్వారం వద్ద నిలిపిన సంస్థ జనరల్ మేనేజర్ ఇలంగోవన్ కారు ధ్వంసమైంది. ఆయన క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం నుంచి మెట్లు దిగుతుండగా పేలుడు జరగడంతో... ఎగిరొచ్చి తన కారు వద్దే పడిపోయి ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఒక అగ్నిగోళం ఎగిరి వచ్చినట్లుగా కనిపించిందని చుట్టుపక్కల వారు తెలిపారు.

ఐదుగురి పరిస్థితి విషమం

ప్రమాదంలో గాయపడిన వారిలో తొమ్మిది మంది కార్మికులు పటాన్‌చెరులోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు రాజనర్సింహ, పొంగులేటి, వివేక్, శ్రీధర్‌బాబు పరామర్శించారు. వీరి వెంట డీజీపీ జితేందర్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ ఉన్నారు. మరోవైపు పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి 36 మృతదేహాలను తరలించగా... ఉస్మానియా నుంచి వచ్చిన ఫోరెన్సిక్ బృందం వారు 30 మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఇక్కడ మృతదేహాలను నిల్వ ఉంచేందుకు ఫ్రీజర్లు, స్థలం లేకపోవడంతో పక్కనే కొత్తగా నిర్మించిన మల్టీ స్పెషాలిటీ భవనంలో వైద్యారోగ్య శాఖ పంపించిన ఫ్రీజర్లలో భద్రపరిచారు. మరో ఆరింటికి పోస్టుమార్టం జరగాల్సి ఉంది.

★ 11 మంది మృతుల కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.11 లక్షలు, 34 మంది క్షతగాత్రులకు రూ.17 లక్షల నగదును ఆర్డీవో రవీందర్ అందించారు.

★ కార్మికుల కుటుంబాలకు చెందిన యశ్వంత్ అనే వ్యక్తి బీడీఎల్ భానూరు ఠాణాలో ఫిర్యాదు చేయడంతో సిగాచీ పరిశ్రమ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పర్యవేక్షణ లోపంతోనే రియాక్టర్ పేలుడు!

'పాశమైలారం దుర్ఘటన'పై నిపుణుల అభిప్రాయం

ఈనాడు, హైదరాబాద్, కూకట్‌పల్లి, లాలాపేట్, న్యూస్‌టుడే: రసాయన, ఫార్మా కంపెనీల్లో రియాక్టర్లు పేలకుండా ఉండటానికి ప్రామాణిక నిర్వహణ విధానాన్ని అమలు చేయాలని నిపుణులు చెబుతున్నారు. పాశమైలారం సిగాచీ రసాయన పరిశ్రమలో సోమవారం స్ప్రేయర్ డ్రయ్యర్ పేలి పలువురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. పర్యవేక్షణ లోపంతో పాటు ప్రామాణిక నిర్వహణ విధానాన్ని అమలు చేయకపోవడం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సైంటిఫిక్ ఇంజినీరింగ్ వ్యవస్థ ఉండాలి

– కేఎం లక్ష్మణ్‌రావు, విశ్రాంత ప్రొఫెసర్, జేఎన్‌టీయూ, హైదరాబాద్

రసాయన, ఫార్మా పరిశ్రమలున్న పారిశ్రామికవాడల్లో సైంటిఫిక్ ఇంజినీరింగ్ వ్యవస్థ ఉంటే ప్రమాదాలు తక్కువ జరిగే ఆస్కారం ఉంటుంది. ఈ వ్యవస్థ స్వయం ప్రతిపత్తిని కలిగి ఉండాలి. పరిశ్రమల్లో ప్రమాదాలకు అవకాశాలున్న ప్రతి అంశాన్ని ఈ వ్యవస్థలోని అధికారులు క్షుణ్ణంగా పరీక్షిస్తారు. ఇలాంటి వ్యవస్థలు అమెరికా, ఇరాన్ వంటి దేశాల్లో ఉన్నాయి. రియాక్టర్ పేలుడు వెనుక చల్లదనం, ఉష్ణోగ్రతను పెంచే సాంకేతిక పరిజ్ఞానం సరిగా పనిచేయకపోవడం, ఆపరేటర్ స్వల్ప లోపాన్ని గుర్తించకపోవడం ప్రాథమిక కారణాలుగా కనిపిస్తున్నాయి. రియాక్టర్ పనితీరును పర్యవేక్షించకపోవడం మరో కారణమై ఉండొచ్చు.

భద్రతా హెచ్చరికల పనితీరుపై అనుమానాలు

– ప్రొఫెసర్ రమేశ్ కుమార్, ప్రిన్సిపల్, టెక్నాలజీ కళాశాల, ఓయూ

రియాక్టర్ పనితీరులో హెచ్చుతగ్గులున్నా..సక్రమంగా పనిచేయకపోయినా భద్రతా హెచ్చరికలు(సెక్యూరిటీ అలారమ్స్) వెంటనే అప్రమత్తం చేస్తాయి. ఒకటో అలారానికి ఎవరూ స్పందించకపోతే రెండో అలారం మరింత గట్టిగా హెచ్చరిస్తుంది. రియాక్టర్ పేలిందంటే రసాయన ప్రక్రియలో లోపాలు, భద్రతా హెచ్చరికలు వినిపించలేదని అర్థమవుతోంది. రియాక్టర్‌లో పీడనం ఎక్కువై పేలిపోయి ఉండొచ్చు. పేలుడు తర్వాత సుమారు 800 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతతో గాలి వేగంగా బయటకు వచ్చింది. ఉష్ణోగ్రత తీవ్రత కారణంగా మృతుల సంఖ్య పెరిగింది.

రియాక్టర్‌లో ప్రెషర్ లీకయ్యుండొచ్చు

– ప్రొఫెసర్ కె.విద్య, రసాయన శాస్త్ర విభాగం, జేఎన్‌టీయూ

ప్రమాదం తీరు, అనంతరం సిగాచీ పరిశ్రమలో పరిస్థితులను గమనిస్తే.. రియాక్టర్‌లో ప్రెషర్ లీకయ్యుండొచ్చని అనిపిస్తోంది. ఇదే ప్రధాన కారణమని చెప్పలేం.. రియాక్టర్లలో రసాయన క్రియలు, ప్రతిస్పందనలు తీవ్రంగా ఉంటాయి. ప్రెషర్ లీక్ కారణంగా రసాయనం బయటకు రాగానే గాల్లోని ఆక్సిజన్‌తో సెకన్ల వ్యవధిలో మండిపోయి రియాక్టర్ పేలిపోయింది. ఆ సమయంలోనే ఇతర కారణాలు భారీ పేలుడుకు దోహదపడి ఉండొచ్చు.

ఈనాడు

వ్యవస్థాగత లోపాలే పెనుప్రమాదాలై...

పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాల పాటింపుపై ఫ్యాక్టరీల యాజమాన్యాలు పూర్తిస్థాయిలో శ్రద్ధ వహించాలని తెలంగాణ రాష్ట్ర కర్మాగారాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అప్రమత్తం చేసి మూడు నెలలు కాలేదు... అంతలోనే ఘోర ప్రమాదం సంభవించింది. సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ ఔషధ పరిశ్రమను శిథిలాల కుప్పగా మార్చేసిన భీకర పేలుడు ధాటికి 36 మంది కడతేరిపోవడం అందరినీ కలచివేస్తోంది. దుర్ఘటన చోటుచేసుకున్న ప్రాంతాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి- ఇటువంటి పారిశ్రామిక ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనానికి ఆదేశించారు. గతంలో ఏపీలో ఎల్జీ పాలిమర్స్ సంస్థలో వాటిల్లిన విపత్తుపై విచారణ జరిపిన ఉన్నతస్థాయి కమిటీ కీలక సూచనలెన్నో చేసింది. ఏటా కర్మాగారాల్లో తప్పనిసరిగా భద్రతా ఆడిట్‌లను నిర్వహించాలని, గుర్తించిన లోపాలను నిర్దేశిత గడువులోగా సరిచేయాలని స్పష్టీకరించింది. ప్రమాదకర రసాయనాలను వినియోగించే పరిశ్రమలలో నిర్ణీత సాంకేతిక అర్హతలు, అనుభవం కలిగిన సేఫ్టీ అధికారులు ప్రతి షిఫ్టులోనూ అందుబాటులో ఉండాలని ఆ కమిటీ పేర్కొంది. ఇలాంటి ఏర్పాట్లు, ముందుజాగ్రత్తలను గాలికొదిలేయడంతోనే రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి!

తయారీ రంగంలో సాధించే ప్రగతి- దేశార్థిక పురోగతికి చోదకశక్తి అవుతుంది. ఉపాధికల్పనకు ఊతమై సామాజిక అభ్యున్నతికి తోడ్పడుతుంది. ఆ దిశగా భారతావని ముందడుగు వేస్తున్న క్రమంలో యాజమాన్యాల అలక్ష్యం, అధికారగణాల ఉదాసీనతతో పెరుగుతున్న పారిశ్రామిక ప్రమాదాలు- కార్మికులకు ప్రాణసంకటాలవుతున్నాయి. 2013-2021 మధ్యలో దేశవ్యాప్తంగా ఫ్యాక్టరీల చట్టం కింద నమోదైన కర్మాగారాల్లో సంభవించిన ఉత్పాతాలలో 10,208 మంది మరణించారు. దాదాపు 97వేల మంది గాయాల పాలయ్యారు. కార్మికులకు ప్రాణాంతకం కావడమే కాదు- పారిశ్రామిక ప్రమాదాల మూలంగా పర్యావరణానికీ తీవ్రనష్టం జరుగుతోంది. ఆయా దుర్ఘటనల మూలంగా వాతావరణంలోకి వెలువడుతున్న విష వాయువులూ రసాయనాలతో గాలి, నీరు, నేలా తీవ్రంగా కలుషితమవుతున్నాయి. 2010-2020 నడుమ ఇలా పర్యావరణాన్ని దెబ్బతీసిన ప్రమాదాలు మన దేశంలో 560 జరిగాయని ఐఐటీ కాన్పూర్, బిట్స్ పిలానీ పరిశోధకుల అధ్యయనంలో తేలింది. అంతులేని విధ్వంసాన్ని మిగిల్చిన భోపాల్ పెనువిపత్తు నుంచి పాఠాలు నేర్చుకోని యంత్రాంగం బాధ్యతారాహిత్యమే ప్రకృతికీ, ప్రజారోగ్యానికీ హానికరమవుతోంది!

దేశవ్యాప్తంగా మూడొందలకు పైగా జిల్లాల్లో ప్రమాదాలకు ఎక్కువ అవకాశాలు ఉన్న అతిపెద్ద రసాయన పరిశ్రమలు పద్దెనిమిది వందలకు పైగా పనిచేస్తున్నాయి. ఒక మోస్తరు స్థాయిలో ముప్పు భయం కలిగిన ఫ్యాక్టరీలు వేలల్లో కనిపిస్తాయి. ఇక అసంఘటిత రంగంలో ఎన్ని ఉన్నాయో ఎవరికీ తెలియదు. 2021లో దేశం మొత్తంలోని సాధారణ పరిశ్రమల్లో పట్టుమని 15శాతం వాటిలోనూ తనిఖీలు జరగలేదు. ఆ ఏడాదిలో 26శాతం ప్రమాదకర ఫ్యాక్టరీల్లోనే భద్రతాపరమైన పరిశీలనలు నిర్వహించారు. తనిఖీలు తగ్గించి, స్వీయ ధ్రువీకరణలకు అధికంగా అనుమతించడం వంటి విధానపరమైన లోపాలతోనే ఇండియాలో పారిశ్రామిక ప్రమాదాలు విపరీతమవుతున్నాయనే విశ్లేషణలూ గతంలో వెలువడ్డాయి. బాయిలర్ల నిర్వహణ వంటి పనులను శిక్షణ లేని ఒప్పంద కార్మికులకు అప్పగించడం, కీలక యంత్రాల బాగోగులను పట్టించుకోకపోవడం వంటి యాజమాన్యాల అపరాధాలూ భారీ విస్ఫోటాలకు కారణభూతమవుతున్నాయి. కర్మాగారాల్లో సురక్షిత పని వాతావరణం కోసం సమీకృత కార్యాచరణ ప్రణాళికను పట్టాలకెక్కించి, నిబంధనలను ఉల్లంఘించేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తేనే- పరిశ్రమలకు ప్రమాదాల గండం తప్పుతుంది!



రాజకీయ నాయకులకు నేనెంతో రుణపడి ఉన్నా. వాళ్లు దేశాన్ని పట్టించుకోకపోయినా నన్ను పట్టించుకున్నారు. నా కార్టూన్లకు కావాల్సిన సరుకిచ్చారు. రాజకీయాలూ నాయకులూ మంచిగా మారిపోతే నేను ఉద్యోగం మానేసి పోవాల్సి వచ్చేది.


– ఆర్.కె.లక్ష్మణ్

లోపలి అద్దం

అలలు లేని కొలను నిశ్చలంగా ఉంటుంది. అది అద్దంలా పనిచేస్తుంది. అందులో భౌతికమైన ప్రతిబింబాలు చూసుకోవచ్చు. కానీ మనసు అభౌతికం. అది ఆంతరంగికమైనది. మనిషి ఉనికి అంతకన్నా సూక్ష్మాంశం. అదే అసలైన 'నేను'. ఆ నేను అహం భావంతో సంబంధం లేనిది. అది మనిషికి ప్రాథమిక, ప్రాకృతిక ప్రధాన భూమిక. ఆ స్వస్వరూపాన్ని దర్శించాలంటే, స్వీయానుభూతిని పొందాలంటే ఏం చెయ్యాలి?

మురికిపాత్రలు వంటకు పనికొస్తాయా, బురద నీళ్లు స్నానానికి ఉపయోగపడతాయా, మసక బారిన అద్దాలు ప్రతిబింబాల్ని సరిగ్గా చూపుతాయా? లేదు. అందుకని వాటిని చక్కగా శుభ్రపరచాలి. అలాగే మనసు కూడా. ధ్యానాత్మకమైన మనసు పరిశుద్ధంగా పారదర్శకంగా ఉంటుంది. పూర్తిస్థాయి ఎరుకలో ఉంటుంది. అప్పుడు కళ్ల ముందున్నది, కళ్లకు వెనక ఉన్నదీ కచ్చితంగా కనబడుతుంది.

మనిషి ఒక పనిలో ఉన్నపుడు మరో దాని గురించి ఆలోచనలో పడటాన్ని పరధ్యానం అంటారు. ఒక విషయంపై సంపూర్ణంగా దృష్టి నిలిపినప్పుడు వేరొక అంశానికి సంబంధించిన ఆలోచనకు తావుండదు. కానీ, మనసు ఒక చోట స్థిరంగా నిలవదు. పరిపరివిధాలా పరుగులు తియ్యడం దాని మౌలిక స్వభావం. మనసు అనవసర విషయాల గురించి ఆలోచించినంత కాలం అది కలుషితం అవుతూంటుంది.



బంగారపు గోడ అయినా మట్టి గోడ అయినా ఒకటే. గోడ అంటేనే అవతల ఉన్నదాన్ని కనపడనీయకుండా అడ్డుపడేది. అలాగే, ఆలోచించడం మనసును మసక బారుస్తుంది. కానీ ఆలోచించకుండా మనిషి మనుగడ సాగదు. అది అనివార్యమైంది.

అంతర్యామి

అడ్డూ అదుపూ లేకుండా ఇష్టారీతిన డబ్బు ఖర్చుపెడితే అనతికాలంలోనే ఖజానా ఖాళీ అవుతుంది. ఆ తరవాత ఇబ్బందుల పాలు కావాల్సివస్తుంది. అందువల్లే ఆచి తూచి ఖర్చుపెడుతుంటారు. ఆలోచన విషయంలోనూ అంతే. అది చైతన్య స్వరూపం. అనవసర ఆలోచనలు ఎక్కువయ్యే కొద్దీ ఆనంద నిధి తరిగిపోతుంది. కాబట్టి ఆలోచనాశక్తిని వృథాగా ఖర్చుపెట్టకూడదు. బాల్యంలో జీవితం ఆనందంగా గడిచిపోవడానికి కారణం ఆలోచనల సాంద్రత తక్కువుండటమే. వృద్ధాప్యంలో బతుకు మనోవేదనతో నిండిపోవడానికి మూలం ఆలోచనల సాంద్రత ఎక్కువ కావడం.

గాలిని ప్రత్యక్షంగా చూడలేం. అందుకని చెట్ల కొమ్మల కదలికలు గమనించి గాలి వీస్తున్న భావనకు గురవుతాం. అదే రీతిన మనసు కూడా. అది ఆలోచనల రూపంలో చలిస్తూ ఉంటుంది. నిర్విరామంగా కదిలే ఆలోచనల సమాహారాన్ని ధ్యానసాధనతో తదేకంగా గమనించడం వల్ల చూసేవాడు (కర్త), చూసేది (కర్మ)... రెండూ విడిపోతాయి. అప్పుడు ఆలోచనా ప్రవాహం శక్తి సన్నగిల్లుతుంది. ఆలోచనల భారం లేనందువల్ల మనసు తేలికపడి పునరుత్తేజితమవుతుంది. పరిశుద్ధమైన అద్దంలా పనిచేస్తుంది. అందులో మనిషి తన అంతరంగాన్ని అవలీలగా దర్శించుకోవచ్చు.

– మునిమడుగుల రాజారావు

అనిశ్చితి... ఆర్థిక ప్రకంపనలు!

ఆయతుల్లా ఖొమైనీ నాయకత్వంలో షియా వర్గ నేతలు 1979లో ఇరాన్‌లో అమెరికాకు అనుకూలమైన షా పాలనకు అంతం పలికి ఇస్లామిక్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. వారు ఇజ్రాయెల్, అమెరికాల పట్ల వైరభావం ప్రదర్శించడానికి సైద్ధాంతిక, భౌగోళిక, రాజకీయ, సైనిక కారణాలెన్నో ఉన్నాయి. ఇరాన్ ఇస్లామిక్ ప్రభుత్వం మొదటి నుంచి పాలస్తీనా విమోచన ఉద్యమానికి గట్టి మద్దతుదారుగా నిలిచింది. ఇజ్రాయెల్, పాలస్తీనా రెండు దేశాలుగా ఏర్పడాలని ఐక్యరాజ్యసమితి తీర్మానించినా ఇజ్రాయెల్ దాన్ని ఖాతరు చేయడంలేదు. దాంతో ఇజ్రాయెల్, అమెరికాలపై గాజాలో హమాస్, లెబనాన్‌లో హెజ్బొల్లా, యెమెన్‌లో హూతీలు సాగిస్తున్న పోరాటానికి ఇరాన్ అండదండలు ఇస్తోంది. ఇది మూడు దేశాల మధ్య శత్రుత్వాన్ని మరింతగా పెంచుతోంది.

ఒకప్పుడు అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య బలమైన మైత్రీబంధమే ఉండేది. ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం తర్వాత అమెరికా, ఇజ్రాయెల్‌తో ఘర్షణ మొదలైంది. ఆ వైరానికి పరాకాష్ఠగా కిందటి నెలలో మూడు ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడిచేసింది. ప్రస్తుతానికి ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ కుదిరినా పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉంది.

ఇరాన్ మీదా అదే ఎత్తుగడ...

ఇరాన్ అణు కార్యక్రమం సైతం అమెరికా, ఇజ్రాయెల్‌లకు కంటగింపుగా మారింది. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధ ఒప్పందంపై సంతకం చేయడం వల్ల అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకు వినియోగించుకునే స్వేచ్ఛ తనకుందని ఇరాన్ వాదిస్తోంది. కానీ, శాంతియుత ప్రయోజనాల మాటున అణ్వాస్త్రాన్ని తయారు చేసే కార్యక్రమంలో ఇరాన్ నిమగ్నమైందని అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలు అనుమానిస్తున్నాయి. ఇరాన్ అణుబాంబును తయారు చేస్తే, తన ఉనికికే ప్రమాదమని ఇజ్రాయెల్ భావిస్తోంది. ఇజ్రాయెల్ దగ్గర అణ్వస్త్రాలు ఉన్నా, అణుబాట వీడాలని ఆ దేశాన్ని ఎవరూ ఒత్తిడి చేయకపోవడం గమనార్హం. నిజానికి ఇరాన్‌తో అణ్వస్త్ర తయారీని విరమింపజేయడానికి అమెరికా పూర్వ అధ్యక్షుడు ఒబామాతో పాటు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, చైనాలు సైతం చొరవ తీసుకున్నాయి. ఈ దేశాలు 2015లో ఇరాన్‌తో సంయుక్త సమగ్ర కార్యాచరణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇరాన్ అణ్వస్త్ర సమస్య పరిష్కారమైపోయిందని అందరూ భావించారు. కానీ, ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడైన వెంటనే ఈ ఒప్పందాన్ని రద్దు చేశారు. రెండోసారి అధ్యక్షుడైన తరవాత కూడా అదే పనిచేశారు. గతంలో ఇరాక్‌లో తమకు గిట్టని సద్దాం ప్రభుత్వం జనహనన ఆయుధాలను సమకూర్చుకుందనే వంకతో ఆ దేశంపై దాడి చేసి సద్దాంను సాగనంపింది అమెరికా. ఇప్పుడు ఇరాన్ మీద కూడా అదే ఎత్తుగడ ప్రయోగిస్తోందనే అభిప్రాయం నెలకొంది. చాలాకాలంగా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పరోక్ష యుద్ధం నడుస్తోంది. ఈ సమరంలో ఇజ్రాయెల్‌కు అమెరికా అన్ని రకాలుగా వత్తాసు పలుకుతోంది. 2023 అక్టోబరులో ఇరాన్ మద్దతుగల హమాస్ ఇజ్రాయెల్‌పై విరుచుకుపడిన దగ్గరి నుంచి వ్యవహారం ముదిరింది. మొదట ఇరాన్ ఎగదోస్తున్న హమాస్, హెజ్బొల్లా, హూతీలను వరస దాడులతో బలహీన పరచిన మీదట ఇజ్రాయెల్ మొన్న జూన్ 13న నేరుగా ఇరాన్‌పై దాడులు చేసింది. దీనికి ఇరాన్ డ్రోన్, క్షిపణి దాడులతో బదులిచ్చింది. అమెరికా జూన్ 22న ఇరాన్‌లోని అణు కేంద్రాలపై బీ2 బాంబర్ విమానాలతో దాడిచేసి ఇక ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం కట్టిపెట్టాలని హుకుం జారీ చేసింది.



ప్రస్తుతానికి ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్నా అది తాత్కాలికమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్‌లోని అణు కేంద్రాలపై దాడి చేయడం ద్వారా ఆ దేశం అణుబాంబును తయారు చేయకుండా నిరోధించగలిగామని అమెరికా చెప్పుకొంటున్నా, బాంబు తయారీకి అవసరమైన శుద్ధిచేసిన యురేనియంను ఇరాన్ భద్రంగా తరలించేసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఇరాన్ అణ్వస్త్ర కార్యక్రమానికి నిజంగానే గండిపడిందా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. మొత్తానికి అటు అణ్వస్త్ర సమస్యా పరిష్కారం కాలేదు, ఇటు పాలస్తీనా సమస్య కూడా కొనసాగుతోంది. దీంతో పశ్చిమాసియాపై అలుముకున్న అనిశ్చితి ఇప్పట్లో తొలగేలా లేదు. ఇజ్రాయెల్- ఇరాన్, ఇజ్రాయెల్- పాలస్తీనా సమస్యలు పశ్చిమాసియాకే పరిమితమయ్యేవి కాదు. మిగతా ప్రపంచంపైనా రాజకీయంగా, ఆర్థికంగా పెను ప్రభావం చూపుతాయి. రాజకీయ లక్ష్యాలను సాధించుకోవడానికి ఇష్టారాజ్యంగా బలప్రయోగానికి దిగే ధోరణి ఇటీవల ప్రబలిపోయింది. నాగోర్నో- కారబాఖ్ ప్రాంతం కోసం అజర్‌బైజాన్ ఆర్మీనియాపై దాడి చేయడం, ఉక్రెయిన్‌పై రష్యా ప్రత్యేక సైనిక చర్యకు దిగడం, హమాస్ దాడి వంటివి ఇందుకు ఉదాహరణలు. ఈ వరసలోనే ఇరాన్‌పై అమెరికా కూడా విరుచుకుపడింది. ఈ క్రమంలో సయోధ్య సాధన కోసం ఐరాస వంటి సంస్థలను ఎందుకు ఉపయోగించుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

భారత్‌కు నష్టమే

ప్రపంచానికి చమురు, సహజ వాయువును సరఫరా చేసే ప్రధాన ప్రాంతంగా పేరొందిన పశ్చిమాసియాలో యుద్ధం అంతర్జాతీయంగా ఆర్థిక ప్రకంపనలు సృష్టిస్తోంది. అది అలాగే కొనసాగితే ప్రపంచ వాణిజ్యాన్ని కుంగదీస్తుంది. ముఖ్యంగా భారతదేశ ఇంధన భద్రత దెబ్బతిని అభివృద్ధికి ఆటంకం కలుగుతుంది. డ్రోన్లు, క్షిపణులవల్ల పశ్చిమాసియా గగనతలంలో రక్షణ కొరవడి పౌర విమాన మార్గాలు మూసుకుపోతాయి. ఇరాన్‌లోని చాబహార్ రేవు గుండా మధ్యాసియాకు వాణిజ్య మార్గం తెరవాలనీ, భారత్ నుంచి పశ్చిమాసియా మీదుగా ఐరోపాకు ఆర్థిక నడవా-ఐమెక్‌ను నిర్మించాలనే ఆశలకు విఘాతం కలుగుతుంది. పశ్చిమాసియా దేశాల్లో పనిచేస్తున్న భారతీయ కార్మికులు, నిపుణులు స్వదేశానికి పంపే డాలర్ల మొత్తాలు కోసుకుపోతాయి. యుద్ధం తీవ్రమైతే వారందరినీ అపార వ్యయప్రయాసలకు ఓర్చి స్వదేశానికి తీసుకురావాల్సి ఉంటుంది. పశ్చిమాసియా సంక్షోభం సమసిపోలేదు కాబట్టి మిగతా ప్రపంచానికి అనిశ్చితి తొలగనట్లే. ఇకనైనా ఇజ్రాయెల్, పాలస్తీనాలను రెండు దేశాలుగా ఏర్పరచాలి. ఇరాన్ అణు సమస్యకు సామరస్య పరిష్కారం గుర్తించాలి. రాజకీయ లక్ష్యాల కోసం ప్రభుత్వాలు, ఉగ్రవాదులు బలప్రయోగానికి దిగకుండా సంయమనం పాటించాలి. తగిన సంస్కరణలతో ఐక్యరాజ్య సమితిని తిరిగి బలోపేతం చేయాలి. ప్రపంచం అవ్యవస్థలోకి జారిపోకుండా చూడాలంటే ఇలాంటి చర్యలు తప్పనిసరి.



అచల్ మల్హోత్రా
ఆర్మీనియా, జార్జియాల్లో భారత మాజీ రాయబారి

పరుగు పందెంలో గెలుపొందాలంటే శారీరక సామర్థ్యం ఉంటే సరిపోదు. పందెంలో పాల్గొనే క్రీడాకారుడికి తాను పరిగెడుతున్నప్పుడు 'ఓడిపోతానేమో' అన్న భావన ఒక్క క్షణం మదిలో మెదిలినా, అతడు పరిగెత్తలేడు. అందుకే శిక్షణ తీసుకుంటున్నప్పుడు, పోటీ పడుతున్నప్పుడు ఆ క్రీడాకారుడు తనపై తాను అచంచలమైన విశ్వాసాన్ని ఏర్పరచుకోవాలి. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి. ఇదే జీవితానికి సైతం వర్తిస్తుంది. జీవితమనేది అలుపెరగని ఒక ఆట. దాన్ని గెలిచి తీరాలి.

గెలుద్దామా మరి!



జీవితాన్ని నదితో పోలుస్తారు. నది ఒకసారి ప్రారంభమైందంటే ఎన్ని అవరోధాలు ఎదురైనా ఆగకుండా గమ్యాన్ని చేరేదాకా ప్రవహిస్తూనే ఉంటుంది. మధ్యలో కొండలు గుట్టలు అడ్డం వస్తే దారి మార్చుకుంటుంది. ఎత్తునుంచి కిందికి దూకాల్సి వస్తే జలపాతమవుతుంది. మురికి నీరు వచ్చినా మంచి నీరు వచ్చినా వెంట తీసుకుని పోతుందే తప్ప అభ్యంతరం చెప్పదు. జీవితమూ అంతే కదా. మంచి, చెడు.. ఎలాంటి అనుభవాలు ఎదురైనా నిరంతరం లక్ష్యం వైపు పురోగమించాల్సిందే.

మన జీవితానికి మనమే కర్తలం. ఆ కర్తృత్వాన్ని సమర్థంగా నిర్వహించడంలోనే మన విజయం ఆధారపడి ఉంటుంది- అన్నారు ప్రఖ్యాత తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి. జీవితానికి అనవసరమైన అంశాల చెప్పుచేతల్లో మనం ఉండకూడదు. కొత్త ఆలోచనల వైపు నిరంతరం పరుగులు తీయాలి. స్వయంశక్తితో అభ్యుదయ పథాన ముందుకు సాగాలి. దట్టంగా అలముకున్న మేఘాల మధ్యలో నుంచి అనంత ఆకాశాన్ని చూడలేం. అలాగే, మన జీవన దృశ్యం వర్ణభరితం కావాలంటే సానుకూల అంశాలనే రంగులను సమపాళ్లలో కలపాలి. జీవన చిత్రాన్ని మనమే సౌందర్యశోభితంగా చిత్రించుకోవాలి. ఎవరికైనా సరే, స్వయంకృషి అనేది ధనస్సు లాంటిది. పట్టుదల, ధైర్యం అనే బాణాలతో లక్ష్యాన్ని ఛేదించాలి. రేపటి గురించి ఆలోచిస్తూ ఈరోజును మర్చిపోవడం అవివేకం. విజేతలు ప్రణాళికలు తయారు చేసి, అమలు చేస్తారు. 'ఊహల్ని పేనుతూ కూర్చుంటే ఉనికి ఉండదు. ఊపిరిని బిగబట్టి ఉద్యమస్ఫూర్తితో ముందడుగు వేస్తే ఉత్తుంగ శిఖరం నీ ముంగిట సాగిలపడు' అంటారు మహాకవి శేషేంద్ర! నిన్నటి గురించి సమీక్ష చేసుకుంటూ, నేటిని ఆస్వాదిస్తూ, రేపటిని ప్రణాళికగా తీర్చిదిద్దుకోవడమే జీవన గమనంలో ముఖ్యమైన అంశం.

జీవితంలో మన దగ్గర నుంచి విడదీయలేని సంపద- వర్తమానం. అది మన ముంగిట ఉన్న షడ్రసోపేతమైన భోజనం లాంటిది. ఆ మాధుర్య విశేషాన్ని ఆస్వాదించాలి. గతించిన కాలమంతా గుప్పిట జారిన ఇసుక లాంటిది. భవిష్యత్తు అంతుచిక్కని, అయోమయమైన శేష ప్రశ్న. వర్తమానం మాత్రమే మనకు దక్కిన అపురూపమైన బహుమానం. మనిషి ఒకసారి పోగొట్టుకుంటే తిరిగి పొందలేనివి మూడు. అవి.. నోటి నుంచి వచ్చిన మాట, చేజార్చుకున్న అవకాశం, కరిగిపోయిన కాలం. అలాంటి కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి. కార్యశూరులై జీవన సమరంలో గెలిచి విజయ తిలకాన్ని దిద్దుకోవాలి.

– విద్వాత్ శ్రీనిధి

కావాల్సిన నైపుణ్యాలివీ...

తమ ఉద్యోగులకు ప్రత్యేక నైపుణ్యాలు ఉండాలని కంపెనీలు కోరుకుంటాయి. కొత్త అభ్యర్థులను కొలువుల్లోకి తీసుకునేటప్పుడు తప్పకుండా వాటిని పరిశీలిస్తాయి. వాటివల్ల పనివాతావరణం మెరుగవడంతో పాటు ఉత్పాదకత ఇనుమడిస్తుందని భావిస్తాయి. దేశీయంగా అన్ని సంస్థలు తమ ఉద్యోగులకు నైతిక విలువలు ఉండాలని ఆశిస్తున్నాయి. దానివల్ల సంస్థలో సానుకూల వాతావరణం ఏర్పడటంతో పాటు పరస్పర నమ్మకం, సమగ్రత, గౌరవం ఇనుమడిస్తాయని నమ్ముతున్నాయి. తమ ఉద్యోగుల్లో ఆయా నైపుణ్యాలు ఉండటం అత్యావశ్యకమని భావిస్తున్న సంస్థలు... (శాతాల్లో)

కాగ్నిటివ్ స్కిల్స్	54
ఇతరులతో సమన్వయం	77
నిర్వహణ నైపుణ్యాలు	69
సాంకేతిక నైపుణ్యాలు	38
స్వీయ సమర్థత	62
కలిసి పనిచేయగలగడం	54
కాలానుగుణంగా మారడం, సమస్యా పరిష్కారం	54
డిజిటల్ అక్షరాస్యత, డేటా విశ్లేషణ	23

(ఆధారం: ఇండియా స్కిల్స్ రిపోర్ట్-2025)

ఆయన జీవితం ఓ ఉత్సవం!

తెలుగువారికి మిమిక్రీ అనగానే నేరెళ్ల వేణుమాధవ్ గుర్తుకు వచ్చే రోజుల్లో- మెజీషియన్‌గా రంగ ప్రవేశం చేసిన బహుముఖ విశేష ప్రతిభాశాలి- భావరాజు వేంకట పట్టాభిరామ్. ఆ రోజుల్లో రెండు మూడు గంటలపాటు తన ఇంద్రజాల ప్రదర్శనతో ప్రేక్షకులను కట్టిపడేసిన మాంత్రికుడాయన. అయితే పట్టాభిరామ్‌ను తెలుగువారు గుర్తుపెట్టుకొన్నది-

తన 75వ ఏట దేహయాత్ర చాలించిన బి.వి.పట్టాభిరామ్ జీవనయానం నిజానికి ఓ వ్యక్తిత్వ వికాసగ్రంథం. తీవ్రమైన ఆత్మన్యూనతాభావంతో మొదలైన ఓ వ్యక్తి కౌమారం- మరణించేనాటికి యువతకు గొప్ప స్ఫూర్తిదాయకంగా మారడం వెనక ఆ వ్యక్తి తపనను తపస్సును జీవన పోరాటాన్ని అక్షరబద్ధం చేస్తే- అది నేటి యువతకు చక్కని పాఠ్యాంశంగా మిగిలిపోతుంది. పట్టాభిరామ్‌ను మనం స్మరించుకోవాల్సింది... మెజీషియన్‌గానో హిప్నటిస్టుగానో మాత్రమే కాదు- ఓ పోరాట యోధునిగా!

మెజీషియన్‌గా కాదు, తన విద్యను చేతబడి వంటి మూఢనమ్మకాలను పటాపంచలు చేయడానికి సద్వినియోగం చేసిన ఓ సంస్కారిగా... ఓ సంస్కర్తగా! దరిమిలా ఆయన హిప్నటిస్టుగా మారి ఆ రెండు విద్యలను సంఘసంస్కరణకోసం అద్భుతంగా మేళవించారు. కళ్లకు గంతలు కట్టుకుని 1984లో హైదరాబాద్ రవీంద్రభారతి నుంచి చార్మినార్ వరకు వాహనాన్ని నడిపి ప్రజల్ని ఆకర్షించిన పట్టాభిరామ్- అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కోరికపై మద్యపాన నిషేధం వంటి ప్రజోపకార పథకాలకు, ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారానికి తనవంతు సాయం అందించారు. గోదావరి వరద బాధితుల సహాయార్థం నిధుల సేకరణకు తన విద్యలను ప్రదర్శించారు. అనతికాలంలోనే వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా స్థిరపడ్డారు.

పట్టాభిరామ్ కుటుంబ నేపథ్యం ఎంతో ఉన్నతమైనది. గోదావరి తీరపు 'రావ్‌సాహెబ్'- భావరాజు సత్యనారాయణ ఆయన తండ్రి. గోదావరి కథల రచయితగా, బాపురమణల ఆత్మసఖునిగా పేరొందిన సీతారాముడు(బీవీఎస్ రామారావు), ముళ్లపూడి మాటల్లో చెప్పాలంటే 'రాజర్షి'గా గుర్తింపు పొందిన



రమణరావులు పట్టాభిరామ్‌కు సోదరులు. 'గోదావరి తీరం నా మనుగడకు ఒక వ్యాకరణాన్ని నిర్దేశించింది' అని చెప్పుకొన్న ఆత్మవిదుడు పట్టాభిరామ్.

ఈ నేపథ్యంలో రూపుదిద్దుకొన్న స్వీయనిర్మిత జీవనక్రమంలో పట్టాభిరామ్ అనేక విజయాలను సొంతం చేసుకొన్నారు. తెలుగు, ఇంగ్లిషు, కన్నడ, తమిళ భాషల్లో అనేకానేక రచనలు వెలువరించారు. పలు పత్రికల్లో 'బాలలకు బంగారుబాట' శీర్షికతో ప్రపంచ ప్రముఖులను అందంగా పరిచయం చేస్తూ కొన్ని తరాల వ్యక్తిత్వ నిర్మాణంలో విశేషకృషి చేశారు. బాలజ్యోతి బాలల మాసపత్రికలో 'మాయావిజ్ఞానం' పేరుతో అనేక వ్యాసాలు అందించారు. సైకాలజీ ఫిలాసఫీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పట్టభద్రులయ్యారు. జర్నలిజం, గైడెన్స్ కౌన్సెలింగ్‌లలో పీజీ పట్టాలు సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది.

భారతదేశంలోనేకాక అమెరికా, ఆస్ట్రేలియా, మలేషియా, థాయ్‌లాండ్, సింగపూర్, అరబ్ దేశాల్లోనూ పట్టాభిరామ్ లెక్కలేనన్ని వర్క్‌షాపులు నిర్వహించి- ఒత్తిడిని జయించడం ఎలా, వ్యక్తులమధ్య సంబంధాలు, ప్రపంచ శాంతి వంటి అంశాలపై ప్రసంగాలు చేశారు. ఫ్లోరిడా విశ్వవిద్యాలయం 1983లోనే ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. అమెరికాలోని నాష్‌విల్, న్యూ ఆలియన్స్ నగర మేయర్లు పట్టాభిరామ్‌కు గౌరవ పౌరసత్వం అందించారు. భారతదేశంలోని అనేక ప్రసిద్ధ బహుళజాతి సంస్థలకు విశ్వవిద్యాలయాలకు రామకృష్ణామఠం వంటి ఆధ్యాత్మిక సంస్థలకు ఆయన గౌరవ సలహాదారుగా వ్యవహరించారు.


'మీ బుర్ర ఓ తీవ్ర సమస్యతో సతమతమవుతున్నప్పుడు మీ సృజనాత్మకతకు అవసరమైన ఏకాగ్రత నిలబడదు. అప్పుడు మీరో చిన్న వ్యాయామం చేయాలి. మీ గదిలోనే సైకప్పుకేసి చూస్తూ పది నిమిషాలు నెమ్మదిగా నడవాలి. అంటే హారిజాంటల్‌గా ఉండే మానవ మస్తిష్కాన్ని వర్టికల్‌గా మార్చడమన్న మాట. దీన్ని మహామహులెందరో సాధన చేసి మంచిఫలితాలను సాధించారు. దీన్ని బ్రెయిన్ ఎక్సర్‌సైజ్ అంటారు. మిమ్మల్ని వేధిస్తున్న ఒత్తిడిని జయించడానికి అది రామబాణంలా పని చేస్తుంది' అని ముళ్లపూడి వెంకట రమణకు పట్టాభిరామ్ చేసిన చికిత్స, రమణకు దక్కిన ఫలితం గురించి రమణ 'కొసరుకొమ్మచ్చి'లో పరిశీలించవచ్చు.

ఒక సాధారణ వ్యక్తి అసాధారణ ప్రతిభాశాలిగా ఎదిగినందుకు కూడా కాదు మనం పట్టాభిరామ్‌ను గౌరవించేది- ఆ ప్రతిభను జాతిజనులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుకున్నందుకు! శివుడి తలపై తాండవం చేసినందుకు కాదుగా మనం గంగమ్మను గౌరవించేది- నేలపై పారినందుకు, సామాన్యుణ్ని చేరినందుకు కదా! అలా జీవితాన్ని ధన్యం చేసుకొన్నందుకు పట్టాభిరామ్‌ను తెలుగువారు చిరకాలం గుర్తుంచుకుంటారు.

– ఎర్రాప్రగడ రామకృష్ణ

ఎందుకీ ఇసుక?

ఒకసారి స్కూల్లో సరదాగా పిల్లలకు ఆటలు ఆడించారు పీఈటీ. చివరికి ముగ్గురు విద్యార్థులు మిగిలారు. వాళ్ల ముగ్గురి చేతుల్లో గుప్పెడు ఇసుక పోసి ఒక వరసలో నిల్చోబెట్టి.. 'పిల్లలూ అదిగో ఆ చివర్లో ఉన్న గీతను తొక్కి.. మళ్లీ ఇక్కడికి చేరుకోవాలి. ఎవరు ముందుగా వస్తారో చూద్దాం' అన్నారు టీచర్. ఆట మొదలవ్వగానే.. మొదటిపిల్లాడు.. 'అసలు ఈ ఇసుక ఎందుకు?' అని కింద పారబోసి పరిగెత్తుకుంటూ వెళ్లి ఆ గీతను తొక్కి మళ్లీ వెనక్కి వచ్చేశాడు. రెండోకుర్రాడేమో.. ఇంత ఇసుక ఎవరు మోస్తారని కొంచెంకొంచెంగా కింద పడేస్తూ మళ్లీ మొదటి స్థానానికి చేరుకున్నాడు. మూడోపిల్లాడు కొంచెం ఇసుక కూడా కింద పడకుండా జాగ్రత్తగా గీతను తాకి మళ్లీ



వెనక్కి వచ్చాడు. ముగ్గుర్నీ పిలిచి.. 'ఎవరి దగ్గర ఎక్కువ ఇసుక ఉంటే వారికి ఎక్కువ బిస్కెట్లు ఇస్తాను.. సరేనా!' అన్నారు టీచర్. దాంతో మొదటి అబ్బాయి 'అరెరె పరిగెత్తడం మీదే దృష్టి పెట్టాను. అసలు చేతిలో ఇసుక ఎందుకు పట్టుకొమ్మన్నారో ఆలోచించలేదు. ఇప్పుడు నాకు ఒక్క బిస్కెట్ కూడా రాదు' అని తెగ బాధపడిపోయాడు. 'ఇసుక పారేయకుండా ఉండాల్సింది ఇంకా ఎక్కువ బిస్కెట్లు వచ్చేవి. బద్ధకంతో వాటిని రాకుండా చేసుకున్నాను' అనుకున్నాడు రెండోపిల్లాడు. చెప్పింది చెప్పినట్లుగా పాటించిన మూడోకుర్రాడు మాత్రం చాలా సంతోషంగా ఉన్నాడు. అప్పుడు పీఈటీ వచ్చి... 'కొన్నిసార్లు చేతిలో ఉన్న అవకాశాలను ఆలోచించకుండా మనమే దూరం చేసుకుంటాం. అలా కాకుండా కాస్త ఆగి ఆలోచిస్తే పొరపాట్లేమీ జరగవు. అర్థమైందా?' అన్నారు. 'అలాగే సార్.. ఇప్పటి నుంచి జాగ్రత్తగా ఆలోచించడం అలవాటు చేసుకుంటాం' అన్నారు విద్యార్థులు.

– చిట్టంపల్లి అంజలి

పదాలేవి?

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి పదం చివరి అక్షరాలతోనే రెండోది మొదలవుతుంది. ఓసారి ప్రయత్నించండి.

1. CLE □□ EA
2. FORE □□ ONE
3. SURPRI □□ A
4. MIRA □□□ AN
5. CAT □□ AIR
6. DIGE □□ ORE

జవాబు: 1.CLEAR, AREA 2.FOREST, STONE 3.SURPRISE, SEA 4.MIRACLE, CLEAN 5.CATCH, CHAIR 6.DIGEST, STORE



ఘటనాస్థలిలో వివరాలు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అయినోళ్లు కానరాక.. కంటికి కునుకులేక

చెల్లాచెదురైన జీవితాలు

- ఈనాడు, హైదరాబాద్, సంగారెడ్డి, న్యూస్‌టుడే, పటాన్‌చెరు అర్బన్, శేరిలింగంపల్లి, చందానగర్, జిన్నారం

హాహాకారాలు.. రోదనలు.. ఉరుకులు పరుగులు.. ఎటు చూసినా శిథిలాలే.. చుట్టూ రక్తపు ముద్దలు.. చెల్లాచెదురైన మృతదేహాలు.. మరోవైపు కాలిన గాయాలు, రక్తమోడుతూ క్షతగాత్రులు.. ఏం జరిగిందో తెలియని అయోమయం.. తమవారు ఏమైపోయారోనని ఎదురుచూపులు.. ఇది రెండో రోజు పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమ వద్ద కనిపించిన భీతావహ పరిస్థితి. క్షతగాత్రులు, ఉద్యోగులతో 'ఈనాడు' మాట్లాడినప్పుడు ప్రమాదాన్ని కళ్లకు కట్టినట్లుగా వివరించారు. వారి మాటల్లోనే..!

రెండు రోజుల క్రితమే చేరి.. ఆసుపత్రిపాలై..



ఆర్తే పాపతో విలపిస్తున్న సోనీ

తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహారాష్ట్రకు చెందిన భీమ్‌రావు పరిస్థితి విషమంగా మారింది. ఏడాదిక్రితం పెళ్లి చేసుకున్న అతను రెండు రోజుల క్రితమే పరిశ్రమలో పనికి కుదిరాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. తన భర్తను బతికించాలని భార్య సోనీ ఆసుపత్రి ముందు కన్నీరు పెడుతోంది. ఆరు నెలల కూతురు ఉందని, భర్తే ఆధారమని బతికించాలని కోరుతోంది.



తమవారి ఆచూకీ దొరక్క రోదిస్తున్న కుటుంబీకులు

పరిశ్రమలో కొనసాగుతున్న శిథిలాల తొలగింపు ప్రక్రియ



పైనుంచి దూకేశా..


- రాజశేఖర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ హెచ్‌వోడీ



సోమవారం తెల్లవారుజామున పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉన్నప్పుడు ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు జరిగింది. క్షణాల్లో మంటలు, పొగ వ్యాపించింది. ఏం చేయాలో తెలియక 10 అడుగుల ఎత్తు నుంచి కిందకు దూకేశా.

పాకుతూ బయటపడ్డా..

- అమర్‌జీత్ సహ, ఫిల్టర్ ఆపరేటర్, బిహార్



నాకు 100 అడుగుల దూరంలో పేలుడు సంభవించింది. సేఫ్టీవాల్వ్స్ ఉన్నా పనిచేయలేదు. నా చుట్టూ పైపులు ఉండి ఎటూ వెళ్లలేని పరిస్థితి. పైపుల కింద మంటల మధ్య నుంచి పాకుతూ తొలి అంతస్తు వరకు వెళ్లా. దేవుడిని తలచుకుని 20 అడుగుల ఎత్తు నుంచి దూకి జనపనార వ్యర్థాల మీద పడ్డా.

పొగతో ఏం కనిపించలే

- చందన్‌కుమార్ నాయక్, ఆపరేటర్, బిహార్



యుటిలిటీ విభాగంలో ఉండగా పెద్దశబ్దం వచ్చి పొగ కమ్మేసింది. మనిషి కూడా కనిపించలేదు. స్పృహ కోల్పోయా. 5 నిమిషాల తర్వాత కళ్లు తెరిచా. తలకు గాయమైంది. మొదటి అంతస్తు నుంచి దూకా.

నాన్న కానరాక.. సీఎంకు చెప్పుకోలేక

- దాసరి కేశవ్, అమీన్‌పూర్



మా నాన్న దాసరి రామాంజనేయులు కనిపించడం లేదు. ఇక్కడే అధికారుల చుట్టూ తిరుగుతున్నా. ముఖ్యమంత్రిని కలిసి పరిస్థితిని వివరించే ప్రయత్నం చేసినా ఫలితం లేదు.

తెలియని వేదన.. బతికుండాలని ప్రార్థన

ప్రమాదం జరిగి రెండ్రోజులవుతున్నా మృతులు, క్షతగాత్రుల వివరాలు పూర్తిస్థాయిలో వెల్లడించలేదంటూ తీవ్ర గందరగోళం నెలకొంది. తమ వారు ఎక్కడున్నారో తెలియక కుటుంబీకులు పరిశ్రమ వద్ద ఎదురుచూస్తున్నారు. శిథిలాల తొలగింపు జాప్యం జరుగుతుండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, అధికారులు వారిని సముదాయించే ప్రయత్నం చేస్తున్నారు. సహాయ చర్యలు సాగుతున్నాయని చెబుతున్నారు.



పరిశ్రమ వద్ద బాధిత కుటుంబాల ఆందోళన

తమ వారు ఎక్కడుంటూ....



● ఒడిశాకు చెందిన కార్మికుడు ప్రశాంత్ మహాపాత్రో కోసం ఆమె అక్క, భార్య సోనాలి పరిశ్రమ వద్ద ఎదురుచూస్తున్నారు. భోజనం కూడా చేయడం లేదు. తన భర్త కావాలని రోదించడం అక్కడివారిని కన్నీరు పెట్టిస్తోంది.



● ప్రకాశం జిల్లాకు చెందిన దాసరి సునీల్‌కుమార్ ఏడాదిగా పరిశ్రమ క్వాలిటీ కంట్రోల్ డిపార్ట్‌మెంట్‌లో కెమిస్ట్‌గా పనిచేస్తున్నాడని అతని సోదరుడు సంపత్ తెలిపారు. సోమవారం ఉదయం డ్యూటీకి వచ్చి గల్లంతు అయినట్లు తెలిపారు. ఇదే పరిస్థితి పలువురు మహిళల్లో నెలకొంది.

యాజమాన్యంపై కేసు: ఈ ఘటనలో కార్మికుడు జగన్ చనిపోయాడు. అతని కుమారుడు యశ్వంత్ బీడీఎల్ భానూరు ఠాణాలో ఫిర్యాదు చేశాడు. మూడు సెక్షన్ల కింద యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జనరల్ షిఫ్ట్ కావడమే శాపమైందా?

పరిశ్రమలో నాలుగు షిఫ్టుల్లో కార్మికులు విధులు నిర్వహిస్తారు. మొదటి, రెండు షిఫ్టుల్లో వచ్చే కార్మికులు ఇక్కడే ఉంటారు. ప్రమాదం 9 గంటల తరువాత చోటుచేసుకుంది. ఫలితంగా ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందంటున్నారు స్థానికులు. పరిశ్రమ వర్గాలు ఇచ్చిన జాబితా ప్రకారం మొత్తం 189 మంది పని చేస్తారు. స్ప్రేయర్ డ్రయర్ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అందుకే ప్రమాదం భారీగా జరిగింది. మూడంతస్తుల భవనం కుప్పకూలగా సమీపంలోని ఇతర విభాగాలు దెబ్బతిన్నాయి.

సవాల్‌గా మారిన డీఎన్‌ఏ పరీక్షలు



మృతులు గుర్తు పట్టలేని విధంగా ఉండటంతో డీఎన్‌ఏ పరీక్షల ద్వారా వారిని గుర్తించే ప్రక్రియ ప్రారంభించారు. అధికారుల వివరాల ప్రకారం 36 మంది ప్రమాదంలో చనిపోగా.. 14 మృతదేహాలను గుర్తించారు. డీఎన్‌ఏ పరీక్ష ఆధారంగా గుర్తించాలంటే ఒక్కో మృతదేహానికి ముగ్గురు సంబంధీకుల నుంచి నమూనాలు సేకరిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. పరిశ్రమకు సమీపంలోని ఓ కార్యాలయంలో 19 మంది నుంచి మంగళవారం రక్త నమూనాలు సేకరించారు.





పేలుడు ధాటికి పరిశ్రమ బయట రోడ్డు పక్కన పడిన భారీ సిలిండర్, మోటారు

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఈనాడు కథనానికి స్పందన

శంషాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారు ఏ స్థాయిలో ఉన్నా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్ హెచ్చరించారు. '650 ఎకరాలపై అక్రమార్కుల కన్ను' శీర్షికతో ఈ నెల 1న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఆక్రమణలను తీవ్ర స్థాయిలో పరిగణించింది. శంషాబాద్ విమానాశ్రయానికి అతి సమీపంలో బాహ్య వలయ రహదారికి ఆనుకుని బహదూర్‌గూడలోని 650 ఎకరాల ప్రభుత్వ భూముల స్థితిగతులపై సమగ్ర నివేదిక అందజేయాలని రెవెన్యూ శాఖను ఆదేశించింది. రాజేంద్రనగర్ ఆర్డీవో కె.వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో శంషాబాద్ తహసీల్దార్ రవీందర్.. రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి మంగళవారం బహదూర్‌గూడలో ఆక్రమణలను పరిశీలించారు. నిర్మాణాలు, ప్రహరీలను యంత్రాలతో కూల్చేశారు. సర్వే నంబరు 62లో 500 ఎకరాలు, సర్వే నంబరు 28లో 150 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని స్పష్టంచేశారు.

పైసాచికం

అనిశాకు చిక్కిన ఇద్దరు అధికారులు.. అటెండర్



నాగార్జున

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి తహసీల్దార్, అటెండర్ అవినీతి నిరోధక శాఖ (అనిశా) వలకు చిక్కిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ వివరాల ప్రకారం.. అంతారం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి పేరుతో ఉన్న 22 గుంటల భూమిని తన కొడుకులకు, మనవళ్లకు రిజిస్ట్రేషన్ చేయడానికి గత నెల 9న స్లాట్ బుక్ చేసి, 10వ తేదీ నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగారు. ఆరు డాక్యుమెంట్లు ఉండగా.. ఒక్కోదానికి రూ.2 వేల చొప్పున రూ.12 వేలు ఇవ్వాలని అటెండర్ యాదగిరి.. రైతులకు చెప్పాడు. దీంతో బాధిత రైతులు. అనిశాను ఆశ్రయించారు. మా దగ్గర అంత డబ్బు లేదు, రూ.10 వేలు ఇస్తామని తహసీల్దార్ నాగార్జునకు రైతులు తెలిపి, అటెండర్ యాదగిరికి నగదు ఇచ్చారు. వెంటనే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ నాగార్జున, యాదగిరిని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఆనంద్‌కుమార్ చెప్పారు.

● తహసీల్దార్ నాగార్జున అనిశాకు పట్టుబడినట్లు తెలియగానే ఆ కార్యాలయం ఎదుటే కొందరు రైతులు బాణసంచా కాల్చారు. ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేసే వారని.. ఆయన ఏసీబీకి దొరకడం ఆనందంగా ఉందని పలువురు రైతులు తెలిపారు.



తలకొండపల్లిలో అధికారులు అనిశాకు చిక్కడంతో రైతులు కాల్చిన బాణసంచా

మ్యుటేషన్‌కు డబ్బులు డిమాండ్



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: మూసాపేట సర్కిల్ కార్యాలయం రెవెన్యూ విభాగంలో(ట్యాక్స్ సెక్షన్) సీనియర్ అసిస్టెంట్ ఎం.సునీత రూ.30 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ వివరాల ప్రకారం.. మూసాపేట సర్కిల్ పరిధిలో ఓ వ్యక్తి మ్యుటేషన్(ఆస్తి మార్పిడి) కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఆస్తి మార్పిడికి ఆమె రూ.80 వేల లంచం ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. చివరకు రూ.30 వేలకు అంగీకరించారు. బాధితుడు మంగళవారం డబ్బుతో ఏసీబీ అధికారులను సంప్రదించగా.. వారు పథకం ప్రకారం అతన్ని పంపి ఆమెకు లంచం ఇప్పించారు. డబ్బు తీసుకొని దరఖాస్తుదారుడి ఫైలులో ఉంచి డ్రాలో పెట్టారు. అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని లంచం సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

పాకిస్థాన్ నటినంటూ పరిచయం.. రూ.21.74 లక్షల టోకరా



నారాయణగూడ, న్యూస్‌టుడే: పాకిస్థాన్ నటి పర్వరీష్ షా చిత్రాలు డీపీ పెట్టుకొని అమాయకులను పెళ్లి చేసుకుంటామని బోల్తా కొట్టిస్తున్నారు ఇద్దరు మోసగత్తెలు. ఇది నిజమని నమ్మిన బాధితుడు రూ.21.74 లక్షలు పోగొట్టుకొని హైదరాబాద్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బహదూర్‌పురాకు చెందిన 29 ఏళ్ల వ్యక్తి మ్యాట్రిమోనిలో బయోడేటాను పోస్టు చేశాడు. 2023లో బాధితుడి నంబర్ ఒక మ్యాట్రిమోని గ్రూప్‌తో అనుసంధానమైంది. అవతలి వ్యక్తి పేరు ఫాతిమా, తాను పాకిస్థాని నటిని అంటూ పరిచయం చేసుకుంది. ఫాతిమా సోదరినంటూ అనీసా ఎం.హుండేకర్ కూడా పరిచయం చేసుకుంది. అనంతరం వారు భావోద్వేగాలతో బాధితుడిని బుట్టలో వేసుకున్నారు. పెళ్లి చేసుకుంటానని ఫాతిమా నమ్మించింది. తన తల్లి అనారోగ్యంతో ఉందని, వైద్య ఖర్చుల కు డబ్బు కావాలని కోరడంతో బాధితుడు కొంత పంపించాడు. రెండు రోజుల్లోనే తిరిగి చెల్లించింది. ఇలా దశలవారీగా రూ.21.74 లక్షలు ఇచ్చాడు. తర్వాత అతడి నంబరును బ్లాక్ చేయడంతో పోలీసులను ఆశ్రయించాడు.

శివరాంపల్లిలో 23.5 మి.మీ. వర్షం

ఈనాడు, హైదరాబాద్: నగరంలో రెండో రోజు మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ద్రోణి ప్రభావంతో మధ్యాహ్నం నుంచి ముసురు మొదలై రాత్రి వరకు కురుస్తూనే ఉంది. శివరాంపల్లిలో గరిష్ఠంగా 23.5 మి.మీ., రాజేంద్రనగర్‌లో 19.8, బహదూర్‌పురలో 19.5, లంగర్‌హౌస్‌లో 17.0, బండ్లగూడలో 16.5, షేక్‌పేటలో 14.5 మి.మీ. వర్షం కురిసింది.

● బుధవారం తెలికపాటి నుంచి మోస్తరు వర్షం, ఉరుములతో కూడిన జల్లులు, ఉపరితల గాలులు గంటకు 30-40 కి.మీ.వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

బావిలో కొలువై.. భక్తజన హృదయమై



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రులు కొండా, పొన్నం, మేయర్ విజయలక్ష్మి, కలెక్టర్ హరిచందన



దర్శనానికి బారులు తీరిన భక్తులు

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లతో సందడి నెలకొంది. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. - న్యూస్‌టుడే, సంజీవరెడ్డినగర్, సనత్‌నగర్







అమ్మవారి ప్రతిమతో..



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న పండితులు



రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



పసుపు చల్లుతున్న శివసత్తులు



భక్తులను నియంత్రిస్తున్న పోలీసులు

అత్యవసర బృందాలు అప్రమత్తంగా ఉండాలి: జలమండలి ఎండీ

ఈనాడు, హైదరాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో జలమండలి 17 అత్యవసర బృందాలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటి సరఫరాపై అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, సరఫరాను తనిఖీ చేయాలన్నారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, డీప్ మ్యాన్‌హోళ్ల వద్ద సీవరేజి సూపర్‌వైజర్ ఉండాలని ఆదేశించారు. ఇతర సమాచారం, ఫిర్యాదులకు జలమండలి కస్టమర్ కేర్ 155313కు ఫోన్ చేయాలన్నారు.

మూడు నెలల బియ్యం పంపిణీ పూర్తి



ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్ పరిధిలోని చౌక ధరల దుకాణాల్లో మూడునెలల సన్న బియ్యం పంపిణీ పూర్తయినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రకటించారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో 6,47,282 రేషన్ కార్డులు ఉండగా 4,732 మెట్రిక్ టన్నులు, మేడ్చల్ జిల్లా పరిధిలో 4,024 టన్నులు, రంగారెడ్డి జిల్లాలో 4,078 టన్నుల బియ్యం పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మొదట్లో సాంకేతిక సమస్యలతో పంపిణీ నెమ్మదిగా సాగింది. ఒక్కో లబ్ధిదారు నుంచి బయోమెట్రిక్ తీసుకొనేందుకు 15-25 నిమిషాలు పట్టింది. కొన్నిచోట్ల రాత్రి 10 గంటల వరకూ పంపిణీ చేశారు.

మీ ఇంట్లో జ్వర బాధితులు ఉన్నారా?

ఈనాడు, హైదరాబాద్: 'మీ ఇంట్లో జ్వరంతో ఎవరైనా బాధపడుతున్నారా... అది డెంగీనా.. మలేరియానా.. లేదంటే వైరల్ జ్వరమా..' ఇలాంటి సమాచారం ఆరా తీసేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిద్ధమైంది. నగరంలోని 91 పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఇళ్లు, ప్రభుత్వ హాస్టళ్లు, వసతి గృహాల్లో మంగళవారం జ్వర సర్వేను ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి బాధితులను గుర్తించి డెంగీ, మలేరియా పరీక్షలు చేయనున్నారు. దోమలు విజృంభిస్తుండటంతో డెంగీ కేసులు పెరుగుతున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి లార్వా నియంత్రణకు చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఆశా వర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి డైఫ్లూ బెంజిరాన్ ద్రావణాన్ని పిచికారీ చేయనున్నారు.

జీహెచ్ఎంసీకి ఈవీ వాహనాలు అందించిన ఎస్‌బీఐ


కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ కర్ణన్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీకి రూ.కోటి విలువైన 10 మహీంద్రా జియో ఈవీ వాహనాలను అందించారు. కోఠిలోని ఎస్‌బీఐ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.రాధాకృష్ణన్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు ఈవీ వాహనాలను అప్పగించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

శ్రీలంకకు పెరిగిన భారతీయ సందర్శకులు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: శ్రీలంక టూరిజం ప్రమోషన్ బ్యూరో ఆధ్వర్యంలో శ్రీలంక కన్వెన్షన్ బ్యూరో (ఎస్.ఎల్.బి.సి) పర్యవేక్షణలో మంగళవారం బంజారాహిల్స్ తాజ్ కృష్ణ హోటల్లో మైస్ (మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్స్ అండ్ ఎగ్జిబిషన్స్) రోడ్ షో పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు శ్రీలంక కన్వెన్షన్ బ్యూరో వర్గాలు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ రోడ్ షోలో కీలకమైన భారతీయ మైస్ ప్లానర్లు, కార్పొరేట్ ట్రావెల్ నిపుణులు, ట్రావెల్ ట్రేడ్ భాగస్వాములు పాల్గొన్నారు. చెన్నైలోని శ్రీలంక డిప్యూటీ హై కమిషన్ తాత్కాలిక డిప్యూటీ కమిషనర్ హర్ష రూపరత్నే, ఎస్ఎల్‌బీసీ ఛైర్మన్ దీర హెట్టియరాచి మాట్లాడుతూ, శ్రీలంకకు ఈ ఏడాది జనవరి నుంచి మే 31 వరకు దాదాపు రెండు లక్షల మంది పైచిలుకు భారతీయ సందర్శకులు వచ్చారన్నారు. శ్రీలంక పర్యాటక రంగానికి భారతదేశం కీలకమైన మార్కెట్‌గా ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348
పంజాగుట్ట	8008573350
నారాయణగూడ	80085 73340

వెంగళరావునగర్, న్యూస్‌టుడే:

? వెంగళరావునగర్ డి-బ్లాకు పార్కు సమీపంలో కొన్ని రోజులుగా వ్యర్థాలు పేరుకుపోయాయి. -మనోజ్‌కుమార్, వెంగళరావునగర్

✓ సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. - రవి, శానిటేషన్ విభాగం ఎస్ఎఫ్ఏ

పాన్‌షాప్‌లపై పోలీసుల దాడులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: పాన్‌షాప్‌లపై నారాయణగూడ పోలీసులు దాడులు నిర్వహించారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు ఏమైన జరుగుతున్నాయా.. తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా పారిన్, 'ఈ-సిగరెట్లు', ఇతర నిషేధిత వస్తువులు ఉన్నాయా అని పరిశీలించారు. ప్రధానంగా విద్యార్థులకు చాక్లెట్ రూపంలో గంజాయిని విక్రయిస్తున్నారా? అని విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపారు. 18 ఏళ్లలోపున్న పిల్లలకు పొగాకు పదార్థాలు విక్రయించొద్దని హెచ్చరించారు.

కొమ్మలు కొట్టేసి.. గుట్టలు వదిలేసి..

జీహెచ్ఎంసీ, విద్యుత్తు సంస్థల మధ్య కుదరని సయోధ్య

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: వర్షాకాలంలో విద్యుత్తు ప్రమాదాలను నివారించేందుకు విద్యుత్తు తీగలకు ఆనుకుని ఉన్న కొమ్మలను ఆ శాఖ సిబ్బంది తొలగిస్తుంటారు. ఏటా వర్షాల సమయంలో తొలగించడం, వెంటనే విద్యుత్తు శాఖ వాటిని తొలగించడం చేస్తూ వచ్చేది. రెండేళ్లుగా కొమ్మలు కొట్టేశాక వారాల తరబడి అక్కడే వదిలేస్తున్న తీరు కనిపిస్తోంది. ఆయా ప్రాంతాల ప్రజలు అదనపు సమస్య వచ్చి పడిందంటూ గగ్గోలు పెడుతున్నారు.


వెంకటరమణ కాలనీ ఇరుకైన కూడలిలో ఇలా..

వీధి వీధినా అదే తంతు..

ఖైరతాబాద్ నియోజకవర్గం మాత్రమే కాదు నగర వ్యాప్తంగా ఏ వీధిలో చూసినా చెట్ల కొమ్మలు ఎండిపోయి కుప్పగా కనిపిస్తున్నాయి. అసలే దోమల సమస్యతో ఇబ్బంది పడుతున్న జనం చెత్త కారణంగా మరిన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల కొమ్మలు కొట్టారంటే రెండు, మూడు రోజుల్లో తొలగించాలి. కానీ రెండు, మూడు వారాల పాటు వదిలేయమేంటని విమర్శలు వస్తున్నాయి. గతంలో కొమ్మలు కొట్టిన రెండ్రోజుల్లో సిబ్బంది తొలగించేవారు. అయితే రెండేళ్లుగా ఈ ప్రక్రియ సజావుగా సాగడంలేదు. ఎందుకిలా అని పలకరిస్తే విద్యుత్తు శాఖ, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు దీనిపై చర్చించారు. తాము కొట్టేసిన కొమ్మలను జీహెచ్ఎంసీ తొలగిస్తుందని విద్యుత్తు శాఖ అధికారులు గతంలో చెబుతూ వచ్చారు. ఇలా రెండు వారాలుగా ఎవ్వరూ తొలగించకపోవడంతో అసలు ఈ బాధ్యత ఎవరిదో తెలియని పరిస్థితి నెలకొంది. రెండు శాఖల సమన్వయ లోపం, ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం బాహాటంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని శాఖల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించాలని కోరుతున్నారు.


బీఎస్‌మక్తాలోని అయ్యప్ప ఆలయం వీధిలో కుప్పగా..

చెట్ల కొమ్మలు ఎండి ఇళ్లలోకి వస్తున్నాయి..

బి.ప్రకాష్, అయ్యప్ప ఆలయం లేన్

బీఎస్‌మక్తా, అయ్యప్ప ఆలయం వీధిలో వీధి పొడవునా రెండు మూడు చోట్ల చెట్ల కొమ్మలు కుప్పలుగా వేశారు. ఎండిపోయి గాలికి కొట్టుకుని వచ్చి ఇళ్లలోనూ పడుతున్నాయి. జీహెచ్ఎంసీ, విద్యుత్తు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ఇంకా పట్టించుకోకపోతే ప్రజాభవన్‌లో సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తాం.

డంపింగ్ యార్డులో చెత్తకు స్థలం కొరత

వినోద్‌కుమార్, ఏడీఈ, సైఫాబాద్

ప్రస్తుతం చెట్ల కొమ్మలను విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలోనే తొలగిస్తున్నాం. లోయర్ ట్యాంక్‌బండ్‌లో గల డంపింగ్ యార్డులో కొమ్మల వ్యర్థాలు వేసేందుకు స్థలం కొరత ఉంది. రోజూ రెండు వాహనాల్లో చెత్త తీసుకెళ్తే కూడా అక్కడ వేసేందుకు అవకాశం లేదు. అక్కడి వీలును బట్టి కొట్టేసిన చెట్ల కొమ్మలు తొలగిస్తున్నాం.

అమ్మవారి ఆశీస్సులతో అందరూ బాగుండాలి: వివేక్


మంత్రితో మధుకర్, స్థానిక నాయకులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: బోనాల సందర్భంగా మంగళవారం ఖైరతాబాద్‌లో టీపీసీసీ కార్యదర్శి మధుకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పూజ, అన్నదాన కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో అందరూ బాగుండాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అతిథులను కార్యక్రమ నిర్వాహకుడు మధుకర్ సత్కరించారు. మాజీ కార్పొరేటర్ జి.కృష్ణ యాదవ్, ఖైరతాబాద్ యాదవ సంఘ అధ్యక్షుడు కె.కుమార్ యాదవ్, ఇతర నాయకులు ఎం.మల్లికార్జున యాదవ్, చౌదరి యాదయ్య, లక్ష్మణ్ యాదవ్, భవానీ కృష్ణ, మహేష్ తదితరులతో పాటు ఇతర పార్టీల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి అలంకరణ



వెంగళరావునగర్, న్యూస్‌టుడే: వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, అర్చన, హనుమాన్ చాలీసా పారాయణం, ఆకుపూజ, సింధూర పూజలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్యస్వామికి పలు పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్తలు, టి.ఎన్.రావు, వెంకటరమణ తదితరులు కార్యక్రమాల్ని పర్యవేక్షించారు.

ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు


కల్యాణోత్సవంలో రవిశంకర్‌రెడ్డి

యూసుఫ్‌గూడ: బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవానికి వినియోగదారుల హక్కుల ఫోరం జాతీయ కార్యదర్శి డా.పి.వి.రవిశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నిజ జీవితాల్లో హీరోలు వైద్యులే


డా. వి.ఎస్. రామచంద్ర, డా. తుషారలను సత్కరించిన సినీ నటుడు ప్రవీణ్, వైద్యులు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: వైద్యుల దినోత్సవం సందర్భంగా శ్రీశ్రీ హోలిస్టిక్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో మంగళవారం బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులను సత్కరించారు. 'బకాసురుడు' సినిమా బృందం ఇందులో పాల్గొని సందడి చేసింది. కార్యక్రమంలో ఆసుపత్రుల ఛైర్మన్ డా. వి.ఎస్.రామచంద్ర, సినీ హాస్య నటుడు ప్రవీణ్ మాట్లాడారు. వైద్యులు చూపించే మానవత్వం, నైపుణ్యం, సేవా దృక్పథం అనిర్వచనీయం అన్నారు. వైద్యులు మన జీవితాల్లో నిజమైన హీరోలని అభిప్రాయపడ్డారు. ఈ వేడుకలో పాల్గొని వారిని సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డా. తుషార, పెద్ద సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.


వైద్యురాలు యాస్మిన్‌ను సత్కరిస్తున్న కటారి రమేష్ తదితరులు

ప్రాణాలను కాపాడేది వారే..

ఫిల్మ్‌నగర్: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఫిల్మ్‌నగర్‌లోని బస్తీ దవాఖాన వైద్యురాలు యాస్మిన్‌ను జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కటారి రమేష్ ఆధ్వర్యంలో సత్కరించారు. పవిత్ర వైద్య వృత్తి ద్వారా ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యుల సేవలు మరువలేనివని ఈ సందర్భంగా కటారి రమేష్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆకుల రాజు, అబ్దుల్ ఘనీ, సాయిలు బాలస్వామి, కృష్ణ పాల్గొన్నారు.

కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..


వైద్య దంపతులను సత్కరించిన సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు

యూసుఫ్‌గూడ: వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఎల్లారెడ్డిగూడలోని రాజా నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డా. మహేందర్, డా.ఆమని దంపతులను ఎల్లారెడ్డిగూడ, జయప్రకాశ్ నగర్ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ సెక్యూరిటీ గార్డు నిజాయితీ


చరవాణిని అప్పగించిన సత్యనారాయణ

నిమ్స్, న్యూస్‌టుడే: పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రి సెక్యూరిటీ గార్డు తన నిజాయితీని చాటుకున్నాడు. అత్యవసర విభాగం వద్ద విధులు నిర్వహించే సెక్యూరిటీ గార్డు కె.సత్యనారాయణకు మంగళవారం ఉదయం ఓ పర్సు, ఐఫోన్ దొరికింది. వెంటనే విషయాన్ని పోలీసు అవుట్‌పోస్టు సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాడు. వారి సాయంతో బాధితులను గుర్తించి పర్సు, ఐఫోన్‌ను అందించాడు. వేగంగా స్పందించి ఇవ్వడంతో బాధితులు, ఆస్పత్రి వైద్యులు అతన్ని అభినందించారు.

ఆలయ పాలకమండలి ఛైర్మన్‌గా అర్జున్ యాదవ్


సభ్యులతో నూతన ఛైర్మన్, ఆలయ ఈఓ

శ్రీనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: శ్రీనగర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యులు మంగళవారం అర్జున్‌యాదవ్‌ను ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పాలక మండలి సభ్యులు దినేష్‌కుమార్, సుబ్బారావు, నర్సింగ్‌రావుయాదవ్, జి.శరత్‌బాబు, జి.కల్యాణి, రాజేష్, వై.జగదీష్, ఎం.విజయ్‌కుమార్, కె.లక్ష్మణ్‌రావు, ఎక్స్ అఫీషియో సభ్యుడు మురళీధర్‌శర్మ హాజరయ్యారు. ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

'వ్యక్తిగత జీవితాల్లోకి చొరబాటు తగదు'


స్వేచ్ఛ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: ది జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కమిటీ సభ్యురాలు స్వేచ్ఛ వోటార్కర్ సంతాప సభ జూబ్లీహిల్స్‌లోని సొసైటీ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఆమె చిత్రపటానికి పలువురు జర్నలిస్టులు నివాళులు అర్పించారు. తెలంగాణ మీడియా అకాడమీ మాజీ ఛైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ, 'మీడియా నిబంధనలకు విరుద్ధంగా వ్యక్తిగత జీవితంలో చొరబడిన సోషల్ మీడియా స్వేచ్ఛను మరోసారి చంపేసింది. ఈ విధానానికి స్వస్తి చెప్పాలి. ఇలాగే కొనసాగితే ఊరుకునేది లేద'ని హెచ్చరించారు. ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ స్వేచ్ఛ ఎంతో ధైర్యవంతురాలు, అలా చేస్తుందని ఊహించలేదన్నారు. ఆమె మరణానంతరం సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు చాలా బాధ కలిగిస్తున్నాయన్నారు. టీ న్యూస్ సీఈవో శైలేష్‌రెడ్డి మాట్లాడుతూ స్వేచ్ఛ ఎలాంటి టాస్క్ ఇచ్చినా ఉత్సాహంగా దానిని బాగా పనిచేసేదని చెప్పారు. స్వేచ్ఛ దళిత సామాజిక వర్గానికి చెందిన అమ్మాయనే విషయం తనతో సహా చాలా మందికి ఆమె మరణించిన తరువాతే తెలిసిందన్నారు. ది జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోపరాజు మాట్లాడుతూ నాన్ అలాటీస్‌కు ఎలాగైనా న్యాయం చేయాలని ఆమె తపన పడిందని అన్నారు. నకిరేకల్‌లో ఎమ్మెల్యేగా పోటీ చెయ్యాలని ఉందని కూడా చెప్పారన్నారు. సీనియర్ జర్నలిస్టు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ స్వేచ్ఛ కూతురుకు తన వంతుగా రూ.లక్షను అందిస్తానన్నారు. యూనియన్, సొసైటీ నేతలు మారుతీసాగర్, మహేశ్వర్‌గౌడ్, యోగానంద్ బసవపున్నయ్య, రవీంద్రబాబు, లక్ష్మీనారాయణ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ టూరిజం కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీఎస్ బోస్, రాజమౌళిలు కోరారు. ఇటీవల సంస్థ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన వల్లూరి క్రాంతిని హిమాయత్‌నగర్‌లోని కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్మికులను క్రమబద్ధీకరించాలని, ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చినట్లు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని విన్నవించారు. ఇతర రాష్ట్ర సంస్థల్లోలాగా వయోపరిమితిని 61 సంవత్సరాలుగా పెంచాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎండీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

మేనేజ్‌మెంట్ సీట్లలో విక్రయాల దందా: ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: 'బి' కేటగిరి మేనేజ్‌మెంట్ సీట్లలో 15 శాతం ముందే అమ్ముకుంటున్న ఇంజినీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించింది. అనంతరం హిమాయత్‌నగర్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలీఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ.. కౌన్సిలింగ్ కంటే ముందే ఇంజినీరింగ్ కాలేజీలు సీట్ల దందా మొదలుపెట్టాయని ఆరోపించారు. ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీల మధ్యవర్తిత్వంతో ఆయా కోర్సుల్లో సీట్లకు రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు దండుకుంటున్నారని చెప్పారు.

దంత ఉచిత వైద్య శిబిరం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: డాక్టర్స్ డేను పురస్కరించుకుని మంగళవారం లయన్స్ ఇంటర్నేషనల్ సనత్‌నగర్ టీమ్ 320-డీ, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ డెక్కన్ బ్రాంచి సంయుక్తాధ్వర్యంలో శ్రీకృష్ణానగర్‌లోని అమరావతి హై స్కూల్‌లో దంత ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 100 మందికి పైగా విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రఫుల్లారెడ్డి, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.నిరంజన్‌రెడ్డి, కార్యదర్శి డా.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ పాత్రల్లో రాణింపు


సత్యనారాయణను సత్కరించిన అతిథులు

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: సత్కళాభారతి వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి సత్యనారాయణ వజ్రోత్సవ జన్మదిన్నాన్ని కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి రవీంద్రభారతిలో నిర్వహించారు. అక్కినేని నాటక పరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డా.కె.వి.రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సత్యనారాయణ దంపతులను సత్కరించారు. అదేవిధంగా రంగస్థల నటుడు జీఎస్ఎన్ శాస్త్రికి 'సత్కళాభారతి పురస్కారం'తో సత్కరించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ ప్రారంభోపన్యాసం చేస్తూ.. ప్రభుత్వ ఉద్యోగిగా, రంగస్థల, వెండి, బుల్లితెర నటుడిగా బహుముఖీనమైన పాత్రలను పోషించి రాణించారన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త డా.వోలేటి పార్వతీశం, తెలుగువర్సిటీ రిజిస్ట్రార్ డా.కోట్ల హనుమంతరావు, రంగస్థల నటుడు, దర్శకుడు తడకమళ్ల రామచంద్రరావు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఛైర్మన్, అంతర్జాతీయ రంగస్థల నటుడు, దర్శకుడు గుమ్మడి గోపాలకృష్ణలు సత్యనారాయణను సత్కరించారు. అనంతరం జ్యోతిరాజ్ భీశెట్టి రచించిన 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటికను డా.వెంకట్ గోవాడ దర్శకత్వంలో ప్రదర్శించారు.

'గద్దర్ పురస్కారాల ఎంపికలో అవమానం'


మాట్లాడుతున్న పృథ్వీరాజ్ యాదవ్, చిత్రంలో యాదగిరి, అమృత్‌గౌడ్, రఫీ

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళాత్మక, సృజనాత్మక, సహజ సిద్ధ, చారిత్రక, సామాజిక, సందేశాత్మక, చట్టబద్ధత కలిగిన, అవినీతిరహిత, ఆరోగ్య ఆహ్లాదభరిత చిత్రాలను ఎంపిక చేసి ఆ చిత్రాలలో పనిచేసిన కళాకారులను, సాంకేతిక నిపుణులను, నిర్మాతలకు తెలంగాణ గద్దర్ అవార్డులు ప్రధానం చేసేందుకు తీసుకున్న నిర్ణయం అభినందనీయం. అయితే అందుకు విరుద్ధంగా, గద్దర్ స్ఫూర్తికి భిన్నంగా అవార్డుల ఎంపిక జరిగిందని, ఈ విధానం గద్దర్‌ను అవమానించడమేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ అమర వీరుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో 'గద్దర్ అవార్డుల గందరగోళం' అనే అంశంపై సినీ దర్శక నిర్మాత రఫీ అధ్యక్షతన సమావేశం జరిగింది. సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్, నిర్మాత పులి అమృత్‌గౌడ్ తదితరులు మాట్లాడారు. అవార్డుల ఎంపికలో అర్హులైన తెలంగాణ వారికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సహనానికి పరీక్ష.. చదువరులకు శిక్ష

● బుక్ చదవాలంటే ముక్కు మూసుకోవాల్సిందే

రహ్మత్‌నగర్, న్యూస్‌టుడే: ఆహ్లాదకర వాతావరణంలో ఉండాల్సిన చదువుల నిలయం మూత్రం కంపుతో విలవిలలాడుతోంది. ప్రశాంతంగా కూర్చుని పుస్తక పఠనం చేసుకుందామని వచ్చే పాఠకులు కంపు భరించలేక ముక్కు మూసుకుంటున్నారు. కొందరైతే జేబురుమాలను ముక్కుకు కట్టుకొని దినపత్రికలను, పుస్తకాలను చదువుకుంటున్నారు. ప్రశాంతంగా 15 నిమిషాలు కూర్చొని చదువుకుందాం అంటే కూర్చునే పరిస్థితి లేదు అని పాఠకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యార్థినులు ఈ ఆవరణలోనికి రావడం చాలా కష్టంగా ఉంది. మద్యం ప్రియులు మద్యం సేవించి గ్రంథాలయం మెట్ల వద్దనే కూర్చుంటారు. వారి వాహనాలను అడ్డుగా నిలుపుతున్నారు. దీంతో పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థినులు, మహిళలు రాలేకపోతున్నారు. ఇదీ రహ్మత్‌నగర్ కూడలిలోని గ్రంథాలయం పరిస్థితి...

గ్రంథాలయం ఏర్పాటు: 30 ఏళ్ల క్రితం
సందర్శకులు: నెలకు 1500 మందికి పైగా
అందుబాటులో ఉన్న పుస్తకాలు: సుమారు పదివేలు
రోజువారీ పత్రికలు: 14
వార పత్రికలు : 31
తెరిచి ఉండే సమయం: ఉ. 8-11, సా. 5-8


మూత్రశాలగా మారిన గ్రంథాలయ ప్రాంగణం


పాఠకుల తిప్పలు

●పక్కనే మద్యం దుకాణం ఉండడం, అక్కడ మూత్రశాలలు లేకపోవడంతో మద్యం సేవించిన వారు పక్కనే ఉన్న గ్రంథాలయం గోడలపై మూత్ర విసర్జన చేస్తున్నారు. ఫలితంగా ఈ ప్రాంతం మొత్తం దుర్వాసన వెలువడుతోంది. ● గ్రంథాలయం పక్కనే శౌచాలయం ఏర్పాటు చేసినా వాటిని ఉపయోగించకపోవడంతో నిరుపయోగంగా మారిపోయాయి. ● చెత్త సేకరించే మున్సిపల్ కార్మికులు తమ రిక్షాలు, ఆటోలను ఇక్కడే నిలుపుతుండడంతో, స్థానికులు తమ చెత్తను వాటిలో పడేస్తున్నారు, ఫలితంగా దుర్గంధం రెట్టింపవుతోంది.

వార్డు కార్యాలయంలోకి తరలిస్తాం..

గ్రంథాలయం పరిసరాలు కంపు కొడుతున్న మాట వాస్తవం. పలుమార్లు మద్యం దుకాణదారులకు విజ్ఞప్తి చేశాం. స్పందన లేకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశాం. సమీపంలో ఉన్న వార్డు కార్యాలయంలోకి గ్రంథాలయాన్ని షిఫ్ట్ మార్చేయాలని యోచిస్తున్నాం. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఉపేందర్ రెడ్డితో మాట్లాడాం. ఆయన సానుకూలంగా స్పందించారు. – సి.ఎన్. రెడ్డి, స్థానిక కార్పొరేటర్

మద్యం తాగి వాహనం నడిపిన వారికి జైలు


శ్వాస పరీక్షలు చేస్తున్న ట్రాఫిక్ అధికారి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన వారిలో పలువురికి న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించింది. మొత్తం 11 మందిని విచారించిన న్యాయస్థానం వారికి రూ.37,700 జరిమానా వేసింది. అందులో ఏడుగురికి రూ.3100లు జరిమానా విధించింది. ఒకరికి రూ.4300లు జరిమానా, 5 రోజులు జైలు, రెండోసారి పట్టుబడిన మరో ముగ్గురికి రూ.4300 జరిమానా, 6 రోజుల జైలు శిక్ష పడినట్లు సెంట్రల్ జోన్ ఏసీపీ మోహన్‌కుమార్ తెలిపారు.

ముమ్మర తనిఖీలు.. కేసులు

నగరంలోని సెంట్రల్ జోన్ పరిధిలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. విద్యార్థులను తరలించే పాఠశాల బస్సులు, ఆటోలను తనిఖీ చేశారు. ఇటీవల మద్యం తాగి విద్యార్థులున్న బస్సు, ఆటోను నడుపుతూ చిక్కిన తరుణంలో వాటిపై దృష్టి సారించారు. ఈ క్రమంలో మంగళవారం వాహన తనిఖీలు చేసి పలువురిపై కేసులు నమోదు చేశారు. అందులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై సైఫాబాద్ - 1, అబిడ్స్ - 1 చొప్పున నమోదు చేశారు. రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌లో సైఫాబాద్ - 34, అబిడ్స్ - 23, చిక్కడపల్లి -129, గాంధీనగర్ - 80 కేసులు నమోదు చేశారు. ఇతర అంశాల్లో సైఫాబాద్ - 5, అబిడ్స్ - 10, చిక్కడపల్లి - 8, గాంధీనగర్ - 11 కేసులు పెట్టారు.

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

వెంగళరావునగర్: జీహెచ్ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్-19 కార్యాలయం ప్రహరీకి ఆనుకొని ఉన్న పూడిక వ్యర్థాలు తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టారు. 'కార్యాలయం.. వ్యర్థాల నిలయం' శీర్షికతో గత నెల 27న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. కుప్పలుగా పోసిన నాలా పూడిక వ్యర్థాలను తొలగించి.. వాహనాల్లో తరలించారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: యూసుఫ్‌గూడలోని మొదటి పటాలం ప్రధాన ద్వారం వద్ద ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో మ్యాన్‌హోల్ కుంగి ప్రమాదకరంగా మారింది. 'కుంగిన మ్యాన్‌హోల్' అనే శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఎల్లారెడ్డిగూడ జలమండలి సెక్షన్ మేనేజర్ శ్యామ్‌కుమార్ స్పందించి మరమ్మతులు చేయించారు.

ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు


పరిశీలిస్తున్న అజారుద్దీన్, సీఎన్‌రెడ్డి

రహ్మత్‌నగర్, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ డివిజన్ ఇందిరానగర్ బస్తీలో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి చేపట్టిన బస్తీబాట కార్యక్రమంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఇన్‌ఛార్జి మహమ్మద్ అజారుద్దీన్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్తూ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రభుత్వంలో వివిధ వర్గాల వారి కోసం అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శ్రీనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: శ్రీనగర్‌కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్ల పనులను కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి మంగళవారం పర్యవేక్షించారు. వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో పొంగిపొర్లుతున్న మురుగుతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్యను వెంటనే తీర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్ రాజు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాద ఘంటికలు!

న్యూస్‌టుడే, జిన్నారం: పరిశ్రమల్లో ప్రమాదం జరిగితే యంత్రాంగం మొదట్లో హడావిడి చేసినా ఆ తర్వాత షరా మామూలేనని పలువురు కార్మికులు వాపోతున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ పరిశ్రమ లాంటివి ఇంకా ఎన్నో ఉంటాయని.. క్షుణ్ణంగా పరిశీలిస్తే అనేక లోపాలు వెలుగులోకి వస్తాయని కార్మికులు వాపోతున్నారు.

గతంలో పలు ఘటనలు

ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని ఓ రసాయన పరిశ్రమ చాలా ఇరుకుగా ఉంటుంది. కనీసం అగ్నిమాపక శకటం వెళ్లలేని పరిస్థితి. ఇది నిబంధనలకు విరుద్ధం. పరిశ్రమలు హెచ్‌ఎండీఏ నిబంధనలు విధిగా పాటించాలి. పరిశ్రమ చుట్టూ, లోపల వాహనాలు తిరిగేలా ఏర్పాట్లు ఉండాలి. కానీ సదరు పరిశ్రమలో జనవరి 20న ప్రమాదం జరిగి ఇద్దరు మృతి చెంది ఐదుగురు గాయపడ్డారు.

● ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలో ఎన్‌రిచ్ ప్రాంతంలో రెండేళ్ల క్రితం నలుగురు మృతి చెందగా 10 మంది గాయపడ్డారు. అప్పట్లో సంబంధిత పరిశ్రమకు కర్మాగారాల భద్రతా శాఖ అనేక సూచనలు చేసింది. తర్వాత ఏ నిబంధన పాటించకుండా ఇటీవల ఉత్పత్తులు ప్రారంభించింది. జిన్నారం మండలంలోని గడ్డపోతారం, ఖాజీపల్లి, బొంతపల్లితో పాటు పటాన్‌చెరు మండలం పాశమైలారం, ఇస్నాపూర్, చిట్కుల్, బండ్లగూడ, ముత్తంగి, హత్నూర, సదాశివపేట, జహీరాబాద్ ప్రాంతాల్లోని అనేక పరిశ్రమలు నిబంధనలు పాటించడం లేదు.

సమావేశమెక్కడ?

పరిశ్రమల భద్రతపై ఏడాదికోసారైనా లోకల్ క్రైసిస్ గ్రూప్ సమావేశం నిర్వహించాలి. మండలాల వారీగా ఒక కమిటీని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేస్తారు. కానీ నాలుగైదేళ్లుగా సమావేశం జరిగినట్లు దాఖలాలు లేవు.

నిపుణుల పర్యవేక్షణ లేకే పేలుడు?

నిర్లక్ష్యంతోనే సిగాచీ ప్రమాదం..

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రమాదంగా నిలిచిన సిగాచీ ఘటనకు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. యంత్రాల వద్ద, రియాక్టర్, బాయిలర్, డ్రయ్యర్ల వద్ద నిపుణుల పర్యవేక్షణ లేదని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ కోణంలోనే దర్యాప్తు ప్రారంభించినట్టు పరిశ్రమలశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఔషధాలు, ఆహార పరిశ్రమలో వాడే మైక్రో క్రిస్టలైన్ సెల్యూలోజ్ (ఎంసీసీ) ఉత్పత్తి జరుగుతుండగా.. ఇందుకోసం హైడ్రోక్లోరిక్ ఆమ్లం, చెక్క గుజ్జు(వుడ్‌పల్ప్)ను ముడిపదార్థంగా వాడతారు. హైడ్రోక్లోరిక్ ఆమ్లాన్ని నియంత్రిత పరిస్థితుల్లో రియాక్టర్‌లో హైడ్రోలైజ్ చేస్తారు. ఈ ప్రక్రియలో సెల్యూలోజ్‌లోని అస్ఫటిక భాగాలు కరిగిపోయి, స్ఫటికాకార భాగాలు



ప్రమాద స్థలం నుంచి మృతదేహాన్ని తరలిస్తున్న సహాయక సిబ్బంది

మిగిలిపోతాయి. ఈ స్ఫటికాకార భాగాలే మైక్రో క్రిస్టలైన్ సెల్యూలోజ్‌గా ఏర్పడతాయి. హైడ్రోలిసిస్ తర్వాత ఏర్పడిన మిశ్రమాన్ని వడపోత ద్వారా వేరు చేసి మిగిలిన సెల్యూలోజ్‌ను నీటితో శుద్ధి చేస్తారు. శుద్ధి చేసిన సెల్యూలోజ్‌ను స్ప్రే డ్రయింగ్ లేదా ఓవెన్ డ్రయింగ్ వంటి పద్ధతుల్లో ఎండబెట్టి తేమ తొలగిస్తారు. ఇక్కడే డ్రయ్యర్ల వద్ద ఉష్ణోగ్రత 700-800 డిగ్రీల వరకు పెరిగి పేలుడు సంభవించొచ్చని అధికారులు భావిస్తున్నారు.

భద్రతా లోపాలు..

పాశమైలారం, సదాశివపేట, పటాన్‌చెరు, ఐడీఏ బొల్లారం ప్రాంతంలో సిగాచీ తరహా పరిశ్రమలు అనేకం ఉండగా ఏటా పేలుడు ఘటనలు సంభవిస్తున్నాయి. ఒకే పరిశ్రమల్లో ఏడాదిలో రెండుసార్లు ప్రమాదాలు జరిగిన ఘటనలున్నాయి. అయినా నిర్వాహకులు కళ్లు తెరవకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

పీసీబీ నివేదిక ప్రకారం

◆ సీఎఫ్‌వో అనుమతి గడువు: 2027 మార్చి 31◆ ప్రతినెలా వుడ్ పల్ప్ వినియోగం: 861 టన్నులు◆ ప్రతినెలా హైడ్రోక్లోరిక్ ఆమ్లం వినియోగం: 74 టన్నులు ◆ రోజూ మైక్రో క్రిస్టలైన్ సెల్యూలోజ్ ఉత్పత్తి: 25,200 కిలోలు◆ కోల్ ఫైర్డ్ ట్యూబ్ బాయిలర్ సామర్థ్యం: ప్రతి గంటకు 3 టన్నులు ◆ కోల్ ఫైర్డ్ బాయిలర్ (స్టాండ్‌బై):ప్రతి గంటకు 2 టన్నులు.

మృతుల్లో మంచిర్యాల వాసి..



దండేపల్లి: కర్మాగారంలో మృత్యువాత పడ్డ ఒజ్జకేశవుల రాజగంగ నాగేశ్వర్‌రావు(51) క్వాలిటీ కంట్రోల్ విభాగంలో సహాయక మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లికి చెందిన ఆయన స్థానికంగా పదో తరగతి వరకు చదువుకున్నారు. ఆ తర్వాత ఎంఎస్సీ రసాయన శాస్త్రం చేశారు. 20 ఏళ్ల కిందట ఉద్యోగ రీత్యా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ కాగితపు పరిశ్రమలో రసాయన విభాగంలో కెమిస్ట్‌గా పని చేశారు. మిల్లు మూత పడటంతో పదేళ్ల కిందట సిగాచీ ఔషధ పరిశ్రమలో చేరారు.రోజూ లాగే విధులకు వెళ్లిన నాన్న తిరిగి రాని లోకాలకు వెళ్లారని తెలిసి తన ఇద్దరు పిల్లలు తల్లడిల్లిపోతున్నారు. కొద్ది సేపటి కిందే వెళ్లొస్తా అని చెప్పి ఇంటి నుంచి ఉద్యోగానికి బయలుదేరిన భర్త ఇక లేరని తెలిసి భార్య సొమ్మసిల్లి పడిపోయింది.

500 మందితో పోలీసు బందోబస్తు

● పరిశ్రమలో ప్రమాదం జరిగిన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి సుమారు 500 మంది పోలీసులతో పాటు ప్రత్యేక సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పరిశ్రమను మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, డీజీపీ జితేందర్ సందర్శించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఏఎస్పీ సంజీవరావు, పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్ పర్యవేక్షణ చేస్తున్నారు. పరిశ్రమలో మృతులు ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులే ఉన్నారు.

మానవ హక్కుల కమిషన్ ఆందోళన

నారాయణగూడ: పరిశ్రమలో జరిగిన ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(ఎస్‌హెచ్‌ఆర్సీ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సుమారు 42 మంది ప్రాణాలు కోల్పోగా, 35 మందికిపైగా కార్మికులు గాయపడ్డారని, వారిలో ఎక్కువగా వలస కార్మికులు ఉండటం, పరిశ్రమలో భద్రతా లోపాలు, కార్మికుల హక్కుల ఉల్లంఘనలపై సీరియస్ అయింది. ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ నెల 30లోపు జరిగిన ఘటనపై సమగ్ర నివేదికను సమర్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్, కార్మిక శాఖ కమిషనర్, అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్, ఎస్పీలకు నోటీసులు జారీ చేసింది.

ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం: మంత్రి

పటాన్‌చెరు అర్బన్, శేరిలింగంపల్లి: ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. పటాన్‌చెరులోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

రూ.కోటి పరిహారం ఇవ్వాలి: కవిత



పటాన్‌చెరు అర్బన్: యాజమాన్యం ఇచ్చే పరిహారం కాకుండా మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందజేయాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. పటాన్‌చెరు ధ్రువ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు.

● ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములుతో కలిసి క్షతగాత్రులను దవాఖానాలో పరామర్శించారు.

● ఫార్మా, రసాయన పరిశ్రమలపై కాలుష్య నియంత్రణ మండలి, సంబంధిత అధికారులు నిరంతర నిఘా ఉంచాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం దిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు.

హిమాయత్‌నగర్: యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే పరిశ్రమలో భారీ పేలుడు సంభవించిందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. మంగళవారం ప్రమాద స్థలిని సందర్శించారు.

నొప్పికి టీకా.. ఆందోళన లేదిక

న్యూస్‌టుడే, ఉస్మానియా ఆసుపత్రి

ఉస్మానియాలో తొలిసారిగా నొప్పి నివారణ కేంద్రం



ఉస్మానియా ధర్మాసుపత్రిలో ఇటీవలే నొప్పి నివారణ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఉస్మానియా బోధనాసుపత్రిలో చదివి నేడు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సుమారు రూ.50 లక్షల విలువైన వైద్య పరికరాలు దవాఖానాకు సమకూర్చారు. మరో రూ.50 లక్షల విలువైన పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. ముందెన్నడూ లేని విధంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పాత భవనంలోని హౌస్‌సర్జన్ క్వార్టర్స్‌లోని గదులకు మరమ్మతులు చేపట్టారు. కొన్ని యంత్రాలు ఇప్పటికే అమర్చారు. పనులు కొనసాగుతున్నాయి. క్యాన్సర్ రోగులు, నరాలు, కండరాలు, వెన్ను, స్పాండిలైటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు ఈ క్లినిక్‌లో చికిత్స చేస్తారు. ఆర్థోపెడిక్, న్యూరాలజీ, అనస్థీషియా, ఫిజియోథెరపీ వంటి వివిధ విభాగాలకు చెందిన వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని సూపరింటెండెంట్ డా.రాకేశ్ సహాయ్ వెల్లడించారు.

వారంలో మూడు రోజులు: వారంలో మూడు రోజులు ఆయా విభాగాలకు చెందిన వైద్యులు అందుబాటులో ఉంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చికిత్స అందిస్తారు. ఉస్మానియాతో పాటు ఎంఎన్‌జే క్యాన్సర్, గాంధీ, ఈఎన్‌టీ, నిలోఫర్ ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి రెఫరల్‌గా వచ్చే రోగులకు ఈ కేంద్రంలో చికిత్స చేసి పంపుతారు. రోగికి నొప్పి తీవ్రత ఎక్కడ ఉందనే విషయమై సీ-ఆమ్, అల్ట్రాసౌండ్, ఇతర రోగ నిర్ధారణ పరీక్షల ద్వారా నిర్ధారిస్తామని వివరించారు. ఆ తర్వాతే ఖరీదైన ఇంజక్షన్లు నరాలకు ఇవ్వడం ద్వారా రోగికి ఉపశమనం కలిగిస్తామన్నారు. చికిత్సలను ఆరోగ్యశ్రీలో చేర్చాలని ఉన్నతాధికారులకు విన్నవించారు.

వచ్చే ఏడాది నుంచి కోర్సు అమలు

పెయిన్ మేనేజ్‌మెంట్ కోర్సుకు ఇటీవలే ఉస్మానియాలోని వైద్యాధికారులు తెలంగాణ సర్కారుకు ప్రతిపాదనలు పంపించారు. వచ్చే ఏడాది నుంచి అమలయ్యే అవకాశం ఉందని డా.రాకేశ్ సహాయ్ వెల్లడించారు. ఎంబీబీఎస్, జనరల్ మెడిసిన్ ఎండీ తర్వాత మరో మూడేళ్ల కాలవ్యవధి కలిగిన ఈ కోర్సును ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

పారాణి ఆరక ముందే ఆరళ్లు

వరకట్న దాహానికి బలవుతున్న నవ వధువులు



● పెళ్లయిన నెలకే మా అబ్బాయికి సరిపోయే సంబంధం కాదు.. వేరే అమ్మాయిని చేసుకుంటే రెట్టింపు కట్నం వచ్చేదని నవ వధువును మనోవేదనకు గురిచేశారు. ఇంట్లో పనిచూసుకోమంటూ ఉద్యోగం మాన్పించారు. కన్నవారితో చెబితే భరించలేరని ఆత్మహత్యాయత్నం చేసింది. రెండ్రోజుల క్రితం శివారు ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. కుమార్తె కాపురం కూలిపోతుందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

● కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన ప్రైవేటు ఉద్యోగికి ఖమ్మం జిల్లా యువతితో వివాహమైంది. కొద్దిరోజులకే అతగాడి నిజస్వరూపం బయటపెట్టాడు. మరో రూ.10లక్షలు కావాలంటూ వేధించాడు. ఆమె తల్లిదండ్రులు తర్వాత ఇస్తామని హామీ ఇచ్చారు. అయినా వేధింపులు ఆపకపోగా.. కొద్దిరోజుల క్రితం నవవధువు ఆత్మహత్యకు పాల్పడింది.

ఈనాడు, హైదరాబాద్

కాళ్లపారాణి ఆరకుండానే అత్తింట ఆరళ్లు, వరకట్న వేధింపులు మొదలవుతున్నాయి. కొందరు కన్నవారితో చెప్పలేక బలవన్మరణమే శరణ్యం అనుకుంటున్నారు. కొందరు తల్లిదండ్రులు నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారని, కుమార్తె నుంచి ఫోన్ వస్తే వారు ఉలిక్కిపడుతున్నారని పోలీసు అధికారి చెప్పటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఎక్కువగా రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో కేసులు నమోదవుతున్నాయి.

అదనపు వేధింపులు.. కొద్దిరోజులకే కారు కొనుక్కోవాలని, వ్యాపారం విస్తరించాలని, సొంతిల్లు కట్టుకోవాలని, విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసమంటూ అల్లుళ్లు అదనపు కట్నం డిమాండ్ చేస్తున్నారు. అప్పటికే పెళ్లి చేసి పీకల్లోతు అప్పుల్లో కూరుకున్న అత్తమామల నుంచి సానుకూల స్పందన రాకపోవటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఆ కోపాన్ని భార్యపై చూపుతున్నారని ఓ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వివరించారు. ఉన్నత విద్యావంతులు, ఆర్థికంగా లోటులేని కుటుంబాల నుంచే ఎక్కువగా వరకట్న వేధింపుల ఫిర్యాదులు వస్తున్నాయని పోలీసు అధికారులు చెప్పటం గమనార్హం. నగరంలో వరకట్న మరణాలు 2023లో 11 ఉంటే 2024కు 12కు చేరాయి. ఈ ఏడాది 5 నెలల్లోనే 6కు పైగా చోటు చేసుకున్నాయి.

2024 ఏప్రిల్ 1 - 2025 మార్చి 31 వరకు మహిళలపై నేరాలు

సఖీ వన్ స్టాప్ సెంటర్	గృహహింస కేసులు	వరకట్న వేధింపులు, మరణాలు
హైదరాబాద్	828	00
మేడ్చల్-మల్కాజిగిరి-1	312	102
మేడ్చల్-మల్కాజిగిరి-2	294	10
రంగారెడ్డి-1	535	00
రంగారెడ్డి-2	132	01

☆ మహిళా శిశు సంక్షేమ శాఖ గణాంకాల ప్రకారం..

ఆ ఖర్చంతా భరించాలని..

కట్టుకున్న భార్య వైద్య ఖర్చులకు కూడా లెక్కలు కడుతున్నారు. పెళ్లయిన నాలుగు నెలలకు భార్యకు మూత్రపిండాల సమస్య ఉందని వైద్యపరీక్షల్లో తేలింది. అంతే ఆరోగ్యం కుదుటపడేంత వరకు పుట్టింటి వద్దనే ఉండమని భర్త హుకుం జారీచేశాడు. ● పెళ్లయిన నెలకే జీవిత భాగస్వామికి హృద్రోగం ఉందని తెలిసింది. భర్త వేధింపులు పెంచటంతో ఆమె బలవన్మరణమే శరణ్యమనుకుంది. ● ఆడపిల్ల పుట్టగానే రేపటి అవసరాలకు కావాల్సిన డబ్బు పుట్టింటి నుంచి తీసుకురమ్మంటూ ఒత్తిడి తీసుకొస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని ఒక ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆల్కలాయిడ్ పరిశ్రమలో పేలిన బాయిలర్



చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్: మేడ్చల్ పారిశ్రామికవాడ ఆల్కలాయిడ్ కంపెనీలో బాయిలర్ పేలి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. షాపూర్‌నగర్‌కు చెందిన మోల శ్రీనివాస్ రెడ్డి 12 ఏళ్లుగా మేడ్చల్ చెక్‌పోస్ట్ పారిశ్రామికవాడ ఆల్కలాయిడ్ బయోయాక్టివ్స్ కంపెనీలో బాయిలర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరి మంగళవారం విధులకు వెళ్లాడు. ఉదయం 10 గంటల సమయంలో బాయిలర్ వద్ద పనులు చేస్తుండగా.. పెద్ద శబ్దంతో ఒక్కసారిగా పేలిపోయింది. పేలుడు ధాటికి శ్రీనివాస్‌రెడ్డి కొంతదూరం ఎగిరిపడ్డాడు. కాలు విరిగి పొట్టభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ శంకర్‌రెడ్డి, సీఐ సత్యనారాయణలు తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు అవసరం



ఇలంబర్తి

ఈనాడు, హైదరాబాద్: ఏళ్ల తరబడి నగరంలోని పైవంతెనలకు మరమ్మతులు జరగట్లేదు. గుంతలు, పగుళ్లతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. రహదారి తవ్వకాలతో రోడ్లపై గుంతలు సమస్యగా మారాయి. మ్యాన్‌హోళ్లను రహదారికి సమాంతరంగా నిర్మించట్లేదు. ఇలాంటి సమస్యలను ప్రస్తావిస్తూ ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తి జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగాన్ని హెచ్చరించారు. ఈ మేరకు బల్దియా ముఖ్య ఇంజినీరు(నిర్వహణ) మంగళవారం సూపరింటెండెంట్ ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, డిప్యూటీ ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్లకు.. కార్యదర్శి ఆదేశాలను తెలియజేస్తూ ఉత్తర్వు జారీ చేశారు. పైవంతెనలు, బ్రిడ్జిలను తనిఖీ చేయాల్సిందిగా ప్రాజెక్టులు, నిర్వహణ విభాగం ఇంజినీర్లను ఆదేశించారు. ప్రతి రెండు వారాలకోసారి సర్కిళ్ల స్థాయిలో ఇంజినీర్లు తనిఖీ నివేదికలను రూపొందించి, సంబంధిత జోనల్ కమిషనర్లకు అందజేయాలని, అవసరమైన చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు హైడ్రాతో కలిసి పనిచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బోనాల వేడుకల్లో ఆకతాయిలు

● భక్తుల చరవాణులు, పర్సులు మాయం



బల్కంపేట ఎల్లమ్మతల్లి ఆలయం వద్ద రద్దీ (షీటీమ్ తీసిన చిత్రం)

ఈనాడు, హైదరాబాద్ : ఆషాఢ బోనాల సంబరాలతో నగరంలో కోలాహలం కనిపిస్తోంది. వేలాది మంది భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి బోనం సమర్పించేందుకు ఆలయాలకు తరలొస్తున్నారు. జనం మధ్య చేరిన జేబుదొంగలు సెల్‌ఫోన్లు కొట్టేసి మాయమవుతున్నారు. కొందరు ప్రబుద్ధులు గుంపులో తమను ఎవరు గమనించరనే ధీమాతో మహిళలతో అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. గోల్కొండ వద్ద భారీ జన సందోహం మధ్యకు మందుబాబులు చేరి గొడవలు చేస్తున్నారు. తొలిరోజు ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఆడపిల్లలను వేధించినట్టు బాధితురాలు ఆవేదన వ్యక్తంచేశారు. సమీపంలోని ఒక కానిస్టేబుల్‌కు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. బల్కంపేట ఎల్లమ్మ తల్లి దర్శనానికి పలు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. ఏటా ఇక్కడ మకాం వేసే గంజాయి బ్యాచ్‌లు అర్ధరాత్రి గర్వాత గొడవలకు దిగటం పరిపాటిగా మారింది. మహంకాళి ఆలయం వద్ద గతేడాది నిర్వహించిన ఊరేగింపులో సుమారు వందలాది సెల్‌ఫోన్లు మాయమయ్యాయి. వరుస ఘటనల నేపథ్యంలో నగర సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. జేబుదొంగల ఆటకట్టించేందుకు, ఆకతాయిలకు ముకుతాడు వేసేందుకు మఫ్టీలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

అంతర్రాష్ట్ర ముఠాల రాక

పాత నేరస్థులు, అంతర్రాష్ట్ర ముఠాలు భక్తుల సెల్‌ఫోన్లు కొట్టేసి సొమ్ము చేసుకుంటున్నారు. నగరానికి చెందిన కొన్ని ముఠాల్లో మహిళలు, పిల్లలు కూడా ఉంటారు. రద్దీ ప్రాంతాల్లో, బోనాల వేడుకలు, ఊరేగింపుల్లో జనం మధ్య చేరి తమ చేతివాటం ప్రదర్శిస్తుంటారు. ఒకర్నొకరు నెట్టుకుంటున్నట్టుగా నటిస్తూ జేబుల్లో ఫోన్లను ముఠాలోని ఒకరు మాయం చేసి మరొకరి చేతికిస్తారు. చేతులు మారుకుంటూ ముఠానేత వద్దకు ఫోన్లు చేరుతాయి. ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసి దళారులు, దుకాణాల వాళ్లకు విక్రయించి వచ్చిన డబ్బును వాటాలేసుకొని పంచుకుంటారని ఓ పోలీసు అధికారి తెలిపారు. ఏపీ, కర్ణాటక, యూపీ తదితర ప్రాంతాల ముఠాలు నగరంలోకి చేరినట్టు సమాచారం.

ఒకేరోజు 50 మంది గుర్తింపు

ఆకతాయిలు బుద్ధిమంతుల్లా భక్తులతో వరుసలో నిలబడతారు. తమనెవరూ గమనించరని మహిళలు, యువతులను తాకుతూ, వికృతంగా ప్రవర్తిస్తుంటారు. బల్కంపేట, గోల్కొండ, మహాకాళి మాత ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందుల కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. 14 షీటీమ్ బృందాలు మహిళలను వేధించే ప్రబుద్ధులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యాయని మహిళా భద్రతా విభాగం డీసీపీ డా.లావణ్య నాయక్ జాదవ్ తెలిపారు. బల్కంపేట ఆలయం వద్ద ఒకేరోజు 50 మంది ఆకతాయిలను గుర్తించామన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకోగానే తాము అమాయకులమని చెప్పుకొస్తున్నారు. వారి వికృత చేష్టల వీడియోలు చూపగానే క్షమించమని కాళ్లావేళ్లా పడుతున్నారు. అత్యవసర సమయంలో డయల్-100కు ఫోన్ చేయాలని పోలీసులు సూచించారు.



అయ్యా.. ఛార్జింగ్‌కు వీలు కల్పించండి

కూకట్‌పల్లి నుంచి మియాపూర్ ప్రధాన రహదారి వివేకానందనగర్ బస్టాప్ పక్కన నియంత్రిక ఉండటంతో అక్కడ జీహెచ్‌ఎంసీ, టీఎస్ రెడ్‌కో సంయుక్త ఆధ్వర్యంలో ఈవీ ఛార్జింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. కానీ వాహనాలు ఛార్జింగ్ పెట్టుకునేందుకు సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది.



మ్యాన్‌హోళ్లు.. మూయాలి నోళ్లు

నగరంలో చాలా ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లు కుంగిపోయాయి. కొన్ని చోట్ల ధ్వంసమయ్యాయి. వర్షాకాలంలో వాటిని గుర్తించక అందులో పడే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

అత్యవసర బృందాల సేవలు షురూ



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: వర్షాకాలంలో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి హైడ్రా సన్నద్ధమైంది. 150 వర్షాకాల అత్యవసర బృందాల(ఎంఈటీ)లను మంగళవారం రంగంలోకి దించింది. ఒక్కో షిఫ్ట్‌లో నలుగురు చొప్పున మూడు షిఫ్టుల్లో పనిచేయడానికి మొత్తం 1,800 మంది ఉంటారు. వాన నీరు నిలిచే చోట రెండు షిఫ్టుల్లో పనిచేసేలా 734 మంది సిద్ధమయ్యారు. 30 సర్కిళ్లలో పనులను పర్యవేక్షించేందుకు హైడ్రాకు చెందిన 30 మంది మార్షల్స్ అందుబాటులో ఉంటారు. అధికారులతో కలిపి మొత్తం 4,100 మంది సేవలందిస్తారు. వరద నీరు నిలిచిన వెంటనే తోడేందుకు పంపులు, చెట్లు పడిపోతే తొలగించడానికి కటింగ్ యంత్రాలు ఎంఈటీలతోపాటు 51 డీఆర్‌ఎఫ్ బృందాలకు అప్పగించారు. ట్రాఫిక్ సజావుగా సాగేలా పోలీసులతో 20 బృందాలు పనిచేయనున్నాయి. 'నాలాలు, కల్వర్టులను పరిశీలించి, వరద ప్రవాహం సాఫీగా సాగేలా జాగ్రత్త పడాలి' అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు.

ఆర్‌ఆర్ సంస్థకు రెరా జరిమానా

ఈనాడు, హైదరాబాద్: ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు రెరా రూ.2,81,276 జరిమానా విధించింది. 30 రోజుల్లో చెల్లించాలని పేర్కొంది. అడిక్‌మెట్ లలితానగర్‌కు చెందిన ముద్రకర్త వీణాధరి ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ నుంచి శ్రీ వజ్రా రెసిడెన్సీలో 2021 మార్చి 13న ఫ్లాట్ కొనుగోలు చేశారు. 459.22 చ.గజాల స్థలంలో అనుమతికి మించి ఫ్లాట్లు నిర్మించారని, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని, అంతేకాకుండా ఎలాంటి సదుపాయాలు కల్పించలేదని వీణాధరి ఫిర్యాదు చేశారు. కానీ సంస్థ తోసిపుచ్చింది. వాదనలు విన్న రెరా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినందుకు జరిమానా విధించింది.

ఉద్యోగ ప్రకటనల విడుదలకు డిమాండ్



గాంధీనగర్, న్యూస్‌టుడే: ఉద్యోగ ప్రకటనలు విడుదల చేయాలని నిరుద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలో నిరసన తెలిపారు. అభ్యర్థులు వెంకటేశ్, కృష్ణ, నగేష్‌లు మాట్లాడారు. ఉద్యోగ ప్రకటనలు వద్దని ధర్నా చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జీఓ-29ను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రాబోయే స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లో తిరిగి తమకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామని హెచ్చరించారు. అనంతరం త్యాగరాయ గానసభలో ఓ కార్యక్రమానికి వచ్చిన శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారిని నిరుద్యోగులు కలిసి వినతిపత్రం అందజేశారు.

బిడ్డకు వైద్యం చేయించలేక తండ్రి ఆత్మహత్య

సుమోటోగా కేసు విచారణకు స్వీకరించిన ఎస్‌హెచ్‌ఆర్సీ

నారాయణగూడ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడి అచేతన స్థితిలో ఉన్న కుమార్తెకు వైద్యం చేయించలేక తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కేసును మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్సీ) సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ధర్మతండాకు చెందిన రైతు జర్పుల పరశురామ్‌కు ఇద్దరు సంతానం. కుమారుడు రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించగా, కుమార్తె కూడా అదే రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి అచేతన స్థితిలో ఉంది. మనస్తాపానికి గురైన పరశురామ్ బిడ్డకు వైద్యం చేయించే శక్తి సరిపోవడం లేదని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై కమిషన్ ఖమ్మం కలెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది.

మల్లికార్జున ఖర్గే సందేశాన్ని ప్రజలకు చేరవేయాలి: కాంగ్రెస్



గాంధీభవన్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఈనెల 4న ఎల్బీస్టేడియంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ గ్రామ స్థాయి అధ్యక్షుల సమావేశాన్ని విజయవంతం చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కోరారు. పార్టీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సన్నాహక సమావేశం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన మంగళవారం గాంధీభవన్‌లో జరిగింది. మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం ఇన్‌ఛార్జి, ఎమ్మెల్యే డా.పర్ణికారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు బొంతు రామ్మోహన్, పలువురు కార్పొరేషన్ల ఛైర్మన్లు పాల్గొన్నారు. ఖర్గే కార్యకర్తలతో నేరుగా మాట్లాడతారని, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడంపై దిశానిర్దేశం చేస్తారని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికపైనా చర్చ జరుగుతుంది' అన్నారు.

నేడు 'మంత్రులతో ముఖాముఖి'

గాంధీభవన్‌లో బుధవారం 'మంత్రులతో ముఖాముఖి'కి క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హాజరుకానున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆయన అర్జీలు స్వీకరిస్తారు.

స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన

ఖర్గే సభ నేపథ్యంలో మంగళవారం ఎల్బీ స్టేడియంలో పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఏర్పాట్లను పరిశీలించారు. వారి వెంట ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, శాట్ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి తదితరులున్నారు.

పింఛనర్ల సమస్యలపై సంఘటితంగా పోరాడదాం: కోదండరాం



మాట్లాడుతున్న కోదండరాం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: పింఛనర్ల సమస్యలపైనా సంఘటితంగా ముందుకెళ్దామని ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం పిలుపునిచ్చారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై మహిళా పెన్షనర్ల సంఘం ఛైర్‌పర్సన్ ఆర్.ఉమాదేవి అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నాకూ పెన్షన్ రాలేదు అన్నారు. పెన్షనర్ల కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఫైనాన్స్ సెక్రటరీ రాజేంద్రబాబు, పెన్షనర్ల సంఘ (సలీమ్‌నగర్) రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మయ్య, పెన్షనర్ల సంఘం (బడీచౌడి) రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	90-00	డ్రెస్డ్	162-00
రిటైల్	112-00	స్కిన్‌లెస్	185-00

ఆర్టీసీని నష్టాల్లోంచి గట్టెక్కిస్తాం

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: భారాస పాలనలో తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆర్టీసీకి సుమారు రూ.6300 కోట్లు ఇచ్చామన్నారు. తుర్కయంజాల్ పట్టణం మునగనూరులో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కోసం 500 చ.గజాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఈ స్థలంలో నిర్మించనున్న సంక్షేమ భవనం పనులకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు కొత్త బస్సులు కొనుగోలు చేయడంతో పాటు ఉద్యోగులకు పీఆర్సీని అమలు చేశామన్నారు. సంక్షేమ భవనానికి ప్రభుత్వం నుంచి రూ.20 లక్షలు ఇస్తామన్నారు. హయత్‌నగర్ నుంచి మునగనూర్, తొర్రూర్ మీదుగా కోహెడ ఓఆర్‌ఆర్ వరకు ఉన్న రహదారిని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు రాజయ్య, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.


సంక్షేమ భవనం పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

డీఎల్ఆర్ఎల్ డైరెక్టర్‌గా శాస్త్రవేత్త మురళి



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో)కు చెందిన డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ ల్యాబొరేటరీ(డీఎల్ఆర్ఎల్) డైరెక్టర్‌గా అవుట్‌స్టాండింగ్ శాస్త్రవేత్త కె.మురళి నియమితులయ్యారు. ఎన్.శ్రీనివాసరావు పదవీ విరమణ చేయడంతో ఆయన నుంచి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 1988లో ఓయూ నుంచి బీఎస్సీ పూర్తిచేసిన ఆయన 1990లో యూనివర్సిటీ ఆఫ్ మైసూర్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో ఎమ్మెస్సీ చేశారు. శాస్త్రవేత్తగా కంచన్‌బాగ్‌లోని డీఎల్ఆర్ఎల్‌లో 1991లో చేరారు. సాయుధ దళాల కోసం ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలు, ఆర్ఎఫ్ సీకర్స్, కౌంటర్ డ్రోన్స్ డిజైన్ నుంచి అభివృద్ధి, ఉత్పత్తి వరకు వివిధ స్థాయిల్లో సేవలు అందించారు.


లాక్ అవకుండా ఆపేలా..

- ద్విచక్ర వాహనాలకు 'ఏబీఎస్' బిగింపుతో ప్రయోజనం
- జనవరి 1 నుంచి అమలుకు కేంద్రం యోచన

ఈనాడు డిజిటల్, హైదరాబాద్

రోడ్డు ప్రమాదాల్లో సింహభాగం ద్విచక్ర వాహనాలదే. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల బారిన పడకుండా నివారించవచ్చు. ద్విచక్ర వాహనాలకు ఇంజిన్ ఎంత కీలకమో.. బ్రేకింగ్ సిస్టమ్ కూడా అంతే ప్రధానం. ఒక్కసారిగా బ్రేక్ వేయడం వల్ల వాహనం నియంత్రణ కోల్పోయి, అదుపు తప్పి ప్రమాదం జరిగిన సందర్భం చాలామందికి ఎదురయ్యే ఉంటుంది. దీనికి కారణం యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్) లేకపోవడం. ప్రస్తుతం 150 సీసీ దాటిన వాహనాలకు మాత్రమే వీటిని బిగిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి సీసీ వారీగా కాకుండా అన్ని ద్విచక్ర వాహనాలకు ఏబీఎస్‌ని తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది.

> దిల్‌సుఖ్‌నగర్‌కి చెందిన రాజు ప్రైవేట్ ఉద్యోగి. తన సహోద్యోగితో బైక్‌పై కార్యాలయానికి వెళ్తున్నాడు. అంతలో ఎదురుగా కుక్క వచ్చేసరికి అతను అసంకల్పితంగా వెంటనే బ్రేక్ వేశాడు. దీంతో ఇద్దరూ ఎగిరిపడ్డారు. వెనక ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా.. రాజు తీవ్రగాయాలతో బయటపడ్డాడు. బ్రేక్ ఒక్కసారిగా వేయడంతోనే బైక్ స్కిడ్ అయి పడిపోయినట్లు పోలీసులు నిర్ధారించారు.



మనిషి బరువు ఆపలేక..

ఎదురుగా వస్తున్న వాహనాలను అంచనా వేయలేక, మలుపులు, జంతువులు ఎదురుగా రావడం, ఇతర వాహనాల నుంచి రక్షణ వంటి కారణాలతో సడెన్ బ్రేక్ వేస్తుంటాం. ఏబీఎస్ లేని వాహనాలు గంటకు 60 కి.మీ. వేగంతో వెళ్లేలా రూపొందిస్తున్నారు. అంతకు మించిన వేగంతో వెళుతూ బ్రేక్ వేయడంతో చక్రాలు మనిషి బరువు ఆపలేక బైక్ స్కిడ్ అవుతోంది.

ఎలా పనిచేస్తుంది?

ఏబీఎస్ ద్విచక్ర వాహనాల చక్రాలు 'లాక్' అవకుండా నియంత్రించే భద్రతా వ్యవస్థ. బ్రేక్ వేసే సమయంలో ఉపయోగపడుతుంది. ఏబీఎస్‌లో చక్రాల వేగాన్ని పర్యవేక్షించే సెన్సర్లు ఉంటాయి. ఇవి వీల్స్ తిరిగే వేగాన్ని నిరంతరం తనిఖీ చేస్తుంటాయి. ఈ సిస్టమ్‌లో ఉండే ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ (ఈసీయూ), హైడ్రాలిక్ వాల్వ్‌లు, బ్రేక్ వేసినప్పుడు వీల్స్ ఒక్కసారిగా లాక్ అవ్వకుండా.. ఏబీఎస్ ద్వారా సెకనుకు పలుసార్లు బ్రేక్ వేస్తూ.. వదులుతూ ఉంటాయి. దీనివల్ల స్కిడ్ అయ్యే ప్రమాదం ఉండదు.

కనులపండువగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం


ఉత్సవాన్ని తిలకిస్తున్న మేయర్ విజయలక్ష్మి, మాజీ సీఎస్ శాంతికుమారి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి, కలెక్టర్ హరిచందన తదితరులు

అమీర్‌పేట, సంజీవరెడ్డినగర్: బల్కంపేటలోని రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు లక్షల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో బల్కంపేట పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఉదయం 11.51 గంటలకు అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయం వద్ద దేవాదాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే భక్తులు దేవస్థానం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లలో బారులుదీరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. సనత్‌నగర్, ఖైరతాబాద్, మేడ్చల్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, దానం నాగేందర్, మల్లారెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, సీపీఐ ఉపాధ్యక్షురాలు డా.కోట నీలిమ తదితరులు కల్యాణోత్సవాన్ని వీక్షించారు.

ప్రముఖుల హాజరు: ఈ వేడుకకు పలువురు అధికారులు, ప్రముఖులు హాజరయ్యారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, ఆర్‌జేసీ రామకృష్ణ, డీజీ సౌమ్యామిశ్రా, వికలాంగుల సంస్థ ఛైర్మన్ సత్యనారాయణ, జోగిని శ్యామల, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్‌రెడ్డి, కాట్రగడ్డ ప్రసూన తదితరులు హాజరయ్యారు.

క్రీడా పాఠశాలల్లో మార్పు వచ్చే వరకు ఆకస్మిక తనిఖీలు

శామీర్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా పాఠశాల అంటే ఎంతో ఊహించుకుని వచ్చే. ఇక్కడి వచ్చాక ఏమీ లేదని తెలిసిందని. మార్పులు వచ్చే వరకు ఆకస్మిక తనిఖీలు చేస్తానని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం హకీంపేట క్రీడా పాఠశాలలో ప్రారంభమైన రాష్ట్ర స్థాయి ఎంపికల ప్రక్రియను శాట్ ఛైర్మన్ శివసేనారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలాదేవితో కలిసి మంత్రి పరిశీలించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉద్యోగాల్లో క్రీడా కోటా కోసం చేర్పించొద్దని, దేశ కీర్తిప్రతిష్ఠలు పెంచేలా ఆటలపై మక్కువ కలిగించాలని సూచించారు. ఒలింపిక్ పతకం సాధిస్తే రూ.6 కోట్ల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు సీఎం ప్రకటించారని, ఆ దిశగా క్రీడా విధానం తెచ్చి సత్తా ఉన్న విద్యార్థులను సమాయత్తం చేయాలన్నారు. రాష్ట్రంలో 141 మంది శిక్షకులతో త్వరలోనే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి క్రీడా భవిష్యత్తుకు ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. ఎంపిక పోటీలను మంత్రి ఆసక్తిగా తిలకించి చిన్నారులకు సూచనలిచ్చారు. విద్యార్థుల డ్రెస్ కోడ్ మార్చాలని అధికారులను ఆదేశించారు. వంటశాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహాయాదవ్, హకీంపేట క్రీడాపాఠశాల డైరెక్టర్ పి.రవికుమార్, శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి శ్రీహరి

పవర్‌గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా దోమన్ యాదవ్



పద్మారావు నగర్, న్యూస్‌టుడే: పవర్ గ్రిడ్ సదరన్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టం-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దోమన్ యాదవ్ మంగళవారం కవాడిగూడలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన గుర్గావ్ పవర్‌గ్రిడ్ కార్పొరేట్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు.

టీకాతో వయోజనులకు మరింత భరోసా

నిమ్స్: టీకాతో వయోజనులకు మరింత భరోసా ఉంటుందని పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ ప్రొ. నగరి బీరప్ప అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగంలో వ్యాక్సినేషన్ క్లినిక్‌లో టీకాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డైరెక్టర్ స్వయంగా టీకా వేయించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. 'మనం నిత్యం తిరుగుతున్న ప్రదేశాల్లో ఉండే బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరం మీద దాడి చేసినపుడు రకరకాల ఇన్ఫెక్షన్లు వచ్చేప్రమాదం ఉంటుంది. హానికర సూక్ష్మక్రిముల నుంచి మన రోగనిరోధక వ్యవస్థ నిరంతరం పోరాడుతున్నా.. ఒక్కోసారి దాన్ని అధిగమిస్తాయి. అలాంటి సందర్భాల్లో టీకాలు వేసుకున్న వారు జబ్బుల బారినపడకుండా ఉంటారని' పేర్కొన్నారు. డీన్ రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతి వీర్, నెఫ్రాలజీ విభాగాధిపతి శ్రీభూషణ్‌రాజు, జనరల్ మెడిసిన్ వైద్యులు పాల్గొన్నారు.


టీకా తీసుకుంటున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప



పనులు వేగిరం స్పందనకు వందనం

'రహదారి సగమే మిగిలింది' శీర్షికతో గత నెల 25 ప్రచురించిన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. ఖైరతాబాద్ బడా గణేష్ నుంచి ఐమాక్స్ వరకు రహదారిని మూసేసి డ్రైనేజీ లైన్ల ఏర్పాటు పనులు వేగవంతం చేశారు. ఇవి పూర్తికాగానే సిమెంటు రోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు.

ఘనంగా ఆచార్య దొణప్ప శత జయంతి వేడుక

నారాయణగూడ: పరిశోధక ప్రపంచంలో రాకెట్‌లా దూసుకెళ్లిన తెలుగు విశ్వవిద్యాలయం తొలి ఉపాధ్యక్షుడు ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి మంగళవారం తెలుగు వర్సిటీలోని ఎన్టీఆర్ కళామందిరంలో ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఆచార్య శంకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకల వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు దొణప్ప చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం శతజయంతి ఉత్సవాల ప్రత్యేక సంచిక 'వ్యాసభారతి' గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దొణప్ప కొన్ని రచనలు ఇంకా ముద్రణ రూపం పొందనివి ఉన్నాయని ఆయన కుమారుడు సుధాకర్ 'శత జయంతి కమిటీ' దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని సంస్థానాధీశులు భాష, సంస్కృతి వికాసానికి చేసినసేవలన దొణప్ప 'ఆంధ్ర సంస్థానాలు సాహిత్య పోషణం' గ్రంథంలో వివరించారన్నారు. ఉత్సవ కమిటీ సంయుక్త కార్యదర్శి పగడాల చంద్రశేఖర్ స్వాగతం పలికారు. పలువురు ఆచార్యులు, సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.


'వ్యాసభారతి' ఆవిష్కరణలో వీసీ ఆచార్య నిత్యానందరావు తదితరులు

చినుకు పడితే చీకటే

ఈనాడు, హైదరాబాద్: చినుకు పడితే చాలు శివార్లలో చీకట్లు అలుముకుంటున్నాయి. గాలివానకు తరచూ విద్యుత్తు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ప్రధానంగా బాహ్యవలయ రహదారి చుట్టుపక్కల ప్రాంతాల్లో పునరుద్ధరణకు ఎక్కువ సమయం పడుతోంది. కొన్నిసార్లు రాత్రిళ్లు జాగారం చేయాల్సి వస్తోంది. సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు నగరంలో కురిసిన వర్షంతో నగరంలో 85కిపైగా ఫీడర్లలో బ్రేక్‌డౌన్లు తలెత్తాయి. వర్షంలోనే సిబ్బంది మరమ్మతులు చేపట్టినా.. కొన్ని ప్రాంతాల్లో మంగళవారం ఉదయం వరకు సరఫరా లేక ఇబ్బందిపడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. 15 వరకు ఫీడర్లలో ఉదయానికి మరమ్మతులు పూర్తిచేశారు. ఆయా ప్రాంతవాసులు రాత్రంతా కరెంటు లేక దోమలతో జాగారం చేశారు. పర్వత్‌నగర్‌లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు 12 గంటలపాటు సరఫరా నిలిచిపోయిందని ప్రశాంత్ రంజన్ ఎక్స్‌లో ఫిర్యాదు చేశారు. కేపీహెచ్‌బీ ఐదో ఫేజ్‌లో, సఫిల్‌గూడలోనూ 12 గంటలపాటు అంతరాయం ఏర్పడిందని వినియోగదారుడు ఫిర్యాదు చేశారు. గచ్చిబౌలి ప్రాంతంలో సమస్యలు ఎక్కువగా తలెత్తాయి. 8 గంటలపాటు కరెంటు లేదని ఆంజనేయనగర్ వాసి వాపోయారు.

జాప్యమెందుకు? వర్షాన్ని సైతం లెక్కచేయక సిబ్బంది, అధికారులు రాత్రింబవళ్లు పనిచేస్తుంటే.. మరికొన్ని ప్రాంతాల్లో కొందరు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది సరిపడా లేకపోవడం.. ఉన్నా స్తంభాలు ఎక్కేందుకు ముందుకు రాకపోవడం, ఒక్కో ఫీడర్ కిలోమీటర్ల పొడవు ఉండటంతో సమస్య ఎక్కడ తలెత్తిందో గుర్తించడంలో జాప్యం జరుగుతోంది. వినియోగదారుల ఫిర్యాదుల నేపథ్యంలో పరిస్థితిని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సమీక్షించారు. సరఫరా పునరుద్ధరించకుండానే కొందరు ఇంజినీర్లు పూర్తయినట్లు చెప్పడంతో సీఎండీ అసంతృప్తి వ్యక్తం చేశారు. మరమ్మతులు పూర్తయితే ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఎఫ్‌వోఎంఎస్)ను చూపించి ఇంకా ఎందుకు చాలాచోట్ల ఎరుపు మార్కు చూపిస్తుందని ప్రశ్నించారు. అప్రమత్తంగా ఉంటూ త్వరితగతిన పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఫెట్సియా అధ్యక్షుడిగా రాజమహేందర్‌రెడ్డి

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (ఫెట్సియా) నూతన కమిటీ మంగళవారం ఏర్పాటైంది. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా రాజమహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.శివసాంబిరెడ్డి, కె.ఎల్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ శంకర్, కోశాధికారిగా కె.హరీష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా గోకుల్ శ్రీధర్, పబ్బతి వెంకట రవికుమార్, ఎ.సాంబశివరావులు ఎన్నికయ్యారు. సభ్యులుగా 14 మంది ఎన్నికయ్యారు.

పీహెచ్‌డీకి 1,194 దరఖాస్తులు

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూలో పీహెచ్‌డీకి మొత్తం 1,194 దరఖాస్తులు వచ్చాయి. పార్ట్‌టైం, ఫుల్‌టైం, ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ విభాగాల్లో పీహెచ్‌డీ కోసం గత నెలలో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. పార్ట్‌టైం కోసం అత్యధికంగా 995 మంది దరఖాస్తు చేసుకోగా.. ఫుల్‌టైంకు 179.. ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ నుంచి 20 దరఖాస్తులు వచ్చాయి. వచ్చే నెలలో వీరికి ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ బి.బాలునాయక్ తెలిపారు.

నిమ్స్ ఎంహెచ్‌ఎం దరఖాస్తుల గడువు 10 వరకు

నిమ్స్, న్యూస్‌టుడే: పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రి ఎంహెచ్‌ఎం కోర్సులకు దరఖాస్తుల గడువు పొడిగించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ అర్హతతో రెండేళ్ల పాటు కోర్సుతో పాటు ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. 20 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని, ఈ కోర్సు పూర్తయితే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈనెల పదో తేదీ లోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. మరిన్ని వివరాలకు nims.edu.in వెబ్‌సైట్ లేదా 040 - 23489189 నంబర్‌లో సంప్రదించొచ్చని సూచించారు.

ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం


జేఎన్‌టీయూ ప్రవేశాల విభాగంలో విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఉద్యోగులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ ప్రవేశాల విభాగంలో మంగళవారం ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. మొదటిరోజు మొత్తం 900 మంది హాజరుకావాల్సి ఉండగా.. 778 మంది వచ్చారు. ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ బి.బాలునాయక్ పర్యవేక్షణలో ఉద్యోగులు విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించి రసీదులు ఇచ్చారు. కౌన్సెలింగ్ 8వ తేదీ వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

యువత అంతా కంప్యూటర్ విద్య, ఏఐ సాంకేతికత వైపు పరుగులు తీస్తోంటే... ఈ ఇద్దరమ్మాయిలూ సాగు విద్యలో చేరారు. ఉద్యాన రంగంలో భవిష్యత్తు కోసం కలలు కన్నారు. అనుకున్నది సాధించడానికి ఇష్టపడి చదివారు. ఆ శ్రమకు ఫలితంగానే జి. చైతన్య, అచ్యుత మోనికా శ్రీనాగిని బంగారు పతకాలు సాధించారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో రాష్ట్రగవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా వాటిని అందుకున్నారు.

ఉద్యాన కోర్సులో 'బంగారు' తల్లులు...

మొక్కల డాక్టర్ కావాలని...



– జి. చైతన్య

మాది వ్యవసాయ కుటుంబం కాదు. అయినా ఎంతో ఇష్టంగా ఉద్యాన కోర్సులో చేరాను. మేముండేది హైదరాబాద్‌లోని చందానగర్. నాన్న రమణారెడ్డి చిరుద్యోగి. అమ్మ పద్మ గృహిణి. ఇంట్లో ఇద్దరాడపిల్లల్నీ బాగా చదివించాలనుకున్నారు. పేదరికంలో ఉన్నా నా చదువుకోసం వారు ఎంతగానో కష్టపడ్డారు. నేను చిన్నప్పటి నుంచీ మెరిట్ స్టూడెంట్‌నే. ఇంటర్ తర్వాత డాక్టర్ కావాలనుకుని నీట్ పరీక్ష రాశా. ప్రైవేటు కళాశాలలో సీటు వచ్చింది. ఆర్థికస్థోమత లేకపోవడంతో మనుషుల డాక్టర్‌ను కాకపోయినా మొక్కల (ప్లాంట్) డాక్టర్‌ను కావాలనుకున్నా. ఇంట్లో ఒప్పించి తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ(హార్టీకల్చర్) కోర్సులో చేరా. ప్రణాళికాబద్ధంగా చదివి నాలుగు బంగారు పతకాలను సాధించా. విశ్వవిద్యాలయ చరిత్రలో నాలుగు పతకాలు సాధించిన మొదటి విద్యార్థిని నేనే కావడం గర్వంగా ఉంది. యూనివర్సిటీలో చేరాక... వ్యవసాయం, ఉద్యాన పంటలు, రైతుల జీవనస్థితిగతులపై అవగాహన ఏర్పడింది. ఈ రంగంలోనే శాస్త్రవేత్తగా ఎదుగుతా. అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలుస్తా. నూతన ఆవిష్కరణలు, పరిశోధనలపై దృష్టిసారిస్తా. నాలాంటి పేద విద్యార్థులు ఉద్యాన విద్యను అభ్యసించేందుకు సహకరిస్తా.

రైతుల కోసం...



– అచ్యుత మోనికా శ్రీనాగిని

తాడేపల్లిగూడెం సమీపంలోని ఆవపాడు మా స్వస్థలం. నాన్న కలికిమూర్తి, అమ్మ అనంతలక్ష్మి వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. చిన్నప్పటి నుంచీ వారితో పాటు పొలాల్లో తిరిగేదాన్ని. అన్నదాతల కష్టాలను దగ్గరగా చూడటంతో... ఎప్పటికైనా వాటిని దూరం చేయాలనుకున్నా. అందుకే, ఇంటర్ తర్వాత ఎంసెట్ రాసి ఏపీలోని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (హార్టీకల్చర్) కోర్సు పూర్తి చేశాను. ఈ డిగ్రీతోనూ ఉద్యోగాలు లభించే అవకాశం ఉన్నా... శాస్త్రవేత్త కావాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో పీజీ సీటు పొందాను. ఎమ్మెస్సీ పూర్తి చేయడంతో ఉద్యాన రంగంపై సంపూర్ణ అవగాహన కలిగింది. రెండు బంగారు పతకాలను సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. నేను నేర్చుకున్న జ్ఞానాన్ని మా నాన్న లాంటి రైతులకు అందించి, వారి అభ్యున్నతికి కృషి చేస్తా.

– ఆకారపు మల్లేశం, హైదరాబాద్

శుభాంగి... ఓ 'ఫైర్'



మహిళలకు సంప్రదాయ ఉద్యోగాలైతే మేలు అన్న పరిస్థితులు ఇప్పుడు మారిపోయాయి. అంతరిక్షం నుంచి అగ్నిమాపక దళం వరకూ అన్నింటా అమ్మాయిలు తమ ప్రతిభనూ, శక్తి సామర్థ్యాలనూ చాటుతున్నారు. అందుకు ఉదాహరణే **శుభాంగి ఘులే**. మహారాష్ట్రలోని పన్వేల్ మున్సిపల్ కార్పొరేషన్ (పీఎంసీ)లో ఫైర్ ఫైటర్‌గా పనిచేస్తున్నారామె. తాజాగా అమెరికాలోని అలబామాలో జరిగిన 21వ 'వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్'లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ప్రపంచ యవనికపై భారతదేశ ప్రతిష్ఠను, దేశ మహిళాశక్తిని చాటి చెప్పారు. 50కు పైగా దేశాల నుంచి వచ్చిన అగ్రస్థాయి పోలీస్, ఫైర్‌ఫైటింగ్ నిపుణులతో ఈ పోటీలు నిర్వహించారు. ఇందులో అత్యంత కఠినమైన 'అల్టిమేట్ ఫైర్ ఫైటింగ్ ఛాలెంజ్'లో మెరుగైన ప్రదర్శన చేశారు. అత్యవసర పరిస్థితులలో వేగం, శక్తి, వ్యూహాత్మక నైపుణ్యాలను ఇందులో లెక్కగడతారు. శుభాంగి ఉద్యోగంలో చేరిన ఏడాదిలోనే ప్రపంచస్థాయి పోటీల్లో పాల్గొనడం విశేషం.

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.

వసుంధర

vasundhara@eenadu.in



అందం ఖరీదు ప్రాణమా?

నలభైల్లోనూ ఇరవైలా కనిపించాలి... ముప్పైల్లోనూ టీనేజీ చర్మం కావాలి. ఇలానే కోరుకుంటున్నారంతా. వృద్ధాప్య ఛాయలు చుట్టుముట్టొద్దంటూ ఖర్చుకీ వెనకాడట్లేదు. ఆ చికిత్సల ప్రభావం మరణానికి దారితీస్తే? నటి షెఫాలీ జరీవాలా మరణం ఇప్పుడు అంతటా చర్చగా మారడానికి ఇదే కారణం. యవ్వనంగా కనిపించాలనే ప్రయత్నం... ప్రాణాలని హరించేవరకూ ఎందుకు తీసుకొస్తోంది.

ఒక ప్రముఖ సౌందర్య ఉత్పత్తుల సంస్థ 8 నగరాల్లో 800 మంది మహిళల మీద పరిశోధన చేసింది. దానిలో తేలిందేంటో తెలుసా? 90 శాతానికిపైగా దృష్టి పెట్టింది... యాంటీ ఏజింగ్ మీదే! వీరిలో 30-40 ఏళ్లలోపు వారే ఎక్కువ. చాలామంది 'ఇంకా ముందే మొదలు పెట్టాల్సింది. ఫలితాలు ఇంకా బాగుండే'వని చెప్పారట. ఇంకో అధ్యయనం ప్రకారం తెల్ల జుట్టు, ముఖమ్మీద గీతలు... అంతెందుకు చర్మం పొడిబారి, నిర్జీవంగా కనిపించినా వృద్ధాప్యఛాయలు వచ్చేస్తున్నాయని కంగారు పడుతున్నారట మహిళలు. వాటిని అదుపు చేయడానికి ఎంత ఖర్చుకైనా వెనకాడట్లేదట. ఈ జాబితాలో ఉన్నది ఎక్కువశాతం మిలీనియల్సే అంటున్నాయి రిసెర్చ్‌లు.

కారణాలు బోలెడు!

ఇంటర్నెట్ పుణ్యమాని పాశ్చాత్య ధోరణులు పరిచయమయ్యాయి. దీంతో సన్నగా, యవ్వనంగా కనిపిస్తేనే అందం, అలాంటి వారికే విలువన్న ధోరణి అలవాటైంది. దీనికి పోలికలూ తోడై అందంలో వెనకపడతామేమోనన్న కంగారు. అదే ఆత్మవిశ్వాసం అన్న నమ్మకం. కాబట్టే, ఫిల్లర్స్, స్కిన్ టైట్‌నింగ్, బొటాక్స్, పీల్స్, కొరియన్, స్కాల్ప్ ట్రీట్‌మెంట్లకు ఆదరణ పెరుగుతోంది. ఒకప్పుడు సమస్య ఏదైనా నిపుణులను కలిసేవాళ్లం. గ్లుటాథయాన్, విటమిన్ సి, రెటినాల్... ఇప్పుడు సమస్య ఏదైనా పరిష్కారం నోటి మీదే ఉంటోంది. ఈ జ్ఞానం చలవ మాత్రం సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లదే. 'ఫలానా ట్రీట్‌మెంట్‌తో అందంగా తయారయ్యా'మంటారు. ఇదంతా తెరమీద కనిపించేది. తెర వెనక మాటేంటి? ఇటీవల ఓ టీనేజీ అమ్మాయి సోషల్‌మీడియాలో చూసి, ఇంట్లో చెప్పకుండా ఓ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. సెన్సిటివ్ స్కిన్ కదా! ఆ కెమికల్స్‌కి ముఖం కాలినట్లుగా తయారైంది. అది చూసుకుని డిప్రెషన్‌కి గురయింది. వెతకాలే కానీ ఇలాంటి ఉదాహరణలు బోలెడు. బ్యూటీ ట్రీట్‌మెంట్లలోని రసాయనాలు పిగ్మెంటేషన్, ఇన్‌ఫెక్షన్లు, మచ్చలు పడటం... ఇలా ఎన్నో సమస్యలకు దారితీస్తున్నాయి. ఇవి పైపూతలకే పరిమితం కావడం లేదు. జెల్లీలు, ట్యాబ్లెట్లు, ఇంజెక్షన్లు, సెలైన్ల రూపంలోనూ అందాన్ని ఎక్కించుకుంటున్నారు. ఫలితం... అవి పడకపోతే అనారోగ్య సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత, పిల్లలు కలగకపోవడం వంటివెన్నో. వికటిస్తే మరణాలు.

మరేం చేయాలి?

ప్రతి ఒక్కరి చర్మతీరు ప్రత్యేకం. ఒకరికి పడినవి అందరికీ పడాలని లేదు. పైగా ఆన్‌లైన్‌లో చూపినవన్నీ నిజాలు అనుకోవడానికి లేదు. మేకప్, కెమెరా ఫిల్టర్ల మాయ ఉండొచ్చు. కాబట్టి, ఆ వలలో పడొద్దు. ఒక్కసారి మన అమ్మల్నీ, బామ్మల్నీ గుర్తు తెచ్చుకోండి. ముడతలు, గీతలు ఉంటేనేం... వాళ్లు అందంగా లేరా? వాళ్లపై మన ప్రేమ ఏమైనా తగ్గిందా? వయసు దాంతోపాటే తనదైన అందాన్ని మోసుకొస్తుంది. దాన్ని స్వీకరించాలంతే. యవ్వన చర్మమనే ఒత్తిడిలోపడి ఆరోగ్యం, డబ్బులూ గుల్ల చేసుకోవద్దు. కావాలంటే కొద్దిపాటి సంరక్షణ తీసుకోండి. మినిమల్ స్కిన్‌కేర్, తాజా ఆహారం, ఒత్తిడి లేని జీవితం, కంటి నిండా నిద్ర లోపల్నుంచీ అందాన్ని అందిస్తాయి. లేదూ సమస్య ఉందంటారా? నిపుణుల సలహా తీసుకోండి. అయితే వాళ్ల సర్టిఫికేషన్లు వగైరా గమనించుకోవాల్సిందే. అలాగే మీరు చేయించుకుంటోన్న ట్రీట్‌మెంట్, వాడుతున్న రసాయనాలకు ప్రపంచవ్యాప్తంగా ఆమోదం ఉందా అన్నదీ చూసుకోవాలి.

'బొటాక్స్, కృత్రిమ కాస్మెటిక్ ఫిల్లర్లొద్దు. జీవితం అందునా ఆరోగ్యకరంగా జీవించడం కావాలి. దీన్ని ప్రయత్నిద్దాం'... అంటూ పిలుపునిచ్చారు మల్లికా షెరావత్. 'అందం తరిగిపోతే ఐడెంటిటీ కోల్పోతామన్న భయంతో ఇలా పొరపాట్లు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మన జీవితం మనకు నచ్చినట్లుగా ఉండాలి. ఎవరో నిర్ణయించినట్లుగా కాదు. ఇది గుర్తుంచుకుంటే వయసుతోపాటు వచ్చే వృద్ధాప్యాన్ని ఆనందంగా ఆహ్వానించగలుగుతాం' అన్నారు నటి ఖుష్బూ. నిత్యం కెమెరా ముందు ఉండే వాళ్లే ఈ మాటలు అన్నప్పుడు మనమూ ఆలోచించాలిగా! కాబట్టి, వయసు దాస్తే సరిపోదు, మిమ్మల్ని మీరు అంగీకరించాలి... ఈ నిజాన్ని గ్రహిస్తే... ఆత్మవిశ్వాసమనే గొప్ప అందం మీ సొంతం.

ఈమెవరు?

రూ.1.8లక్షల కోట్లకు వారసురాలు!



'నేర్చుకోవడానికీ ఎదగడానికీ అవకాశాల్ని కల్పించే గొప్ప ప్రయాణమే నాయకత్వం. అద్భుతమైన బృందంతో నాకది సాధ్యమైంది. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఇంటర్నేషనల్ గురుగ్రామ్, ధారవ్ హైస్కూల్, మోడరన్ మాంటిస్సోరి ఇంటర్నేషనల్ చెయిన్ సంస్థల నిర్మాణంలో భాగమైన మా బృందాలన్నీ నాలో నిత్య స్ఫూర్తిని కలిగిస్తుంటాయి. ఇది నా అదృష్టం. అలాగే బాలల జీవితాల్ని తీర్చిదిద్దడంలో భాగం కావడం నాకు దక్కిన గొప్ప అవకాశం. దృఢమైన లక్ష్యం ఉన్న నాయకులెవరైనా గొప్ప బృందాల్నే కాదు, శాశ్వత వారసత్వాన్నీ నిర్మిస్తారని నేనెప్పుడూ గుర్తు చేసుకుంటాను' అంటారు కోలా కింగ్‌గా పేరొందిన రవి జయపురియా ముద్దుల కూతురు 38 ఏళ్ల దేవయాని జయపురియా... లక్షా ఎనభై వేల కోట్ల రూపాయల ఆస్తికి వారసురాలు. విద్య, ఆరోగ్యం, పానీయాలు, సామాజిక సంక్షేమం... ఇలా ఎన్నో రకాల వ్యాపారాలున్న ఆర్‌జే గ్రూప్ నిర్వహణలో సోదరుడు వరుణ్‌తోపాటు కీలక బాధ్యతలెన్నో నిర్వర్తిస్తున్నారీమె. డీపీఎస్ పూర్వ విద్యార్థిని అయిన ఈమె పేద విద్యార్థులకోసం ముస్కాన్ ఇనిషియేటివ్, ప్రవాహ్ స్కిల్ సెంటర్... వంటివి తన స్కూళ్లలో ఏర్పాటుచేశారు. అలియా, చంపాదేవి జయపురియా ఛారిటబుల్ ట్రస్ట్‌లకు ధర్మకర్త కూడా. దేవయాని ఇంటర్నేషనల్ ఈమె ప్రధాన వెంచర్. ఇందులో భాగంగా కేఎఫ్‌సీ, పిజా హట్, వాంగో, కోస్టా కాఫీ... వంటి ఫుడ్ చెయిన్లనీ నిర్వహిస్తోందీమె. స్టెమ్ సెల్ బ్యాంకింగ్, మెదాంతా, లెమన్ ట్రీ హోటల్స్... వంటి ప్రాజెక్టుల్లోనూ పెట్టుబడులున్నాయి ఈమెకు. అయినా మీడియా, సోషల్‌మీడియాలకి మాత్రం దూరంగా ఉంటూ తండ్రి వ్యాపార సామ్రాజ్యంలో కీలకపాత్ర పోషిస్తున్నారీమె!



అంగన్‌వాడీ కాదు... అంతకుమించి!

ఇండోర్‌లోని సేతీ నగర్ అది. అక్కడి ఆడవాళ్లు ప్రతి మంగళవారం స్థానిక అంగన్‌వాడీల దగ్గర సమావేశమవుతారు. అందులో ఆశ్చర్యమేముందీ... అంటారా! ఆశ్చర్యం లేదు కానీ ఈ సెంటర్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడకు ఆడవాళ్లు వచ్చేది పోషకాహారం తీసుకోవడానికో, పిల్లల బరువు చూసుకోవడానికో కాదు, అందరూ కలిసి ఆత్మీయంగా మాట్లాడుకోవడానికీ, ఒకరి సమస్యలు మరొకరికి చెప్పుకోవడానికీ, పరిష్కారాలు వెతుక్కోవడానికీ...

అవును మరి. కొత్తగా తల్లైన రాధకు ఎన్నో సందేహాలు. వాటన్నింటికీ ఆమెకు జవాబు ఇక్కడ దొరుకుతుంది. ఇంతకుముందు ఇతరుల ముందు మాట్లాడటానికే భయపడేది లక్ష్మి. కానీ, ఇప్పుడు ఆత్మవిశ్వాసంతో తన సమస్యల గురించి మాట్లాడగలుగుతోంది. కారణం... తన గొంతు వినిపించడానికి దీన్నే ఓ సురక్షిత స్థలం అనుకుంటోంది కాబట్టి. తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతోన్న పాపను వెంటనే న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్‌కు తీసుకెళ్లమని సూచించడంతో... ఆ పాప రెండు వారాల్లోనే కోలుకుని నడవటం ప్రారంభించింది. ఇది ఆ అమ్మకు ఓ కొత్త ఊపిరి. స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ గురించి సరైన సమయంలో సూచించటంతో ఓ బాలిక ఆర్థిక ఇబ్బందులు లేకుండా చదువుకుని ఇప్పుడు నీట్‌కు ప్రిపేర్ అవుతోంది. ఇది ఆ కుటుంబానికి ఓ పెద్దసాయం. ఇలా... ఆర్థిక ఒత్తిళ్లు, రుతుక్రమ సమస్యలు, గృహహింస... సమస్య ఏదైనా వాళ్లందరికీ చర్చించేందుకు ఈ సెంటర్ మంచి స్థావరంగా మారింది. మహిళలు సంఘటితంగా ఉంటే ఎలాంటి సమస్యనైనా, కష్టాన్నైనా ఎదుర్కోవచ్చనటానికి ఈ సెంటర్ ఓ ఉదాహరణ. కేవలం పాలసీలో ఉన్న కార్యక్రమాలే కాకుండా, ఇలా ఆడవాళ్లకు సపోర్ట్ చేసే ఓ వ్యవస్థలా మారటం... సరికొత్త మార్పునకు శ్రీకారం చుట్టినట్లే. ఈ ఛేంజ్ అంతటా వస్తే బావుంటుంది కదా!

సాఫ్ట్‌వేర్‌కు మారొచ్చా?

నా వయసు 25. నెట్‌వర్కింగ్ రంగంలో పనిచేస్తున్నా. నా భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆయనతో పోలిస్తే నా జీతం తక్కువ. పెరుగుతోన్న ఖర్చుల దృష్ట్యా నేనూ అటువైపు వెళ్లాలనుకుంటున్నా. ఈ రంగంలో రెండేళ్ల అనుభవం ఉంది. ఇప్పుడు కొత్త కెరియర్‌కు మారొచ్చా? అందుకు ఎలాంటి అర్హతలు ఉండాలి?

– ఓ సోదరి

కెరియర్లో ఏ దశలో ఉన్నా సరే... ఒక రంగం నుంచి మరో దానికి మారే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. అయితే, దాన్ని ముందే పక్కాగా ప్రణాళిక వేసుకోవాలి. నెట్‌వర్కింగ్ నుంచి సాఫ్ట్‌వేర్‌కు మారాలంటే... అందుకు సంబంధించిన సర్టిఫికేషన్ లేదా డిప్లొమా కోర్సులు వంటివి అవసరమవుతాయి. అంతకంటే ముందు మీ విద్యార్హతలు మీరు మారాలనుకుంటున్న కెరియర్‌కు సరిపోవాలి. ఒకవేళ మీకు అలాంటి క్వాలిఫికేషన్ లేకపోతే ఉద్యోగంలో ఉన్నప్పుడే అందుకు సంబంధించిన అర్హతలను సంపాదించుకోవాలి. ఎందుకంటే, సరైన ప్రణాళిక, సన్నాహాలు లేకుండా కెరియర్ మార్చుకోవటం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. మరో విషయం ఏంటంటే... మీకు ఇందుకు సంబంధించిన హార్డ్ స్కిల్స్ ఉన్నా సరే... ఈ ఉద్యోగంలో ఉన్నప్పుడే జాబ్ వెతుక్కోవటం ఉత్తమం. కాబట్టి, ఆచితూచి ముందడుగు వేయండి.

డియర్ వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

మీకు తెలుసా?

సాధారణంగా శిశువుల తల బరువు వాళ్ల శరీర బరువులో 25 శాతం ఉంటుందట. పెరిగేకొద్దీ ఆ శాతం తగ్గుతుందట.



పిరమిడ్ వాకింగ్ తెలుసా..!



శరీరానికి అనవసరపు శ్రమ ఇవ్వకుండా... అవసరమైన మేర క్యాలరీలు కరిగించేందుకు వాకింగ్ మంచి ఎంపిక. అయితే ఆరోగ్య సమస్యను బట్టి నడిచే విధానంలోనూ మార్పు ఉండాలంటున్నారు నిపుణులు. అందులో ఒకటే ఈ పిరమిడ్ వాకింగ్ పద్ధతి. ఇది తక్కువ-మధ్యస్థ తీవ్రతతో పనిచేసే వ్యాయామ శైలి. దీనికి 20 నిమిషాల సమయాన్ని కేటాయించాలి. ముందు 3-5 నిమిషాలు వార్మ్ అప్ కోసం కేటాయించి నెమ్మదిగా నడవాలి. ఇది మీ శరీర భాగాలు వాకింగ్‌కు అనుకూలంగా తయారయ్యేందుకు సహకరిస్తుంది. తర్వాత కొద్దికొద్దిగా వేగం పెంచాలి. అలా మీకు అనుకూలంగా సమయాన్ని విభజించుకుంటూ... వేగం పెంచుకుంటూ నడవాలి. చివరి ఐదు నిమిషాల్లో వేగాన్ని తగ్గిస్తూ యథాస్థితికి రావాలి. అంటే పిరమిడ్ ఆకారంలో సమయాన్ని పెంచుకుంటూ వెళ్లాలన్న మాట. ఇలా చేయడం వల్ల శరీర కదలికల్లో వచ్చే హెచ్చుతగ్గులకు అనుగుణంగా అంతర్గత అవయవాలూ పనిచేయడం మొదలుపెడతాయి. గుండె పనితీరు మెరుగుపడుతుంది. మిగతా నడక పద్ధతుల కంటే దీనిలో క్యాలరీలు ఎక్కువగా కరుగుతాయట. ముఖ్యంగా నడక ఆపాక కూడా కొద్దిసేపటి వరకు దీని ప్రభావం తగ్గదు. దాంతో మీ శరీరంలో ఉండే అదనపు కొవ్వు కరగడానికి ఇది మేలైన పద్ధతి అంటున్నారు నిపుణులు.

బంగారం - వెండి




1న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,00,420	90,600	1,09,696
విజయవాడ	96,795	90,200	1,08,900
ప్రొద్దుటూరు	97,300	89,520	1,07,000
రాజమహేంద్రవరం	98,400	90,200	1,20,000
విశాఖపట్నం	98,050	90,200	1,12,000
తమిళనాడు	-----	90,200	1,20,000

చెత్తను తాకక్కర్లేదు!


కొన్ని చిన్న వస్తువులుగానే కనిపిస్తాయి. కానీ, వాటి ప్రయోజనాలు మాత్రం బోలెడు. అలాంటి వంటింటి పరికరాలే ఇవి... మీరూ చూసేయండి.

స్మార్ట్ కిచెన్



తాకే పనిలేకుండా...

సింక్‌లో కూరగాయల వ్యర్థాల్లాంటివి పడిపోతుంటాయి. అయితే, అవి పైపు లోపలికి పోకుండా డ్రైనర్ ఉన్నప్పటికీ, వాటిని చేత్తోనే తీసేయాల్సి వస్తుంది. అలాకాకుండా, ఈ 'ఆటోమేటిక్ పుష్ బటన్ డ్రైనర్'ను తీసుకురండి. దీనికి ఉండే బటన్‌ను నొక్కితే చాలు... డ్రైనర్ అడుగున ఉండే మూత దానంతట అదే తెరచుకుని వ్యర్థాలు బయటకు వచ్చేస్తాయి. పని సులువవుతుంది.





జ్యూస్‌ల కోసం...



పండ్లరసాలు తాజాగా సిద్ధం చేసుకోవటానికి ఈ ఎలక్ట్రిక్ సిట్రస్ ప్రెస్ ఉపయోగపడుతుంది. దీన్లో నారింజ, ద్రాక్ష, బత్తాయి... లాంటి పండ్ల రసాలు ఈజీగా చేసుకోవచ్చు. ఇది గుజ్జుతో సహా జ్యూస్ చేసి ఆటోమేటిక్‌గా రెడీ చేసేస్తుంది. దీన్ని శుభ్రపరచుకోవటమూ తేలికే.






ఎప్పుడైనా సిద్ధంగా...

పిల్లలతో ప్రయాణించటం మామూలుగానే కష్టం. అలాంటిది పాలు తాగే పసి పిల్లలుంటే ఇంకా ఇబ్బంది. ఏ సమయంలోనైనా సరే వాళ్లకు వేడి వేడి పాలు తాగించాల్సి ఉంటుంది. అందుకు ఉపయోగపడుతుందీ బాటిల్ మిల్క్ హీటర్. లెదర్‌తో తయారుచేసిన పౌచ్ ఇది. దానికి అటాచ్ అయి ఓ డిజిటల్ డిస్‌ప్లే కూడా ఉంటుంది. దీన్లో ఉష్ణోగ్రతను సెట్ చేసుకునేందుకు ఐదు రకాల మోడ్‌లు అందుబాటులో ఉంటాయి. ఈ పౌచ్‌ను బాటిల్‌కు చుట్టేసి, దానికున్న అడాప్టర్ సాయంతో ఛార్జ్ చేస్తే సరి. పాలు వేడెక్కుతాయి.







బనకచర్లపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్, చిత్రంలో కొండా సురేఖ, జూపల్లి, వాకిటి శ్రీహరి, పొంగులేటి, పొన్నం, మహేశ్‌కుమార్‌గౌడ్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, వివేక్, శ్రీధర్‌బాబు, చిన్నారెడ్డి తదితరులు ◆ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్‌లు

తెలంగాణ రైతుకు.. కేసీఆర్ మరణశాసనం

(మొదటి పేజీ తరువాయి)

అబద్ధాలతో నీటి సెంటిమెంట్‌ను రగల్చడానికి ప్రయత్నిస్తున్నారని, అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు వాస్తవాలు వివరించాలన్నారు. ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై మంగళవారం ప్రజాభవన్‌లో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లకు అవగాహన కల్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

వారి ధనదాహాన్ని తీర్చుకోవడానికే కాళేశ్వరం

"కేసీఆర్ ధనదాహాన్ని తీర్చుకోవడానికి ప్రాణహిత-చేవెళ్ల పేరు, ఊరు మార్చడంతో పాటు అంచనా పెంచి కాళేశ్వరం చేపట్టారు. రూ.1.50 లక్షల కోట్ల ఈ ప్రాజెక్టులో రూ.లక్షా రెండువేల కోట్ల విలువైన పనిచేసి రూ.96,000 కోట్లు చెల్లించారు. ఇంత ఖర్చు చేసి 50 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లిచ్చారు. కృష్ణా, గోదావరి జలాలను ఏపీకి గతంలో తాకట్టు పెట్టిన కేసీఆర్, హరీశ్‌రావు. . ఆ రాచపుండునే ఇప్పుడు సమస్యగా సృష్టించాలని చూస్తున్నారు. భారాస పునరుజ్జీవానికి నీటి సెంటిమెంట్‌ను వాడుకోవడానికి చూస్తున్నారు. ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటుచేసి ఒకరోజు కృష్ణాపై, మరోరోజు గోదావరిపై చర్చిద్దాం రమ్మంటే భారాస ముందుకు రాలేదు. ఆపార్టీ నేతలది వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడ. నదీ జలాలను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లి దోషులుగా నిలబెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తోంది. ప్రధాని మోదీ ప్రభుత్వ మనుగడ చంద్రబాబుపై ఉంది. చంద్రబాబు ప్రభుత్వ మనుగడ గోదావరి ప్రాజెక్టులపై ఉంది. ఈ లెక్కలన్నీ ఒక్క రోజులోనో, ఒక ఏడాదిలోనో తేలేవి కావు. ఇవన్నీ ప్రజలకు వివరించాలి.

భాజపా సహాయ నిరాకరణ

గత 11 ఏళ్లుగా నీటి సమస్యలపై భాజపా ఏ నిర్లక్ష్యం చూపిందో ఇప్పుడూ అదే కొనసాగిస్తోంది. భారాసను బతికించడానికి భాజపా పరోక్షంగా సాయం చేస్తోంది. కాంగ్రెస్ నేతలంతా ఆపార్టీపైనే దృష్టి పెట్టాలి. కిషన్‌రెడ్డి మాట్లాడే ప్రతిమాట కేటీఆర్ కార్యాలయం నుంచి వచ్చిందేనని నేను చెబుతున్నా. మేం వెళ్లి కిషన్‌రెడ్డిని కలిసి తెలంగాణ సమస్యలను వివరిస్తే.. ఏ రోజూ మమ్మల్ని ఏ కేంద్ర మంత్రి వద్దకూ తీసుకెళ్లలేదు. నీటి సమస్యల పరిష్కారానికి ఇరురాష్ట్రాల మధ్య పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్ర ప్రభుత్వం పట్టనట్లు చూస్తోంది. ఏపీ నేతలు వారి రాష్ట్రానికి చెందిన సమస్యల గురించి కేంద్రంలో ప్రతి ఒక్కరినీ కలుస్తుంటే కిషన్‌రెడ్డి ఒక్క పనీ చేయకుండా సమస్యలు కొనసాగాలని చూస్తున్నారు. ఏపీ ప్రభుత్వం ముందుకొచ్చి తెలంగాణకు సహకరించాలి.

నాటి సీఎం ఇచ్చిన వివరాలతోనే..

2016లో జరిగిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో గోదావరి నుంచి సముద్రంలోకి 3000 టీఎంసీలు పోతున్నాయని కేసీఆర్ చెప్పారు. ఈ సమావేశం తర్వాత గోదావరి-పెన్నా అనుసంధానానికి డీపీఆర్ బాధ్యతను వాప్కోస్ సంస్థకు అప్పగిస్తూ చంద్రబాబు నిర్ణయం తీసుకొన్నారు. గోదావరి-పెన్నా మొదటి దశపై 2018లో మరో జీఓ ఇచ్చారు. అప్పుడు కేసీఆర్ ఇచ్చిన వివరాలతోనే గోదావరి జలాలను పెన్నాకు తరలించడానికి మొదటిదశ కింద వాప్కోస్‌తో ఏపీ ప్రభుత్వం సర్వే చేయిస్తే వారు 4 రకాల ఆప్షన్లు ఇచ్చారు. దీనిప్రకారం 400 టీఎంసీలను తరలించడానికి అవకాశం ఉందన్నారు. బనకచర్లలో 200 టీఎంసీలు ఎత్తిపోయడానికి ఇప్పుడు పంపులు పెడుతున్నా.. 300 టీఎంసీలు తీసుకెళ్లేలా విస్తరించడానికి ప్రణాళిక రూపొందించారు. మళ్లీ జగన్ సీఎం కాగానే నాటి ప్రగతి భవన్‌కు పిలిచి పెన్నానది వరకూ గోదావరి జలాలు తరలించవచ్చని కేసీఆర్ చెప్పారు. గోదావరిపై 968 టీఎంసీలను వాడుకోవడానికి మేం ప్రాజెక్టులు కట్టుకున్న తర్వాతే వరద, మిగులు జలాల లెక్కలు తేలతాయి. పోలవరం నుంచి మళ్లించే 80 టీఎంసీల నుంచి 45 టీఎంసీలు తెలంగాణకు ఇవ్వాలి. ఈ నీటిని, మైనర్ ఇరిగేషన్‌లో ఆదా అయిన నీటిని కలిపి పాలమూరు-రంగారెడ్డికి అనుమతి తెచ్చుకోవడానికి ఏపీ సహకరించాలి.

గోదావరిలో 968 టీఎంసీల వినియోగం తరవాతే..

గోదావరిలో తెలంగాణకు 968 టీఎంసీలు, ఏపీకి 518 టీఎంసీలని ఉమ్మడి రాష్ట్రంలోనే నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కానీ దీనికి తగ్గట్లుగా కేసీఆర్ నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను కూడా పూర్తి చేయలేకపోయారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే చంద్రబాబుకు ధైర్యం వచ్చిందని, బనకచర్ల ద్వారా నెల్లూరు వరకూ తీసుకెళుతున్నారని ఇది కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలుసని భారాస నేతలు అబద్ధాలు చెబుతున్నారు. తెలంగాణకు కేటాయించిన ప్రకారం 968 టీఎంసీలను, ఏపీలో కూడా 518 టీఎంసీల నికర జలాలను వినియోగించుకోవడానికి ప్రాజెక్టులు కట్టుకున్న తరవాత వరద, మిగులు జలాలు లెక్కతేల్చాలి. సమ్మక్క-సారక్కకు ఇప్పటివరకు.. నీటి కేటాయింపులు రాలేదు. శ్రీరాంసాగర్‌లో పూడికవల్ల 40 నుంచి 50 టీఎంసీల సామర్థ్యం తగ్గిపోయింది. వ్యక్తులు ఎవరెవరికైనా పరిచయం ఉండొచ్చు. అంతమాత్రాన తెలంగాణ రైతుల హక్కులు తాకట్టు పెడతామా? న్యాయపరమైన అంశాలపై కొట్లాడతాం. కేసీఆర్‌తో పంచాయితీ పెట్టుకోవడం కంటే తెలంగాణ నీటి హక్కులను ఎలా సాధించుకోవాలనే.. దానిపైనే ఈ సమావేశం ఏర్పాటుచేశాం. భాజపా రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న రామచందర్‌రావుకు శుభాకాంక్షలు చెబుతున్నా. మొదటి సమస్యగా గోదావరి నదీజలాల సమస్యను ప్రధాని దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయనను కోరుతున్నా.

నిర్మాణంలో ఉన్నవి పూర్తిచేస్తే పరిష్కారం దొరికేది

నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు భారాస పూర్తిచేస్తే మన సమస్యలకు పరిష్కారం దొరికేది. ఎపెక్స్ కమిటీ సమావేశంలో 2015లో గానీ, 2019లో గానీ కృష్ణాలో మన వాటా కోసం కేసీఆర్ ఎప్పుడూ వాదించలేదు. అసలైన నీటి హక్కులను కూడా ఏపీకి ధారాదత్తం చేశారు. కృష్ణానదిలో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల నికర జలాలుండేవి. ఈ జలాల పంపిణీలో విభజన సందర్భంగా వివాదాలు వస్తాయని నాటి ప్రధాని నదీ జలాల బోర్డులను ఏర్పాటుచేశారు. కొత్త ప్రాజెక్టులు నిర్మించాలంటే కూడా బోర్డు అనుమతి తీసుకోవాలన్నారు. ఉమ్మడి ఏపీకి సంబంధించిన 811 టీఎంసీల్లో 2015లో కేంద్రం నిర్వహించిన సమావేశంలో ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని హరీశ్‌రావు సంతకం చేశారు. కృష్ణానది పరీవాహక ప్రాంతం 68% తెలంగాణలో, 32% ఏపీలో ఉంది. ఈమేరకు 555 టీఎంసీలు తెలంగాణకు రావాలి. కానీ 2020లో జరిగిన కేఆర్ఎంబీ సమావేశంలో అడిగినా కూడా మళ్లీ భారాస ప్రభుత్వం 299 టీఎంసీలు చాలని చెప్పింది. ఇందులో ఏ ఏడాదైనా అత్యధికంగా వాడుకున్నది 221 టీఎంసీలు మాత్రమే. కొత్త ప్రాజెక్టులతో పాటు నిర్మాణంలో ఉన్న బీమా, నెట్టెంపాడు, పాలమూరు రంగారెడ్డి నీటి కేటాయింపులకు అనుమతులు తీసుకురాలేదు. దీనివల్ల 299 టీఎంసీలు కూడా వాడుకోలేదు. పెండింగ్ ప్రాజెక్టులతో పాటు 299 టీఎంసీలు పూర్తిగా వినియోగించుకునేలా కొత్త ప్రాజెక్టులు భారాస పాలనలో పూర్తిచేస్తే కృష్ణాలో 555 టీఎంసీల కోసం కొట్లాడే అవకాశం తెలంగాణకు ఉండేది" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

నదీ జలాల్లో వాటాలపై భారాస దగా

● ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్

ఈనాడు, హైదరాబాద్: పదేళ్ల భారాస పరిపాలనలో. . నదీజలాల్లో తెలంగాణ హక్కులకు తీవ్రమైన నష్టం వాటిల్లిందని, రాష్ట్రానికి కేసీఆర్ దగా చేశారని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. నాడు భారాస వదులుకున్న హక్కులను.. కాంగ్రెస్ ప్రభుత్వం పోరాడి తిరిగి సాధిస్తోందని పేర్కొన్నారు. ఒక్క చుక్కనీటిని కూడా వదులుకోవడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా లేదని పునరుద్ఘాటించారు. గోదావరి- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుతో రాష్ట్రానికి జరిగే అన్యాయంపై మంగళవారం ప్రజాభవన్‌లో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఉత్తమ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడారు.

తెలంగాణ అనుమతి లేకుండా బనకచర్ల ఎలా నిర్మిస్తారు

"రూ.81,500 కోట్లతో బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించింది. ఆ మేరకే కేంద్రానికి ఏపీ సీఎం చంద్రబాబు ప్రీ ఫీజిబిలిటీ నివేదిక ఇచ్చారు. పునర్విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల్లో ఎవరు ఏ కొత్త ప్రాజెక్టు నిర్మించినా పరస్పర అనుమతి తప్పనిసరి. విభజనచట్టం కింద పోలవరానికి ఏపీ ప్రభుత్వం జాతీయ హోదా సాధించింది. కేంద్ర నిధులతో చేపట్టిన ఈ ప్రాజెక్టును ఆమోదించిన దానికన్నా అధిక సామర్థ్యంతో నిర్మిస్తోంది. బనకచర్లకు తెలంగాణ అంగీకారం లేదు. ఇదే విషయాన్ని కేంద్రానికి తెలియజేశాం. పోలవరం ప్రాజెక్టు అథారిటీని కూడా అత్యవసర సమావేశం నిర్వహించాలని కోరాం. 75 శాతం నీటి లభ్యత ఆధారంగా ట్రైబ్యునల్ గోదావరి జలాల్లో 968 టీఎంసీలు తెలంగాణకు, 518 ఏపీకి ఇచ్చింది. ఈ వాటాల్లో మార్పు చేయడానికి వీల్లేదు. గోదావరి ట్రైబ్యునల్ అవార్డుకు కూడా బనకచర్ల వ్యతిరేకంగా ఉంది. ఈ విషయంపై సీఎం రేవంత్, నేను కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి విజ్ఞప్తి చేశాం. దీంతో ఆయన మే 28న రాష్ట్రానికి లేఖ రాశారు. ఆ మేరకు బనకచర్ల ప్రతిపాదనను తిరస్కరించారు.

ప్రతిపక్షాలది బాధ్యతారాహిత్యం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేపడుతున్న పకడ్బందీ ప్రణాళిక ద్వారా చట్టబద్ధంగా మన నీటి హక్కులు కాపాడుకోవడంతో పాటు గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను సరిచేస్తూ ముందుకు వెళ్తున్నాం. జలాల విషయంలో ప్రతిపక్ష పార్టీలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నాయి. భారాస అధికారంలో ఉన్నప్పుడే గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు ఏపీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. కృష్ణా జలాల విషయంలోనూ భారాస పాలకులు తీరని ద్రోహం చేశారు. ట్రైబ్యునల్ ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయిస్తే కేంద్రం వద్ద జరిగిన ఎపెక్స్ కౌన్సిల్‌లో ఏపీ 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలకు పదేళ్ల కాలానికి కేసీఆర్ అంగీకారం కుదుర్చుకుని వచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కృష్ణా నదిలో 70శాతం నీళ్లు తెలంగాణకు కావాలని డిమాండ్ చేశాం. పాత ఒప్పందాన్ని తెరిపించి కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట వాదనలు వినిపిస్తున్నాం. పంపకాలకు సంబంధించి ట్రైబ్యునల్ అవార్డును త్వరగా జారీ చేయాలని కోరాం. నదీజలాలపై భారాస ప్రభుత్వం నిర్లక్ష్యం, అసమర్థతలతో రాష్ట్ర హక్కులు ప్రమాదంలో పడ్డాయి. కృష్ణా పరీవాహకంలో పాలమూరు- రంగారెడ్డి, బీమా, కల్వకుర్తి, కోయిల్‌సాగర్, డిండి..; గోదావరిపై దేవాదుల, తుమ్మిడిహెట్టి, సమ్మక్క, సీతారామ తదితర ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. నీటిహక్కులు కూడా సాధించలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకనే కేంద్రంతో సమర్థంగా చర్చలు జరిపింది. దీంతో సీతారామ ఎత్తిపోతల పథకానికి, 67 టీఎంసీలకు హైడ్రాలజీ అనుమతులు వచ్చాయి. అయినప్పటికీ భారాస గోబెల్స్ ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీకి మూల స్తంభాలైన ప్రతినిధులు ఈ విషయాలన్నింటినీ విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని సూచించారు.

కేసీఆర్, జగన్ చర్చల అనంతరమే బనకచర్లపై నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: కేసీఆర్, జగన్‌ల మధ్య జరిగిన చర్చల అనంతరమే గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై నిర్ణయం జరిగిందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ పర్యటన సందర్భంగా, హైదరాబాద్‌లో, అసెంబ్లీలో నాడు కేసీఆర్ చేసిన వ్యాఖ్యలే దీనికి రుజువని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో ఆయన పలు వీడియోలు, పేపర్ క్లిప్పింగ్‌లను ప్రదర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు తదితరులు హాజరయ్యారు.

ఆయన సీఎంగా ఉన్నప్పుడే...

◆ "2016 సెప్టెంబరు 21న దిల్లీలో అప్పటి ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, కేసీఆర్ పాల్గొన్న సమావేశంలో నదీ జలాల తరలింపుపై నిర్ణయాలు జరిగాయి. 'కృష్ణా నదిపై రెండు రాష్ట్రాల్లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు వెయ్యి టీఎంసీలు అవసరం. గోదావరిలో మూడు వేల టీఎంసీలు వృథాగా సముద్రం పాలవుతున్నాయి. అందుబాటులో ఉన్న ఈ నీటిని ఎలా సమర్థంగా వినియోగించుకోవాలో నిర్ణయించుకోవాలి' అని సమావేశంలో కేసీఆర్ అన్నారు.

◆ కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు ప్రయత్నాలు జరిగాయి. 2018 జూన్ 13, సెప్టెంబరు 5 తేదీల్లో రాయలసీమకు గోదావరి జలాల తరలింపుపై ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.6 వేల కోట్లకు పరిపాలన అనుమతులు, పనులకు నిధులను మంజూరు చేసింది.

◆ 2019 జూన్ 29న హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో నాటి సీఎంలు కేసీఆర్, జగన్ సమావేశమయ్యారు. నదీ జలాలపై కేసీఆర్ ప్రజంటేషన్ ఇచ్చారు. గోదావరి నీటిని కృష్ణా, పెన్నా బేసిన్లకు మళ్లించడంపై వారి మధ్య ఆరు గంటలపాటు చర్చలు జరిగాయి. కృష్ణా, గోదావరి నదుల అనుసంధానంపై ఏకాభిప్రాయానికొచ్చారు" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

పోలవరం నుంచి 200 టీఎంసీల తరలింపునకే...

గోదావరి జలాలను కృష్ణా బేసిన్ మీదుగా పెన్నా బేసిన్‌కు తరలించేందుకు బనకచర్ల ప్రాజెక్టును ఏపీ చేపట్టిందని గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్య ప్రసాద్, అంతర్రాష్ట్ర జలవనరుల డీఈఈ వెంకట నారాయణ పేర్కొన్నారు. "200 టీఎంసీలను తరలించేందుకు గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదిస్తోంది. పోలవరం కుడి కాలువకు సమాంతరంగా 18 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ నిర్మించి కృష్ణాలో ప్రకాశం బ్యారేజీ ఎగువన కలుపుతారు. అక్కడి నుంచి పల్నాడు జిల్లాలో నిర్మించతలపెట్టిన బొల్లాపల్లి జలాశయానికి తరలిస్తారు. ఈ మార్గంలో ఆరు ఎత్తిపోతల పథకాలు ప్రతిపాదించారు. చివరగా నంద్యాల జిల్లాలో బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు కాలువను అనుసంధానం చేస్తారు. ఈ క్రాస్ రెగ్యులేటర్‌కు శ్రీశైలం కుడి కాలువ కూడా అనుసంధానమై ఉంటుంది. గోదావరి లేదా కృష్ణా జలాలను వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది'' అని వివరించారు.

సెటిల్‌మెంట్ అడ్డాలుగా పోలీసుస్టేషన్‌లు!

● సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకున్న పోలీసులపై చర్యలు తీసుకోండి

● రాచకొండ సీపీకి హైకోర్టు ఆదేశం



ఈనాడు, హైదరాబాద్: దర్యాప్తు పేరుతో సివిల్ వివాదాలను పరిష్కరించే సెటిల్‌మెంట్ అడ్డాలుగా పోలీస్‌స్టేషన్లు మారుతున్నాయని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. దర్యాప్తు చేయడాన్ని కోర్టులు అడ్డుకోవని, అయితే దర్యాప్తు పేరుతో సెటిల్‌మెంట్ అడ్డాలుగా మార్చడం సరికాదని స్పష్టం చేసింది. సివిల్ వివాదాల్లో పోలీస్ సిబ్బంది జోక్యం చేసుకోకుండా సమావేశాలు నిర్వహించాలని, జోక్యం చేసుకున్నవారిపై చర్యలు తీసుకుని ఇతరులకు సందేశం ఇవ్వాలని ఆన్‌లైన్ ద్వారా విచారణకు హాజరైన రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబుకు సూచించింది. పోలీసు విధులకు సంబంధించి మార్గదర్శకాలు (ఎస్ఓపీ) జారీచేసి వెబ్‌సైట్‌లో, పోలీసు స్టేషన్లలో ఉంచేలా చర్యలు తీసుకోవాలని డీజీపీకి సూచించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగోల్ బండ్లగూడలోని ఓ ఇంటి వివాదంలో పోలీసులు జోక్యం చేసుకుంటున్నారంటూ పి.సుదర్శన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రూ.55 లక్షలు చెల్లించి సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవాలని పిటిషనర్‌ను పోలీసులు బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని.. సివిల్ కోర్టు ఇంజంక్షన్ ఉత్తర్వులున్నా... ప్రతివాదులైన ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదుపై 19వ తేదీన పిటిషనర్‌ను పిలిపించి ఉదయం నుంచి రాత్రి వరకూ స్టేషన్‌లో ఉంచారని వివరించారు.

హోంశాఖ తరఫు న్యాయవాది మహేశ్‌రాజె వాదనలు వినిపిస్తూ... ఫిర్యాదుపై సెక్షన్ 35 కింద నోటీసులు జారీ చేశామన్నారు. దర్యాప్తులో భాగంగా స్టేషన్‌కు పిలిపించామన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి... నోటీసుల పేరుతో ఒక వ్యక్తిని రోజంతా నిర్బంధించే అధికారం లేదన్నారు. 19వ తేదీ ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకూ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీని సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను వచ్చేవారానికి వాయిదా వేశారు. కేసు విచారణకు నాగోలు సీఐ వ్యక్తిగతంగా హాజరయ్యారు.



మీ ఎదుగుదలపైనే దృష్టిపెట్టండి

మీకంటే మెరుగైన ఫలితాలు దక్కించుకుంటున్నవారిని చూసి ఆందోళన చెందకండి. నిన్నటి కంటే నేడు మీరు మెరుగ్గా పనిచేస్తున్నారా లేదా అనే విషయంపై మాత్రమే దృష్టి పెట్టండి. మీ ఎదుగుదలను, మీలో పెరుగుతున్న సానుకూల శక్తిని గుర్తిస్తూ ముందుకు సాగండి. - లెవిస్ హోవెస్, రచయిత

గురుకులాల్లో పర్యటనలపై క్యాలెండర్ రూపొందించాలి

● భట్టి విక్రమార్క ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో పర్యటన, సమీక్షలపై క్యాలెండర్‌ను రూపొందించాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంగళవారం సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి సంక్షేమ శాఖల అధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. "వసతి గృహాలు, గురుకులాల్లో ఏ అధికారి ఎప్పుడు పర్యటించారు, పరిశీలించిన అంశాలు తదితర వివరాలపై ఎప్పటికప్పుడు నివేదిక తయారు చేయాలి. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలను పర్యటనకు ఆహ్వానించాలి. వైద్యులు ఖరారు చేసిన మెనూను హాస్టళ్లు, గురుకులాల్లో కనిపించేలా బ్యానర్లు పెట్టాలి. వసతిగృహాల్లో దోమతెరలను ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వస్తే ఆన్‌లైన్‌లో ఉచితంగా వైద్య సేవలు అందించడానికి కార్పొరేట్ ఆసుపత్రులు సిద్ధంగా ఉన్నాయి. రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసి విద్యుత్ అవసరాలు తీర్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలి'' అని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

◆ రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి పుస్తకాలు, ఏకరూప దుస్తులు, షూ అందించాలని సంబంధిత శాఖ అధికారులను భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రజాభవన్‌లో మంగళవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'గురుకులాల్లో చివరి విద్యార్థి వరకు అన్ని వస్తువులు అందాలి. ఒక్కో సొసైటీ కార్యదర్శి పరిధిలో ఎన్ని పాఠశాలలు, గురుకులాలు ఉన్నాయి? ఎంత మంది విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, షూ అందించారు? తదితర వివరాలను లిఖితపూర్వకంగా బుధవారం అందించాలి' అని పేర్కొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. చిత్రంలో అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సందీప్‌కుమార్ సుల్తానియా

విద్యుత్ సిబ్బందికి ప్రత్యేక డ్రెస్‌కోడ్ ఉండాలి..

విద్యుత్ సిబ్బంది కోసం ప్రత్యేక డ్రెస్‌కోడ్‌ను ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. డిస్కం రూపొందించిన డ్రెస్‌లను ఆయన ప్రజాభవన్‌లో పరిశీలించి పలు సూచనలు చేశారు. "మెరుగైన సేవలకుగానూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) ఐఎస్‌వో 9000 సర్టిఫికెట్ పొందడం అభినందనీయం. విద్యుత్ సరఫరాలో ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి. సౌర విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాం'' అని తెలిపారు. సమావేశంలో విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్ పాల్గొన్నారు.

భారాస దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

● మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుపై భారాస దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రజాభవన్‌లో బనకచర్ల ప్రాజెక్టుపై జరిగిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. 'భారాస హయాంలోనే ఏపీ ప్రభుత్వం బనకచర్ల నిర్మాణం మొదలుపెట్టింది. అప్పటి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒప్పందం చేసుకున్నారు. నాడు దీనికి సంబంధించి కేసీఆర్, హరీశ్‌రావుల సంతకాలు చేయడం తెలంగాణకు శాపంగా మారింది. రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే బనకచర్లను వ్యతిరేకిస్తూ వస్తున్నాం. సీఎం, మంత్రులు ప్రధాని మోదీని, కేంద్ర మంత్రులను పలుమార్లు కలిసి బనకచర్లపై అభ్యంతరం వ్యక్తం చేశారు. భారాస హయాంలో జరిగిన తప్పు బయటపడుతుందనే ఆ పార్టీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారు. అందుకే.. తెలంగాణ ప్రభుత్వం లొంగిపోయిందని.. నీటి పంచాయితీని తెరపైకి తెచ్చి సెంటిమెంట్‌ను రగిల్చి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. ఆ పార్టీ సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ఈ దుష్ప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు సమర్థంగా తిప్పికొట్టాలి' అని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

ఎపెక్స్ కౌన్సిల్ ఏర్పాటుకు ఎందుకు డిమాండ్ చేయరు?: హరీశ్‌రావు



ఈనాడు, హైదరాబాద్: గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో చెప్పిన అబద్ధాలనే మళ్లీ ప్రచారం చేస్తున్నారని భారాస సీనియర్ నేత హరీశ్‌రావు విమర్శించారు. పదే పదే అవాస్తవాలు చెబుతున్న సీఎం.. ఎపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ఎందుకు డిమాండ్ చేయడం లేదని ధ్వజమెత్తారు. చంద్రబాబు పట్ల రేవంత్ చూపుతున్న గురుభక్తికి ఇది నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై మంగళవారం హరీశ్‌రావు ఒక ప్రకటనలో స్పందించారు. 'ఏపీ నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో మొదట మాట్లాడింది భారాస. ప్రాజెక్టు పర్యావరణ అనుమతుల తిరస్కరించే వరకు అలుపెరుగని పోరాటం చేశాం. గోదావరిలో 1000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు చాలని చెప్పిన రేవంత్.. మిగులు జలాల్లోనూ తెలంగాణకు వాటా ఉంటుందని అవగాహన కల్పించింది మా పార్టీనే. భారాస పాలనలో ప్రస్తావనే రాని బనకచర్ల ప్రాజెక్టు..ఇప్పుడు ఎవరి అండ చూసుకుని ముందుకు వస్తుందో రేవంత్ చెప్పాలి' అని వ్యాఖ్యానించారు.

కేసీఆర్‌ను దోషిగా నిలిపే యత్నాలు సఫలం కావు

బనకచర్ల ప్రాజెక్టు విషయంలో భారాస అధినేత కేసీఆర్‌ను దోషిగా నిలబెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి సఫలం కావని భారాస నేతలు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇచ్చిన పీపీటీలో కేసీఆర్‌ను తిట్టాలి.. చంద్రబాబును కాపాడాలనే ఆత్రుత తప్ప ఐకమత్యం కనిపించలేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కె.సంజయ్, కౌశిక్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ తదితరులు మంగళవారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 'బనకచర్లపై యుద్ధం ప్రకటిస్తారనుకున్నాం. కానీ అలాంటిదేమీ జరగలేదు. కేసీఆర్ గోదావరి జలాలు వాడుకోమంటే..బనకచర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లా? దీనిపై వచ్చే సోమవారమే అసెంబ్లీ సమావేశాలు పెట్టాలి. భారాస తరఫున హరీశ్‌రావు పీపీటీ ఇస్తారు' అని పేర్కొన్నారు.

'రామచందర్‌రావువి అవగాహనలేని వ్యాఖ్యలు'

భారాసను ప్రజలు మరిచిపోయారని భాజపా రాష్ట్ర కొత్త అధ్యక్షుడు రాంచందర్‌రావు వ్యాఖ్యానించడం ఆయన అవగాహన లేమికి నిదర్శనమని శాసనమండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి విమర్శించారు. ఆయనొక జాక్‌పాట్ అధ్యక్షుడని, అధ్యక్ష బాధ్యతలు స్వీకరించగానే రాజాసింగ్ రాజీనామా చేశారని ఎద్దేవాచేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. "భాజపా ఎప్పుడూ మూడోస్థానం కోసం పోటీ పడాల్సిందే. కాంగ్రెస్ విషయంలో భాజపా ద్వంద్వ వైఖరి అవలంబిస్తోంది'' అని పేర్కొన్నారు.

రూ.121.92 కోట్లతో జూరాల అదనపు వంతెన..

● పాలనా అనుమతుల ఉత్తర్వులు జారీ

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల జలాశయం దిగువన వంతెన నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇటీవల జూరాల గేట్ల సమస్యపై పరిశీలనకు వచ్చిన నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్థానిక నాయకులు సమస్యను వివరించడంతో వంతెన మంజూరు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.121.92 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణానికి పరిపాలనా అనుమతులు ఇస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న జూరాల డ్యాం వంతెనకు 10 టన్నుల బరువున్న వాహనాలు తిరిగే సామర్థ్యమే ఉంది. కానీ, గత్యంతరం లేక 40 టన్నుల వాహనాల రాకపోకలకూ అనుమతి ఇస్తున్నారు. దీంతో క్రస్ట్‌గేట్ల బేరింగ్ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందని.. అదనపు వంతెన తప్పనిసరని 2021లోనే నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చింది.

రాయచోటిలో చిక్కిన ఇద్దరు ఉగ్రవాదులు!

● అడ్వాణీ రథయాత్రలో బాంబు పేలుళ్ల కుట్ర కేసుల్లో నిందితులు

న్యూస్‌టుడే, రాయచోటి: ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధం ఉన్న ఇద్దరు నిందితులను అన్నమయ్య జిల్లా రాయచోటిలో చెన్నై ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. భాజపా అగ్రనేత ఎల్‌కే అడ్వాణీ తమిళనాడు మదురైలో 2011లో రథయాత్ర చేశారు. ఆ సందర్భంగా బాంబు పేలుళ్లకు కుట్రపన్నిన కేసులో తమిళనాడుకు చెందిన వరుసకు సోదరులైన అబూబక్కర్ సిద్దిఖీ, మొహమ్మద్ అలీ ప్రధాన నిందితులుగా ఉన్నారు. ఇతర బాంబు పేలుళ్ల కేసుల్లోనూ వీరిద్దరూ నిందితులుగా ఉన్నారు. ఆయా ఘటనల తర్వాత రాయచోటికి వచ్చారు. పేర్లు మార్చుకుని గత ముప్పై ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. స్థానికంగా వస్త్ర వ్యాపారం చేసుకుంటూ ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇద్దరు ఉగ్రవాదులు రాయచోటిలో ఉన్నారనే నిఘా వర్గాల సమాచారంతో చెన్నై ఐబీ అధికారులు ఈ ప్రాంతంలో మకాం వేశారు. రెండు నెలలుగా మారువేషాల్లో తిరుగుతూ అనుమానితులపై నిఘా పెట్టి అరెస్టు చేశారు.

ద.మ.రైల్వే ఇన్‌ఛార్జి జీఎంగా సందీప్ మాథుర్



ఈనాడు, హైదరాబాద్: ద.మ.రైల్వే ఇన్‌ఛార్జి జీఎంగా సందీప్ మాథుర్ మంగళవారం రైల్ నిలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఏపీలో కొత్తగా ఏర్పడ్డ దక్షిణ కోస్తా రైల్వేకు జీఎంగా వ్యవహరిస్తున్న మాథుర్‌కు అరుణ్‌కుమార్ జైన్ పదవీ విరమణతో ద.మ.రైల్వేకు అదనపు బాధ్యతల్ని రైల్వేబోర్డు అప్పగించింది.



తిరుమలలో అటవీప్రాంతం నుంచి ఇనుప కంచెను దాటుకుని వచ్చిన చిరుత మంగళవారం సాయంత్రం అన్నమయ్య భవనం వెనుక గేటు పైకెక్కి కూర్చుంది. సిబ్బంది సైరన్లు మోగించడంతో తిరిగి అడవిలోకి వెళ్లిపోయింది. -న్యూస్‌టుడే, తిరుమల

వాన్‌పిక్ వ్యవహారంలో కోర్టు ధిక్కరణ పిటిషన్: తీర్పు వాయిదా

ఈనాడు, హైదరాబాద్: వాన్‌పిక్ వ్యవహారంలో యూఏఈ కోర్టు ఉత్తర్వుల అమలుకు సంబంధించి హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టుకు ఇచ్చిన హామీని ఉల్లంఘించారంటూ ఐక్వెస్ట్, పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్ తదితరులపై రాకియా (రస్ అల్ ఖైమా ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ) హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆస్తుల బదలాయింపునకు సంబంధించి కింది కోర్టులో ఎలాంటి లావాదేవీలు నిర్వహించబోమని హామీ ఇచ్చిన ఐక్వెస్ట్ కంపెనీ ఆ హామీని ఉల్లంఘించిందని తెలిపారు. నిమ్మగడ్డ ప్రసాద్, ఐక్వెస్ట్ తరఫున సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. రాకియా వారి దేశానికి చెందిన కోర్టు నుంచి ఏకపక్షంగా ఉత్తర్వులు తెచ్చుకుందన్నారు. కింది కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించలేదని పేర్కొన్నారు. న్యాయమూర్తి తీర్పును వాయిదా వేశారు.

ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్ ఆడిన టెస్టులు. ఏడు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఒక టెస్టును డ్రా ముగించింది.


8

మధ్యాహ్నం 3.30 నుంచి



గంభీర్, గిల్

తొలి టెస్టులో చాలా వరకు ఆధిపత్యాన్ని ప్రదర్శించినా చివరికి అనూహ్యంగా ఓటమి చవిచూసిన టీమ్‌ఇండియా.. ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. బజ్‌బాల్ ఆటతో సిరీస్‌లో ఆధిక్యం సంపాదించిన ఇంగ్లాండ్.. జోరు కొనసాగించాలనే ఉత్సాహంతో ఉంది. ఈ నేపథ్యంలో అండర్సన్-తెందుల్కర్ సిరీస్‌లో మరో కీలక సమరానికి రంగం సిద్ధమైంది. నేటి నుంచే ఎడ్జ్‌బాస్టన్‌లో రెండో టెస్టు. ఇంగ్లాండ్ ఇప్పటికే తుది జట్టును ప్రకటిస్తే.. ఒక స్పిన్నర్‌తో సరిపెట్టుకోవాలా లేదా ఇద్దరు స్పిన్నర్లను ఆడించాలా అనే సందిగ్ధతలో టీమ్‌ఇండియా ఉంది. బుమ్రా ఈ మ్యాచ్‌లో ఆడే అవకాశముంది. మరి భారత్ పుంజుకోగలదా? ఇంగ్లాండ్‌ను అడ్డుకోగలదా?


సుందర్

పుంజుకుంటారా?

నేటి నుంచే ఇంగ్లాండ్‌తో భారత్ రెండో టెస్టు ● బుమ్రాపై అనిశ్చితి

ఎడ్జ్‌బాస్టన్

లీడ్స్‌లో చక్కని అవకాశాన్ని చేజార్చుకున్న టీమ్‌ఇండియా.. సిరీస్ సమం చేయాలనే లక్ష్యంతో ఇంకో పోరుకు సన్నద్ధమైంది. బుధవారం నుంచే ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు. ఇక్కడ కూడా పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుందన్న అంచనాల నేపథ్యంలో.. బజ్‌బాల్ శైలితో దూసుకుపోతున్న ఇంగ్లాండ్‌ను ఎదుర్కోవడం శుభ్‌మన్ గిల్ బృందానికి సవాలే. లోయర్ ఆర్డర్, బౌలర్ల వైఫల్యం తొలి టెస్టులో భారత్‌ను దెబ్బతీసిన సంగతి తెలిసిందే. అవకాశాలు సృష్టించుకున్నా.. ఆ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా భంగపడింది. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ బలమైన స్థితిలో నిలిచినా.. అనుకున్న దానికన్నా తక్కువ స్కోరుతో సరిపెట్టుకుంది. లేదంటే ఫలితం భిన్నంగా ఉండేదే. 371 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా.. ఆతిథ్య జట్టును భారత్ నిలువరించలేకపోయింది. ఇప్పుడు కలిసిరాని ఎడ్జ్‌బాస్టన్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి.

ఇద్దరు స్పిన్నర్లతో?: తొలి టెస్టులో ఓడినప్పటికీ టీమ్‌ఇండియా బ్యాటింగ్ విభాగం బలంగానే కనిపిస్తోంది. ఆ మ్యాచ్‌లో మన బ్యాటర్లు అయిదు సెంచరీలు చేశారు. రాహుల్, జైస్వాల్, గిల్ తలో శతకం సాధిస్తే.. సూపర్ ఫామ్‌ను ప్రదర్శిస్తూ పంత్ రెండు సెంచరీలు కొట్టాడు. ఫామ్‌లో ఉన్న వీళ్లు మరోసారి రాణిస్తే భారత్‌కు తిరుగుండదు. కానీ సాయి సుదర్శన్ అరంగేట్రం, కరుణ్ నాయర్ పునరాగమనం మాత్రం నిరాశపరిచాయి. అయినా వీళ్లకు మరో అవకాశం దక్కడం ఖాయం. ఈ బ్యాటర్లు ఈసారైనా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జట్టు ఆశిస్తోంది. అయితే బ్యాటింగ్ బాగానే కనిపిస్తున్నా.. లోయర్ ఆర్డర్ నుంచి కనీస తోడ్పాటు లేకపోవడమే ఆందోళన కలిగిస్తోంది. ఆల్‌రౌండర్లు, టెయిలెండర్ల వైఫల్యం లీడ్స్‌లో భారత్ ఓటమికి ప్రధాన కారణాల్లో ఒకటి. తొలి ఇన్నింగ్స్‌లో 41 పరుగులకే చివరి ఏడు వికెట్లు చేజార్చుకున్న ఆ జట్టు.. రెండో ఇన్నింగ్స్‌లో 31 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. జడేజా, శార్దూల్ నిరాశపరిచారు. భారత్ ఈ లోయర్ ఆర్డర్ సమస్యను పరిష్కరించుకోకపోతే ఇబ్బందులు తప్పవు.

ఇండియా VS ఇంగ్లాండ్

మధ్యాహ్నం 2:30 గంటలకు

SONY SPORTS 1 ENGLISH | SONY SPORTS 4 TELUGU | SONY SPORTS 5 ENGLISH

అలాగే బౌలింగ్‌లోనూ గణనీయంగా మెరుగుపడాల్సివుంది. 20 వికెట్లు పడగొట్టడానికే తమ తొలి ప్రాధాన్యత అని లీడ్స్‌లో ఓటమి తర్వాత కోచ్ గంభీర్ పునరుద్ఘాటించాడు. అది సాధ్యం కావాలంటే బౌలర్లు గొప్పగా పుంజుకోవాలి. తొలి ఇన్నింగ్స్‌లో బుమ్రా అయిదు వికెట్ల ఘనత మినహా లీడ్స్‌లో భారత బౌలర్ల ప్రదర్శన నిరాశాజనకం. ముఖ్యంగా 371 పరుగుల లక్ష్యాన్ని కూడా కాపాడలేకపోవడం ఇప్పటికీ వెంటాడుతోంది. ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్, శార్దూల్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. ఈ మ్యాచ్‌కు కూర్పు భారత జట్టు మేనేజ్‌మెంట్‌కు పెద్ద సవాలుగా మారింది. ఇద్దరు స్పిన్నర్లను తీసుకోవాలా లేదా ఒక్కరితోనే దిగాలా అన్నది సందిగ్ధత. ఇద్దరిని తీసుకునే అవకాశాలు మెండు. అప్పుడు రెండో స్పిన్నర్‌గా కుల్‌దీప్, సుందర్‌లలో ఎవరిని ఆడిస్తారన్నది ఆసక్తికరం. శార్దూల్‌ను పక్కన పెట్టడం ఖాయం. ఇక ప్రధాన పేసర్ బుమ్రా పూర్తి ఫిట్‌నెస్‌తో సెలక్షన్‌కు అందుబాటులో ఉన్నాడని కెప్టెన్ గిల్ చెప్పాడు. కానీ అతడు తుది జట్టులో ఉంటాడా లేదా అన్న విషయంలో మాత్రం స్పష్టత లేదు. ఒకవేళ బుమ్రా లేకపోతే ఎడమచేతివాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అరంగేట్రం చేయొచ్చు. భారత జట్టు ఫీల్డింగ్ కూడా మెరుగుపడడం చాలా అవసరం.



రాహుల్ అర్ష్‌దీప్

పిచ్ ఎలా ఉందంటే..

ఎడ్జ్‌బాస్టన్‌లో పిచ్ ఆరంభంలో పేసర్లకు సహకరించే అవకాశముంది. క్రమంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. ఆఖరి రెండు రోజుల్లో స్పిన్నర్లకు తోడ్పాటు లభించవచ్చు. టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకోవడం ఖాయం. ఇక్కడ గత నాలుగు టెస్టుల్లోనూ రెండోసారి బ్యాటింగ్ చేసిన జట్టే నెగ్గింది. మ్యాచ్‌కు వర్షం వల్ల అంతరాయం కలిగే అవకాశముంది. ముఖ్యంగా నాలుగు, అయిదు రోజుల్లో వాన ముప్పు ఎక్కువగా ఉంది.


తుది జట్లు

భారత్ (అంచనా): యశస్వి జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, గిల్, పంత్, కరుణ్ నాయర్, జడేజా, వాషింగ్టన్ సుందర్/కుల్‌దీప్, బుమ్రా/అర్ష్‌దీప్, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ

ఇంగ్లాండ్: క్రాలీ, డకెట్, ఒలీ పోప్, రూట్, బ్రూక్, స్టోక్స్, స్మిత్, వోక్స్, కార్స్, జోష్ టంగ్, బషీర్.

బలంగా ఇంగ్లాండ్: ఇంగ్లాండ్ రెట్టించిన ఉత్సాహంతో ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగుతోంది. జోరు కొనసాగిస్తూ ఆధిక్యాన్ని 2-0కు పెంచుకోవాలనుకుంటోంది. ధీమాగా ఉన్న ఆ జట్టు ఎప్పుడో తుది జట్టును ప్రకటించింది. మొదటి మ్యాచ్‌లో ఆడిన జట్టులో ఇంగ్లాండ్ ఎలాంటి మార్పులు చేయలేదు. లీడ్స్‌లో బజ్‌బాల్ ఆటతో అదరగొట్టిన ఇంగ్లాండ్.. మరోసారి ఆ ప్రదర్శనను పునరావృతం చేయాలనుకుంటోంది. పిచ్ కూడా వాళ్ల బ్యాటింగ్‌కు సరిపోయేలా ఉంది. క్రాలీ, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్టోక్స్‌తో ఆ జట్టు లైనప్ బలంగా కనిపిస్తోంది. ఇంగ్లాండ్ టాప్-5 బ్యాటర్లలో ప్రతి ఒక్కరూ తొలి టెస్టులో కనీసం అర్ధ శతకం చేయడం ఇంగ్లాండ్ విశ్వాసాన్ని మరింత పెంచే విషయమే. వికెట్‌కీపర్ జామీ స్మిత్ కూడా రెండు ఇన్నింగ్స్‌ల్లో రాణించాడు. సిరీస్ ఆరంభానికి ముందు అనుభవం లేని ఇంగ్లాండ్ బౌలింగ్ విభాగంపై అనేక సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ వాళ్లు లీడ్స్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ భారత్‌ను ఆలౌట్ చేయగలిగారు. అయితే అక్కడ ఆకట్టుకోలేకపోయిన వోక్స్.. ఇప్పుడు సొంత మైదానంలో విజృంభిస్తాడని ఇంగ్లాండ్ ఆశిస్తోంది. గత మ్యాచ్‌లో ఫర్వాలేదనిపించిన కార్స్, జోష్ టంగ్ మరింతగా రాణించేందుకు సిద్ధమవుతున్నారు.

బుమ్రా.. వారి సమస్య



స్టోక్స్

బర్మింగ్‌హామ్: రెండో టెస్టులో బుమ్రా ఆడతాడా లేదా అనేది భారత్‌కు సంబంధించిన విషయమని... ఎవరున్నా లేకపోయినా తాము పూర్తి స్థాయిలో ఆడి గెలిచేందుకు ప్రయత్నిస్తామని ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అన్నాడు. "బుమ్రాను ఆడించాలా లేదా అనేది భారత్ సమస్య. అది వారే పరిష్కరించుకుంటారు. టీమ్‌ఇండియా మెరుగైన జట్టు. చివరిదాకా పోరాడుతుంది. అంతర్జాతీయ క్రికెట్ ఆడే ప్రతి జట్టుకు ఎంతో ఒత్తిడి ఉంటుంది. భారత్‌కు ఆ ఒత్తిడి ఇంకా ఎక్కువ. అందుకే తొలి టెస్టులో ఓడినా.. టీమ్‌ఇండియాను తక్కువ అంచనా వేయట్లేదు. సిరీస్‌ను మళ్లీ 0-0తోనే తాజాగా మొదలుపెడతాం" అని స్టోక్స్ తెలిపాడు. భారత వికెట్‌కీపర్ రిషబ్ పంత్‌కు తాను పెద్ద అభిమానినని స్టోక్స్ చెప్పాడు. "పంత్ ప్రత్యర్థి జట్టు ఆటగాడైనప్పటికీ.. అతడి ఆటని ఇష్టపడతాను. అన్ని ఫార్మాట్లలో ఒకే శైలి బ్యాటింగ్‌తో పంత్ ఆడే తీరు ముచ్చటగా ఉంటుంది. అతడి లాంటి ప్లేయర్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తే ఎలా ఉంటుందో లీడ్స్‌లో జరిగిన తొలి టెస్టులో చూశాం. ఒక మ్యాచ్‌లో రెండు సెంచరీలు చేయడం అంత తేలికేం కాదు. అతడు ధాటిగా ఆడుతుంటే ఏదో సమయంలో ఔట్ చేసే అవకాశం దొరుకుతుందేమోనని చూశాం. పంత్ చాలా ప్రమాదకరమైన బ్యాటర్" అని ఇంగ్లాండ్ కెప్టెన్ అన్నాడు.

రాజస్థాన్ నుంచి సంజు బయటికి?

దిల్లీ: 2026 ఐపీఎల్ సీజన్ కోసం రాజస్థాన్ రాయల్స్ తమ జట్టును ప్రక్షాళన చేసుకునే దిశగా అడుగులేస్తున్నట్లు సమాచారం. వేలానికి ముందు కొనుగోళ్లు, అమ్మకాల్లో భాగంగా రాజస్థాన్ జట్టు నుంచి కనీసం ఆరుగురు ఆటగాళ్లు వేరే ఫ్రాంఛైజీలకు వెళ్లబోతున్నట్లు తెలుస్తోంది. ఈ ఆటగాళ్ల వివరాలను రాజస్థాన్ ఇప్పటి వరకు బయటపెట్టకపోయినా.. కెప్టెన్, వికెట్‌కీపర్ సంజు శాంసన్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. రాజస్థాన్ జట్టుకు సంజు గుడ్‌బై చెప్పే విషయంలో పరస్పరం అంగీకారం కుదిరిందా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. ఈ సీజన్లో కోచ్, ఫ్రాంఛైజీ యాజమాన్యంతో సంజుకు పొసగట్లేదని వార్తలు వచ్చాయి. చెన్నై జట్టుకు సమర్థుడైన వికెట్‌కీపర్ బ్యాటర్ అవసరం ఉంది. వచ్చే ఐపీఎల్ నాటికి మహేంద్రసింగ్ ధోని 45వ పుట్టిన రోజుకు దగ్గరవుతాడు. కాబట్టి ధోనీకి ప్రత్యామ్నాయంగా సంజు కోసం చెన్నై చూస్తుంటుందనడంలో సందేహం లేదు. సంజు పట్ల ఆసక్తి కనబరిచే అవకాశమున్న మరో జట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్. క్వింటన్ డికాక్‌పై పూర్తి నమ్మకంతో లేని కోల్‌కతా.. రహ్మానుల్లా గుర్బాజ్‌పైనా సీజన్ మొత్తం ఆధారపడే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో సంజు కోసం చెన్నై, కోల్‌కతా గట్టిగా ప్రయత్నించే అవకాశముంది.



సంజు శాంసన్

ఛాంపియన్

లవ్లీనాకు స్వర్ణం.. నిఖత్‌కు రజతం


నీతూ

ఈనాడు, హైదరాబాద్: జాతీయ ఎలైట్ మహిళల బాక్సింగ్ టోర్నీలో తెలంగాణ స్టార్ క్రీడాకారిణి నిఖత్ జరీన్ రజత పతకంతో సరిపెట్టుకుంది. మంగళవారం సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన మహిళల 51 కేజీల ఫైనల్లో జ్యోతి (ఆర్‌ఎస్‌పీబీ) చేతిలో నిఖత్ ఓడింది. ఒలింపిక్ పతక విజేత లవ్లీనా (టాప్స్) స్వర్ణంతో అదరగొట్టింది. 75 కేజీల ఫైనల్లో లాషు యాదవ్ (ఆర్‌ఎస్‌పీబీ)పై లవ్లీనా విజయం సాధించింది. 60 కేజీల విభాగంలో తెలంగాణ అమ్మాయి నిహారిక గోనెళ్ల కాంస్య పతకం గెలుచుకుంది. నాలుగు రోజుల పాటు అభిమానుల్ని అలరించిన బాక్సింగ్ టోర్నీ మంగళవారం ముగిసింది. రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఆర్‌ఎస్‌పీబీ) జట్టు ఓవరాల్ టీమ్ టైటిల్ కైవసం చేసుకుంది. 48 కేజీలలో నీతూ (హరియాణా), చంచల్ (సాయ్ ఎన్).. 54 కేజీలలో ప్రీతి (టాప్స్), ధాను (ఎస్‌ఎస్‌సీబీ).. 57 కేజీలో బబిరోజ్సనా చాను (ఆర్‌ఎస్‌పీబీ), కమల్‌జీత్ కౌర్ గిల్ (ఏఐపీ).. 60 కేజీలో ప్రాచి (ఆర్‌ఎస్‌పీబీ), అంజలి (హరియాణా)..65 కేజీలలో అంకుషిత బోరో (టాప్స్), శశి (ఆర్‌ఎస్‌పీబీ).. 70 కేజీలో శివాని (దిల్లీ), గితిమొని గొగోయ్ (సాయ్ ఎన్).. 80 కేజీలలో స్వీటీ (సాయ్ ఎన్), అల్ఫియా (ఆర్‌ఎస్‌పీబీ).. 80+ కేజీలలో రితిక (సాయ్ ఎన్), శివాని తోమర్ (ఏఐపీ) వరుసగా స్వర్ణ, రజత పతకాలు సాధించారు.


తీర్థు

ప్రపంచ ఆక్వాటిక్స్‌కు తీర్థు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్ మొంగం తీర్థు సామదేవ్.. రొమేనియాలో వచ్చే నెల 19 నుంచి 24వ తేదీ వరకు జరిగే ప్రపంచ జూనియర్ ఆక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించాడు. గత నెల భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ సీనియర్ ఆక్వాటిక్స్‌లో సత్తా చాటిన తీర్థు.. భారత జట్టుకు ఎంపికయ్యాడు.

వింబుల్డన్ టైటిల్ రేసులో ఉన్న ఇగా స్వైటెక్ శుభారంభం చేసింది. ఈ పోలెండ్ స్టార్ పెద్దగా కష్టపడకుండానే రెండో రౌండ్ చేరింది. పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్ యానిక్ సినర్ కూడా ముందంజ వేశాడు. మరో వైపు స్టార్ ప్లేయర్ల నిష్క్రమణ పరంపరను కొనసాగిస్తూ క్విటోవా, పెగులా, జెంగ్, ముసెటి, జ్వెరెవ్ ఇంటిముఖం పట్టారు.

స్వైటెక్ శుభారంభం

సినర్ ముందంజ

● పెగులా, జెంగ్, క్విటోవా ఔట్


స్వైటెక్

లండన్: ఫ్రెంచ్ ఓపెన్ చిక్కకపోయినా.. వింబుల్డన్‌లోనైనా టైటిల్ పట్టాలనే సంకల్పంతో బరిలో దిగిన ఇగా స్వైటెక్ ఘనంగా తొలి అడుగు వేసింది. మంగళవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఈ ఎనిమిదో సీడ్ 7-5, 6-1తో కుదెర్‌మెతోవా (రష్యా)ను ఓడించింది. ఈ పోరులో తొలి సెట్లో మాత్రమే ప్రత్యర్థి నుంచి స్వైటెక్‌కు కాస్త ప్రతిఘటన ఎదురైంది. పన్నెండో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన ఈ పోలెండ్ స్టార్ సెట్ చేజిక్కించుకుంది. రెండో సెట్లో క్రాస్ కోర్టు విన్నర్లు, డ్రాప్ షాట్లతో విజృంభించిన స్వైటెక్.. కుదెర్‌మెతోవాకు అవకాశమే ఇవ్వలేదు. ఏడు గేమ్‌లలో ఆరింటిని తానే చేజిక్కించుకుని సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకుంది. స్వైటెక్ 5 ఏస్‌లు, 15 విన్నర్లు కొట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ బార్బరా క్రెజికోవా (చెక్) కూడా ముందంజ వేసింది. ఈ 17వ సీడ్ 3-6, 6-2, 6-1తో అలెగ్జాండ్రా (ఫిలిప్పీన్స్)ను ఓడించింది. మూడో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా) తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టింది. 2-6, 3-6తో కొక్సియారెటో (ఇటలీ) చేతిలో పెగులా కంగుతింది. అయిదో సీడ్ జెంగ్ (చైనా) కూడా ఓడిపోయింది. ఆమె 5-7, 6-4, 1-6తో సినియాకోవా (చెక్) చేతిలో ఓడింది. క్విటోవా (చెక్) కథ ముగిసింది. ఆమె 3-6, 1-6తో నవారో (అమెరికా) చేతిలో కంగుతింది. రష్యా అమ్మాయి ఆండ్రీవా 6-3, 6-3తో మయర్ షరీఫ్ (ఈజిప్ట్)పై.. సకారి (గ్రీస్) 6-4, 6-4తో బ్లింకోవా (రష్యా)పై నెగ్గగా.. కొలిన్స్ (అమెరికా) 6-3, 6-2తో ఒసోరియో (కొలంబియా)ను ఓడించింది. టౌసన్ (కెనడా), సంసోనోవా (రష్యా), లామెన్స్ (నెదర్లాండ్స్) కూడా తొలి రౌండ్ దాటారు.

సినర్ దూకుడు: టైటిల్ ఫేవరెట్ యానిక్ సినర్ (ఇటలీ) రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. ఈ టాప్ సీడ్ ఆటగాడు 6-4, 6-3, 6-0తో నార్డీ (ఇటలీ)ని ఓడించాడు. తొలి రెండు సెట్లలో ఒక్కోసారి ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి గెలిచిన సినర్.. మూడో సెట్లో మరింత చెలరేగాడు. మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి తేలిగ్గా సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 6-7 (3-7), 7-6 (10-8), 3-6, 7-6 (7-5), 4-6తో రెండర్‌నెచ్ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు. ఏడో సీడ్ ముసెటి (ఇటలీ) 2-6, 6-4, 5-7, 1-6తో బసిల్‌ష్విలి (జార్జియా) చేతిలో కంగుతిన్నాడు. డిమెనార్ (ఆస్ట్రేలియా) 6-2, 6-2, 7-6 (7-2)తో కార్‌బాలెస్ (స్పెయిన్)పై, టామీ పాల్ (అమెరికా) 6-4, 6-4, 6-2తో మండే (బ్రిటన్)పై నెగ్గారు.

టాప్-3లో స్మృతి


స్మృతి

దుబాయ్: ప్రపంచ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన టాప్-3లోకి ప్రవేశించింది. మంగళవారం ఐసీసీ ప్రకటించిన జాబితాలో ఒక స్థానం మెరుగైన స్మృతి మూడో ర్యాంకు సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 12, షెఫాలీ వర్మ 13, జెమీమా రోడ్రిగ్స్ 14వ స్థానాల్లో నిలిచారు. బౌలింగ్‌లో దీప్తిశర్మ 3, రేణుక సింగ్ ఆరో ర్యాంకులు సాధించారు. ఆల్‌రౌండర్లలో దీప్తిశర్మ మూడో స్థానంలో కొనసాగుతోంది. వన్డే బ్యాటింగ్ జాబితాలో స్మృతి నంబర్‌వన్ ర్యాంకును నిలబెట్టుకుంది. బౌలింగ్, ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తిశర్మ నాలుగో స్థానంలో ఉంది.

దక్షిణాఫ్రికా భారీ తేడాతో..


బాష్

బులవాయో: దక్షిణాఫ్రికా అదరగొట్టింది. కార్బిన్ బాష్ (5/43), కొడి యూసుఫ్ (3/22) విజృంభించడంతో తొలి టెస్టులో 328 పరుగుల భారీ తేడాతో జింబాబ్వేను చిత్తు చేసి రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. 537 పరుగుల ఛేదనలో నాలుగో రోజు, మంగళవారం ఓవర్‌నైట్ స్కోరు 32/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే.. 208 పరుగులకే ఆలౌటైంది. బాష్, యూసుఫ్ ప్రత్యర్థి పతనంలో కీలకపాత్ర పోషించారు. కేశవ్ మహరాజ్, బ్రెవిస్ చెరో వికెట్ తీశారు. వెల్లింగ్టన్ మసకద్జ (57), కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (49), ముజరబాని (32 నాటౌట్) మాత్రమే పోరాడారు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 418/9 వద్ద డిక్లేర్ చేయగా.. జింబాబ్వే 251కే ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో సఫారీ జట్టు 369 పరుగులు చేసింది.

రిటైరయ్యే లోపు భారత్‌లో గెలవాలి: లైయన్

సెయింట్ జార్జెస్ (గ్రెనడా): తాను రిటైరయ్యే లోపు భారత్‌లో టెస్టు సిరీస్ గెలవాలని కోరుకుంటున్నట్లు ఆస్ట్రేలియా స్పిన్నర్ నాథన్ లైయన్ తెలిపాడు. ఆసీస్ తరఫున 138 టెస్టుల్లో 556 వికెట్లు పడగొట్టిన లైయన్‌కు భారత్‌పై మంచి రికార్డే ఉంది. భారత్‌తో 32 టెస్టుల్లో అతను 130 వికెట్లు పడగొట్టాడు. 2004-05 తర్వాత భారత్‌లో టెస్టు సిరీస్ గెలుపు ఆసీస్‌కు అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. "భారత్‌లో సిరీస్ గెలవాలని ఎప్పుడూ చెబుతుంటా. ఇంగ్లాండ్‌లో కూడా నెగ్గాలని కోరుకుంటున్నా. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో ఆ జట్లతో తలపడే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఒక్కో టెస్టుపైనే దృష్టంతా. మరో డబ్ల్యూటీసీ ఫైనల్ కచ్చితంగా నా కెరీర్‌లో ఉంటుంది" అని లైయన్ వివరించాడు.

పెరికార్డ్ 153 కి.మీ వేగంతో..


పెరికార్

లండన్: ఫ్రాన్స్ ఆటగాడు గివాని పెరికార్డ్ వింబుల్డన్‌లో ఓ రికార్డు సృష్టించాడు. అయిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)తో సోమవారం సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో 21 ఏళ్ల పెరికార్డ్ (ఫ్రాన్స్) 153 కి.మీ వేగంతో సర్వీస్ చేశాడు. వింబుల్డన్ చరిత్రలో ఇదే వేగవంతమైన సర్వీస్. 2010లో టేలర్ డెంట్ (148 కి.మీ) సృష్టించిన రికార్డును పెరికార్డ్ అధిగమించాడు. 6 అడుగుల 8 అంగుళాల పెరికార్డ్ గతేడాది వింబుల్డన్‌లో ప్రీక్వార్టర్స్ చేరాడు. ఫ్రిట్జ్‌తో ఈ పోరు వర్షం కారణంగా ఆగిపోయింది. మంగళవారం ఈ పోరు తిరిగి ప్రారంభం కాగా ఫ్రిట్జ్ 6-7 (6-8), 6-7 (8-10), 6-4, 7-6 (8-6), 6-4తో పెరికార్డ్‌ను ఓడించాడు.

అయిదు సెట్లు ఆడలేం

లండన్: మహిళల టెన్నిస్‌లోనూ అయిదు సెట్లు ఉండాలన్న వాదనను ప్రపంచ నంబర్‌వన్ సబలెంక తోసిపుచ్చింది. "శారీరకంగా చూస్తే చాలామంది కంటే నేను బలంగా ఉంటా. నాలాంటి వాళ్లకు అయిదు సెట్ల ఫార్మాట్ లాభమే. అలా అని ఆడలేను. సుదీర్ఘంగా పోటీపడేందుకు మహిళల శరీరం అనువుగా ఉండదు. గాయాల పాలయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే దీనికి నేను వ్యతిరేకం. అయిదు సెట్లు.. అయిదు గంటలపాటు సాగుతుంటే చూసేవాళ్లకు బాగానే ఉంటుంది. అలాంటి సమరాలను స్టాండ్‌లో కూర్చొని ఆనందిస్తా. కోర్టులో దిగి ఆడడమే కష్టం. ఒకసారి అయిదు సెట్లు ఆడాక కోలుకోవడానికి ఎన్ని రోజులు పడుతుందో తెలియదు" అని సబలెంక పేర్కొంది.


సబలెంక

మా చెడ్డ ఒత్తిడి!

చదువు, వృత్తి, వ్యక్తిగత జీవితం, ఆర్థిక కారణాలు.. ఏవైనా కావొచ్చు. నేటి యువత ఒత్తిడితో చిత్తవుతోంది. తీవ్ర ఒత్తిడికి గురవుతున్న వారిలో పక్షవాతం (స్ట్రోక్) ముప్పు పెరుగుతోందని 'అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ' హెచ్చరించింది. ఈ మేరకు వారి అధ్యయనాన్ని మెడికల్ జర్నల్‌లో ప్రచురించింది. జీవన శైలి మార్పులతో ఎక్కువవుతున్న ఒత్తిడి వల్ల అనేక దుష్ఫలితాలు ఉంటాయని వివరించింది.



అధ్యయనం ఇలా

- ఇస్కీమిక్ స్ట్రోక్... దీనికి గురైన వారిలో మెదడులోని కొంత భాగానికి రక్తం సరఫరా నిలిచిపోతుంది. నీరసం ఆవహిస్తుంది. మాట తడబడుతుంది. చూపు దెబ్బతింటుంది. కొన్ని సందర్భాల్లో మరణం సంభవిస్తుంది.

అధ్యయనం కోసం ఎంపిక ఇలా...

ఇస్కీమిక్ స్ట్రోక్‌కు గురైన వారు – 426 | సాధారణ ఆరోగ్యవంతులు – 426

ఒత్తిడి స్థాయి తెలుసుకునేందుకు ఓ ప్రశ్నావళిని తయారుచేసి వీరి నుంచి జవాబులను రాబట్టారు. వాటి ఆధారంగా మూడు రకాల శ్రేణులను నిర్ణయించారు.

1. 0–13 వరకు పాయింట్లు వస్తే తక్కువ ఒత్తిడి
2. 14–26 మధ్యస్థ ఒత్తిడి
3. 27–40 తీవ్ర ఒత్తిడిగా నిర్ణయించారు

- ఇందులో ఆరోగ్య వంతులకు సగటున 10 పాయింట్లు వస్తే.. పక్షవాతానికి గురైన వారికి 13 పాయింట్లకు పైగా వచ్చాయి.
- స్ట్రోక్ వచ్చినవారికి నెల రోజులు ముందు తీవ్ర ఒత్తిడి ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది.
- ఫిన్లాండ్‌లోని హెల్సెంకీ యూనివర్సిటీ ఆసుపత్రితోపాటు, వివిధ వైద్య సంస్థలు ఈ అధ్యయనానికి సహకరించాయి.

అనర్థాలు అనేకం

- ఒత్తిడికి గురైనప్పుడు కార్టిసాల్, అడ్రినలిన్, నార్‌అడ్రినలిన్‌లాంటి హార్మోన్లు విడుదలవుతుంటాయి. కొద్దిగా ఒత్తిడితో పాటు, ఈ హార్మోన్లు శరీరానికి అవసరమేగానీ, అదే పనిగా విడుదలైతే మాత్రం అవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. అధిక రక్తపోటు వస్తుంది. దీని మూలాన అవయవాలు దెబ్బతింటాయి. మెదడు, గుండెతోపాటు అన్ని అవయవాలపై ఒత్తిడి తీవ్ర ప్రభావం చూపుతుంది.
- నిరంతర ఒత్తిడి జ్ఞాపకశక్తిని క్షీణింపజేస్తుంది. అధ్యయనం చేసే శక్తి తగ్గిపోతుంది. నిర్ణయాలు సరిగా తీసుకోలేం. ఏకాగ్రత తగ్గుతుంది. భావోద్వేగాలపై ప్రభావం చూపడంతో భయం, ఆందోళన పెరిగే ప్రమాదం ఉంది.
- మెదడుకు అవసరమైన న్యూరోట్రాన్స్‌మిటర్లు తగ్గి.. అలసట అధికమవుతుంది. సంతోషాన్ని కలిగించే హార్మోన్ల విడుదల తగ్గుతుంది. నిద్రలేమి సమస్య వేధిస్తుంది. ఉదాహరణకు 'సెరిటోనిన్' తగ్గడం వల్ల డిప్రెషన్ వస్తుంది. 'డోపమైన్' తగ్గుదల వల్ల అలసట పెరుగుతుంది. నేర్చుకునే శక్తి, సంతోషం, ఆహ్లాదం తగ్గుతాయి. మెదడుకు కీడు చేసే 'గ్లూటమైట్' పెరుగుతుంది.
- రక్తప్రసరణలో మార్పు వస్తుంది. రక్తనాణాలు కుంచించుకుపోయి, ఆక్సిజన్, గ్లూకోజ్ శాతం తగ్గుతాయి. మైగ్రేన్ సమస్య పెరుగుతుంది. మొత్తంగా మెదడు దానంతట అదే మరమ్మతు చేసుకునే శక్తి కూడా క్షీణిస్తుంది.

- ఈనాడు, హైదరాబాద్

ఇతర అవయవాలపై...

- ఒత్తిడి మెదడే కాకుండా ఇతర అవయవాలపై దుష్ప్రభావం చూపుతుంది. అధిక రక్తపోటు వల్ల గుండె లయ తప్పుతుంది. జీర్ణవ్యవస్థపై కూడా ప్రభావం ఉంటుంది. మధుమేహం ఉన్న వారికి ఇది మరింత ప్రమాదకరం.
- కొందరు బరువు పెరుగుతారు. కొందరు తగ్గుతారు.
- మహిళల్లో నెలసరి సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది.
- వ్యాధినిరోధక శక్తిపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.
- శృంగార సామర్థ్యం తగ్గుతుంది. డిప్రెషన్ పెరిగే ప్రమాదం ఉంది.
- ఒత్తిడి ప్రభావం రక్తప్రసరణ వ్యవస్థపై పడుతుంది.
- హైబీపీ వల్ల రక్తనాళాలు చిట్లి హెమరేజిక్ స్ట్రోక్ ప్రమాదమూ ఉంది. కొందరిలో నిశ్శబ్ద స్ట్రోక్స్ (సబ్ క్లినికల్ ఇన్‌ఫాక్ట్స్) వస్తాయి.

ఇలా తగ్గించుకోండి...

- ఒత్తిడిగా భావించినప్పుడు దానికి కారణాలు గుర్తించాలి. ఏయే అంశాల వల్ల ఇబ్బంది పడుతున్నామో విశ్లేషించాలి.
- బాగా ఇష్టపడే పనులను చేయడం, ఇష్టమైన వారితో గడపడం, ప్రకృతిలో నడవడం, ధ్యానం, సంగీతం వినడం, పుస్తక పఠనం, డ్యాన్స్ చేయడం లాంటివి దోహదపడతాయి.
- ప్రతికూల ఆలోచనలను వదిలి పాజిటివ్ థింకింగ్ అలవర్చుకోవాలి.
- డైరీ రాయడం మంచిది. అతిగా పనిచేసి అలసిపోవద్దు.

మన చేతుల్లోనే ఉంది

- నేటి యువతీ యువకుల్లో చాలామంది ప్రతి విషయానికీ ఒత్తిడికి గురవుతున్నారు.
- చదువు, ఉద్యోగం, ఆర్థిక ఇబ్బందులు, స్క్రీన్ టైం పెరగడం, పోటీతత్వం.. ఇలా కారణాలు బోలెడు.
- ఒత్తిడిని తగ్గించుకోవడం మన చేతుల్లోనే ఉంది. జీవన శైలిలో, ఆహారంలో మార్పులు చేసుకోవాలి.
- చక్కెర, కొలెస్ట్రాల్ ఉన్న పదార్థాలను తగ్గించి, ఎక్కువ ప్రోటీన్ ఉన్న ఆహారం తినాలి. అవసరమైతే డైటీషియన్ల సలహాతో సమతుల ఆహారం భుజించాలి.
- వారంలో కనీసం ఐదురోజుల పాటు రోజూ అరగంట చొప్పున వ్యాయామం చేయాలి.
- ప్రతి విషయానికీ ఒత్తిడికి గురయ్యేవారు కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీని తీసుకోవాలి.

– డాక్టర్ సుబ్బయ్య చౌదరి, న్యూరాలజిస్టు, యశోద ఆసుపత్రి, హైదరాబాద్

నిండుకుండలా తుంగభద్ర డ్యాం

ఎనిమిదేళ్ల తర్వాత జూన్‌లోనే 70 టీఎంసీల జలాలు



నిండుకుండలా మారిన తుంగభద్ర జలాశయం

హొసపేటె, సుచ్ఛిపెంటి సర్కిల్, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్ర జీవనాడి తుంగభద్ర ప్రాజెక్టు ఎనిమిది ఏళ్ల తర్వాత ముందస్తుగా జలకళ వచ్చింది. జూన్ నెలలో జలాశయం పూర్తిగా భర్తీకి చేరువవడం చాలా అరుదు. 2017లో జూన్‌లో జలాశయం నిండుకుండలా మారింది. మళ్లీ ఇప్పుడు ముందస్తుగానే ప్రాజెక్టు నీటితో కళకళలాడుతోంది. నానాటికీ వరద ప్రవాహం పెరుగుతుండటంతో ప్రస్తుతం జలాశయంలో 74 టీఎంసీల నీరు ఉంది. క్రస్ట్ గేట్లు దెబ్బతిన్నందున ఈ సంవత్సరం జలాశయంలో 80 టీఎంసీల కన్నా ఎక్కువగా నీటిని నిల్వ చేయరు. కానీ ఇప్పటికే జలాశయం నిల్వలు 80 టీఎంసీలకు చేరువ కావడం గమనార్హం. ✦ ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీ వరద వస్తోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 90,077 క్యూసెక్కుల చొప్పున ప్రవాహం కొనసాగుతోంది.

బాబ్లీ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

రెంజల్, శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ తాలూకా పరిధిలో గోదావరిపై ఉన్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను కేంద్ర జల సంఘం, శ్రీరామసాగర్ ప్రాజెక్టు, మహారాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజినీర్ల సమక్షంలో మంగళవారం ఎత్తారు. అక్టోబరు 28 వరకు తెరిచి ఉంచుతారు. బాబ్లీలో ప్రస్తుతం 0.3 టీఎంసీల నీరుంది. దిగువనున్న ఎస్సారెస్పీకి కొంతమేర నీరు చేరే అవకాశముంది.

ఏపీలో పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

పోలవరం, న్యూస్‌టుడే: కొన్ని రోజులుగా నదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఏపీలోని గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద మంగళవారం నీటి మట్టం 26.45 మీటర్లకు చేరింది. 48 గేట్ల ద్వారా 49,477 క్యూసెక్కులు స్పిల్ ఛానల్ ద్వారా గోదావరిలో కలుస్తున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

నేడు పలు జిల్లాల్లో వర్షాలు!

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధ, గురువారాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో బుధవారం వర్షాలు కురవనున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయనున్నాయి. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన వర్షం పడనుంది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఉపసంచాలకుల ప్రకటన విడుదల చేసింది.

రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ పునరుద్ధరణ

ఈనాడు, హైదరాబాద్: విపత్తు నిర్వహణ చట్టం-2005 నిబంధనల ప్రకారం తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ(టీజీఎస్‌డీఎంఏ)ని రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. దీనికి సంబంధించిన జీవోను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ మంగళవారం విడుదల చేశారు. ఈ అథారిటీకి సీఈఓగా సీఎస్ వ్యవహరించనున్నారు.

మల్టీజోన్-2 ఇన్‌ఛార్జి ఐజీగా తఫ్సీర్ ఇక్బాల్



ఈనాడు, హైదరాబాద్: పోలీస్‌శాఖ మల్టీజోన్-2 ఇన్‌ఛార్జి ఐజీగా తఫ్సీర్ ఇక్బాల్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఐజీగా పనిచేసిన సత్యనారాయణ సోమవారం ఉద్యోగ విరమణ పొందడటంతో తఫ్సీర్ ఇక్బాల్‌కు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతల్ని అప్పగించింది. ఈ మేరకు ఆయన మంగళవారం ఆ బాధ్యతల్ని స్వీకరించారు.



క్రమశిక్షణ అంటే.. సంకల్ప బలం ఒక్కటే కాదు!

క్రమశిక్షణను పూర్తిగా సంకల్ప బలానికి సంబంధించినదిగా చాలామంది పొరబడుతుంటారు. కానీ- చేసే పనిలో విజయం సాధించేందుకు అనువైన పరిస్థితులను మన చుట్టూ సృష్టించుకోవడమూ క్రమశిక్షణే. ఇంటికి జంక్‌ఫుడ్ తీసుకురాకపోవడం, రోజూశిక్షణ/వ్యాయామానికి సమయం కేటాయించుకోవడం.. ఇవన్నీ ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి క్రమశిక్షణ పరిధిలోకే వస్తాయి. – రిజ్వానీ, వెల్‌నెస్ కోచ్

హైదరాబాద్‌లో బీఎల్‌వో వ్యవస్థ ప్రక్షాళన

- ఎన్నికల విధులకు ముందుకు రాని ఉద్యోగులకు తాఖీదులు

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) హెచ్చరికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో బూత్ స్థాయి అధికారుల(బీఎల్‌వోల) వ్యవస్థ ప్రక్షాళనకు జిల్లా ఎన్నికల అధికారి అయిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ నడుం బిగించారు. అందులో భాగంగా బీఎల్‌వోలుగా పనిచేస్తున్న పొరుగు సేవల సిబ్బంది స్థానంలో ప్రభుత్వ ఉద్యోగులను నియమించారు. ఈ విధులు చేపట్టడానికి ముందుకు రాని వారికి నియోజకవర్గాల ఎన్నికల అధికారులు తాజాగా తాఖీదులిచ్చారు. జనాభాతో సమానంగా ఓటర్లు ఉండడం, జాబితాలో నకిలీలు, తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధుల ఫిర్యాదుల నేపథ్యంలో గతేడాది అక్టోబరులో ఈసీఐ అధికారులు నగరంలో పర్యటించారు. చాంద్రాయణగుట్ట, చార్మినార్ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలు పరిశీలించినప్పుడు నకిలీ ఓటర్ల వ్యవహారం బయటపడింది. ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో పొరుగు సేవల సిబ్బంది ఉండడం గమనించారు. దీంతో ఈసీఐ అధికారులు ఎన్నికల విధులకు ప్రైవేటు సిబ్బందిని వినియోగిస్తున్నారా? అంటూ జిల్లా అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 4 వేల పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలుగా పొరుగు సేవల సిబ్బంది ఉండటంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అక్షరాలు తెలియని పారిశుద్ధ్య విభాగం కార్మికులు, అంతంతమాత్రంగా చదువుకున్న సిబ్బందితో ఓటర్ల నమోదు నిర్వహిస్తుండటంపై అభ్యంతరం తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ బీఎల్‌వో వ్యవస్థ దిద్దుబాటుకు శ్రీకారం చుట్టారు. 4 వేల పోలింగ్ కేంద్రాలకు విద్యా, అగ్నిమాపక, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ నుంచి అటెండర్ స్థాయి వరకు ఉద్యోగులను బీఎల్‌వోలుగా నియమించి, మిగిలిన ఖాళీల్లో జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలోని ఉద్యోగులను నియమించారు. దాదాపు 1,500 మంది ఈ ఆదేశాలు బేఖాతరు చేస్తూ బీఎల్‌వో విధులపై విముఖత చూపారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల ఎన్నికల అధికారులు సంబంధిత ఉద్యోగులకు.. మిమ్మల్ని ఎందుకు సస్పెండ్ చేయకూడదో తెలపాలంటూ జూన్ 30న తాఖీదులిచ్చారు. మూడురోజుల్లో విధుల్లో చేరకపోతే సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆధారంగా భూ యజమానులకు నోటీసులు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఈనాడు, హైదరాబాద్: భూముల సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత భూయజమానులకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించాలని రెవెన్యూ యంత్రాంగాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం ఆయన రెవెన్యూ అధికారులతో దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. '10,226 సదస్సుల్లో 8.27 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వాటిని భూ భారతి పోర్టల్లో నమోదు చేస్తున్నారు. మంగళవారం నాటికి 7.98 లక్షల దరఖాస్తులు పూర్తయ్యాయి. మిగిలిన వాటినీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. ప్రతి దరఖాస్తుపై విచారణ చేయాలి. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి... ఆ భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు, రికార్డులను ఒకే దస్త్రంగా రూపొందించి భూభారతిలో అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు కారణాలను లిఖితపూర్వకంగా యజమానికి తెలపాలి' అని మంత్రి పేర్కొన్నారు.

13 బంగారు పతకాల్లో.. 12 అమ్మాయిలకే

- ఘనంగా ఉద్యాన వర్సిటీ స్నాతకోత్సవం

ఈనాడు, హైదరాబాద్: కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి బీఎస్సీ (ఉద్యాన, అటవీ), ఎమ్మెస్సీ (ఉద్యాన) కోర్సుల్లో మొత్తం 13 బంగారు పతకాలకు గానూ.. విద్యార్థినులు 12 పతకాలను కైవసం చేసుకున్నారు. బీఎస్సీలో 8 బంగారు పతకాలకు గాను మొత్తం అమ్మాయిలకే దక్కాయి. బీఎస్సీ ఉద్యాన కోర్సులో గుడిసె చైతన్య నాలుగు బంగారు పతకాలతో రికార్డు నెలకొల్పారు. ఎమ్మెస్సీలో మోనికాశ్రీనాగిని రెండు పతకాలు పొందారు. మంగళవారం వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరిగిన ఉద్యాన వర్సిటీ నాలుగో స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆయా విద్యార్థులకు బంగారు పతకాలను, ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్య పరిశోధనలు, నూతన ఆవిష్కరణలతో వ్యవసాయ, ఉద్యానరంగాలు సుస్థిరాభివృద్ధిని సాధిస్తాయని తెలిపారు. సాగులో అన్నదాతలు పురోగమించడానికి, సంపూర్ణ ఆహారభద్రత సాధించడానికి విద్యార్థులు, పట్టభద్రులు... భవిష్యత్ మార్గనిర్దేశకులుగా మారాలన్నారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ.. సాంకేతిక ఆవిష్కరణలు, సాగు ఖర్చులు, పంటకోత తర్వాత నష్టాలను తగ్గించడం... దిగుబడిని మెరుగుపరచడం, విలువ జోడింపు దిశగా విశ్వవిద్యాలయాలు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయం ఉన్నత విద్యా ప్రమాణాలతో ముందుకు సాగుతోందని ఉపకులపతి దండా రాజిరెడ్డి తెలిపారు. వ్యవసాయ, పశువైద్య విశ్వవిద్యాలయాల వీసీలు అల్దాస్ జానయ్య, జ్ఞానప్రకాశ్; ఐఐఎంఆర్, ఐఐవోఆర్‌ల డైరెక్టర్లు తారాసత్యవతి, ఆర్‌కే మాథుర్, ఇతర అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా నాలుగు బంగారు పతకాలు అందుకున్న చైతన్య. చిత్రంలో ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్, ఉద్యాన వర్సిటీ వీసీ రాజిరెడ్డి

3 జిల్లాల్లో 100 శాతానికిపైగా 'రేషన్ పోర్టబిలిటీ'

- రాష్ట్రంలో సన్నబియ్యం 3 నెలల కోటా రికార్డుస్థాయిలో 94.62% పంపిణీ



ఈనాడు, హైదరాబాద్: దేశంలో ఎక్కడ రేషన్‌కార్డు ఉన్నా.. నివసించే ప్రాంతంలో సరకులు తీసుకునే అవకాశం కల్పిస్తున్న 'రేషన్ పోర్టబిలిటీ'కి మంచి ఆదరణ లభిస్తోంది. జూన్ నెల బియ్యం పంపిణీలో ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఈ పోర్టబిలిటీ 104-116 శాతం నమోదైంది. అంటే ఆయా జిల్లాల్లో ఉన్న రేషన్‌కార్డుల సంఖ్యతో పోలిస్తే ఎక్కువమంది లబ్ధిదారులు బియ్యం తీసుకున్నారు.

✦ మరోవైపు మూడు నెలలకు కలిపి రేషన్ సరఫరా నేపథ్యంలో జూన్‌లో రికార్డు స్థాయిలో బియ్యం పంపిణీ జరిగింది. 2024లో బియ్యం పంపిణీ సగటు 89 శాతం కాగా, 2025 జూన్‌లో అది 94.62 శాతంగా నమోదైంది.

ఉగాది కానుకగా ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం పంపిణీ ప్రారంభించడంతో రేషన్ బియ్యం తీసుకునేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. జూన్‌లో 3 నెలల (జూన్‌తో పాటు జులై, ఆగస్టు) బియ్యం ఒకేసారి పంపిణీ చేసిన విషయం తెలిసిందే. దీంతో గత నెలలో బియ్యం తీసుకోకపోతే జులై, ఆగస్టు నెలల కోటా కూడా పోతుందన్న భయంతో చాలామంది తీసుకున్నారు. దీంతో ఆ సంఖ్య 94.62 శాతానికి పెరిగింది.

అత్యధిక పోర్టబిలిటీ మేడ్చల్‌లో 116.52 శాతం

రాష్ట్రంలో అత్యధిక రేషన్ పోర్టబిలిటీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 116.52 శాతంగా నమోదైంది. ఇతర జిల్లాల ప్రజలు ఎక్కువగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఉద్యోగాలు, ఉపాధి కోసం ఉంటుండటంతో ఈ మూడు జిల్లాల్లో కేటాయించిన దానికంటే తీసుకున్న బియ్యం అధికంగా ఉంది. మరోవైపు వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ జిల్లాల్లో రేషన్ బియ్యం పంపిణీ వరుసగా 81.28, 81.98, 82.09 శాతాలుగా నమోదైంది. ఈ జిల్లాల్లో కొందరు ఇతరప్రాంతాలకు ఉపాధికోసం వెళ్లడంతో ఇక్కడ రేషన్ బియ్యం తక్కువ మంది తీసుకున్నట్లు తెలుస్తోంది.

చీఫ్ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఈనాడు, హైదరాబాద్: చీఫ్ ఇంజినీర్ స్థాయి అధికారులు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తానని, ఇందులో ఫలితాలు చూపించాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఆర్ అండ్ బీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. 'రాష్ట్రానికి రావాల్సిన రూ.300 కోట్ల సీఆర్‌ఐఎఫ్ నిధులను కేంద్రమంత్రి గడ్కరీతో మాట్లాడి తీసుకొచ్చాం. బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నాం. అదే స్థాయిలో పనుల వేగం కూడా ఉండాలి. హ్యామ్ రోడ్లకు సంబంధించి పది ప్యాకేజీ పనులను మొదలుపెట్టేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. దీనిపై రెండు రోజుల్లో పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తాను' అని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇటీవల పదోన్నతులు, పోస్టింగ్‌లు పొందిన అధికారులు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్ అండ్ బీ ఈఎన్సీ జయభారతి, సీఈలు రాజేశ్వర్ రెడ్డి, లింగారెడ్డి, మోహన్ నాయక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు రూ.5,111 కోట్ల జీఎస్టీ ఆదాయం

ఈనాడు, దిల్లీ: తెలంగాణకు జూన్ నెలలో జీఎస్టీ కింద రూ.5,111 కోట్ల ఆదాయం సమకూరింది. గతేడాది ఇదే నెలలో వచ్చిన రూ.4,716 కోట్లతో పోలిస్తే 8% ఎక్కువ. ఈమేరకు కేంద్ర ఆర్థికశాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది జూన్ వరకు ఐజీఎస్టీలో ఎస్‌జీఎస్టీ భాగాన్ని సెటిల్‌మెంట్ తర్వాత తెలంగాణకు రూ.10,686 కోట్ల ఆదాయం వచ్చింది.

పది మంది తహసీల్దార్లకు 'తిరుగు బదిలీ'

ఈనాడు, హైదరాబాద్: బహుళ జోన్-1 పరిధిలో శాసనసభ ఎన్నికల సందర్భంగా బదిలీ అయిన పది మంది తహసీల్దార్లను 'తిరుగు బదిలీ' చేస్తూ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు, నిజామాబాద్‌లో ముగ్గురు, కరీంనగర్, మంచిర్యాల, ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున గతంలో వారు పనిచేసిన జిల్లాలకు బదిలీ అయ్యారు.

ఆ 81 మంది ఇంజినీర్లకు వేతనాలివ్వండి

ఈనాడు, హైదరాబాద్: ఆర్థికశాఖ నిబంధనలు అడ్డుగా మారడంతో ఎనిమిది నెలలుగా వేతనాలు నిలిచిపోయిన 81 మంది నీటిపారుదల శాఖ ఇంజినీర్లకు వెంటనే వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రజాభవన్‌లో హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చక్రధర్, సహాయ కార్యదర్శి రమా తదితరులు సీఎం, మంత్రి ఉత్తమ్‌లను కలిసి సమస్యను వివరించగా వెంటనే చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వానికి సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

పథకం ప్రకారమే గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు!

- హైకోర్టులో పిటిషనర్ల వాదన
- నేడూ కొనసాగనున్న విచారణ

ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణలో పథకం ప్రకారమే అక్రమాలు జరిగాయని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు హైకోర్టుకు నివేదించారు. హాల్‌టికెట్ల జారీతో మొదలైన అక్రమాలు... పరీక్ష కేంద్రాల ఎంపిక, మూల్యాంకనం వరకూ కొనసాగాయని తెలిపారు. కొందరికి లబ్ధి చేకూరేలా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వ్యవహరించిందని ఆరోపించారు. గ్రూప్-1 మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సురేందర్‌రావు వాదనలు వినిపించారు. 'పేపర్లపై మూల్యాంకనం జరిగిన ఆనవాళ్లు లేవు. అయినా మార్కులు ఇచ్చారు. హాల్‌టికెట్ల జారీ.. పరీక్ష కేంద్రాల ఎంపిక కూడా పథకం ప్రకారం జరిగింది. మూల్యాంకనానికి ప్రొఫెసర్లను కమిషన్ ముందే ఎంపిక చేసుకుంది. జనవరి 11 నుంచి 25 వరకు మూల్యాంకనానికి ప్రొఫెసర్లను కేటాయించాలంటూ... జనవరి తరువాత కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు లేఖ రాసింది. అంటే కమిషన్‌కు లేఖ రాయకముందే ప్రొఫెసర్లకు వ్యక్తిగతంగా సమాచారం అందించి కేవలం కమిషనర్ అనుమతి కోసం లేఖ రాసింది'' అని వివరించారు. మరో సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ... ''ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్లు జారీ చేయడం ఇదే మొదటిసారి. ఏ పోటీ పరీక్షలోనూ ఇలా జారీ చేసిన దాఖలాలు లేవు. కేవలం పరిపాలనపరమైన సౌలభ్యం కోసమే రెండో హాల్‌టికెట్ జారీ చేశామని సమర్థించుకోవడం మినహా ఏ ఇతర కారణాలను పేర్కొనలేదు'' అని తెలిపారు. వాదనలు బుధవారమూ కొనసాగనున్నాయి.

'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక

- 'మిషన్ కర్మయోగి' బృందంతో భేటీలో సీఎస్ రామకృష్ణారావు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ రైజింగ్- 2047' లక్ష్యం దిశగా ప్రభుత్వ యంత్రాంగాన్ని సమాయత్తం చేసేందుకు..విభాగాల వారీగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ 'మిషన్ కర్మయోగి' అధికారుల బృందం మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో భేటీ అయింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, సిబ్బందిలో నైపుణ్యాభివృద్ధికి మిషన్ కర్మయోగి చేపట్టిన శిక్షణ కార్యక్రమాలను 'కెపాసిటీ బిల్డింగ్ కమిషన్' అడ్మినిస్ట్రేషన్ సభ్యురాలు డాక్టర్ అల్కా మిత్తల్ వివరించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. 'ఇప్పటికే తెలంగాణలో డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ పోలీస్ అకాడమీ, ఫారెస్ట్ అకాడమీ, ఎక్సైజ్ అకాడమీ తదితర సంస్థలు సమర్థంగా పలు శిక్షణ కార్యక్రమాలు చేపట్టి, ప్రభుత్వ సిబ్బంది, అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్నాయి' అని రామకృష్ణారావు తెలిపారు. పలు శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.



నేలమట్టమైన పరిశ్రమ గదులు

బాణసంచా పేలి.. 8 మంది దుర్మరణం

తమిళనాడులో దుర్ఘటన

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడులో ఓ బాణసంచా పరిశ్రమలో పేలుడు సంభవించడంతో అక్కడికక్కడే 8 మంది దుర్మరణం చెందారు. విరుదునగర్ జిల్లా శివకాశి సమీపంలోని చిన్నకామన్‌పట్టి ప్రాంతంలో 'గోకులేష్' పేరిట బాణసంచా పరిశ్రమ కొనసాగుతోంది. అందులో సుమారు 50 మంది కార్మికులు పని చేస్తుంటారు. మంగళవారం ఉదయం కార్మికులు బాణసంచా తయారీకి అవసరమైన ముడిసరకును కలుపుతుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. అక్కడున్న 8 గదులు నేలమట్టమై.. 8 మంది అక్కడికక్కడే మృతి చెందారు. పరిశ్రమ యజమానులపై సాత్తూర్ పోలీసులు కేసు నమోదు చేసి, ఒకరిని అరెస్టు చేశారు. ఈ ఘటన సమయంలో అందులో ఎంతమంది ఉన్నారనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50వేల చొప్పునపరిహారాన్ని ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ ప్రకటించారు.

చేనేత రుణమాఫీకి రూ.33 కోట్లు మంజూరు

ప్రభుత్వ ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో చేనేత కార్మికులకు రూ.లక్ష లోపు రుణమాఫీ పథకం అమలు కోసం రూ.33 కోట్ల నిధులను మంజూరు చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 ఏప్రిల్ మొదటి తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు చేనేత కార్మికులు అన్ని బ్యాంకులు, జిల్లా సహకార కేంద్రబ్యాంకుల్లో వ్యక్తిగతంగా చేనేత వస్త్రాల ఉత్పత్తి, కార్యనిర్వహణ మూలధనం, ఇతర వృత్తి సంబంధిత కార్యకలాపాల కోసం తీసుకున్న రూ. లక్ష వరకు రుణాల(అసలు, వడ్డీ కలిపి)కే మాఫీ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడించింది. మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లాల వారీగా సహాయ సంచాలకులను ఆదేశించగా..ఆ ప్రక్రియ సాగుతోంది. రుణమాఫీ అమలు కోసం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ, చేనేత సంచాలకుడి అధ్యక్షతన రాష్ట్రస్థాయి కమిటీలను ఏర్పాటు చేసింది. జిల్లా కమిటీ నుంచి వచ్చిన ప్రతిపాదనలను రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదించిన తర్వాత రుణమాఫీ మొత్తం ఆయా రైతుల ఖాతాల్లో నమోదు అవుతుంది. అనంతరం బ్యాంకర్లు ఎలాంటి బకాయిల్లేవని(నో డ్యూస్) ధ్రువీకరణపత్రం జారీ చేస్తారు. రుణమాఫీ అనంతరం కార్మికులు కోరుకుంటే మళ్లీ ఆ మేరకు రుణాన్ని బ్యాంకులు మంజూరు చేస్తాయి. ఎవరైనా కార్మికులు ప్రస్తుతం చేనేత కార్యకలాపాల్లో లేకపోయినా, వారి ఖాతాలు నిరర్థక ఆస్తుల ఖాతా(ఎన్‌పీఏ) కింద ఉన్నా వారికి మళ్లీ రుణాలు రావని ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

EENADU Vol: 51, Issue: 323 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. 95 & 96, Survey No. 150, Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Hyderabad, Medchal District - 500 037, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223, RNI No. 27656/1975, Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

వైద్యులు మానవత్వానికి మూలస్తంభాలు: మోదీ

దిల్లీ: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. వైద్యులు ఆరోగ్య పరిరక్షకులని, మానవత్వానికి మూలస్తంభాలని కొనియాడారు. భారత ఆరోగ్య సంరక్షణ సదుపాయాలను బలోపేతం చేయడంలో వారి సహకారం అసాధారణమైందని 'ఎక్స్' సామాజిక మాధ్యమ వేదికగా తెలిపారు.

ప్రజా వేగు కేసు నుంచి వైదొలగిన 14వ జడ్జి

నైనీతాల్: కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) న్యాయమూర్తి మనీష్ గార్గ్ తనను కోర్టులో బహిరంగంగా దుర్భాషలాడారంటూ ప్రజా వేగు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసు అధికారి అయిన సంజీవ్ చతుర్వేది దాఖలు చేసిన పరువు నష్టం కేసు నుంచి మెజిస్ట్రీరియల్ కోర్టు జడ్జి వైదొలిగారు. దీంతో ఇప్పటివరకూ ఈ కేసు నుంచి 14 మంది జడ్జీలు వైదొలిగినట్లయింది. ఒక వ్యక్తి దాఖలు చేసిన కేసుల నుంచి 14 మంది జడ్జీలు తప్పుకోవడం ఒక రికార్డని చతుర్వేది తెలిపారు.

సెయిల్‌లో రూ.కోట్ల కుంభకోణం: కాంగ్రెస్

దిల్లీ: స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో రూ.వందల కోట్ల కుంభకోణం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మంగళవారం ఆరోపించింది. మౌలిక సదుపాయాల కల్పనకు ఆయా కంపెనీలకు రాయితీ ధరతో ఈ సంస్థ విక్రయించిన ఉక్కును వాణిజ్య లాభదాయక విధానంలో వారు అమ్ముకొన్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీ అజయ్‌కుమార్ తెలిపారు. సంస్థలోని అవినీతిని బయటపెట్టినందుకు తనను సస్పెండు చేశారని, ఆ తర్వాత స్వచ్ఛంద పదవీ విరమణకు బలవంత పెట్టారంటూ సెయిల్ జనరల్ మేనేజరు రాజీవ్ భాటియా చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. ఈ విషయాలు తెలియజేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి భాటియా రెండు లేఖలు రాసినా, బదులు రాలేదని తెలిపారు. కొత్తగా ఏర్పడిన ఓ సంస్థకు సెయిల్ రూ.750 కోట్ల కాంట్రాక్టు ఇవ్వడంపైనా పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయని అజయ్‌కుమార్ తెలిపారు.

ఇక్కడ 463.. అక్కడ 246 మంది

- ఖైదీల జాబితాను ఇచ్చిపుచ్చుకున్న భారత్-పాక్

ఇస్లామాబాద్: భారత్- పాకిస్థాన్‌లు తమ దేశాల జైళ్లలో మగ్గుతున్న దాయాది దేశ ఖైదీల వివరాలను ఇచ్చి పుచ్చుకున్నాయి. 246 మంది భారతీయులు, భారతీయులుగా భావిస్తున్నవారు పాక్ జైళ్లలో ఉన్నట్లు ఇస్లామాబాద్ ప్రకటించింది. వీరిలో 193 మంది మత్స్యకారులు ఉన్నారని తెలిపింది. భారత కారాగారాల్లో 463 మంది పాకిస్థానీయులు, పాకిస్థాన్ వాసులుగా భావిస్తున్నవారు ఉన్నట్లు దిల్లీ వెల్లడించింది. వీరిలో 382 మంది సాధారణ పౌరులని, 81 మంది మత్స్యకారులని తెలిపింది. శిక్ష పూర్తై, పాకిస్థాన్ వాసులుగా నిర్ధారణ అయినవారిని వెంటనే తమ దేశానికి తరలించాలని పాక్ కోరింది. పాకిస్థాన్‌వాసులుగా భావిస్తున్న వారి గుర్తింపును ధ్రువీకరించేందుకు ప్రత్యేక దౌత్య సాయానికి అభ్యర్థనను దాఖలు చేసింది.

యూఎస్‌ఎయిడ్‌కు నిధుల కోతతో 2030కల్లా 1.4 కోట్ల మంది మృతి

దిల్లీ: యునైటెడ్ నేషన్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్‌కు (యూఎస్ఏఐడీ) భారీగా నిధుల కోత వల్ల ప్రపంచ వ్యాప్తంగా 2030 నాటికి 1.4 కోట్లకుపైగా నివారించదగిన మరణాలు సంభవించవచ్చని ద లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం తెలిపింది. ఇందులో మూడో వంతు ఐదేళ్లలోపు పిల్లలవి ఉంటాయని పేర్కొంది. ఈ నిధుల కోత అల్ప, మధ్యాదాయ దేశాల్లో దశాబ్దాలుగా సాధించిన పురోగతిపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించింది.

1300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యంపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి

కీవ్: తమ డ్రోన్లు 1300 కిలోమీటర్ల దూరంలో ఉన్న రష్యా పారిశ్రామిక కర్మాగారాన్ని దెబ్బతీశాయని ఉక్రెయిన్ అధికారులు మంగళవారం తెలిపారు. మరోవైపు ఉక్రెయిన్‌కు చెందిన 60 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణశాఖ తెలిపింది. అధునాతన, తీవ్ర నష్టాన్ని కలిగించే డ్రోన్లను రంగంలోకి దించుతున్న ఇరు దేశాలు.. యుద్ధ క్షేత్రాన్ని ఈ సరికొత్త ఆయుధాలకు ప్రయోగ కేంద్రంగా మార్చుకుంటున్నాయి. ఈ క్రమంలో ఉక్రెయిన్‌పై ఒక్క జూన్‌లోనే రికార్డు స్థాయిలో 5438 డ్రోన్లను రష్యా ప్రయోగించింది. వీటిని జెలెన్‌స్కీ సైన్యం దీటుగా తిప్పికొడుతోంది. ఇందులో భాగంగా మాస్కోకు తూర్పున వెయ్యి కిలోమీటర్లకుపైగా దూరంలో ఉన్న ఓ పారిశ్రామిక కర్మాగారంపై డ్రోన్ దాడి చేసింది. ఈ ఘటనలో అనేక మంది గాయపడినట్లు సమాచారం.

శవదహన వాటికలో 383 మృతదేహాల లభ్యం

మెక్సికో సిటీ: మెక్సికోలోని సియుదద్ క్వారెజ్ నగరంలో ఓ శవదహన వాటికలో 383 మృతదేహాలు లభ్యమయ్యాయి. ఓ గుర్తు తెలియని ఆగంతకుడు ఇచ్చిన సమాచారంతో అధికారులు ఆ ప్రదేశానికి సోమవారం చేరుకున్నారు. దహనవాటిక నిర్వాహకుడిని, ఓ ఉద్యోగిని అదుపులోకి తీసుకున్నారు. ఎందుకు అన్ని మృతదేహాలను అక్కడ దాచారో ఇంకా తెలియలేదని అధికారులు తెలిపారు.

ఝార్ఖండ్‌లో 18 వేల డిటొనేటర్ల స్వాధీనం

చాయ్‌బాసా (ఝార్ఖండ్): మావోయిస్టులకు చెందిన 18 వేల డిటొనేటర్లను భద్రతా దళాలు ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్భుమ్ జిల్లాలో స్వాధీనం చేసుకున్నాయి. టోంటో పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని హుస్సిపి గ్రామ సమీపంలో ఈ పేలుడు సామగ్రిని కనుగొన్నారు. నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్న బలగాలపై ప్రయోగించేందుకే వీటిని అటవీ ప్రాంతంలో దాచి వుంచారని భావిస్తున్నారు.

2024 లోక్‌సభ ఎన్నికల ప్రాతిపదికన..

బిహార్‌లో సీట్ల పంపిణీ!

- ఎన్డీయే, మహాగఠ్ బంధన్ కీలక నిర్ణయం

ఈటీవీ భారత్: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో అధికారపక్షమైన ఎన్డీయే, ప్రతిపక్ష మహాగఠ్ బంధన్ సీట్ల పంపిణీకి సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు మిత్రపక్షాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. రెండు ప్రధాన కూటముల్లోనూ అంతర్గత విభేదాలను అధిగమించడానికి గతేడాది లోక్‌సభ ఎన్నికల ప్రాతిపదికన సీట్ల పంపకం చేసుకోవాలని నిర్ణయించుకున్నాయి. మిత్రపక్షాలను సమైక్యంగా ఉంచేందుకు ఈ చర్య ఉపయోగపడుతుందని ఆయా కూటములు భావిస్తున్నాయి.

- 2020 బిహార్ శాసనసభ ఎన్నికల్లో భాజపా 110 సీట్లలో పోటీ చేసి 74 (ఇప్పుడు 79) గెలుచుకుంది. జేడీయూ 115 సీట్లలో బరిలోకి దిగి 43 (ప్రస్తుతం 45) సెగ్మెంట్లలో విజయకేతనం ఎగురవేసింది. జేడీయూను దెబ్బకొట్టాలనే లక్ష్యంతో చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ 134 స్థానాల్లో పోటీ చేసింది. దీంతో జేడీయూ భారీగా సీట్లను కోల్పోయింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో భాజపా 17 సీట్లలో బరిలోకి దిగి 12 గెలుచుకుంది. జేడీయూ 16 స్థానాలకు పోటీ చేసి 12 సీట్లలో విజయం సాధించింది. చిరాగ్ పాసవాన్‌కు చెందిన ఎల్జేపీ (రామ్ విలాస్) అయిదు సీట్లలో పోటీ చేసి అన్నింటినీ కైవసం చేసుకొంది. హిందుస్థానీ అవామీ



మోర్చా (సెక్యులర్) ఒక సీటులో పోటీచేసి దాన్ని గెలుచుకుంది. రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్ఎల్ఎం) పోటీ చేసినా ఒక్క సీటులోనూ గెలవలేకపోయింది. ఈసారి సీట్ల పంపిణీ స్నేహపూర్వకంగా జరుగుతుందని, సరైన సమయంలో ఎవరు ఏయే సీట్లలో పోటీ చేస్తారో ప్రకటిస్తామని సీఎం నీతీశ్ సన్నిహితుడు, రాష్ట్ర మంత్రి విజయ్‌కుమార్ చౌధరి ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తం 243 సీట్లలో 225 గెలుచుకునేందుకు దృష్టి పెడుతున్నామని, పోటీదారులందరూ ఎన్డీయే అభ్యర్థులుగానే పోటీ చేస్తారని భాజపా ఎన్నికల కమిటీ కార్యదర్శి ప్రేమ్‌రంజన్ పటేల్ తెలిపారు. బిహార్ ముఖ్యమంత్రిగా మరోసారి నీతీశ్ కుమారే ఉంటారని జేడీయూ అధికార ప్రతినిధి నీరజ్‌కుమార్ చెప్పారు.

మహాగఠ్‌బంధన్‌లో వరుస భేటీలు

మరోవైపు.. విపక్ష కూటమి మహాగఠ్‌బంధన్ సీట్ల పంపిణీపై ఇప్పటికే నాలుగు సమావేశాలు నిర్వహించింది. అన్ని పార్టీల ముఖ్య నేతలు హాజరయ్యారు. కొన్ని పార్టీలు తమకు ఎక్కువ సీట్లు కావాలని డిమాండ్ చేస్తున్నాయి. జూన్ 12న జరిగిన మహాగఠ్‌బంధన్ సమావేశానికి ఆర్జేడీ నాయకుడు తేజస్వీ ప్రసాద్ యాదవ్ నేతృత్వం వహించారు. అన్ని పార్టీలు తాము పోటీ చేయాలనుకొంటున్న సీట్ల జాబితాలను ఇవ్వాలని కోరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపకాన్ని పరిగణలోకి తీసుకొని, ముందుగా మిత్రపక్షాల మధ్య వివాదాలు లేని సీట్లను ఖరారు చేస్తామని ఆర్జేడీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆర్జేడీ 23, కాంగ్రెస్ 9, సీపీఐ (ఎంఎల్), వీఐపీ చెరో 3 స్థానాలు, సీపీఐ, సీపీఎం చెరో స్థానానికి పోటీ చేశాయి. దీని ఆధారంగా ఆర్జేడీ దాదాపు 138, కాంగ్రెస్ 54, సీపీఐ(ఎంఎల్), వీఐపీ చెరో 18, సీపీఐ, సీపీఎం ఆరు స్థానాల చొప్పున పోటీ చేయాల్సి ఉంటుంది. 2020 శాసనసభ ఎన్నికల్లో వరుసగా 144, 70, 19 స్థానాలకు పోటీచేసిన ఆర్జేడీ, కాంగ్రెస్, సీపీఐ (ఎంఎల్).. ఈసారి వీఐపీ (వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ) కోసం కొన్ని సీట్లను వదులుకోవాల్సి ఉంటుంది.

అమెరికా బాటలోనే బ్రిటన్

- వీసా నిబంధనలు కఠినతరం
- భారతీయులపై ప్రభావం

లండన్: విదేశీ వలసదారుల విషయంలో అమెరికా బాటలోనే బ్రిటన్ (యూకే) పయనిస్తోంది. వివిధ ఉద్యోగాల్లో చేరే విదేశీ నిపుణులకు సంబంధించిన వీసా నిబంధనలను కఠినతరం చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు కఠినతర వీసా నిబంధనల బిల్లును మంగళవారం పార్లమెంటులోని దిగువ సభ హౌజ్ ఆఫ్ కామన్స్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ నూతన నిబంధనలు.. దేశ వలస విధానాన్ని పూర్తి స్థాయిలో పునర్వ్యవస్థీకరించే కొలమానాలని హోం మంత్రి యివెట్ కూపర్ అభివర్ణించారు. వలస విధానాన్ని తమ ప్రభుత్వం క్రమబద్ధీకరించి, నియంత్రణలోకి తీసుకొస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం భారీగా వలసలను ప్రోత్సహించిందని, దీనివల్ల కేవలం నాలుగేళ్లలోనే వలసలు నాలుగు రెట్లు పెరిగాయని వెల్లడించారు. విదేశీ వలసలను వీలైనంతగా తగ్గించి, వివిధ నైపుణ్యాల పెంపు కోసం బ్రిటన్ పౌరులకు శిక్షణ అందిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం.. ఉద్యోగుల నైపుణ్యాలకు విలువ ఇస్తుందని, అయితే వారు శ్రమ దోపిడీకి గురి కాకుండా నివారిస్తుందని కూపర్ స్పష్టం చేశారు. బ్రిటన్‌కు వచ్చే విదేశీయులంతా సరైన రీతిలో, సరైన దిశగా సేవలను అందించగలిగేలా పర్యవేక్షిస్తామని వెల్లడించారు. ఈ విషయంలో రాజీపడేది లేదని తేల్చి చెప్పారు.

జులై 22 నుంచి అమల్లోకి?

ఈ ఏడాది మే నెలలో బ్రిటన్ సర్కారు విడుదల చేసిన ఇమ్మిగ్రేషన్ శ్వేతపత్రంలోనే ఈ కొత్త వీసా నిబంధనలను ప్రతిపాదించింది. తాజాగా వాటిని హౌజ్ ఆఫ్ కామన్స్‌లో ప్రవేశపెట్టడం ద్వారా చట్టపరమైన ఆమోదం దిశగా కసరత్తును మొదలుపెట్టారు. పార్లమెంటు ఆమోదం పొందాక.. జులై 22 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయి. ఈ నిబంధనల ప్రభావం ఎంతో మంది భారతీయులపై పడనుంది. ఎందుకంటే ఏటా చాలా మంది భారతీయులు బ్రిటన్‌లో ఉన్న పర్సనల్ కేర్ సెంటర్లు, హోటళ్లు, భవన నిర్మాణ సంస్థలు, ఆసుపత్రుల్లో దిగువ స్థాయి ఉద్యోగాల కోసం దరఖాస్తు చేస్తుంటారు.

ప్రతిపాదిత వీసా నిబంధనలివే..

బ్రిటన్‌లో ఉద్యోగం పొందేందుకు విదేశీ నిపుణులకు అదనపు నైపుణ్యాలు అవసరం.

✦ అత్యల్ప వేతనాలు కలిగిన ఉద్యోగాలను, గ్రాడ్యుయేట్ స్థాయి వాటిని విదేశీయులతో భర్తీ చేయకూడదు. ఇలాంటి ఉద్యోగాల్లో భర్తీ అయ్యే వారు వీసాకు అనర్హులు.

✦ ఇంటి పనులు, పర్సనల్ కేర్, వృద్ధులు, పిల్లలు, దివ్యాంగులకు సేవలు చేసే విభాగాల్లో విదేశీయులను నియమించకూడదు.

✦ ఇప్పటివరకూ వంట మనుషులు, ప్లాస్టరింగ్ వర్కర్లు వంటి 100కుపైగా పనులు చేసే వారికి వీసా మినహాయింపులు ఇచ్చేవారు. ఇక నుంచి వారికి ఆ మినహాయింపులు లభించవు.

ఇప్పటికే ఉన్న వారికి మినహాయింపులు: సీమా మల్హోత్రా

ఇప్పటికే యూకేలో పని చేస్తున్న విదేశీ వర్కర్లకు అదనపు నైపుణ్యాల నుంచి మినహాయింపు కల్పిస్తామని హోంశాఖ (వలసదారుల వ్యవహారాలు) సహాయ మంత్రి సీమా మల్హోత్రా వెల్లడించారు. ఈ విషయాన్ని కొత్త వీసా నిబంధనల్లో పొందుపరుస్తున్నట్లు తెలిపారు. కొత్త వీసా నిబంధనలు ఆమోదం పొందాక జులై 22 నుంచి కనీసం బ్యాచిలర్ డిగ్రీ, సమానమైన విద్యార్హత ఉన్నవారే బ్రిటన్ వీసాకు అర్హులని ఆమె వెల్లడించారు.

హిమాచల్‌లో కుంభవృష్టి

శిమ్లా: ఎడతెగని వర్షాలతో హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీ జిల్లా చిగురుటాకులా వణికిపోయింది. సోమవారం ఉదయం నుంచి 24 గంటల వ్యవధిలో 253.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతిచెందారు. 16 మంది గల్లంతయ్యారు. హిమాచల్‌లో పలుచోట్ల ఆకస్మికంగా కుంభవృష్టి కురుస్తోంది. వరదలు ముంచెత్తుతున్నాయి. రాష్ట్రంలో ఏకబిగిన కురుస్తున్న వర్షాలకు మండీ జిల్లాలో పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. నీళ్లలో చిక్కుకుపోయిన



హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీ జిల్లాలో అకస్మాత్తుగా వచ్చిన వరదతో మంగళవారం బురదలో చిక్కుకుపోయిన వాహనాలు

ప్రజల్ని, పశువుల్ని రక్షించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పోలీసులతో పాటు జాతీయ విపత్తు ఉపశమన దళం, రాష్ట్రస్థాయి దళాలు రంగంలో దిగి సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. చండీగఢ్ నుంచి మనాలీకి ఉన్న నాలుగు వరసల రహదారి స్తంభించిపోయింది. వాహనాల్లో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల తేలికపాటి వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. పలు ప్రాంతాల్లో స్వల్ప వ్యవధిలో భారీ వాన కురుస్తుండటం ఆందోళనకరంగా మారిందని, గత రెండుమూడేళ్లలో ఈ పోకడ బాగా పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

కరిగిపోయిన రూ.50 కోట్ల పంచదార

దిల్లీ: భారీ వర్షాల కారణంగా హరియాణాలోని యమునానగర్‌లో సరస్వతి చక్కెర మిల్లులోకి నీరు చేరి రూ.50 కోట్ల విలువ చేసే పంచదార కరిగిపోయింది. ఆ ప్రాంతంలో 37.9మి.మీ వర్షం కురిసినట్లు భారత వాతావరణ సంస్థ(ఐఎండీ) వెల్లడించింది. ఇది సాధారణం కంటే 576% ఎక్కువ అని పేర్కొంది. ''రాత్రి భారీగా వర్షం కురిసింది. మిల్లు ప్రాంగణంలోకి నీరు వస్తోందని అర్ధరాత్రి సమయంలో మా సిబ్బంది మమ్మల్ని అప్రమత్తం చేశారు. మిల్లు పక్కనే ఆక్రమణకు గురైన కాల్వ ఒక్కసారిగా పొంగి రెండు గోడౌన్లలోకి 3 నుంచి 4 అడుగుల నీరు చేరింది. దాదాపు 1.25 లక్షల క్వింటాళ్ల పంచదారకు నష్టం కలిగింది. దాని విలువ రూ.50-60 కోట్ల వరకు ఉంటుంది. మిగిలిన నిల్వలను పరిశీలిస్తే పూర్తి నష్టాన్ని చెప్పగలం'' అని సరస్వతి షుగర్ మిల్ సీఈఓ ఎస్‌కే సచ్‌దేవ వెల్లడించారు.



ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో మంగళవారం ఎండవేడిమి తాళలేక ఈఫిల్ టవర్ సమీప ఫౌంటెన్ నీటిలో సేద తీరుతున్న ఓ పర్యాటకురాలు

మండుతున్న ఐరోపా

పారిస్: అతి శీతల ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన ఐరోపా ఖండం వేడెక్కింది. భూతాప వృద్ధి కారణంగా ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. స్పెయిన్‌లోని బార్సిలోనా ఆహ్లాదకరమైన చల్లటి వాతావరణానికి ప్రతీతి. కానీ ఈ నగరంలో సోమవారం 37.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. మరోవైపు వేసవి తాపం కారణంగా ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరంలో ఐఫిల్ టవర్‌ను మంగళవారం మూసి ఉంచారు. ఈసారి ఐరోపా చవి చూస్తున్న వడగాడ్పులు అతి దారుణమైనవని నిపుణులు పేర్కొంటున్నారు. అనేక ఐరోపా దేశాల్లో వేడిమి కారణంగా సంభవించే ఆరోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ అయ్యాయి. గడచిన ఐదేళ్లతో పోలిస్తే ఈసారి జూన్‌లో అత్యధిక వేడిమి నమోదైంది. గత నెలలో స్పెయిన్‌లో సరాసరిన 26 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందని బార్సిలోనాలోని ఫాబ్రా అబ్జర్వేటరీ వెల్లడించింది. 1914 నుంచి ఇప్పటిదాకా నమోదైన అత్యధిక సరాసరి ఉష్ణోగ్రత ఇదేనని పేర్కొంది. ఫ్రాన్స్‌లో వేడి కారణంగా 1,300 పాఠశాలలు మూసివేశారు. 2100 సంవత్సరం కల్లా ఫ్రాన్స్‌లో వేసవి తాపం 40 డిగ్రీలకు చేరుకుంటుందని, 50 డిగ్రీలు దాటినా ఆశ్చర్యపోనవసరం లేదని నిపుణులు అంటున్నారు. పోర్చుగల్‌లో జూన్ ఉష్ణోగ్రత 46.6 డిగ్రీలకు చేరింది.

మేధాపాట్కర్ ప్రస్తావనతో అర్ధాంతరంగా ముగిసిన భేటీ

- పార్లమెంటు స్ఫూర్తికి విరుద్ధం: సీపీఎం

దిల్లీ: గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ పార్లమెంటరీ స్థాయీ సంఘ సమావేశం మంగళవారం అర్ధాంతరంగా ముగిసింది. ఓ అంశంపై సామాజిక కార్యకర్త మేధాపాట్కర్ అభిప్రాయాలు వినాలని ప్యానెల్ నిర్ణయించడంతో భాజపా ఎంపీలు దీనికి నిరసన తెలుపుతూ వాకౌట్ చేశారు. భాజపా సభ్యుల ప్రవర్తన పార్లమెంటు స్ఫూర్తికి విరుద్ధమని సీపీఎం ఎంపీ కె.రాధాకృష్ణన్ తప్పుబట్టారు. కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలాకా సారథ్యంలో జరిగిన స్థాయీసంఘ సమావేశంలో 2013 నాటి యూపీఏ సర్కారు హయాంలో రూపొందించిన భూసేకరణ చట్టం అమలు తీరుపై మేధాపాట్కర్ అభిప్రాయాలను వినాలని నిర్ణయించారు. భాజపా సభ్యులు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ మేధాపాట్కర్‌ను జాతి వ్యతిరేకిగా అభివర్ణించారు.

ఎఫ్‌సీఏకు సంబంధించిన కేసుల్లో సీఈసీ సలహాలను అనుమతించకండి

- సీజేఐకి లేఖ రాసిన విశ్రాంత అధికారులు

దిల్లీ: వన్యప్రాణులు, పర్యావరణ భద్రత, అటవీ సంరక్షణ చట్టం సవరణ బిల్లు (ఎఫ్‌సీఏఏ)-2023కు సంబంధించి నమోదైన కేసుల్లో కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) సలహాలను అనుమతించవద్దని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌కు 60 మంది మాజీ అధికారులు లేఖ రాశారు. ప్రస్తుత సీఈసీలో ముగ్గురు సభ్యులు.. అటవీశాఖ మాజీ అధికారులేనని, మరొకరు విశ్రాంత శాస్త్రవేత్త అని లేఖలో తెలిపారు. వీరు ఇప్పటికే అటవీ, వాతావరణ మార్పులశాఖలో అత్యున్నత పదవులు నిర్వహించి, వివిధ బిల్లుల రూపకల్పనలో పాల్గొన్నవారు కావడంతో.. ఎఫ్‌సీఏఏకు సంబంధించిన కేసుల్లో పాత అభిప్రాయానికి విరుద్ధంగా మరో సలహా ఇవ్వలేరని తెలిపారు. స్వతంత్రంగా అభిప్రాయాన్ని వెల్లడించే అవకాశం వారికి చాలా తక్కువని వివరించారు. ఇది పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు దారి తీసే అవకాశముందని అభిప్రాయపడ్డారు. దీనిని నివారించడానికి సీఈసీ సభ్యుల్లో మార్పు జరగాలని సూచించారు. ఈ లేఖపై ప్రకృతి శ్రీవాస్తవ, కేరళ మాజీ ప్రిన్సిపల్ చీఫ్ అటవీ సంరక్షకురాలు నవరేఖ శర్మ, ఇండోనేసియా మాజీ రాయబారి ఎన్.సి. సక్సేనా, పూర్వ ప్రణాళిక సంఘం మాజీ కార్యదర్శి ఆరోగ్యశాఖ మాజీ కార్యదర్శి కె.సుజాతా రావుసహా 60 మంది అధికారులు సంతకం చేశారు.

పౌర పాలనకు ప్రధాని ఉత్కృష్ట అవార్డులు!

దిల్లీ: పౌర పరిపాలన (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) విభాగంలో అత్యుత్తమ పనితీరు కనబరచిన జిల్లాలు, ప్రభుత్వ సంస్థలకు 2025 సంవత్సరంలో ప్రధాన మంత్రి ఉత్కృష్ట అవార్డుల పథకాన్ని కేంద్ర ప్రభుత్వం మంగళవారం నోటిఫై చేసింది. ఈ పథకం కింద నమోదు కావడానికీ, నామినేషన్లు దాఖలు చేయడానికీ అక్టోబరు 2న ఒక ప్రత్యేక వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించనుంది. ప్రభుత్వ పథకాల ఫలాలను లబ్ధిదారులందరికీ అందించడంలో సఫలమైన జిల్లా కలెక్టర్లను గుర్తిస్తారు. మూడు విభాగాల్లో వీరి సేవలను బేరీజు వేస్తారు. మొదటి విభాగంలో 11 ప్రాధాన్య రంగాల కార్యక్రమాల కింద జిల్లాల సంపూర్ణ అభివృద్ధిని సాధించిన వారిని గుర్తిస్తారు. ఈ విభాగంలో ఐదు అవార్డులు ఉంటాయి. రెండో విభాగంలో బ్లాక్ స్థాయి సమగ్ర అభివృద్ధికి ఐదు అవార్డులు ఇస్తారు. మూడో విభాగంలో నవీకరణ సాధించిన కేంద్ర, రాష్ట్ర మంత్రిత్వ శాఖలు, జిల్లా విభాగాలకు ఆరు అవార్డులిస్తారు.

ఇండో-పసిఫిక్‌లో భారత్ కీలక పాత్ర

- మోదీతో ట్రంప్‌నకు దృఢ అనుబంధం: అమెరికా

వాషింగ్టన్: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తమకు భారత్.. కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి అని అమెరికా స్పష్టం చేసింది. ప్రధాని మోదీకి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు మధ్య దృఢ అనుబంధం ఉందని పేర్కొంది. రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉందని, త్వరలో దీనిపై ట్రంప్ ప్రకటన చేస్తారని వెల్లడించింది. అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ సోమవారం మీడియాతో మాట్లాడారు. ఇండో-పసిఫిక్ భద్రతను నిర్ణయించే కీలక భాగస్వామిగా భారత్ ఉందని ఆమె పేర్కొన్నారు. ట్రంప్‌నకు మోదీతో వ్యక్తిగతంగా మంచి అనుబంధం ఉంది. అది భవిష్యత్తులోనూ కొనసాగుతుంది' అని వివరించారు. 'భారత్‌తో వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉందని అధ్యక్షుడు గత వారం చెప్పారు. వాణిజ్య మంత్రితో జరిగిన చర్చల్లో నేనూ పాల్గొన్నా. ఒప్పందం తుది దశకు చేరింది. త్వరలోనే అధ్యక్షుడు ట్రంప్, ఆయన వాణిజ్య బృందం నుంచి అధికారిక ప్రకటన వస్తుంది' అని వెల్లడించారు. మోదీ ఆహ్వానం మేరకు ఈ ఏడాది చివరలో భారత్‌లో జరగనున్న క్వాడ్ సదస్సుకు ట్రంప్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఇండో-పసిఫిక్ అంశాలపై చర్చించనున్నారు.

వచ్చే వారం అమెరికాకు నెతన్యాహు

- గాజా కాల్పుల విరమణ ఒప్పందంపై ట్రంప్‌తో చర్చించే అవకాశం



వాషింగ్టన్: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ నెల 7న అమెరికా వెళ్లనున్నారు. వాషింగ్టన్‌లో ఆయన అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్, ఇతర సీనియర్ అధికారులతో సమావేశమవుతారు. గాజా కాల్పుల విరమణ ఒప్పందం తొందరగా కుదుర్చుకోవాలని ట్రంప్ ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రంప్ ఇటీవల మాట్లాడుతూ వచ్చే వారంలోపు హమాస్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ కుదిరే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్వేతసౌధానికి రమ్మని నెతన్యాహుకు ఆహ్వానం రావడం గమనార్హం.

న్యూయార్క్ మేయర్ అభ్యర్థి మందానీయే

- డెమోక్రటిక్ ప్రైమరీలో 50శాతం ఓట్ల సాధన

న్యూయార్క్, వాషింగ్టన్: భారత సంతతికి చెందిన జోహ్రాన్ మందానీ.. డెమోక్రటిక్ పార్టీ తరఫున న్యూయార్క్ మేయర్ బరిలో దిగడం ఖాయమైంది. మంగళవారం జరిగిన పార్టీ ప్రైమరీ ఓట్ల లెక్కింపులో ఆయన 50శాతం ఓట్లతో విజయం సాధించారు. మాజీ గవర్నర్ ఆండ్రూ కువోమోను ఆయన ఓడించారు. వాస్తవానికి జూన్ 24వ తేదీన జరిగిన ప్రైమరీలోనే ఆయన గెలిచారు. అయితే 50శాతం ఓట్లు రాకపోవడంతో మరోసారి సిటీ ర్యాంక్‌డ్ ఛాయిస్ ఓటింగ్ మోడల్‌ను అనుసరించారు. రెండో ప్రాధాన్య ఓటు ద్వారా ఈ ప్రక్రియను నిర్వహించారు. డెమోక్రటిక్ అభ్యర్థిగా పోటీపడనున్న మందానీ.. ప్రస్తుత మేయర్ ఎరిక్ ఆడమ్స్, రిపబ్లికన్ అభ్యర్థి కర్టిస్ స్లీవా, స్వతంత్ర అభ్యర్థి జిమ్ వాల్డెన్‌తో మేయర్ ఎన్నికల్లో తలపడతారు.

మందానీ కమ్యూనిస్టు: ట్రంప్: న్యూయార్క్ నగర మేయరు బరిలో ఉన్న డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మందానీ.. కమ్యూనిస్టని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. ఆయనను ఎన్నుకోవాలనే పిచ్చి వ్యామోహంలో న్యూయార్క్ ప్రజలున్నారని వ్యాఖ్యానించారు.

ట్రంప్ సన్నిహితుల ఈ-మెయిల్స్ బయటపెడతాం

- ఇరాన్ హ్యాకర్ల బెదిరింపులు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితులకు సంబంధించిన ఈ-మెయిల్స్ సమాచారాన్ని బహిర్గతం చేస్తామని ఇరాన్ హ్యాకర్లు బెదిరింపులకు దిగారు. 'రాబర్ట్' అనే మారు పేరుతో ఈ హ్యాకర్ల బృందం 'రాయిటర్స్' వార్తా సంస్థతో చాట్ చేసింది. ఈ క్రమంలో పలు విషయాలు వెల్లడించింది. వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ వైల్స్, ట్రంప్ న్యాయవాది లిండ్సే హాలిగన్, అధ్యక్షుడి సలహాదారు రోజర్ స్టోన్, శృంగార తార స్టార్మీ డేనియల్స్‌తో పాటు మరికొందరి మెయిళ్లను తాము హ్యాక్ చేసినట్లు పేర్కొంది. తమ దగ్గర దాదాపు 100 గిగాబైట్ల సమాచారం ఉందని వెల్లడించింది. ఈ బెదిరింపులపై ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ స్పందిస్తూ.. జాతీయ భద్రతకు భంగం కలిగించేవారు ఎవరైనా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

భద్రతా మండలి అధ్యక్షస్థానంలో పాక్

ఇస్లామాబాద్: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అధ్యక్ష బాధ్యతలను మంగళవారం పాకిస్థాన్ స్వీకరించింది. నెల రోజుల పాటు ఈ పదవిలో ఉంటుంది. మండలిలో 15 సభ్యదేశాలు నెలకొకరు చొప్పున అక్షరమాల క్రమంలో ఈ అధ్యక్ష పదవిని నిర్వహిస్తారు. జులై నెలలో ఈ అవకాశం పాకిస్థాన్‌కు దక్కింది. భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా గతేడాది ఎన్నికైన పాక్ రెండేళ్ల పదవీ కాలం జనవరి నెల నుంచి ప్రారంభమైంది.

మధుమేహానికి కొత్త చికిత్స దిశగా...

ముంబయి: మానవ శరీరంలో అత్యధికంగా ఉండే కొల్లాజెన్ అనే ప్రొటీన్ క్లోమగ్రంధికి నష్టం కలిగించే అమైలిన్ యాగ్రిగేషన్ అనే ప్రక్రియకు గురై టైప్-2 డయాబెటిస్‌కు దారితీస్తోందని ఐఐటీ బాంబే అధ్యయనంలో తేలింది. టైప్-2 డయాబెటిస్‌లో క్లోమ గ్రంధి తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి చేయలేక పోతుంది. మానవ శరీర కణాలపై ఇన్సులిన్ ప్రభావం చూపకుండా పోయినా రక్తంలో చక్కెర స్థాయి పెరిగిపోతుంది.. శరీరంలో క్లోమ గ్రంధి నుంచి ఉద్భవించే ఇన్సులిన్ భోజనానంతరం రక్తంలో చక్కెర పరిమాణం పెరగకుండా నిరోధించే అమైలిన్ అనే హార్మోన్‌ను కూడా ఉత్పత్తి చేస్తుంది. శరీరంలోని కొల్లాజెన్ - 1 అనే ప్రొటీన్ అమైలిన్ పేరుకుపోవడానికి కారణమై ఇన్సులిన్ ఉత్పత్తి చేసే క్లోమ గ్రంధిలోని బీటా కణాలను దెబ్బతీస్తుంది. ఈ స్థితిలో అమైలిన్ విషతుల్యమవుతుంది. ఈ పరిణామాల కారణంగా శరీరం రక్తంలో చక్కెర పరిమాణాన్ని నియంత్రించే సామర్థ్యాన్ని కోల్పోతుంది అని ఐఐటీ బాంబే నిర్వహించిన అధ్యయనం తేల్చింది. అమైలిన్, కొల్లాజెన్‌లు ఒకదానిపై ఒకటి ఏ విధంగా ప్రభావం చూపుతాయన్నది అధ్యయనం చేసేందుకు క్రయో ఎలక్ట్రాన్ మైక్రోస్కోపీని అభివృద్ధి పరుస్తున్నారు. దీని వల్ల డయాబెటిస్‌కు కొత్త ఔషధాలు కనుగొనేందుకు వీలు కలుగుతుంది.

సహజీవన భాగస్వామిని చంపి.. శవం పక్కనే రెండ్రోజులు నిద్ర

ఇంటర్నెట్ డెస్క్: మధ్యప్రదేశ్ రాజధాని నగరమైన భోపాల్‌లో సచిన్ రాజ్‌పూత్ (32) అనే యువకుడు తన సహజీవన భాగస్వామి అయిన రితికా సేన్ (29)ను చంపి.. రెండు రోజులపాటు ఆమె శవం పక్కనే నిద్రించాడు. భోపాల్‌లోని గాయత్రీ నగర్‌లో వీరిద్దరూ వివాహం లేకుండా కలిసి ఉంటున్నారు. దాదాపు గత నాలుగేళ్లుగా వీరి సంబంధం కొనసాగుతోంది. రితిక ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తుండగా.. సచిన్ ఖాళీగా ఉంటున్నాడు. దీంతో ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఉద్యోగం లేనందున తనను పట్టించుకోవడం లేదని, ఆఫీసులో మరొకరితో సంబంధం కొనసాగిస్తోందని ఆమెను నిలదీసేవాడు. జూన్ 27 రాత్రి.. ఈ వ్యవహారం ఇద్దరి మధ్య పెద్ద గొడవకు దారి తీసింది. సచిన్ ఆవేశం పట్టలేక రితికను గొంతు నులిమి చంపేశాడు. తర్వాత ఏం చేయాలో పాలుపోక మృతదేహాన్ని ఓ దుప్పటిలో చుట్టి, మంచం మీదే ఉంచాడు. హత్య చేశానన్న భయంతో రెండు రోజులపాటు విపరీతంగా తాగుతూ శవం పక్కనే నిద్రించాడని పోలీసులు తెలిపారు. చివరకు ఆదివారం తన స్నేహితుడు అనూజ్‌కు హత్య గురించి సచిన్ చెప్పాడు. విస్తుపోయిన అనూజ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుప్పటిలో చుట్టిన మృతదేహాన్ని స్వాధీనం చేసుకొన్న పోలీసులు నిందితుడిని కస్టడీలోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. సచిన్‌కు ఇదివరకే వివాహమై, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.



హతురాలు రితికాసేన్.. నిందితుడు సచిన్ రాజ్‌పూత్

ఈనాడు సినిమా

ఎన్టీఆర్ - హృతిక్.. డ్యాన్స్ వార్


ఎన్టీఆర్


హృతిక్

అటు ఉత్తరాది ప్రేక్షకులతో పాటు ఇటు దక్షిణాది సినీప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా 'వార్ 2'. అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని యశ్ రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో తారక్ - హృతిక్‌ల మధ్య హోరాహోరీ పోరాటాలతో పాటు మంచి డ్యాన్స్ మూమెంట్స్‌తో నిండిన ఓ పాట కూడా ఉండనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. మేలోనే షూట్ చేయాల్సిన ఆ గీతం హృతిక్ కాలి గాయం కారణంగా ఆలస్యమైంది. ఇప్పుడా పాట చిత్రీకరణ ముంబయిలో మొదలైనట్లు సమాచారం. యశ్‌రాజ్ స్టూడియోస్‌లో సిద్ధం చేసిన ప్రత్యేక సెట్‌లో ఈ షూట్ కొనసాగుతున్నట్లు తెలిసింది. ఈ పాటకు ప్రీతమ్ స్వరాలందించగా.. బాస్కో మార్టిన్ నృత్య దర్శకుడిగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. ఇది సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచే గీతమవుతుందని సినీవర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్ర నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

చిరు కోసం బాలీవుడ్ అందం!


మౌని రాయ్

'విశ్వంభర'ను ముగించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు చిరంజీవి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. ఈ సినిమా ఇప్పటికే దాదాపు పూర్తి కాగా.. మిగిలి ఉన్న ఒక ప్రత్యేక గీతాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇప్పుడీ పాట కోసం బాలీవుడ్ భామ మౌని రాయ్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ గీతం కోసం ఓ ప్రత్యేక సెట్‌ను సిద్ధం చేసే పనిలో పడింది చిత్ర బృందం. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈనెలలోనే పాట చిత్రీకరణ పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దీనికోసం భీమ్స్ సిసిరోలియో మంచి మాస్ బీట్‌ను సిద్ధం చేసిచ్చినట్లు తెలిసింది. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన ఈ సోషియో ఫాంటసీ థ్రిల్లర్ ఈ ఏడాది లోనే చివర్లో తెరపైకి రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలోనే విడుదల తేదీపై స్పష్టత రానుంది. దీనికి ఎం.ఎం.కీరవాణి సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఏజెంట్ ప్రపంచ వేట



దేశాభివృద్ధిలో నిత్యం పోటీ పడుతూ ఉండే రెండు దేశాల అధ్యక్షులు విల్ డెర్రింగల్(జాన్ సెనా) సామ్ క్లార్క్(ఇద్రిస్ ఎల్బా) నిజజీవితంలో స్నేహితులు కావడమంటే కష్టమే. వారి మధ్య తరచూ పోటీయే ఉంటుంది. ఎప్పుడూ ఘాటు వ్యాఖ్యలు చేసుకోవడంతోనే వారి రోజులు గడిచిపోతాయి. కానీ తెలియని ఓ శత్రువు కారణంగా ఇరు దేశాలకు ప్రమాదం ఉందని తెలిస్తే..దానిని అధిగమించడానికి వీరిద్దరూ కలిసి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. సమస్యలు వచ్చినప్పుడు ఒక్కసారిగా తమ వైరుధ్యాలు పక్కకు పెట్టి పోరాడే ఈ దేశాధినేతలు సాగించే పోరాటాలు ఉత్కంఠగా సాగుతూనే వారి మధ్య కొన్ని సంభాషణలు నవ్వులు పూయిస్తాయి. ప్రపంచంపై జరుగుతున్న కుట్రను అడ్డుకోవడానికి ఏజెంట్ నోయల్ బిస్సెట్(ప్రియాంక చోప్రా)ని రంగంలోకి దింపుతారు ఇద్దరు దేశాధ్యక్షులు.

సినిమా: హెడ్స్ ఆఫ్ స్టేట్
ప్లాట్‌ఫామ్: అమెజాన్ ప్రైమ్
విడుదల: బుధవారం
నటీనటులు: జాన్‌సినా, ప్రియాంక చోప్రా

అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలతో ఆమె వారిని రక్షిస్తూనే ప్రత్యర్థుల వెన్నులో వణుకుపుట్టిస్తోంది. తనతోనే ఉన్నా ఇద్దరు నాయకుల ఊహలకు కూడా అందకుండా సాహసోపేతంగా ప్రత్యర్థులపై విరుచుకుపడుతుంది. ఇలాంటి యాక్షన్ సీక్వెన్స్‌తో థ్రిల్లింగ్‌గా అనిపించే ఈ సినిమాకి ఇల్యా నైషుల్లర్ దర్శకత్వం వహించారు. ప్రపంచానికి ముప్పు వాటిల్లకూడదని తపిస్తున్న ఈ ముగ్గురి భాగస్వామ్యంలో ఉత్కంఠభరితంగా సాగే ప్రపంచ వేటని చూడాలంటే 'హెడ్స్ ఆఫ్ స్టేట్' సినిమాపై మీరూ ఓ లుక్కేయండి.

రెడీ ఇన్ ఓటీటీ


ప్రతి నిమిషం మరణం వైపు ఓ అడుగు!



ఉన్నది ఒకటే జీవితం. ఏదీ శాశ్వతం కాదు. ఈ ప్రపంచం మనల్ని ఎలా చూసినా మనం మాత్రం మన కర్తవ్యాన్ని మర్చిపోకూడదు అంటారు. అలానే మన జీవితంలో ఏ నిమిషం ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేం. మరణమనే మాట వింటే చాలు చాలా భయపడిపోతూ ఉంటాం. కానీ మరణమే లేకుంటే.. చావు అనే భయమే మనకు ఉండదు. ఇలా అమరత్వం పొందిన అండీ(చార్లీజ్ థెరాన్) తన జీవితం కేవలం ప్రతీకారం తీర్చుకోవడానికే అంటోంది. తన జీవితంలో ప్రశాంతత లేకుండా చేసిన ఓ బృందాన్ని అన్వేషిస్తుంది. వాళ్లకు సంబంధించిన ప్రతిదాన్నీ నాశనం చేయడానికి రంగంలోకి దిగుతుంది. ఏ మాత్రం జాలి లేకుండా తన బాధకు కారణమైన ప్రతి ఒక్కరిని వేటాడుతూనే, ఈ పోరాటం ప్రతి నిమిషం మరణం వైపు ఒక అడుగు అంటోంది. ఇలా థ్రిల్‌ని పంచుతూ, ప్రేక్షకుడి ఊహకందనిరీతిలో యాక్షన్ సన్నివేశాలతో సాగే ఈ చిత్రానికి విక్టోరియా మహోని దర్శకత్వం వహించారు.

సినిమా: 'ది ఓల్డ్ గార్డ్ 2'
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్
విడుదల: బుధవారం
నటీనటులు: చార్లీజ్ థెరాన్, కికి లేన్

పవన్‌కల్యాణ్ అభిమానిగా కనిపిస్తా


సప్తమి గౌడ

'తమ్ముడు' సినిమా కోసం గుర్రపుస్వారీ నేర్చుకున్నానని... చిత్రీకరణలో భాగంగా రోజూ మూడు నుంచి నాలుగు గంటలు స్వారీ చేయాల్సి వచ్చేదని చెప్పారు కథానాయిక సప్తమిగౌడ. 'కాంతార' సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించిన కథానాయిక ఈమె. 'తమ్ముడు' సినిమాతో తెలుగు తెరకు పరిచయం అవుతోంది. ఇందులో రత్న పాత్రలో సందడి చేయనుందామె. నితిన్ కథానాయకుడిగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందించిన ఈ చిత్రాన్ని దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ఈ నెల 4న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు సప్తమిగౌడ.

"విజయవంతమైన 'కాంతార' తర్వాత నాకు పలు భాషల నుంచి అవకాశాలు వచ్చాయి. అయితే ఎక్కువ సినిమాలు 'కాంతార'లో నేను చేసిన పాత్రనే పోలి ఉన్నాయి. దాంతో వాటిని ఒప్పుకోలేదు. సరిగ్గా అదే సమయంలోనే 'తమ్ముడు' కోసం దర్శకుడు శ్రీరామ్ వేణు నుంచి నాకు కాల్ వచ్చింది. హైదరాబాద్‌కి వచ్చాక... సంభాషణలతో సహా రత్న పాత్రకి సంబంధించిన పూర్తి స్క్రిప్ట్‌ని ఇచ్చారాయన. చాలా నచ్చింది. లుక్ టెస్ట్‌లోనూ పాల్గొన్నా. ఈ పాత్ర కోసం గుర్రపుస్వారీ నేర్చుకోవాలనీ చెప్పారు. కథ, పాత్రలు నచ్చడంతో నేను వెనకడుగు వేయలేదు. ఈ సినిమా కోసం ఎంపికైన మొట్ట మొదటి నటిని నేనే".

❑ "ఈ సినిమాలో నా లుక్ చూస్తే 'కాంతార'కి దగ్గరగా అనిపించొచ్చు కానీ, నేను పోషించిన రత్న పాత్ర పూర్తి భిన్నమైనది. అంబరగొడుగు అనే ఊరిలో ఉంటుంది రత్న. తను కథానాయకుడు పవన్‌కల్యాణ్‌కి అభిమాని. ఆ పాత్రకి ఓ ప్రేమకథ కూడా ఉంటుంది. 'తమ్ముడు' సీరియస్ సబ్జెక్ట్ అయినా, రత్న పాత్ర కారణంగా నవ్వులు కూడా పండుతాయి. పాత్ర నిడివి తక్కువే కానీ, నటనకి మాత్రం మంచి పేరొస్తుంది. సినిమాపై చాలా ప్రభావం చూపించే పాత్ర. ఎక్కువగా ఆస్వాదిస్తూ రాసిన పాత్ర నీదే అని దర్శకుడు కూడా చెప్పారు. ఇందులో కనిపించే మహిళల పాత్రలన్నీ కూడా చాలా బలంగా ఉంటాయి. మహిళా ప్రేక్షకులు మరింతగా సంతోషిస్తారు. అరకు కొండలు, గుట్టల్లో గుర్రపుస్వారీ చేస్తూ, చిత్రీకరణలో పాల్గొనడం వెనక ఎంతో కష్టం ఉండేది. ఆ కష్టానికి తగ్గ ఫలితం తప్పకుండా వస్తుంది. నితిన్‌తో నటించడం, అది కూడా 'తమ్ముడు'లాంటి కథలో నటించడం ఎంతో తృప్తినిచ్చింది. థియేట్రికల్‌గా ఓ గొప్ప అనుభూతిని పంచే చిత్రమిది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో నా తొలి తెలుగు సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నా".

❑ "భాషతో సంబంధం లేకుండా నా ప్రయాణం కొనసాగుతోంది. వాణిజ్య ప్రధానమైన సినిమాల్లో నటించడం అంటేనే నాకు ఇష్టం. 'పుష్ప' సినిమాల్లో రష్మిక చేసిన శ్రీవల్లి పాత్ర నాకు చాలా నచ్చింది. అలాంటి అవకాశాలు వస్తే కాదనను. విభిన్నమైన ప్రయత్నాలన్నా నాకు ఇష్టమే. ప్రస్తుతం తెలుగులో 'తమ్ముడు' కాకుండా రెండు చిత్రాలు చేస్తున్నా. తమిళం, కన్నడ భాషల్లోనూ నటిస్తున్నా".

వెండితెరపైకి మోహన్‌లాల్ కుమార్తె


విస్మయ మోహన్‌లాల్

ఇటీవలే 'తుడరుమ్' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించారు మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్. ఈ జోష్‌లోనే ఇప్పుడాయన మరో కొత్త కబురు వినిపించారు. తన కుమార్తె విస్మయ మోహన్‌లాల్‌ను తెరకు పరిచయం చేస్తూ.. తమ సొంత నిర్మాణ సంస్థ ఆశీర్వాద్ సినిమాస్‌లో 'తుడక్కం' పేరుతో ఓ సినిమాని నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. '2018' సినిమాతో సినీప్రియుల్ని మెప్పించిన దర్శకుడు జూడ్ ఆంథోని జోసెఫ్‌తో దీనికి దర్శకత్వం వహించనున్నారు. ఇదొక వినూత్నమైన పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబు కానుందని.. దీంట్లో మోహన్‌లాల్ కూడా కీలక పాత్రలో కనువిందు చేసే అవకాశముందని సమాచారం. ప్రస్తుతం దీని చిత్రీకరణ మొదలైంది. త్వరలో మరిన్ని వివరాలు వెల్లడికానున్నాయి.

ధనుష్ ప్రేమ సంఘర్షణ


కృతి సనన్, ధనుష్

ఇటీవలే 'కుబేర' సినిమాతో ప్రేక్షకులను అలరించారు నటుడు ధనుష్. తాను నటించిన తదుపరి సినిమా చిత్రీకరణ పూర్తయిందంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు. ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో ధనుష్, కృతి సనన్ జంటగా నటించిన చిత్రం 'తేరే ఇష్క్ మే'. ఆనంద్ ఎల్ రాయ్, హిమాంశు శర్మ, భూషణ్ కుమార్, కృష్ణ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఏ ఆర్ రెహమాన్ సంగీతమందిస్తున్నారు. ధనుష్, బాలీవుడ్ నటి సోనమ్ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన 'రాంఝనా'కి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. ఇప్పటికే ఈ సినిమాలోని ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ చిత్రబృందం పంచుకున్న వీడియోలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. శంకర్ అనే యువకుడిగా ధనుష్, ముక్తి అనే అమ్మాయి పాత్రలో కృతి ఈ చిత్రంలో నటిస్తున్నారు. వైవిధ్యమైన ప్రేమ కథతో రూపొందుతోన్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిన విషయాన్ని తెలుపుతూ గాయాలై రక్తం కారుతూ ఉన్న ఇద్దరు వ్యక్తులు చేయి చేయి పట్టుకున్న ఓ ఫోటోని ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు ధనుష్. ఈ సినిమా నవంబరు 28న థియేటర్లలో విడుదల కానుంది. ఇందులో ప్రభుదేవా, సుశీల్ దహియ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

మంచి సినిమాలతోనే వస్తా: నితిన్


శిరీష్, దిల్‌రాజు, నితిన్, శ్రీరామ్ వేణు

గత కొన్ని సినిమాలతో ప్రేక్షకుల్ని సంతోష పెట్టలేకపోయాననీ, ఇకపైన మంచి సినిమాలతోనే వస్తానని చెప్పారు కథానాయకుడు నితిన్. థియేటర్లలో 'తమ్ముడు' పంచే అనుభవం గొప్పగా ఉంటుందన్నారు. దర్శకుడు శ్రీరామ్ వేణు, ఇతర నటీనటులు, సాంకేతిక బృందం ఎంతో శ్రమించిందని, వాళ్లందరి కోసం ఈ సినిమా ఘన విజయం సాధించాలన్నారు. కొన్ని నెలలుగా నిరుత్సాహంగా ఉంటున్నా, నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్ నా భుజం తట్టి నాలో ఉత్సాహాన్ని నింపారన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో 'తమ్ముడు' విడుదలకి ముందస్తు వేడుక జరిగింది. ఈ కార్యక్రమంలో నితిన్‌తోపాటు, చిత్ర బృందం పాల్గొంది. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "మా సంస్థకు 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత మరో మంచి విజయం 'తమ్ముడు'తో రానుంది. రామ్‌చరణ్‌తో 'గేమ్ ఛేంజర్' చేశాం కానీ, సూపర్‌హిట్ ఇవ్వలేకపోయామనే లోటు ఉంది. అందుకే త్వరలోనే రామ్‌చరణ్‌తో సినిమాని ప్రకటిస్తాం" అన్నారు.

ఆయుష్మాన్‌తో సారా


సారా అలీఖాన్


ఆయుష్మాన్ ఖురానా

సారా అలీఖాన్, ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో ఓ చిత్రం తెరకెక్కనుంది. దీనిని ధర్మ ప్రొడక్షన్స్, సిఖ్యా ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కథ రచయిత ఆకాష్ కౌశిక్ దర్శకత్వంలో యాక్షన్ కామెడీ నేపథ్యంలో రూపొందుతోంది. తాజాగా చిత్రబృందం చిత్రీకరణ ప్రారంభమైంది.. త్వరలోనే సినిమా టైటిల్‌ని ప్రకటిస్తామంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించింది. ప్రస్తుతం సారా.. అనురాగ్ బసు దర్శకత్వం వహించిన 'మెట్రో ఇన్ దినో'తో జులై 4న థియేటర్‌లో ప్రేక్షకులను పలకరించనుంది.

నా మాటని తప్పుగా అర్థం చేసుకున్నారు


విక్రాంత్ మాస్సే

'ట్వెల్త్ ఫెయిల్'తో దేశవ్యాప్తంగా మంచి క్రేజ్‌ను సంపాదించుకున్న విక్రాంత్ మాస్సే.. ఇటీవలే నటనకు కొన్ని రోజులు విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ విషయంపై మరోసారి మాట్లాడుతూ.. నన్ను నేను తీర్చిదిద్దుకోవడానికి.. కొత్తగా నిరూపించుకోవడానికే ఈ విరామమని అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న విక్రాంత్ మాట్లాడుతూ.. "చాలా మంది మీరు ఎందుకు సినిమాల నుంచి రిటైర్ అయ్యారని అడుగుతున్నారు. బహుశా వాళ్లు నేను పెట్టిన పోస్టును తప్పుగా అర్థం చేసుకున్నట్లు ఉన్నారు. అభిమానులకు నేను విరామం తీసుకోవడం ఇష్టం లేదేమో. కానీ నన్ను నేను మెరుగుపరచుకోవాలనుకుంటున్నా. 'ట్వెల్త్ ఫెయిల్', 'ది సబర్మతీ రిపోర్ట్' సినిమాల తర్వాత చాలా అవకాశాలు వచ్చాయి. ఏడాదికి 10 చిత్రాలు చేయలేను. అందుకే నాకు కొంత సమయం అవసరమని తెలియజేయడానికే ఆ పోస్ట్ పెట్టాన"ని చెప్పుకొచ్చారు.

'మాలిక్' యాక్షన్ హంగామా!


మానుషి చిల్లర్, రాజ్‌కుమార్ రావు

బాలీవుడ్ సినీనటుడు రాజ్‌కుమార్ రావు ఇటీవల నటించిన చిత్రం 'భూల్ చుక్ మాఫ్'. దీని తర్వాత రాజ్‌కుమార్ నుంచి వస్తోన్న యాక్షన్ చిత్రం 'మాలిక్'. మంగళవారం ఈ చిత్ర ట్రైలర్‌ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంది చిత్రబృందం. ఇందులో రాజ్‌కుమార్ ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా భయంకరమైన గ్యాంగ్‌స్టర్‌గా కనిపిస్తాడు. ఇది పొలిటికల్ క్రైమ్ డ్రామా. పుల్కిత్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 11న థియేటర్లలోకి రానుంది. ఇందులో సౌరబ్ శుక్లా, సౌరబ్ సచ్‌దేవా, మానుషి చిల్లర్ ప్రధానపాత్రల్లో నటించారు. ఈ చిత్రం 1980ల నాటి అలహాబాద్ నేపథ్యంలో సాగే కథ ఇది. రాజ్‌కుమార్ రావు తన పాత్ర గురించి మాట్లాడుతూ..."నేను ఇలాంటి పాత్రను చేయడం ఇదే మొదటిసారి. ఇది నటుడిగా నన్ను మరింత ముందుకు నడిపించింది. క్రూరమైన గ్యాంగ్‌స్టర్‌గా నటించడం థ్రిల్లింగ్‌గా ఉంది" అని అన్నారు.

అరుదైనవి సాధిస్తామా?

- భూఅయస్కాంతాల్లో స్వయం సమృద్ధిపై దృష్టి
- రూ.5,000 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేస్తున్న కేంద్రం
- ఇప్పటివరకు చైనా ఎగుమతులపైనే ఆధారం
- ఇకపై పరిస్థితి మారుతుందని ఆశ



అరుదైన భూఅయస్కాంతాలు (రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్).. విమానాలు, కంప్యూటర్లు, కార్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాల వంటి వస్తువుల తయారీలో కీలకం. ఈ విడిభాగాల కొరత ప్రపంచ దేశాలను కలవర పెడుతోంది. వీటిని ఉత్పత్తి చేయటంలో పూర్తిస్థాయి గుత్తాధిపత్యం ఉన్న చైనా, అన్ని దేశాలకు సరఫరాలు నిలిపివేయడమే ఇందుకు కారణం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వివిధ దేశాల ఉత్పత్తులపై సుంకాలు విధిస్తూ, చైనా వస్తువులపై మరింత అధిక భారాన్ని మోపిన సమయంలో.. వీటి ఎగుమతులను చైనా నిలిపేసింది. అప్పటివరకు దిగుమతి చేసుకున్న నిల్వలతోనే ప్రస్తుతం వివిధ దేశాల్లో ఆయా వస్తువుల తయారీ సాగుతోంది. కానీ నిల్వలు తగ్గిపోతున్నందున, చైనాను ఒప్పించేందుకు మన దేశం సహా పలు దేశాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ తయారీకి సబ్సిడీ పథకాన్ని తీసుకుని రావడంపై ప్రభుత్వం అతి త్వరలో నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి తెలిపారు. రూ.5,000 కోట్ల బడ్జెట్‌తో కొత్త పథకాన్ని తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కొన్ని దేశీయ కంపెనీలు ఈ రంగంలోకి అడుగు పెట్టడానికి ఆసక్తి చూపాయి. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ తయారీకి అవసరమైన లోహాల కోసం గనుల తవ్వకాన్ని సులభతరం చేసేందుకు ఖనిజాల చట్టానికి సవరణలనూ ప్రతిపాదిస్తున్నారు.



తగ్గిన సరఫరాలు...

మనదేశం గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో చైనా నుంచి 53,750 టన్నుల అరుదైన భూఅయస్కాంతాలను దిగుమతి చేసుకుంది. ప్రపంచ దేశాల వినియోగంలో 90% చైనానే సరఫరా చేస్తోంది. ఇటీవలి పరిణామాలతో చైనా నుంచి వీటి ఎగుమతులు గతేడాదితో పోలిస్తే 60% క్షీణించాయి.

అరుదైన భూఅయస్కాంతాలంటే...




- 'పీరియాడిక్ టేబుల్' లోని 17 లోహాలను అరుదైన భూఅయస్కాంతాలుగా పరిగణిస్తున్నారు. స్కాండియమ్, ఎట్రియమ్, లాంథానమ్, సెరియమ్, ప్రసేడిమియమ్, నియోడైమియమ్.. తదితర లోహాలు ఇందులో ఉన్నాయి.
- వీటికి అయస్కాంత శక్తితో పాటు వెలుగునివ్వడం, విద్యుత్తు వాహకాలుగా పనిచేసే ప్రత్యేకతలున్నాయి. ఇనుము, ఇతర లోహాల్లో ఇవి సులువుగా కలిసిపోతాయి.
- అరుదైన భూఅయస్కాంత లోహాలనే పేరే కానీ ఇవి భూమి లోపలి పొరల్లో ఎంతో అధికంగా దొరుకుతాయి. కాకపోతే వాటిని వెలికితీయడం బాగా ఖర్చుతో కూడిన వ్యవహారం.
- అరుదైన భూఅయస్కాంత లోహాలు భూమి పొరల్లో రేడియోయాక్టివ్ గుణాలు ఉన్న యురేనియం, థోరియంతో కలిసి ఉంటాయి. అందువల్ల వీటిని వేరుచేసి, బయటకు తీయటం కష్టమైన పని, ప్రమాదకరం కూడా.


దేనికి వినియోగిస్తారు?



అన్ని రకాల ఎలక్ట్రానిక్ సాధనాల్లో అరుదైన భూఅయస్కాంతాలను వినియోగిస్తారు. విద్యుత్తు, అయస్కాంత శక్తి అవసరమైన అన్ని సాధనాల్లో, వాటికి సంబంధించిన ఎలక్ట్రానిక్ సర్క్యూట్లలో ఇవి తప్పనిసరి. కంప్యూటర్లు, స్మార్ట్ టీవీలు, కార్లు, సముద్ర గర్భంలో వేసే అండర్-సీ ఫైబర్ ఆప్టిక్ కేబుళ్లు, పలు రకాల ఎలక్ట్రానిక్ సాధనాల్లో వీటిని అధికంగా వినియోగిస్తున్నారు. దొంగ నోట్ల ముప్పు తలెత్తకుండా యూరో బ్యాంక్ నోట్లలోనూ వీటిని వినియోగిస్తున్నారు.



చైనా ఆధిపత్యం ఎలా?



దేన్నైనా పెద్దగా ఆలోచించడం, దాన్ని కట్టుదిట్టంగా అమలు చేయడమే చైనా విజయ రహస్యం. అరుదైన భూఅయస్కాంత లోహాల విషయంలోనూ అదే విధానాన్ని అమలు చేసింది. 4 దశాబ్దాల క్రితమే చైనా భారీగా పెట్టుబడులు పెట్టి, అరుదైన భూఅయస్కాంతాల తయారీని ప్రోత్సహించింది. అరుదైన ఖనిజాలను తవ్వడమే కాకుండా, వాటిని ప్రాసెస్ చేసి అయస్కాంతాలను ఉత్పత్తి చేయడంలో పరిణతి సాధించింది. పాతికేళ్ల గడిచే సరికి ప్రపంచ మార్కెట్‌ను శాసించే స్థాయికి చేరుకుంది. ఉత్పత్తి వ్యయాలు తక్కువగా ఉండటం, ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర ప్రోత్సాహకాలు ఎక్కువగా ఉండటం, ఈ తరహా ఖనిజాలకు కొరత లేకపోవటంతో చైనా ప్రణాళికలు విజయవంతం అయ్యాయి. అమెరికా, ఐరోపా నుంచి భారతదేశం వరకు భూఅయస్కాంతాల కోసం పూర్తిగా చైనాపైనే ఆధారపడి ఉన్నాయి.

అరుదైన భూఅయస్కాంత లోహాల లభ్యత అధికంగా ఉన్న దేశాలు

- చైనా ● బ్రెజిల్ ● భారత్ ● ఆస్ట్రేలియా ● యూఎస్ఏ

(అమెరికా ఒకప్పుడు అరుదైన భూఅయస్కాంతాలను అధికంగా ఉత్పత్తి చేసేది. కానీ ఇప్పుడు అరుదైన ఖనిజాలను తవ్వి, భూఅయస్కాంతాల తయారీ కోసం చైనాకు సరఫరా చేస్తోంది.)

- ఈనాడు, హైదరాబాద్

ఈనాడు బిజినెస్

ముంబయి-మాంచెస్టర్ విమాన సర్వీస్: ఇండిగో

ముంబయి: దేశీయ విమాన దిగ్గజం ఇండిగో, సుదూర అంతర్జాతీయ కార్యకలాపాలను మంగళవారం ప్రారంభించింది. ముంబయి నుంచి బయలుదేరిన విమానం నేరుగా మాంచెస్టర్‌లో ల్యాండ్ కావడం ద్వారా ఈ సేవలకు శ్రీకారం చుట్టింది. బోయింగ్ 787-9 డ్రీమ్‌లైనర్ విమానంతో వారానికి మూడు సార్లు ఈ కొత్త మార్గంలో ప్రయాణం ఉంటుంది. బ్రిటన్ ఆర్థిక రాజధాని, ఉత్తర ఇంగ్లండ్‌లో సంప్రదాయాల కేంద్రాలను ఈ విమాన సర్వీస్ కలుపుతుందని కంపెనీ సీఈఓ పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. అంతర్జాతీయ కార్యకలాపాల కోసం 6 వైడ్ బాడీ బీ787-9 విమానాలను ఇండిగో లీజుకు తీసుకుంది. ఈ ఏడాది మార్చిలో తొలి విమానం అందింది. 2026 కల్లా అన్నీ చేరతాయి.

ఆధార్ ఉంటేనే పాన్



ఈనాడు, హైదరాబాద్: కొత్తగా పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య) తీసుకోవాలని అనుకుంటున్నారా.. మీకు ఆధార్ ఉంటేనే ఇది సాధ్యం అవుతుంది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధన జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఇప్పటి వరకు పాన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు, గుర్తింపు కోసం ఏదైనా ప్రభుత్వ ధ్రువీకరణలో ఏదో ఒకటి సమర్పిస్తే సరిపోయేది. ఇక నుంచి తప్పనిసరిగా ఆధార్ సంఖ్య ఉండాల్సిందే. ఇప్పటికే పాన్ ఉన్నవారు కచ్చితంగా దాన్ని ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి. లేకపోతే పాన్ రద్దవుతుంది. చెల్లని పాన్‌తో ఏవైనా లావాదేవీలు చేసేందుకు ప్రయత్నిస్తే, జరిమానా విధిస్తారు.

అదానీ పవర్‌తో బంగ్లా వివాదం పరిష్కారం

దిల్లీ: విద్యుత్ సరఫరా ఒప్పందానికి సంబంధించి అదానీ పవర్‌తో ఉన్న సమస్యలను బంగ్లాదేశ్ పరిష్కరించుకుంది. బకాయిల నిమిత్తం గత 3-4 నెలలుగా ప్రతి నెలా 90-100 మిలియన్ డాలర్లు చెల్లిస్తూ వచ్చిన ఆ దేశం, జూన్‌లో 437 మిలియన్ డాలర్లు (సుమారు రూ.3,700 కోట్లు) చెల్లించేసింది. రెండు నెలల బిల్లింగ్‌కు లెటర్ ఆఫ్ క్రెడిట్ ఉండటంతో పాటు, మిగతా అన్ని బకాయిలకు అదనపు హామీ కింద సావరిన్ గ్యారంటీని బంగ్లాదేశ్ కలిగి ఉందని ఈ పరిణామాన్ని దగ్గర నుంచి గమనిస్తున్న వర్గాలు తెలిపాయి.

రూ.57 తగ్గిన వాణిజ్య సిలిండర్

హైదరాబాద్: వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధరను హైదరాబాద్‌లో రూ.57 తగ్గించి, రూ.1886.50గా చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రకటించాయి. ఈ సిలిండర్ ధర దిల్లీలో రూ.1,665, ముంబయిలో రూ.1,616.50కు దిగొచ్చింది. వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరను ఏప్రిల్ నుంచి తగ్గిస్తూ వస్తున్నారు.

విమాన ఇంధన ధర 7.5% పెంపు: విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర దిల్లీలో కిలో లీటరుకు 7.5% (రూ.6,271.5) పెరిగి రూ.89,344.05కు చేరింది. గత 3 నెలల్లో ఏటీఎఫ్ ధరను తగ్గించగా, జులై 1న పెంచారు. జూన్ 1న రూ.2,414.25, మే 1న రూ.3,954.38, ఏప్రిల్ 1న రూ.5,870.54 చొప్పున ఏటీఎఫ్ ధరలు తగ్గాయి. ముంబయిలో రూ.83,549.23కు, చెన్నైలో రూ.92,526.09కు, కోల్‌కతాలో రూ.92,705.74కు ఈ ధర పెరిగింది. వ్యాట్ వంటి స్థానిక పన్నుల నేపథ్యంలో నగరాల మధ్య ధరల వ్యత్యాసం ఉంటుంది.

కోడి గుడ్డు

26 ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	575
వరంగల్	577
విజయవాడ	590
గోదావరి	570
విశాఖపట్నం	585
చిత్తూరు	633

విడా వీఎక్స్2 విద్యుత్ స్కూటర్

ప్రారంభ ధర రూ.59,490

దిల్లీ: హీరో మోటోకార్ప్ తన కొత్త విద్యుత్ స్కూటర్ విడా వీఎక్స్2ను విడుదల చేసింది. ఇది రెండు రకాలుగా లభిస్తుంది. బ్యాటరీ యాజ్ ఎ సర్వీస్ (బాస్)తో ఈ వాహన ధరలు వరుసగా రూ.64,990, రూ.59,490గా ఉన్నాయి. బ్యాటరీతో కలిపి అయితే వాహన ధరలు రూ.1,09,990, రూ.99,490గా ఉన్నాయి. బూడిద, నీలం, ఎరుపు, పసుపు, నలుపు రంగుల్లో ఈ స్కూటర్ లభ్యమవుతుంది. ఎల్ఈడీ లైట్లు, జీపీఎస్ ట్రాకింగ్, ఫుల్లీ డిజిటల్ కలర్ టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, సీటు కింద హెల్మెట్ ఉంచేందుకు స్థలంతో పాటు మరి కొంత స్టోరేజ్, వెనుక వైపు బ్యాక్‌రెస్ట్, డైమండ్ కట్ ఫినిష్‌తో అల్లాయ్ వీల్స్, ఫ్రంట్ డిస్క్ బ్రేక్ వంటి సదుపాయాలు ఈ స్కూటర్లలో ఉన్నాయని వెల్లడించింది.

భారత్ భళా..

- 3 నెలల్లో సెన్సెక్స్ 12000 పాయింట్లు పైకి
- రూ.72 లక్షల కోట్లు పెరిగిన సంపద



దిల్లీ: సెన్సెక్స్ ఈ ఏడాది ఏప్రిల్ 7 నాటి కనిష్ఠ స్థాయైన 71,425 పాయింట్ల నుంచి 3 నెలల్లోపే 12,000 పాయింట్లు (దాదాపు 17%) పుంజుకుంది. తద్వారా జీవనకాల గరిష్ఠ స్థాయికి (85978.25) మళ్లీ చేరువవుతోంది. ఈ 3 నెలల్లో బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.72 లక్షల కోట్లు పెరిగింది. వరుసగా 4 నెలలుగా సెన్సెక్స్, నిఫ్టీ సానుకూలంగా కదలాడుతున్నాయి. దేశ - విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం ఇందుకు ఉపకరించింది.

డీఐఐలు రూ.3.57 లక్షల కోట్ల పెట్టుబడులు: స్టాక్ మార్కెట్లలో దేశీయ సంస్థాగత మదుపర్లు (డీఐఐ) జోరుగా పెట్టుబడులు పెడుతున్నారు. మ్యూచువల్ ఫండ్ సంస్థల ప్రాతినిధ్యం అధికంగా ఉండే డీఐఐలు, ఈ ఏడాది ప్రథమార్ధంలో ఏకంగా రూ.3.57 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు. 2024 మొత్తం మీద వీరు పెట్టిన రూ.5.26 లక్షల కోట్ల పెట్టుబడుల్లో ఇవి 68 శాతానికి సమానం. 2023 పెట్టుబడులు రూ.1.81 లక్షల కోట్లతో పోలిస్తే ఇవి దాదాపు రెట్టింపు. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) 2025 తొలి 3 నెలల్లో భారీగా అమ్మగా, గత 3 నెలల్లో కొన్నారు. అయినా 6 నెలల్లో చూస్తే రూ.1.3 లక్షల కోట్లు వెనక్కి తీసుకున్నట్లయ్యింది.

కంపెనీల్లో పెరిగిన వాటా: దేశీయ కంపెనీల్లో సంస్థాగత మదుపర్ల వాటాల్లో కూడా మార్పులొచ్చాయి. 2025 మార్చి త్రైమాసికానికి డీఐఐల వాటా 160 బేసిస్ పాయింట్లు పెరిగి జీవనకాల గరిష్ఠమైన 19.2 శాతానికి చేరింది. 2024 మార్చిలో ఇది 17.6 శాతంగా ఉంది. మన మార్కెట్లలో ఎఫ్ఐఐల వాటా 19.2% నుంచి రికార్డు కనిష్ఠమైన 18.8 శాతానికి చేరింది.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.84 లక్షల కోట్లు

జూన్‌లో స్థూల జీఎస్‌టీ వసూళ్లు 6.2% పెరిగి రూ.1.84 లక్షల కోట్లకు చేరాయి. కిందటేడాది జూన్‌లో ఇవి రూ.1,73,813 కోట్లుగా నమోదయ్యాయి. ఈ ఏడాది మే నెలలో వసూలైన రూ.2.01 లక్షల కోట్లతో పోలిస్తే, జూన్‌లో జీఎస్‌టీ వసూళ్లు తగ్గాయి.

14 నెలల గరిష్ఠానికి తయారీ వృద్ధి

భారత తయారీ రంగ కార్యకలాపాలు పుంజుకున్నాయి. జూన్‌లో ఈ రంగ వృద్ధి 14 నెలల గరిష్ఠానికి చేరింది. రంగం పని తీరుకు సూచికగా వాడే హెచ్ఎస్‌బీసీ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్ ఇండెక్స్ (పీఎంఐ) జూన్‌లో 58.4 పాయింట్లకు చేరింది. మే నెలలో ఇది 57.6 పాయింట్లుగా నమోదైంది.

రిటెయిల్ మదుపర్లూ ముందుకే: కొన్నేళ్లుగా రిటెయిల్ మదుపర్లు బ్యాంక్ డిపాజిట్ల నుంచి ఈక్విటీల వైపు పొదుపు మొత్తాలను తరలిస్తున్నారు. మ్యూచువల్ ఫండ్ల ద్వారా పెట్టుబడులు పెడుతున్నారు. మేలో మ్యూచువల్ ఫండ్ల నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) రికార్డు స్థాయిలో రూ.70 లక్షల కోట్లకు చేరింది. భారత బ్యాంకుల్లో డిపాజిట్ల విలువ రూ.227.4 లక్షల కోట్లుగా ఉంది.

దశాబ్దకాలంగా ఎస్‌బీఐలో అనూహ్య డిజిటల్ మార్పులు

నిర్మలా సీతారామన్



దిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) గత దశాబ్దకాలంలో చేపట్టిన డిజిటలీకరణ ఫలితంగా, ఖాతాదార్లకు భారీ ప్రయోజనాలు లభించాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. దేశ సేవలో 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్‌బీఐకి అభినందనలు తెలిపారు. 2047 కల్లా 'వికసిత్ భారత్' దిశగా చేస్తున్న ప్రయాణంలో ఎస్‌బీఐ కీలక పాత్ర పోషించగలదని మంత్రి పేర్కొన్నారు. '23,000కి పైగా శాఖలు, 78,000 కస్టమర్ సర్వీస్ పాయింట్లు, 64,000 ఏటీఎంలతో ఎస్‌బీఐ, ప్రతి భారతీయుడి బ్యాంకరుగా నిలిచింద'ని సీతారామన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. '1.5 కోట్ల మంది రైతులు, 1.3 కోట్ల స్వయం సహాయ గ్రూపులు, 32 లక్షల మంది వీధి వ్యాపారులు, 23 లక్షల ఎమ్ఎస్ఎమ్ఈలకు ఎస్‌బీఐ మద్దతుగా నిలిచింది. 15 కోట్ల జన్‌ధన్ ఖాతాలు, 14.65 కోట్ల పీఎమ్ సురక్ష బీమా యోజన, 1.73 కోట్ల అటల్ పెన్షన్ యోజన, 7 కోట్ల పీఎమ్ జీవన్ జ్యోతి బీమా యోజన ఖాతాదార్లు ఎస్‌బీఐకి ఉన్నార'ని మంత్రి అన్నారు.

✦ అంతర్జాతీయ ఆర్థిక, క్రెడిట్ రేటింగ్ వ్యవస్థల్లో సంస్కరణలు తీసుకురావాలని భారత్ కోరుకుంటోందని మంత్రి తెలిపారు.

మారుతీ, హ్యుందాయ్ విక్రయాలు తగ్గాయ్



దేశీయ గిరాకీ నెమ్మదించడం వల్లే

దిల్లీ: మారుతీ సుజుకీ, హ్యుందాయ్ మోటార్ దేశీయ సరఫరాలు, 2024 జూన్‌తో పోలిస్తే గత నెలలో రెండంకెల క్షీణతను నమోదు చేశాయి. టాటా మోటార్స్ సరఫరాలూ తగ్గాయి. దేశీయ విపణిలో గిరాకీ నెమ్మదించడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. మహీంద్రా అండ్ మహీంద్రా నుంచి డీలర్లకు వాహన సరఫరాలు మాత్రం గతనెలలో పెరిగాయి.

✦ మారుతీ సుజుకీ గత నెలలో డీలర్లకు 1,18,906 ప్రయాణికుల వాహనాలను సరఫరా చేసింది. 2024 జూన్‌లో సరఫరా చేసిన 1,37,160 వాహనాలతో పోలిస్తే ఇవి 13% తక్కువ. చిన్న కార్ల విభాగంలో ఆల్టో, ఎస్-ప్రెసో విక్రయాలు 9,395 నుంచి 6,414కు తగ్గాయి. కాంపాక్ట్ కార్లలో బాలెనో, సెలెరియో, డిజైర్, ఇగ్నిస్, స్విఫ్ట్, వ్యాగన్‌ఆర్ విక్రయాలు 64,049 నుంచి 54,177కు పరిమితమయ్యాయి. యుటిలిటీ కార్లలో గ్రాండ్ విటారా, బ్రెజా, ఎర్టిగా, ఎక్స్ఎల్6, జిమ్నీ విక్రయాలు 52,373 నుంచి 47,947కు తగ్గాయి.

✦ హ్యుందాయ్ మోటార్ ఇండియా దేశీయ విపణిలో డీలర్లకు గత నెలలో 44,024 కార్లను సరఫరా చేసింది. 2024 జూన్‌లో సరఫరా చేసిన 50,103 వాహనాలతో పోలిస్తే, 12% క్షీణత నమోదైంది.

జూన్‌లో వివిధ కంపెనీల మొత్తం వాహన విక్రయాలు

కంపెనీ	2025	2024	వృద్ధి/క్షీణత(%)
మారుతీ సుజుకీ	1,67,993	1,79,228	−6
టాటా మోటార్స్✦	65,019	74,147	−12
మహీంద్రా & మహీంద్రా	78,969	69,271	14
హ్యుందాయ్ మోటార్	60,294	64,803	−6
టయోటా	28,869	27,474	5
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,60,806	3,58,477	1
టీవీఎస్ మోటార్	4,02,001	3,33,646	20
రాయల్ ఎన్‌ఫీల్డ్	89,540	73,141	22
హీరో మోటోకార్ప్	5,53,963	5,03,448	10
హోండా మోటార్‌సైకిల్	4,29,147	5,18,799	−17

✦ దేశీయ విక్రయాలు

ఇళ్ల ధరలు సగటున 4-6% పెరగొచ్చు: క్రిసిల్ అంచనా



దిల్లీ: ఇళ్ల/ప్లాట్ల ధరలు మధ్య కాలంలో (మీడియం టర్మ్) సగటున 4-6% పెరిగే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. గత 2 ఆర్థిక సంవత్సరాల్లో ధరల పెరుగుదల రెండంకెల మేర ఉందని తెలిపింది. ఇళ్లు/ప్లాట్లు నిర్మిస్తున్న స్థిరాస్తి డెవలపర్లు ఈ ఆర్థిక సంవత్సరం/వచ్చే ఆర్థిక సంవత్సరంలో స్థిరమైన విక్రయాలు చేయగలుగుతారని పేర్కొంది. కొవిడ్ పరిణామాల నుంచి రికవరీ అయిన మూడేళ్ల తర్వాతా ఇళ్లకు గిరాకీ స్థిరంగా ఉందని, విక్రయాల పరిమాణం 5-7%, సగటు ధరలు 4-6% పెరగొచ్చని క్రిసిల్ అంచనా వేసింది. 2025-26, 2026-27ల్లోనూ గిరాకీని మించి, ఇళ్లు/ప్లాట్ల సరఫరా కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. దేశంలో సుమారు 35% ఇళ్లు/ప్లాట్లు విక్రయిస్తున్న 75 స్థిరాస్తి కంపెనీలను విశ్లేషించి.. వాటి బ్యాలెన్స్ షీట్లు, రుణ చెల్లింపుల సామర్థ్యాలు ఆరోగ్యకరంగా ఉన్నాయని క్రిసిల్ వివరించింది. గత ఆర్థిక సంవత్సరంలో గిరాకీలో పెద్దగా మార్పు లేదని పేర్కొంది. రుణ వడ్డీ రేట్లు తగ్గడం, ఇళ్ల ధరల్లో వృద్ధి స్వల్పంగానే ఉండటం స్థిరాస్తి విపణికి కలిసి రావొచ్చని క్రిసిల్ అంచనా వేసింది.

యూపీఐ లావాదేవీల్లో 32% వృద్ధి



దిల్లీ: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు వార్షిక ప్రాతిపదికన ఈ ఏడాది జూన్‌లో 32% పెరిగి 1840 కోట్లకు చేరాయని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెల్లడించింది. విలువ పరంగా 20% పెరిగి రూ.24.04 లక్షల కోట్లకు చేరాయని తెలిపింది. ఈ ఏడాది మే నెలతో పోలిస్తే లావాదేవీలు, విలువ పరంగా కూడా గత నెలలో తక్కువగా నమోదయ్యాయి. మేలో రికార్డు స్థాయిలో 1868 కోట్ల లావాదేవీలు జరిగాయి. వీటి విలువ రూ.25.14 లక్షలకోట్లు. జూన్‌లో రోజువారీ సగటు లావాదేవీల సంఖ్య 61.3 కోట్లుగా ఉంది. మే నెలలో రోజుకు 60.2 కోట్ల లావాదేవీలు జరిగాయి. విలువ పరంగా రోజువారీ సగటు మొత్తం జూన్‌లో రూ.80,131 కోట్లు కాగా, మేలో రూ.81,106 కోట్లుగా నమోదైంది.

రూ.100తో సిప్.. సాధ్యాసాధ్యాలు చూశాకే

బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ

ముంబయి: చిన్న మదుపరులు రూ.100తోనూ క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసేందుకు దోహదపడే 'చోటా సిప్' తీసుకొచ్చేందుకు మరో 6 నెలలు పట్టొచ్చని బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ తెలిపింది. ఇది ఎంత మేరకు ఆచరణ సాధ్యం అనే అంశాన్ని పరిశీలించాకే తీసుకొస్తామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గణేష్ మోహన్ మంగళవారం వెల్లడించారు. రూ.100 నుంచీ సూక్ష్మ పెట్టుబడులను సాధ్యం చేసేందుకు అనువైన సాంకేతిక పరిష్కారాలపై పనిచేస్తున్నామని వివరించారు. చిన్న మదుపరులను ప్రోత్సహించే లక్ష్యంతో, ఈ ఏడాది ప్రారంభంలో మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఈ చోటా సిప్‌ను ప్రకటించింది. ఇప్పటికే ఎస్‌బీఐ, కోటక్ ఏఎంసీ దీన్ని తీసుకొచ్చాయి.

సేవింగ్స్ ఖాతాలో కనీస నిల్వ లేకున్నా అపరాధ రుసుము లేదు: పీఎన్‌బీ

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తన ఖాతాదార్లకు శుభవార్త చెప్పింది. సేవింగ్స్ ఖాతాల్లో కనీస సగటు నిల్వ (ఎమ్ఏబీ) లేనిపక్షంలో విధించే అపరాధ రుసుమును మినహాయిస్తున్నట్లు తెలిపింది. జులై 1 నుంచే ఇది అమల్లోకి వచ్చింది. మహిళలు, రైతులు, అల్పాదాయ కుటుంబాలకు మద్దతుగా నిలిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంకు ఎండీ, సీఈఓ అశోక్‌చంద్ర పేర్కొన్నారు.

ఫ్రెంచి కంపెనీకి పరాస్ యాంటీ డ్రోన్ టెక్నాలజీ సేవలు

డ్రోన్లపై ఎదురుదాడి చేసే సాంకేతికత బదిలీ

ముంబయి: మానవరహిత విమానాల (యూఏవీ)పై ఎదురుదాడి చేసే అత్యాధునిక సాంకేతికతను ఫ్రాన్స్‌కు చెందిన సెర్బెయిర్ సంస్థకు అందించనున్నట్లు పరాస్ యాంటీ డ్రోన్ టెక్నాలజీ ప్రకటించింది. ఈ ఒప్పందం విలువ రూ.22 కోట్లు. ఈ యూరోపియన్ కౌంటర్-యూఏవీ కంపెనీ దాదాపు 30 వరకు చిమెరా 200 వ్యవస్థలను సొంతం చేసుకోవాలని భావిస్తోంది. రేడియో ఫ్రీక్వెన్సీలను గుర్తించే, మానవ రహిత విమానాలను తటస్థీకరించే సత్తా ఉన్న పోర్టబుల్ వ్యవస్థలు ఇవి. డ్రోన్/డ్రోన్‌ల గుంపుపై దాడి చేసేలా వీటిని డిజైన్ చేసినట్లు కంపెనీ తెలిపింది. కొత్త తరం, అత్యాధునిక రక్షణ సాంకేతికతల ఎగుమతి విషయంలో భారత్ స్థానాన్ని ఈ ఒప్పందం బలోపేతం చేయగలదని పరాస్ యాంటీ డ్రోన్ టెక్నాలజీస్ తెలిపింది. పరాస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీస్‌కు ఇది అనుబంధ కంపెనీ.

ఇలా పనిచేస్తుంది: చిమెరా 200 అనేది కౌంటర్ యూఏవీ వ్యవస్థ. డ్రోన్లు, రిమోట్ కంట్రోళ్లు, వాటి టేకాఫ్, నియంత్రణ ప్రాంతాలను కచ్చితత్వంతో గుర్తించగలదు. వీటిని గుర్తించడంతో పాటు ప్రమాదాలను తటస్థీకరిస్తుంది కూడా. అన్ని దిశల్లోనూ పనిచేయడం దీని ప్రత్యేకత.

బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లు



సెన్సెక్స్ ▲ 91 — 83697

నిఫ్టీ ▲ 25 — 25542

ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.1970.04 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు.. రూ.771.08 కోట్లు

సమీక్ష

మన స్టాక్ మార్కెట్ మంగళవారం లాభాల్లో ముగిసేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాంటి బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లు ఉపకరించాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 17 పైసలు తగ్గి రూ.85.59 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.46% పెరిగి 67.03 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్ మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ మంగళవారం రూ.10,000 కోట్లు పెరిగి రూ.461.26 లక్షల కోట్ల (5.39 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

ఒడుదొడుకుల్లో..: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 83,606.46తో పోలిస్తే 80) పాయింట్ల లాభంతో 83,685.66 వద్ద ఆరంభమైంది. 83,874.29 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసిన, ఒడుదొడుకుల మధ్య కిందకు వచ్చింది. చివరకు 90.83 పాయింట్ల లాభంతో 83,697.29 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 24.75 పాయింట్లు పెరిగి 25,541.80 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,593.40 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 25,501.80 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదుచేసింది.

17 కంపెనీల షేర్లు నష్టాల్లో..: సెన్సెక్స్ 30 షేర్లలో 17 కంపెనీల షేర్లు నష్టపోయాయి. యాక్సిస్ బ్యాంక్ షేరు 2.13%, ట్రెంట్ 1.25%, ఎటెర్నల్ 1.14%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.95%, టెక్ మహీంద్రా 0.94%, టీసీఎస్ 0.91%, పవర్‌గ్రిడ్ 0.72% తగ్గాయి. బీఈఎల్ 2.51%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.84%, ఏషియన్ పెయింట్స్ 1.17%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.10%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.93%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.54% పెరిగాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో టెలికాం 0.52%, ఇంధనం 0.46%, వినియోగ వస్తువులు 0.43%, లోహ 0.3% రాణించాయి. ఎఫ్ఎమ్‌సీజీ 0.68%, విద్యుత్ 0.41%; యుటిలిటీస్ 0.32%, ఐటీ 0.24% నష్టపోయాయి.

✦ దేశీయ మాల్ట్ స్పిరిట్ తయారీ సంస్థ పికాడిలీ ఆగ్రో ఇండస్ట్రీస్ షేర్లు నేడు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలో (ఎన్ఎస్ఈ) నమోదుకానున్నాయి. ఇప్పటికే ఈ కంపెనీ షేర్లు బీఎస్ఈలో ట్రేడవుతున్నాయి.

✦ రాజ్ పెట్రో స్పెషాలిటీస్ కొనుగోలును పూర్తి చేసినట్లు షెల్ ల్యూబ్రికెంట్స్ తెలిపింది. ఇందుకు ఎంత వెచ్చించిందీ వెల్లడించలేదు.

✦ ఐపీఓ ద్వారా రూ.1200 కోట్ల వరకు సమీకరించేందుకు సెబీ వద్ద వాహన విడిభాగాల సంస్థ హీరో మోటార్స్ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ.800 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో రూ.400 కోట్ల షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు.

✦ లాజిస్టిక్స్ సేవల ప్రొవైడర్ షాడోఫాక్స్ టెక్నాలజీస్, కాన్ఫిడెన్షియల్ ప్రీ-ఫైలింగ్ మార్గంలో సెబీకి ఐపీఓ ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది.

✦ సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా సునీల్ జయవంత్ కదమ్ బాధ్యతలు స్వీకరించారు.

✦ ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల బోర్డు సభ్యులను ఎంపిక చేసే ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) ఛైర్మన్, ఇతర సభ్యుల పదవీకాలాన్ని ప్రభుత్వం ఏడాది పాటు పొడిగించింది. దీంతో ఎఫ్ఎస్ఐబీ ప్రస్తుత ఛైర్మన్ భాను ప్రతాప్ శర్మ, ఇతర సభ్యులు 2026 జూన్ 30 వరకు కొనసాగనున్నారు.

సిగాచీ షేరుకు కొనసాగిన నష్టాలు

తెలంగాణలోని పాశమైలారం వద్ద ఉన్న సిగాచీ ఇండస్ట్రీస్ ప్లాంటులో రియాక్టరు పేలుడు వల్ల మరణించిన ఉద్యోగుల సంఖ్య అంతకంతకూ పెరుగుతుండటం, కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలకు ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఈ కంపెనీ షేరు వరుసగా రెండో రోజూ నష్టపోయింది. మంగళవారం బీఎస్ఈలో 5.57% నష్టపోయి రూ.46.07 వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో 8.36% కుదేలైంది. సోమవారం కూడా ఈ కంపెనీ షేరు 11.50% నష్టపోయింది.

శుభారంభం..

✦ స్థిరాస్తి అభివృద్ధి సంస్థ **కల్పతరు లిమిటెడ్** షేరు అరంగ్రేటంలో రాణించింది. బీఎస్ఈలో ట్రేడింగ్ ఇష్యూ ధర వద్ద (రూ.414)నే ప్రారంభమైనా, తదుపరి 9.42% పెరిగి రూ.453 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 4.78% లాభంతో రూ.433.80 వద్ద ముగిసింది. సంస్థ మార్కెట్ విలువ రూ.8,932.55 కోట్లుగా నమోదైంది.

✦ నిర్మాణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ **గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్స్** షేర్లు, ఇష్యూ ధర రూ.71తో పోలిస్తే 28.30% అధికంగా రూ.91.10 వద్ద నమోదయ్యాయి. ఆ తర్వాత 33.80% పెరిగి రూ.95 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరాయి. చివరకు 33.40% లాభంతో రూ.94.72 వద్ద ముగిశాయి.


✦ **ఎల్లెన్‌బ్యారీ ఇండస్ట్రియల్ గ్యాసెస్** షేర్లు ఇష్యూ ధర రూ.400తో పోలిస్తే 23% అధికంగా రూ.492 వద్ద నమోదయ్యాయి. చివరకు 35% లాభంతో రూ.541.20 వద్ద ముగిశాయి.

✦ వ్యాపార విభజన (డీమెర్జర్) ప్రక్రియ అనంతరం **రేమండ్ రియాల్టీ** షేరు మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైంది. బీఎస్ఈలో ఈ కంపెనీ షేరు ట్రేడింగ్ రూ.1,005 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత 4.99% లాభంతో రూ.1,055.20 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. చివరకు 4.2% నష్టంతో రూ.962.50 వద్ద ముగిసింది.

స్క్రీన్‌షాట్స్‌కు బార్డర్

డివైస్ సలహా

విండోస్ 11లో స్నిప్పింగ్ టూల్‌ను వాడుతున్నారా? దీంతో ఆటోమేటిక్‌గా స్క్రీన్‌షాట్స్‌కు బార్డర్‌నూ యాడ్ చేసుకోవచ్చని తెలుసా? కాకపోతే ఇందుకోసం సెటింగ్స్‌లో చిన్న మార్పు చేసుకోవాలి.



స్నిప్పింగ్ టూల్‌ను ఓపెన్ చేసి, మూడు చుక్కల మెనూ ద్వారా **సెటింగ్స్**‌లోకి వెళ్లాలి. కింద పరచుకున్న జాబితాలో **యాడ్ బార్డర్ టు ఈచ్ స్క్రీన్‌షాట్** ఆప్షన్‌ను ఆన్ చేసుకోవాలి. తర్వాత దాని పక్కనే **బాణం** గుర్తు మీద క్లిక్ చేసి **బార్డర్ కలర్, థిక్‌నెస్**‌ను ఎంచుకోవాలి. అంతే. స్క్రీన్‌షాట్ తీసిన ప్రతిసారీ నిర్ణయించుకున్న బార్డర్ జత చేరుతుంది.

మ్యూట్ ఇన్‌స్టా స్టోరీస్

ఇన్‌స్టాగ్రామ్‌లో ఎవరినో ఫాలో అవుతున్నారు. వారేమో బోలెడన్ని స్టోరీలు పోస్ట్ చేస్తున్నారు. వాటన్నింటినీ చూడాల్సిన అవసరం లేకపోవచ్చు. అలాంటప్పుడు **మ్యూట్ స్టోరీస్** ఆప్షన్ సాయం తీసుకోవచ్చు. మీరు ఫాలో అవుతున్న వారి స్టోరీ మీద తాకితే పైన కుడివైపున **మూడు చుక్కల** మెనూ కనిపిస్తుంది. దీని ద్వారా **మ్యూట్**‌లోకి వెళ్లి **మ్యూట్ స్టోరీస్**‌ను ఎంచుకుంటే చాలు.

పీసీ శుభ్రం

కొత్త విండోస్ 11 కంప్యూటర్‌లో బోలెడన్ని బ్లోట్‌వేర్స్ ఉంటాయి. ఇవి పీసీ స్టోరేజీని బాగా ఆక్రమిస్తున్నాయని భావిస్తున్నారా? అయితే అన్‌ఇన్‌స్టాల్ చేసి శుభ్రం చేసుకోవచ్చు. ముందు **సెటింగ్స్** ద్వారా **యాప్స్**‌లోకి వెళ్లాలి. ఇందులో ఇన్‌స్టాల్డ్ యాప్స్ జాబితా కనిపిస్తుంది. వీటిల్లో అనవసరమైన వాటిని తొలగించుకోవాలనుకుంటే ఆ యాప్ పక్కనుండే **మూడు చుక్కల** మెనూపై క్లిక్ చేయాలి. తర్వాత **అన్‌ఇన్‌స్టాల్** మీద క్లిక్ చేస్తే సరి.

నెట్‌ఫ్లిక్స్ మెరుగ్గా

నెట్‌ఫ్లిక్స్‌లో దృశ్యాలు పిక్సెల్స్ విడిపోయినట్టుగా కనిపిస్తున్నాయా? అయితే వీడియో నాణ్యత సెటింగ్స్ తక్కువ స్థాయిలో సెట్ అయ్యిండొచ్చు. దీన్ని సరి చేసుకోవాలనుకుంటే డెస్క్‌టాప్ మీద నెట్‌ఫ్లిక్స్‌కు లాగిన్ కావాలి. **ప్రొఫైల్** మీద తాకి **అకౌంట్**‌లోకి వెళ్తే **ఎడిట్ సెటింగ్స్** ఆప్షన్ కనిపిస్తుంది. ఇందులో **ప్లేబ్యాక్ సెటింగ్స్**‌ను ఎంచుకొని **డేటా యూసేజ్ పర్ స్క్రీన్**‌ను **హై**కి మార్చుకొని **సేవ్** చేసుకోవాలి. ఒకవేళ వీడియో బఫర్ కావటం మొదలెడితే స్పీడ్ టెస్ట్‌ను రన్ చేసి వెనక్కి ఆటో మోడ్‌కు వెళ్లాలి.

కుకీగా..

వెబ్‌సైట్ తెరవగానే కుకీస్ అంగీకార పాపప్ ఓపెన్ అవుతుంది. 'యాక్సెప్ట్ ఆల్' లేదా 'రిజెక్ట్ ఆల్' చేస్తే తప్ప ముందుకు సాగలేం. కొన్ని వెబ్‌సైట్లు కుకీస్ ఆప్షన్‌ను ఇష్టమైన విధంగా మార్చుకోవటానికీ వెసులుబాటు కల్పిస్తుంటాయి. నిజానికి ఈ పాపప్స్, బ్యానర్లు చికాకు కలిగిస్తాయి. అందుకే వెబ్‌సైట్‌ను చూడాలనే తొందరలో ఏదో ఒక ఆప్షన్‌ను ఎంచుకుంటాం. చాలాసార్లు యాక్సెప్ట్ ఆల్‌కే ఓటేస్తుంటాం. ఇంతకీ కుకీస్ అంటే ఏంటి? మాటిమాటికీ వీటి పాపప్ ఎందుకు కనిపిస్తుంది? అంగీకరిస్తే లేదా తిరస్కరిస్తే ఏమవుతుంది?

కుకీస్ అనేవి చిన్న ఫైళ్లు. వీటిని వెబ్‌పేజీలు పరికరంలో సేవ్ చేస్తాయి. లాగిన్ సమాచారాన్ని గుర్తుంచుకోవటం, ఇష్టమైన వార్తల విభాగాలు, టెక్స్ట్ సైజు వంటివి ఏవైనా కావొచ్చు. యూజర్ అనుభూతిని మెరుగు పరచటానికి ఉద్దేశించిన ఇలాంటి సమాచారం వీటిల్లో ఉంటుంది. మనం బ్రౌజింగ్ చేస్తున్న తీరు ఆధారంగా షాపింగ్ వెబ్‌సైట్ల సమాచారం కనిపించటానికివే కారణం. బ్రౌజింగ్ ప్రవర్తనను పసిగట్టి మనకు నచ్చే ప్రకటనల వంటి వాటినీ చూపిస్తుంటాయి. కుకీస్ అని ఒక మాటలో తేల్చినప్పటికీ వీటిల్లో చాలా రకాలున్నాయి. పరికరంలో ఎంతసేపు ఉంటాయనేదాన్ని బట్టి వీటిని కొంతవరకు వర్గీకరించొచ్చు.

- **సెషన్ కుకీస్:** ఇవి తాత్కాలికంగా పుట్టుకొస్తాయి. ఉదాహరణకు- ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నప్పుడు కార్టులో ఉన్న వస్తువులను ట్రాక్ చేసేవి. బ్రౌజర్‌ను క్లోజ్ చేశాక ఇవి వాటంతటవే డిలీట్ అవుతాయి.
- **పర్సిస్టెంట్ కుకీస్:** ఇవి పరికరంలో దీర్ఘకాలం స్టోర్ అవుతాయి. మనల్ని గుర్తిస్తాయి. ఉదాహరణకు- లాగిన్ వివరాలను సేవ్ చేయటం ద్వారా త్వరగా ఈమెయిల్‌ను యాక్సెస్ చేయటానికి తోడ్పడతాయి. వీటి గడువు కాలం కొద్ది రోజుల నుంచి కొన్నేళ్ల వరకూ ఉండొచ్చు.

కుకీస్ ఆప్షన్స్ అంటే?

సాధారణంగా కుకీస్ పాపప్స్ అన్నీ పనిచేయటానికి అవసరమైన 'ఎసెన్షియల్ కుకీస్'ను వెబ్‌సైట్ వాడుకుంటుందని తెలియజేస్తుంటాయి. మనం వద్దనుకున్నా వీటిని ఎంచుకోవాల్సిందే. లేకపోతే ఆన్‌లైన్ షాపింగ్ కార్ట్స్ వంటివి పని చేయవు. అయితే సెటింగ్స్‌లో ఎక్కడో అక్కడ 'నాన్-ఎసెన్షియల్ కుకీస్' వద్దని నిర్ణయించుకునే ఆప్షన్ ఉంటుంది. ఇలాంటి కుకీస్‌లో మూడు రకాలున్నాయి.

- **ఫంక్షనల్ కుకీస్:** మన వ్యక్తిగత బ్రౌజింగ్ తీరుతో (భాష లేదా ప్రాంతం ఎంపిక వంటివి) ముడిపడినవి.
- **అనలిటిక్స్ కుకీస్:** వెబ్‌సైట్‌ను వీక్షకులు వాడుకునే తీరు గురించి గణాంక సమాచారాన్ని అందించేవి.
- **అడ్వర్టయిజింగ్ కుకీస్:** సమాచారాన్ని ట్రాక్ చేస్తూ మన ప్రొఫైల్‌ను రూపొందిస్తాయి. లక్షిత ప్రకటనలు కనిపించేలా సాయం చేస్తాయి.

అడ్వర్టయిజింగ్ కుకీస్ చాలావరకూ థర్డ్ పార్టీలకు చెందినవే. ఇవి ఆ వెబ్‌సైట్లకే పరిమితం కావు. మనం విజిట్ చేయని డొమెయిన్లు, వేదికల మధ్య కూడా ప్రసారమవుతాయి. ఉదాహరణకు- గూగుల్ యాడ్స్ వేర్వేరు వెబ్‌సైట్లలోనే కాదు.. వేర్వేరు పరికరాల్లోనూ మన బ్రౌజింగ్ తీరును పసిగడుతుంది. ఆయా పరికరాల్లో గూగుల్ ఖాతాతో గూగుల్ సెర్చ్ లేదా యూట్యూబ్ వంటి ఇతర సేవలను వాడుకున్నప్పుడు దీన్ని గమనిస్తుంటాం.

అంగీకరించాలా? వద్దా?

కుకీస్‌ను అంగీకరించాలా? వద్దా? అనేది పూర్తిగా మన నిర్ణయమే. 'యాక్సెప్ట్ ఆల్' ఆప్షన్‌ను ఎంచుకుంటే అన్ని రకాల కుకీస్, ట్రాకర్స్‌ను వాడుకోవటానికి వెబ్‌సైట్‌కు అనుమతించినట్టే. ఇది మంచి అనుభూతికి తోడ్పడుతుంది. మన అనుమతి కోసం వేచి చూస్తున్నవాటితో పాటు వెబ్‌సైట్‌లోని అన్ని ఫీచర్లూ ఎనేబుల్ అవుతాయి. ఉదాహరణకు- థర్డ్ పార్టీ కుకీస్ రూపొందించిన ప్రొఫైల్ ఆధారంగా అందే పర్సనలైజ్డ్ ప్రకటన యాడ్ స్లాట్‌లో కనిపించొచ్చు. అదే 'రిజెక్ట్ ఆల్' ఆప్షన్‌ను ఎంచుకున్నామనుకోండి. లేదూ మొత్తంగా బ్యానర్‌నే పట్టించుకోలేదనుకోండి. వెబ్‌సైట్ పనిచేయటానికి అవసరమైనవి తప్ప మిగతా అన్నిరకాల కుకీస్‌ను నిరాకరించినట్టే. అలాగని బేసిక్ ఫీచర్లు అందుబాటులో ఉండవని కాదు. వ్యక్తిగత ఫీచర్లు, థర్డ్ పార్టీ కంటెంట్ వంటివి కనిపించవు.

మనం ఎంచుకున్న ఆప్షన్ అనుమతించిన కుకీస్‌లో నమోదవుతుంది. ఆరు నుంచి 12 నెలల్లో మరోసారి గుర్తుచేస్తుంది. ఒకవేళ మనసు మార్చుకుంటే ప్రాధాన్యాలను కుకీస్ సెటింగ్స్ ద్వారా అప్‌డేట్ చేసుకోవచ్చు. ఈ సెటింగ్స్ చాలావరకూ వెబ్‌సైట్ దిగువ భాగంలో ఉంటాయి. కొన్ని సైట్లు దీన్ని తమ కుకీస్ పాలసీలో పేర్కొనొచ్చు. లేదా తమ ప్రైవసీ పాలసీ ఆప్షన్లలోనైనా సమ్మిళితం చేయొచ్చు.



తొలగించుకోవటమెలా?

ఒకవేళ పొరపాటున కుకీస్‌కు అనుమతించినా చింతించాల్సిన పని లేదు. వీటిని బ్రౌజర్ సెటింగ్స్ ద్వారా తొలగించుకోవచ్చు. బ్రౌజర్‌లో హిస్టరీని క్లియర్ చేసేటప్పుడు కుకీస్‌నూ ఎంచుకుంటే అప్పటివరకూ ఉన్నవి పోతాయి.

- క్రోమ్ బ్రౌజర్‌లో పైన కుడి మూలన ఉన్న నిలువు చుక్కల మీద తాకి **హిస్టరీ** ఎంచుకోవాలి. అనంతరం **క్లియర్ బ్రౌజింగ్ డేటా** మీద క్లిక్ చేసి, **ఆల్‌టైమ్**‌ను ఎంచుకొని **కుకీస్ అండ్ అదర్ సైట్ డేటా** బాక్సులో రైట్ గుర్తు ఉండేలా చూసుకోవాలి. తర్వాత **క్లియర్ డేటా** మీద క్లిక్ చేస్తే హిస్టరీతో పాటు కుకీస్ కూడా రిమూవ్ అవుతాయి.
- ఫైర్‌ఫాక్స్ బ్రౌజర్‌లో పైన కుడి మూలన ఉన్న అడ్డం గీతల మీద తాకి, కింద పరచుకునే జాబితాలో **హిస్టరీ** మీద క్లిక్ చేస్తే **క్లియర్ రీసెంట్ హిస్టరీ** కనిపిస్తుంది. **టైమ్ అండ్ రేంజ్** విభాగంలో **ఎవ్రీథింగ్** ఎంచుకొని **కుకీస్, క్యాష్, యాక్టివ్ లాగిన్స్, సైట్ సెటింగ్స్, ఆఫ్‌లైన్ వెబ్‌సైట్ డేటా** అన్ని బాక్సులనూ టిక్ చేసుకొని **క్లియర్ నౌ** మీద క్లిక్ చేయాలి.

యూరోపియన్ యూనియన్ చట్టంతోనే..

ప్రస్తుతం కుకీ అంగీకార పాపప్ చాలా వెబ్‌సైట్లలో కనిపిస్తుండటానికి కారణమేంటో తెలుసా? యూరోపియన్ యూనియన్ ప్రైవసీ చట్టం. ఇది 2018లో అమల్లోకి వచ్చింది. దీన్ని జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (జీడీపీఆర్) చట్టం అంటారు. ఇది ఆన్‌లైన్‌లో ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించుకునే తీరులో కఠినమైన నిబంధలకు వీలు కల్పిస్తుంది. యూజర్లను గుర్తించేందుకు కుకీస్‌ను వాడుకుంటున్నప్పుడు అవి పర్సనల్ డేటా కిందికి వస్తాయని, అందువల్ల నిబంధనలకు లోబడి ఉంటాయని చట్టం మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. ఇందులో పేర్కొన్న విషయాలు

- అత్యవసరమైనవాటికి తప్ప మిగతా కుకీస్‌కు యూజర్ల అంగీకారం తప్పనిసరి.
- కుకీస్ ట్రాక్ చేస్తున్న డేటాకు సంబంధించిన సమాచారాన్ని యూజర్లకు స్పష్టంగా తెలియజేయాలి.
- అంగీకారాన్ని విధిగా స్టోర్ చేయాలి. డాక్యుమెంట్లలో పేర్కొనాలి.
- ఏవైనా కుకీస్‌ను అంగీకరించకపోయినా కూడా యూజర్లు సేవలను వాడుకునేలా ఉండాలి.
- యూజర్లు తమ అంగీకారాన్ని తేలికగా వెనక్కి తీసుకునే వెసులుబాటు కల్పించాలి.

చాలా సైట్ల ట్రాఫిక్ అంతర్జాతీయం కావటం వల్ల యూరోపియన్ యూనియన్ ఆవలి వెబ్‌సైట్లు సైతం ఈ జీడీపీఆర్ మార్గదర్శకాలను అనుసరిస్తుంటాయి.

టెక్ కబురు

పోకో ఎఫ్7 5జీ వచ్చేసింది

పోకో సంస్థ మనదేశంలో, అలాగే కొన్ని ఎంపిక చేసిన దేశాల్లో అధికారికంగా పోకో ఎఫ్7 5జీ ఫోన్‌ను పరిచయం చేసింది. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ 4 చిప్‌సెట్‌తో కూడిన ఇది ఆండ్రాయిడ్ 15 ఆధారిత హైపర్‌ఓఎస్ 2.0తో పనిచేస్తుంది. 1.5కే రెజల్యూషన్‌తో కూడిన 6.83 అంగుళాల ఎమోలెడ్ డిస్‌ప్లే, 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 3,200 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, 7,550ఎంఏహెచ్ బ్యాటరీ, 90డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్, 22.5డబ్ల్యూ రివర్స్ ఛార్జింగ్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ రక్షణ ఫీచర్ల వంటి వాటితో అలరిస్తోంది.



వెనకాల 50ఎంపీ సెన్సర్, 8ఎంపీ లెన్స్‌తో కూడిన రెండు కెమెరాల వ్యవస్థ.. ముందు సెల్ఫీల కోసం 20ఎంపీ కెమెరా ఉన్నాయి. పరికరం వేడిని నియంత్రించేందుకు పోకో 3డీ ఐస్‌లూప్ కూలింగ్ వ్యవస్థ మరో ప్రత్యేకత. గూగుల్ జెమినీ, సర్కిల్ టు సెర్చ్, ఏఐ నోట్స్, ఏఐ ఇంటర్‌ప్రెటర్, ఏఐ ఆధారిత ఇమేజ్ టూల్స్ వంటి బోలెడన్ని కృత్రిమ మేధ ఫీచర్లూ ఉన్నాయి. నాలుగేళ్ల పాటు ఆండ్రాయిడ్ ఓఎస్ అప్‌డేట్లు, ఆరేళ్ల వరకూ సెక్యూరిటీ ప్యాచెస్ లభిస్తాయి. ఇది రెండు రకాల్లో అందుబాటులో ఉంటుంది. 12జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజీ రకం ధర రూ.31,999. 12జీబీ ర్యామ్, 512జీబీ స్టోరేజీ రకం ధర రూ.33,999.

కొత్త గెలాక్సీ బడ్స్ కోర్


నాణ్యమైన సౌండ్ కావాలి. అలాగని మరీ ఎక్కువగా ఖర్చు కావొద్దు. ఇలాంటి ఇయర్ బడ్స్‌ను కోరుకోని వారెవరు? వీరిని దృష్టిలో పెట్టుకొనే సామ్‌సంగ్ తాజాగా గెలాక్సీ బడ్స్ కోర్‌ను తీసుకొచ్చింది. యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్ (ఏఎన్‌సీ), గెలాక్సీ ఏఐ, మంచి బ్యాటరీతో ఇవి ఆకట్టుకుంటున్నాయి. బ్లూటూత్ 5.4తో అనుసంధాన మవుతాయి. ఏఏసీ, సామ్‌సంగ్‌కు చెందిన సీమ్‌లెస్ కోడెక్ (ఎస్ఎస్‌సీ) సాయంతో వైర్‌లెస్‌గా నాణ్యమైన ఆడియో అనుభూతిని కలిగిస్తాయి.



వైర్‌లెస్ ఛార్జింగ్‌తో పాటు యూఎస్‌బీ-సీ ఛార్జింగ్ సదుపాయమూ ఉండటం విశేషం. దృఢత్వంలో ఐపీ54 రేటింగ్‌ను కలిగుంది. అంటే దుమ్ము, నీటి తుంపరలను బాగా తట్టుకుంటుందన్నమాట. గెలాక్సీ ఏఐతో సమ్మిళితం కావటం మరో విశేషం. ఇది అప్పటికప్పుడు వాయిస్ కాల్‌ను ట్రాన్స్‌క్రిప్ట్ చేయగలదు. వేర్వేరు భాషల్లో మాట్లాడటానికి ఇంటర్‌ప్రెటర్ మోడ్ ఉపయోగపడుతుంది. ఏఎన్‌సీ ఆఫ్ చేస్తే 35 గంటల సేపు ప్లేబ్యాక్ చేస్తుంది. అదే ఏఎన్‌సీ ఆన్ చేస్తే 20 గంటల పాటు వినోదం పొందొచ్చు. నలుపు, తెలుపు రంగుల్లో లభించే గెలాక్సీ బడ్స్ కోర్ ధర రూ.4,999.

ఖుల్ జా జీనోమ్!

గూగుల్‌కు చెందిన డీప్‌మైండ్ కొత్త కృత్రిమ మేధ మోడల్‌ను ఆవిష్కరించింది. దీని పేరు **ఆల్ఫాజీనోమ్**. మానవ డీఎన్ఏలో తలెత్తిన మార్పులు జన్యువుల పనితీరు మీద ఎలాంటి ప్రభావం చూపుతాయో కచ్చితంగా అంచనా వేయటం దీని ప్రత్యేకత. ఇది జన్యుపదార్థం వ్యవహారాలను మరింత బాగా అర్థం చేసుకోవటానికి శాస్త్రవేత్తలకు, డాక్టర్లకు సాయం చేస్తుంది. అందుకే జన్యు పరిశోధనలో గొప్ప పురోగతిని తీసుకురాగలదని భావిస్తున్నారు. మానవ జీనోమ్ సంపూర్ణ జన్యు సూచనల సముదాయం. ఒకరకంగా దీన్ని ప్రాణి ఏర్పడటానికి, మనుగడ సాగించటానికి అవసరమైన



సమాచారంతో కూడిన సమగ్ర సూచనల పుస్తకం అనుకోవచ్చు. జన్యు పదార్థంలో పెద్దమొత్తంలో ఉండేది డీఎన్ఏ. శారీరక గుణాల దగ్గరి నుంచి క్యాన్సర్ వంటి జబ్బుల ముప్పుల వరకూ అన్నింటినీ జన్యురాశి ప్రభావితం చేస్తుంది. డీఎన్ఏలో చిన్న మార్పు అయినా ఆరోగ్యం మీద పెద్ద ప్రభావాలే చూపుతుంది. అయితే కణస్థాయిలో జన్యుమార్పులు ఎలా పనిచేస్తాయో అర్థం చేసుకోవటం జీవశాస్త్రవేత్తలకు పెద్ద సవాలుగా నిలుస్తోంది. ఇక్కడే ఆల్ఫాజీనోమ్ ప్రాధాన్యం సంతరించుకుంటోంది. జన్యు యంత్రాంగాల గురించి లోతుగా అర్థం చేసుకోవటానికిది తోడ్పడుతుంది. ముఖ్యంగా ప్రొటీన్ల సంకేతాలతో నేరుగా సంబంధం లేకపోయినా జన్యు నియంత్రణలో కీలక పాత్ర పోషించే భాగాల పనితీరును అవగతం చేసుకోవటానికి ఉపయోగ పడుతుంది.

ఎలా పనిచేస్తుంది?

సాధారణ, అరుదైన జన్యు రకాలు.. రెండింటినీ విశ్లేషించగల సామర్థ్యం ఆల్ఫాజీనోమ్ ప్రత్యేకత. అరుదైన జన్యుమార్పులు చిన్నవే అయినా ఆయా వ్యక్తుల ప్రత్యేకతకు ఇవే మూలం. అతి పొడవైన జన్యు క్రమాలను.. అంటే 10లక్షల మూల జతల వరకూ ఈ మోడల్ విశ్లేషించగలదు. అందువల్ల అతి కచ్చితమైన అంచనాలను సవివరంగా చూపగలదు. అన్నింటికన్నా ముఖ్యంగా వేర్వేరు రకాల కణాలు, జీవ ప్రక్రియల్లోనూ ఈ పనిని చేయటం విశేషం. అదీ ఒక్క మోడల్‌లోనే! భారీ సంస్థల నుంచి గ్రహించిన సమాచార నిధుల ద్వారా దీనికి శిక్షణ ఇచ్చారు మరి. ఇప్పటివరకూ జన్యు నియంత్రణకు సంబంధించిన వేర్వేరు అంశాలను జన్యు మార్పులు ఎలా ప్రభావితం చేస్తాయో తెలుసుకోవటానికి పరిశోధకులు బోలెడన్ని టూల్స్ ఉపయోగిస్తున్నారు. ఆల్ఫాజీనోమ్ ఈ పరిస్థితిని మార్చగలదని భావిస్తున్నారు. చాలా సామర్థ్యాలను ఇది ఒక్క మోడల్‌లోనే సమ్మిళితం చేస్తుంది. దీంతో మరింత వేగంగా, కచ్చితంగా జన్యు విశ్లేషణ సాధ్యమవుతుంది.

ఓపెన్‌ఏఐ ప్రమాదకర హెచ్చరిక

కృత్రిమ మేధ (ఏఐ) మేలు చేయటమే కాదు, ప్రమాదకరంగానూ మారనుందా? ఓపెన్‌ఏఐ సంస్థ తాజాగా ఇలాంటి విషయాన్నే వెల్లడించింది. తమ భవిష్యత్ జెన్ మోడళ్లు ప్రమాదకర స్థాయిలో సహాయం చేయగలవనీ పేర్కొంది. ఉదాహరణకు- జీవాయుధాలను తయారుచేయటమెలా? అని అడిగినా వివరంగా చెప్పగలవు. ఏఐ మోడళ్లు హై-రిస్క్ టెరిటరీకి సమీపిస్తున్నందున భద్రతా పరీక్షల వివరాలను సంస్థ వెల్లడించింది. ఏమీ తెలియనివారూ ప్రాణాంతకాలను సృష్టించే అవకాశముందని పేర్కొంది. ఇదే నిజమైతే ఏఐ విద్యార్థులు ఏదో ఒకనాడు మానవాళికి హాని తలపెట్టేవారికి సహాయం చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. మనం ఏఐ సాయంతో క్యాన్సర్‌ను నయం చేయాలని కోరుకుంటున్నాం కానీ కొవిడ్‌లాంటి మహమ్మారులను సృష్టించటానికి కాదు.

ఔరా ఫ్యాషన్


గూగుల్ కొత్త ప్రయోగాత్మక యాప్‌ను తీసుకొచ్చింది. దీని పేరు డాప్ల్ (Doppl). ఇది ఏఐ సాయంతో మీరు ఏయే దుస్తుల్లో ఎలా కనిపిస్తారో చూపిస్తుంది. దీనిలోకి ముందుగా ఫుల్ ఫొటోను అప్‌లోడ్ చేస్తే మీ డిజిటల్ వర్షన్‌ను సృష్టిస్తుంది. అనంతరం దుస్తుల ఫొటోలు లేదా స్క్రీన్‌షాట్స్‌ను ఎంచుకుంటే చాలు. అప్పుడు డాప్ల్ యాప్ ఆ దుస్తుల్లో మీ వర్చువల్ రూపాన్ని సృష్టిస్తుంది.



ఇది ఫొటోలను ఏఐ సాయంతో వీడియోలుగానూ మార్చగలదు. దీంతో నిజంగా ఎలా కనిపిస్తారో చూసుకోవచ్చు. ఇష్టమైన ఫొటోలు వీడియోలను సేవ్ చేసుకోవచ్చు. వాటిని ఇతరులకూ పంపించుకోవచ్చు.

మనదేశంలోకి గూగుల్ ఏఐ మోడ్

ఆన్‌లైన్‌లో సెర్చింగ్ తీరుతెన్నులనే మార్చివేయగల ఏఐ మోడ్‌ను గూగుల్ మనదేశంలోని యూజర్లకు తాజాగా పరిచయం చేసింది. ఈ టూల్ ప్రస్తుతానికి ప్రయోగాత్మక దశలో ఉంది. అందువల్ల గూగుల్ ల్యాబ్స్ ద్వారా వాడుకోవాల్సి ఉంటుంది. దీన్ని ఎంచుకున్న తర్వాత యూజర్లు ఇంగ్లిష్‌లో ప్రశ్నలు అడగొచ్చు. సంక్లిష్ట రీజనింగ్‌కు ఉద్దేశించిన ఏఐ మోడ్ అనుబంధ ప్రశ్నలు వేయటం ద్వారా లోతైన సమాచారాన్ని అందిస్తుంది. వెబ్‌లో ఉపయోగపడే లింకులను ఉటంకిస్తుంది. జెమినీ 2.5 వర్షన్ సాయంతో పనిచేసే దీనికి పెద్ద పెద్ద ప్రశ్నలూ సంధించొచ్చు. సంక్లిష్టమైన లేదా అర్థచ్ఛాయాభేదంతో కూడిన ప్రశ్నలనూ అడగొచ్చు.



ఇంతకు ముందు ఇలాంటి పనుల కోసం చాలాసార్లు సెర్చ్ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఏఐ మోడ్‌తో చిటికెలో జవాబులు తెలుసుకోవచ్చు. వస్తువులను పోల్చటం, ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకోవటం వంటి వివరణాత్మక ప్రశ్నలకు ఇది బాగా ఉపయోగపడుతుందని గూగుల్ చెబుతోంది. ఏఐ మోడ్ ఇప్పటికే అమెరికాలో అందుబాటులో ఉంది. టెస్టర్లు దీనికి చాలా పొడవైన ప్రశ్నలు వేసినా వివరంగా జవాబులిస్తూ ఆకట్టుకుంటోంది.



ఐప్యాడ్‌లోనూ వాట్సప్

వాట్సప్ ఇప్పుడు అధికారికంగా ఐప్యాడ్స్‌కూ అందుబాటులోకి వచ్చింది. అదీ మల్టీటాస్కింగ్, ప్రైవసీ ఫీచర్లతో. స్టేజ్ మేనేజర్, స్ప్లిట్ వ్యూ, స్లైడ్ ఓవర్ వంటి ఐప్యాడ్‌ఓఎస్ ఫీచర్ల సాయంతో ఒకే సమయంలో వేర్వేరు యాప్‌లతో పనులు చేసుకోవచ్చు. అంటే బ్రౌజింగ్ చేస్తూనే మెసేజ్‌లు పంపొచ్చు. కాల్ చేస్తూనే వెబ్‌లో శోధించొచ్చు. కొత్త ఐప్యాడ్ వాట్సప్ యాప్‌తో 32 మందితో వీడియో, ఆడియో కాల్స్ చేసుకోవచ్చు. స్క్రీన్లను షేర్ చేసుకోవచ్చు. ముందు, వెనక కెమెరాలకు ఇట్టే మారొచ్చు కూడా. ఐప్యాడ్ పెద్ద తెరలకు తగ్గట్టుగా విశాలమైన ప్యానెల్ లేఅవుట్స్ కూడా ఉంటాయి. దీంతో చాట్స్, గ్రూప్స్, ఫేవరట్స్, అన్‌రీడ్ మెసేజెస్ విభాగాలకు తేలికగా వెళ్లొచ్చు. ఇది మ్యాజిక్ కీబోర్డ్, యాపిల్ పెన్సిల్‌నూ సపోర్టు చేస్తుంది. మ్యాక్‌తో పాటు నాలుగు పరికరాల వరకూ చాట్స్ సింక్రనైజ్ కావటానికీ వీలు కల్పిస్తుంది. అన్ని వేదికల మీదా వ్యక్తిగత మెసేజ్‌లు, కాల్స్, మల్టీ మీడియా సురక్షితంగా ఉండేలా చేస్తుంది.

ఫోన్ బ్యాటరీ అపోహలు వీడండి

స్మార్ట్‌ఫోన్లు మన జీవితంలో ఒక భాగంగా మారిపోయాయి. బ్యాంకు, ఈమెయిల్, సామాజిక మాధ్యమాల పనులన్నీ ఇప్పుడు దీంతోనే సాగుతున్నాయి. అందుకే ఎక్కడ బ్యాటరీ నిండుకుంటుందోనని తరచూ ఫోన్ల వంక చూస్తూనే ఉంటాం. అంతర్జాలంలో బ్యాటరీని సేవ్ చేసుకోవటానికి సంబంధించిన చిట్కాలకూ కొదవలేదు. అయితే వీటిల్లో చాలావరకూ కాలం చెల్లినవే. కొత్త ఫోన్లకు వర్తించవు. అలాంటి కొన్ని బ్యాటరీ అపోహల్లో నిజమెంతో చూద్దాం.



బ్యాక్‌గ్రౌండ్ యాప్స్ తొలగించటం

అతి ఎక్కువగా ప్రచారంలో ఉన్న అపోహల్లో ఒకటి- బ్యాక్‌గ్రౌండ్ యాప్స్‌ను రిమూవ్ చేస్తే బ్యాటరీ సేవ్ అవుతుందని అనుకోవటం. ఫోన్‌లో ఎన్ని ఎక్కువ యాప్‌లు ఓపెన్ అయ్యింటే అంత ఎక్కువగా బ్యాటరీ ఖర్చవుతుందని చాలామంది నమ్ముతుంటారు. ఇది పాత ఫోన్ల విషయంలో నిజం కావొచ్చేమో గానీ కొత్త ఆండ్రాయిడ్, ఐఓఎస్ పరికరాలకు మాత్రం కాదు. నేటి ఆధునిక ఫోన్లన్నీ బ్యాక్‌గ్రౌండ్‌లో ఉన్న యాప్స్‌ను పాజ్ చేసేస్తాయి. ఆశ్చర్యంగా అనిపించినా ఓపెన్ చేసి ఉన్న యాప్స్‌ను తరచూ తొలగిస్తుంటే ఫోన్ మరింత ఎక్కువ బ్యాటరీని వాడుకుంటుంది తెలుసా? ఎందుకంటే బ్యాక్‌గ్రౌండ్ నుంచి రిమూవ్ చేసినప్పుడు అవి మెమరీ నుంచి పోతాయి. తిరిగి ఓపెన్ చేసినప్పుడు స్టోరేజీ నుంచి రీలాంచ్ అవుతాయి. ఇందుకు బ్యాటరీని వాడుకుంటాయి. యాప్స్ స్పందించనప్పుడు లేదా కొంతకాలం వాటితో పనిలేనప్పుడే యాప్స్‌ను బ్యాక్‌గ్రౌండ్ నుంచి తొలగించటం మంచిది.

ఓవర్‌ఛార్జింగ్

ఫోన్‌ను అతిగా ఛార్జింగ్ చేస్తే బ్యాటరీ మీద విపరీత ప్రభావం పడుతుందనేది మరో అపోహ. దీనికి మూలం పాతకాలం ఫోన్లు. లిథియం అయాన్ బ్యాటరీలు రాక ముందు ఎక్కువసేపు ఛార్జ్ చేస్తే పరికరాలు వేడెక్కేవి. ఫలితంగా బ్యాటరీ మన్నిక కాలమూ తగ్గేది. అయితే ఆధునిక ఫోన్లలో ఓవర్‌ఛార్జింగ్ చేసినా దెబ్బతినకుండా కాపాడే యంత్రాంగాలు ఉంటున్నాయి. బ్యాటరీ పూర్తిస్థాయి ఛార్జింగ్‌కు సమీపిస్తున్నప్పుడు ఫోన్ దాన్ని ట్రికిల్ ఛార్జింగ్‌కు మారుస్తుంది. అప్పుడు బ్యాటరీ నెమ్మదిగా... డిశ్చార్జ్ అయ్యే శాతంతో సమానంగా లేదా దాని కన్నా కాస్త ఎక్కువగా ఛార్జ్ అవుతుంది. అంటే 100% ఛార్జింగ్ దగ్గరికి వస్తున్నప్పుడు ఫోన్ చాలా నెమ్మదిగా ఛార్జ్ అవుతుందన్నమాట.

వై-ఫై, బ్లూటూత్ ఆన్ చేస్తే..

ఫోన్‌లో వై-ఫై, బ్లూటూత్ ఆన్ చేసి ఉంచితే బ్యాటరీ త్వరగా నిండుకుంటుందనేది ఇంకో అపోహ. ఇది పదేళ్ల క్రితం నాటి మాట. అధునాతన టెక్నాలజీ.. మెరుగైన ఆండ్రాయిడ్, ఐఓఎస్ పరికరాల రాకతో నేడు అలాంటి ఇబ్బంది తొలగిపోయింది. వై-ఫై, బ్లూటూత్‌ను డిసేబుల్ చేస్తే కొద్దిగా బ్యాటరీ ఆదా కావొచ్చు గానీ పెద్ద తేడా కనిపించదు. దగ్గర్లో ఛార్జర్ ఉంటే లేదా రాత్రిపూట ఛార్జ్ చేసే అవకాశం ఉంటే ఈ ఫీచర్లను ఆన్ చేసుకుంటే ఇబ్బందేమీ ఉండదు.

పూర్తిగా నిండుకున్నాకే..

బ్యాటరీ పూర్తిగా నిండుకున్న తర్వాతే ఛార్జింగ్ చేయాలనుకోవటం శుద్ధ తప్పు. నిజానికి వీలైనంత వరకూ ఛార్జింగ్ సున్నాకు చేరకుండా చూసుకోవటమే ఉత్తమం. ఎందుకంటే సున్నా నుంచి ఛార్జ్ కావటానికి ఎక్కువ శక్తి అవసరమవుతుంది. నికెల్-కాడ్మియం ఆధారిత పాత బ్యాటరీ టెక్నాలజీలు సున్నాకు చేరకపోతే తమ పూర్తి సామర్థ్యాన్ని గుర్తించేవి కావు. అందుకే అప్పట్లో పూర్తిగా బ్యాటరీ నిండుకున్నాకే ఛార్జ్ చేస్తుండేవారు. ఇప్పుడలా కాదు. లిథియం అయాన్ బ్యాటరీలకు అలాంటి సమస్యేమీ లేదు. ఛార్జింగ్ 20 శాతం కన్నా దిగువకు పడిపోకుండా చూసుకోవటం మంచిదన్నది నిపుణుల సూచన. బ్యాటరీ ఛార్జింగ్ 20 కన్నా తగ్గితే బ్యాటరీ సేవింగ్ మోడ్‌లోకి మార్చుకోవాలని కొన్ని ఫోన్లు సూచిస్తుండటం గమనించే ఉంటారు. చాలా ఏళ్ల పాటు అతిగా వాడినప్పటికీ అధునాతన ఫోన్లు కనీసం 80% బ్యాటరీ సామర్థ్యాన్ని నిలిపి ఉంచుకుంటాయి కూడా.

థర్డ్ పార్టీ ఛార్జర్ల వాడకం

మనం చాలావరకూ ఫోన్ కొన్నప్పుడు దాని వెంట వచ్చే ఛార్జర్‌నే వాడతాం. ఎందుకంటే థర్డ్ పార్టీ లేదా అనధికార ఛార్జర్లు వాడితే బ్యాటరీ దెబ్బతినే అవకాశముందని ఫోన్‌ను తయారుచేసిన కంపెనీలు చెబుతుంటాయి. అందుకే థర్డ్ పార్టీ ఛార్జర్లు వాడితే బ్యాటరీ క్షీణిస్తుందనే నమ్మకం ప్రబలిపోయింది. కొన్ని స్మార్ట్‌ఫోన్లు సొంత ఛార్జింగ్ ప్రమాణాలతో వచ్చినప్పటికీ చాలా ఫోన్లు యూఎస్‌బీ పవర్ డెలివరీ పీపీఎస్ వంటి ప్రమాణాలనూ సపోర్టు చేస్తాయి. అంటే కంపెనీకి సంబంధించిన ఛార్జర్ అవసరం లేదన్నమాట. కాకపోతే నాణ్యమైన, విశ్వసనీయమైన బ్రాండ్ల ఛార్జర్లు మాత్రమే కొనాలి. నాసిరకం ఛార్జర్లతో బ్యాటరీతో పాటు ఫోన్ దెబ్బతినే ప్రమాదముంది.

"మొట్టమొదటిగా బుద్ధుడిని మానవ రూపంలో గాంధారకళ ప్రదర్శించింది. ఇది గ్రీకు, రోమన్, హిందూ శిల్పకళా సంప్రదాయాల కలయిక.

సనాతన సంస్కృతికి సజీవ ఆవిష్కరణలు!

"గాంధార, మధుర, అమరావతి శిల్ప శైలులు భౌగోళికంగా భారతదేశంలో భిన్న ప్రాంతాల్లో వర్ధిల్లినప్పటికీ అవన్నీ సమకాలీన మైనవే. ఆనాటి శిల్పులు అత్యంత ప్రతిభావంతులై సృష్టికి ప్రతిసృష్టి చేసిన స్రష్టలు. తమ నైపుణ్యంతో శిల్పంలో భారతీయ ఆత్మను ఆవిష్కరించిన కళా యోగులు.

జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

పురాతన భారతీయ సంస్కృతి, కళలు, ఆలోచనలను ప్రతిబింబించే రూపాలే శిల్పాలు. చారిత్రక, సాంస్కృతిక, మతపరమైన ప్రాధాన్యంతో ముడిపడిన భారతీయ శిల్పకళకు ఘన చరిత్ర, ఎనలేని ప్రాముఖ్యత ఉంది. భారతీయ వారసత్వాన్ని, సామాజిక జీవిత చిత్రాన్ని ఆవిష్కరించిన కళాత్మక వ్యక్తీకరణలు. ప్రాచీన భారతదేశ చరిత్రలో ఉజ్వలంగా వెలిగిన ఈ శిల్పకళ, ఇందులోని శైలుల గురించి పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. బౌద్ధమత ప్రభావంతో రూపుదిద్దుకున్న గాంధార శైలి, భారతీయ తత్వానికి విశిష్ట రూపంగా నిలిచిన మధుర శిల్ప రీతి, చారిత్రక గాథలతో పాటు మానవ జీవిత అనుభూతులను కూడా అందంగా ప్రదర్శించిన అమరావతి శిల్పాల ప్రాశస్త్యాన్ని తెలుసుకోవాలి.

ప్రాచీన భారతదేశంలో శిల్పం

ప్రాచీన భారతదేశంలో నిర్దిష్ట ప్రమాణాలతో కూడిన వాస్తు శిల్పాల చరిత్ర సింధు నాగరికతతోనే ప్రారంభమైందని చరిత్రకారుల అభిప్రాయం. భారతదేశ తొలి ప్రాచీన వాస్తు శిల్ప కళల గురించి ప్రస్తావించేటప్పుడు ప్రధానంగా పేర్కొనవలసినవి హరప్పా, మొహంజోదారో, లోథాల్ లాంటి సింధు నాగరికత పట్టణాల్లో లభించిన అవశేషాలు. మొహంజోదారోలో లభించిన నాట్యగత్తె కాంస్య విగ్రహం, చన్హుదారో సహా ఇతర ప్రాంతాల్లో దొరికిన అనేక మట్టి, రాతి బొమ్మలు ఆనాటి శిల్ప విశేషాలను తెలియజేస్తున్నాయి. సింధు నాగరికత కాలం తర్వాత ఒక నిర్దిష్ట పద్ధతిలో వాస్తు శిల్పాలను పోషించింది మౌర్యులే. అయితే మౌర్యుల శిల్పం ఆస్థాన కళ కావడంతో అది వారితోనే అంతరించిపోయింది.



రాజకీయంగా మౌర్యుల పతనం తర్వాత మగధలో శుంగ, కణ్వ వంశాలు, పశ్చిమోత్తర భారతదేశంలో విదేశీ రాజవంశాలు ఆక్రమించి పాలించాయి. విదేశీ వంశాల్లో ఇండో బాక్ట్రియన్లు - శకులు - కుషాణులు ప్రముఖులు. కుషాణ చక్రవర్తి కనిష్కుడు గొప్ప బౌద్ధ మతపోషకుడు, రెండో అశోకుడిగా ప్రసిద్ధుడు. ఇతడు క్రీ.శ. ఒకటో శతాబ్దంలో నాలుగో బౌద్ధ సంగీతి నిర్వహించాడు. ఈ సమావేశంలో బౌద్ధమతం మహాయాన, హీనయాన మతాలుగా చీలిపోవడం గొప్ప చారిత్రక పరిణామం. హీనయాన మతస్థులు బుద్ధుడి బోధనలను మాత్రమే అంగీకరించి ఆయన బోధనల ద్వారా నిర్వాణం పొందవచ్చని విశ్వసిస్తారు. వీరు బుద్ధుడి మానవ రూపానికి అంత ప్రాముఖ్యం ఇవ్వరు. దానికి భిన్నంగా మహాయాన మతస్థులు బుద్ధుడు భగవంతుడి అవతారమని, ఆయన పట్ల భక్తి ఉంటే నిర్వాణం పొందవచ్చని నమ్ముతారు. మహాయాన శాఖ వారికి ఆదిదేవుడు బుద్ధుడు. వారు బుద్ధుడిని ఆయన గత జన్మలైన బోధిసత్వులను మానవ రూపంలో ఆరాధిస్తారు. కనిష్కుడు కూడా మహాయాన మతాన్ని స్వీకరించాడు. ఈ పరిస్థితుల్లో మహాయాన మతస్థులకు బుద్ధుడిని మానవ రూపంలో (విగ్రహ రూపంలో) అందించాల్సిన చారిత్రక బాధ్యత ఆనాటి శిల్పిపై పడింది. ఆనాటి కళాకారుడు గ్రీకు, రోమన్, భారతీయ లక్షణాలతో బుద్ధుడి విగ్రహం తయారు చేసి మహాయాన బౌద్ధ మత అవసరాన్ని తీర్చాడు. ఈ కళను గాంధార కళ అంటారు. ప్రథమంగా బుద్ధుడిని మానవరూపంలో చూపింది గాంధార కళే.



గాంధార శిల్ప కళ


ప్రాచీన భారతీయ వాస్తు శిల్పకళా రీతుల్లో గాంధార శిల్పం ఉన్నతశ్రేణికి చెందిన పరిణామాత్మకమైన శిల్పకళ. ఇది గ్రీకు, రోమన్, హిందూ శిల్పకళా సంప్రదాయాల కలయిక. క్రీ.శ. ఒకటో శతాబ్ది నుంచి సుమారు మూడు శతాబ్దాలు పశ్చిమోత్తర భారతదేశంలో వర్ధిల్లింది. మొదట పెషావర్, తక్షశిల, గాంధార, పంజాబ్, వాయవ్య సరిహద్దు ప్రాంతం, అఫ్గానిస్థాన్, బమియన్ లోయ ప్రాంతాల్లో ఆవిర్భవించి అనంతరం భారతదేశంలోని మధుర, సౌరాష్ట్ర, కశ్మీర్ ప్రాంతాలకు విస్తరించింది. ఆ తర్వాత భారతదేశ ఎల్లలు దాటి గాంధార శిల్పం మధ్య ఆసియా నుంచి చైనా, జపాన్, కొరియాలకు, ఇండో చైనా, ఇండోనేసియా, శ్రీలంక రాజ్యాలకు కూడా చేరింది. అప్పటికే బర్హుట్, సాంచీ మొదలైన చోట్ల శిల్పకళాకృతులు ఉన్నప్పటికీ బుద్ధుడిని మానవ రూపంలో చూపించింది గాంధార శిల్పకళే. గాంధార శిల్పంలో అప్పటి మహాయాన మత అవసరాలకు అనుగుణంగా ఎక్కువగా బౌద్ధ విగ్రహాలే వెలువడ్డాయి. బౌద్ధ శిల్పాన్ని మలచడంలో అప్పటి గ్రీకు, భారతీయ సంప్రదాయాలను వినియోగించారు. కనిష్కుడి కాలం నుంచి ఈ శైలిలో బుద్ధుడి విగ్రహాలు, బౌద్ధ నిర్మాణాలపై బుద్ధుడి జాతక కథల శిల్పాలు విరివిగా లభిస్తున్నాయి.

లక్షణాలు: గాంధార శైలిలో బుద్ధుడి శరీరాన్ని గ్రీకు యోధుడి పోలికతో మలిచారు. కండరాలను స్పష్టంగా చెక్కడం, పలుచని వస్త్రం మాటున అంగవిన్యాస దృశ్యాన్ని ప్రదర్శించడం, తలపై ఒక విధమైన ఆకర్షణీయమైన అలంకరణ (రింగులు తిరిగిన జుట్టు) తీర్చిదిద్దడంలో గ్రీకు/రోమన్ శిల్పకళా ప్రభావం కనిపిస్తుంది. భారతీయ ఆధ్యాత్మిక లక్షణాలైన ప్రభామండలం (దివ్యపురుషుల శిరస్సు వెనుక వెలుగు), ఉష్ణీశం (తల పైభాగంలో కేశాల ముడి), ఉర్ణం (నుదుట బొట్టు), హస్తాల్లో చక్రాలు కూడా బుద్ధ శిల్పంలో జొప్పించారు. ఈ శిల్పం రూపంలో గ్రీకు/ రోమన్ సంప్రదాయాల ప్రభావం ఉన్నప్పటికీ భారతీయ ఆధ్యాత్మిక లక్షణాలు కూడా ప్రస్ఫుటంగా ఉండి భారతీయ ఆత్మను పుణికిపుచ్చుకుంది. అయితే ఈ శైలి భారతీయ శిల్పకళా చరిత్రలో శాశ్వత స్థానం పొందలేదు. క్రీ.శ. 1- 4 శతాబ్దాల మధ్యకాలంలో వర్ధిల్లిన గాంధార శిల్పకళ తర్వాత కనుమరుగైంది. అయినప్పటికీ భారతీయ శిల్పకళపై గాంధార ప్రభావం చూపింది.



మధుర శిల్ప కళ

క్రీ.శ. ఒకటో శతాబ్దం కనిష్కుడి కాలం నుంచి నాలుగో శతాబ్దం ప్రారంభంలో గుప్తుల రాక వరకు మధుర కేంద్రంగా వర్ధిల్లింది. భారతదేశంలో అంతకు ముందే ఉన్న సాంచీ, బార్హుత్ శిల్ప రీతులకు కొనసాగింపుగా దీనిని చెప్పవచ్చు. మధుర శిల్పం విదేశీ వాసనలు వదిలించుకుని పూర్తిగా భారతీయ తత్వాన్ని సంతరించుకున్న విశిష్ట కళారూపం. విదేశీ మధుర శిల్పాలు చాలా వరకు సిక్రీలో లభించే తెల్ల చుక్కలున్న ఎర్ర ఇసుకరాయితో తయారయ్యాయి. గాంధార శిల్పకళ పూర్తిగా బౌద్ధ మతంతో ప్రభావితమైంది. మధుర శిల్పాల్లో బౌద్ధ, జైన, హిందూ మతాల శిల్పాలు, మాతృదేవత, నాగ, నాగిని, యక్ష, యక్షిణి, జంతు, వృక్ష (ప్రకృతి), స్త్రీ శిల్పాలు ఉన్నాయి. బుద్ధుడి విగ్రహాలతో పాటు అనేక హిందూ దేవతామూర్తుల విగ్రహాలు, యక్ష, యక్షిణిల విగ్రహాలు, తీర్థంకరుల విగ్రహాలు, రాజుల విగ్రహాలు కూడా ఈ శిల్పకళా రీతిలో మలిచారు. మానవుడి ఆనందం, ఉద్రేకాలను సహజంగా చిత్రించారు. మధుర శిల్పంలో బుద్ధుడు సన్నని దేహంతో, అర్ధ నిమిలిత నేత్రాలతో పూర్తి భారతీయ ఆధ్యాత్మిక లక్షణాలతో శాక్యముని మాదిరి దర్శనమిస్తాడు. బాహ్య, అంతర ప్రశాంతత ఈ శిల్పకళ ముఖ్య లక్షణం. మానవ శిల్పాల రూపకల్పనలో నైపుణ్యం కనిపిస్తుంది. సాంచి, బార్హుత్ శిల్పాల వల్ల మధుల శిల్పాలు ప్రభావితమైప్పటికీ, వారిని అనుకరించలేదు. కనిష్కుడికి చెందినదని పేర్కొంటున్న ఒక తల లేని విగ్రహం మధురలో లభించింది. అది ఈ కళకు సంబంధించినదే అని భావిస్తున్నారు.



అమరావతి శిల్పకళ

ఇది గాంధార, మధుర శిల్పకళలకు సమకాలీనంగా దక్కనులో అభివృద్ధి చెందింది. శాతవాహన, శాతవాహన అనంతర యుగాల్లో కృష్ణ, గోదావరి ప్రాంతంలో అమరావతి, జగ్గయ్యపేట, నాగార్జునకొండ, గుమ్మడిదుర్రు మొదలైన చోట్ల వర్ధిల్లింది. ఈ శిల్పకళా శైలిని అమరావతి శైలి అంటారు. అత్యంత నైపుణ్యం కలిగిన ఆంధ్రా శిల్పుల కళా కౌశలాన్ని చాటిచెప్పింది అమరావతి శిల్పం. ఈ శిల్పకళకు శాతవాహన యుగ, మలి శాతవాహనాయుగ వర్తక శ్రేణులు, సంపన్న వ్యాపారులు, ప్రజలు, మహారాజులు పోషకులు. నాగార్జునకొండ, ఘంటశాల, అమరావతి, జగ్గయ్యపేట, గోలి ఈ కళకు ప్రధాన కేంద్రాలు. అమరావతి కళాకారులు స్తూపాలకు, వాటిపై శిల్పాకృతులకు ప్రధానంగా పాలరాయిని వాడి శిల్ప సౌందర్యాన్ని ఇనుమడింపజేశారు. అమరావతి శైలి శిల్పకళ ఆనాటి స్తూపాల అండాల మీద, ఆయక స్తంభాలపైనా, తోరణాల మీద కనిపిస్తుంది. బుద్ధుడిని మానవ రూపంలో కంటే గుర్తుల రూపంలో ఎక్కువగా చూపించారు.



మత విషయాలతో పాటు సాంఘిక జీవన అంశాలను కూడా ప్రదర్శించడం ఈ శిల్పకళ ప్రత్యేకత. అమరావతి శిల్పాల్లో మానవులు పొడగరులు, స్ఫురద్రూపులు. ప్రకృతి నేపథ్యంగా ఉన్న శిల్పానికే ప్రాముఖ్యం ఇచ్చారు. శిల్పాలు నిస్తేజంగా కాకుండా, గొప్ప చైతన్య దీప్తితో అందరినీ ఆకర్షిస్తాయి. లాలిత్యం, మృదుత్వంతో వివిధ భంగిమల్లో మానవాకృతిని మలచడంలో ఉన్నతస్థాయిని ప్రదర్శించిన సిద్ధహస్తులు. జాతక కథలను చక్కగా విశదీకరించటం, వ్యక్తుల అవయవ సౌష్టవాన్ని స్పష్టీకరించడం, పాత్రల మనోభావాలను చక్కగా వ్యక్తీకరించటంలో ఉన్నత ప్రమాణాలను ఆవిష్కరించారు. స్త్రీ, పురుష శిల్పాలు, పశుపక్ష్యాది శిల్పాలు, తరులతాది శిల్పాలు ఇలా అన్నింటిలో చైతన్యపూరితమైన సౌందర్యమే కనిపిస్తుంది. అమరావతీ శిల్పం బౌద్ధమత గాథలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకున్నప్పటికీ జీవితంలోని అనుభూతులను, ఆనందాన్ని కూడా ఆవిష్కరించింది. ఈ శిల్పంలో కనిపించే కళాకౌశలం భారతీయ కళకు పరాకాష్ఠ.



రచయిత:
వి.వి.ఎస్.రామావతారం

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

- 2025, మే 1 నుంచి ఐదు సంవత్సరాల కాలానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎవరు నియమితులయ్యారు? జ: అనంత్ అంబానీ




- ఫ్రెంచ్ ప్రభుత్వం ఇటీవల ప్రతిష్ఠాత్మక 'ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్' పురస్కారాన్ని ఏ భారతీయ చలనచిత్ర దర్శకురాలికి ప్రదానం చేసింది? (ఈమె దర్శకత్వం వహించిన ఆల్ వుయ్ ఇమాజిన్ యాజ్ లైట్ సినిమా 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గ్రాండ్ ప్రిక్స్ గెలుచుకుంది.) జ: పాయల్ కపాడియా
- ప్రపంచ బ్యాంకు రూపొందించిన స్ప్రింగ్ 2025 పావర్టీ అండ్ ఈక్విటీ బ్రీఫ్ నివేదిక ప్రకారం 2011–12 నుంచి 2022–23 మధ్య కాలంలో భారత్‌లో ఎంత మంది తీవ్ర పేదరికం నుంచి బయట పడ్డారు? (తీవ్ర పేదరికంలో నివసిస్తున్న వారు 2011–12లో 16.2 శాతం ఉండగా 2022–23 నాటికి 2.3 శాతానికి తగ్గారు. రోజుకు 2.15 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్న వారిని తీవ్ర పేదరికంలో ఉన్నట్లు ప్రపంచ బ్యాంకు పేర్కొంది.) జ: 171 మిలియన్ల మంది
- యురేనియం లేదా ప్లుటోనియం లాంటి సంప్రదాయ విచ్ఛిత్తి పదార్థాలు లేకుండా పనిచేసే విప్లవాత్మక రకం హైడ్రోజన్ బాంబును ఇటీవల ఏ దేశం పరీక్షించింది? (మెగ్నీషియం హైడ్రైడ్–ఆధారిత ఫ్యూజన్ లాంటి అధునాతన పద్ధతులను ఉపయోగించింది.) జ: చైనా

మరింత సమాచారం

మాక్ కౌన్సెలింగ్ 2025

ఈఏపీసెట్
నీట్



జీవుల సాయంతో పర్యావరణ పరిశుభ్రత!

జీవసాంకేతిక శాస్త్రం
(బయోటెక్నాలజీ)

మానవ ప్రయోజనాల కోసం ప్రస్తుతం విస్తృతంగా వినియోగిస్తున్న సాంకేతికతల్లో బయోటెక్నాలజీ మొదటి వరుసలో ఉంటుంది. జీవులు, జీవవ్యవస్థలు, వాటి భాగాలను ఉపయోగించి నూతన ఉత్పత్తులను సృష్టించే ఆధునిక పరిజ్ఞానం ఇది. సాగురంగంలో ఫలసాయాన్ని పెంచడం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం నుంచి పరిశ్రమలు, పర్యావరణ పరిరక్షణ వరకు పలు రంగాల్లో విభిన్న ప్రయోజనాలను అందిస్తున్న ఈ సాంకేతికత గురించి పోటీ పరీక్షార్థులకు ప్రాథమిక అవగాహన ఉండాలి. బయోటెక్నాలజీ రకాలు, తయారవుతున్న వివిధ ఉత్పత్తులు, క్లోనింగ్ మౌలికాంశాలు, దేశంలో ఈ సాంకేతికత వినియోగం తీరుతెన్నులు, పర్యవేక్షణ, నియంత్రణ కోసం ఏర్పాటైన సంస్థల గురించి తెలుసుకోవాలి.



సైన్స్ అండ్ టెక్నాలజీ

1. బయోటెక్నాలజీ కింది ఏ శాస్త్రాల కలయిక?
   ఎ) జీవశాస్త్రం బి) ఇంజినీరింగ్
   సి) జన్యుశాస్త్రం డి) రసాయన శాస్త్రం
   ఇ) సూక్ష్మజీవ శాస్త్రం
   1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి, ఇ
   3) సి, డి, ఇ 4) బి, డి, ఇ
2. కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) బయోటెక్నాలజీ పదాన్ని ప్రతిపాదించింది కార్ల్ హెరికె.
   బి) బయోటెక్నాలజీలో జీవశాస్త్రం, గణితం, భౌతికశాస్త్రాలు కలిసి ఉంటాయి.
   సి) సూక్ష్మజీవుల అధ్యయనమే బయోటెక్నాలజీ.
   1) ఎ 2) బి, సి 3) ఎ, సి 4) ఏదీ కాదు
3. బయోటెక్నాలజీ గురించి కింది వాక్యాల్లో సరికానివి?
   ఎ) సూక్ష్మజీవులను నియంత్రితంగా మానవ ప్రయోజనాలకు వాడుకోవడమే బయోటెక్నాలజీ.
   బి) వ్యవసాయ రంగం, వైద్య రంగం, చేపల పెంపకంలో బయోటెక్నాలజీ ఉపయోగపడుతుంది.
   సి) బయోటెక్నాలజీని పర్యావరణాన్ని శుభ్రపరచడానికి వాడుకోలేం.
   1) ఎ, బి 2) బి 3) సి 4) ఎ
4. కిందివాటిని సరైన క్రమంలో జతపరచండి.
   ఎ) రెడ్ బయోటెక్నాలజీ 1) బయో ఇన్‌ఫర్మాటిక్స్, నానో బయోటెక్నాలజీ
   బి) బ్లూ బయోటెక్నాలజీ 2) జన్యు ఆధారిత బయోటెక్నాలజీ పరిశ్రమ
   సి) గ్రీన్ బయోటెక్నాలజీ 3) వైద్య రంగంలో బయోటెక్నాలజీ
   డి) వైట్ బయోటెక్నాలజీ 4) తీరప్రాంత, సముద్ర బయోటెక్నాలజీ
   ఇ) గోల్డ్ బయోటెక్నాలజీ 5) వ్యవసాయ, పర్యావరణ రంగంలో బయోటెక్నాలజీ
   1) ఎ-3, బి-4, సి-5, డి-2, ఇ-1
   2) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
   3) ఎ-1, బి-5, సి-2, డి-4, ఇ-3
   4) ఎ-2, బి-3, సి-4, డి-5, ఇ-1
5. కిందివాటిలో సరిగా జతపరచనివి ఏవి?
   ఎ) గ్రే బయోటెక్నాలజీ - కిణ్వ ప్రక్రియ, బయోప్రాసెస్ గురించి తెలియజేస్తుంది.
   బి) ఎల్లో బయోటెక్నాలజీ - నూనెగింజల ఉత్పత్తి గురించి తెలియజేస్తుంది.
   సి) బ్రౌన్ బయోటెక్నాలజీ - వర్షాధార, ఎడారి ప్రాంతాల్లో బయోటెక్నాలజీ వినియోగం.
   డి) పర్పుల్ బయోటెక్నాలజీ - బయోటెక్నాలజీ గురించి పేటెంట్‌లు, మేధోపరమైన హక్కుల గురించి తెలియజేస్తుంది.
   1) ఎ, బి, సి 2) బి 3) సి 4) డి
6. కిందివాటిలో సరైన వాటిని గుర్తించండి.



   ఎ) సుగంధ, ఔషధ మొక్కల జాతీయ బ్యాంకును లఖ్‌నవూలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ ప్లాంట్ (సీఐఎంఏపీ) సంస్థలో ఏర్పాటు చేశారు.
   బి) బయోటెక్నాలజీ పద్ధతుల ద్వారా మొక్కల భాగాలను నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్‌లో భద్రపరుస్తున్నారు.
   1) ఎ, బి 2) ఎ 3) బి 4) ఏదీ కాదు
7. కిందివాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
   ఎ) బయోటెక్నాలజీ ఆవశ్యకతను 2023లో జరిగిన జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో గుర్తించారు.
   బి) ఇంటర్నేషనల్ సెంటర్ ఆఫ్ జెనిటిక్ ఇంజినీరింగ్ అండ్ బయోటెక్నాలజీ సంస్థను ఐక్యరాజ్యసమితి దిల్లీలో ఏర్పాటు చేసింది.
   1) ఎ, బి 2) బి 3) ఎ 4) ఏదీకాదు
8. కిందివాటిలో పర్యావరణ సంబంధ బయోటెక్నాలజీ గురించి సరైనవి?
   ఎ) జీవులను ఉపయోగించి పర్యావరణాన్ని శుభ్రపరచడాన్ని బయో రెమెడియేషన్ అంటారు.
   బి) మొక్కలను ఉపయోగించి నేల, నీటిలోని కాలుష్యాన్ని తగ్గించడాన్ని ఫైటో రెమెడియేషన్ అంటారు.
   సి) సూక్ష్మజీవులను ఉపయోగించి చమురు తెట్టెలు, పురుగుమందులను విచ్ఛిన్నం చేయవచ్చు.
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
9. బయోటెక్నాలజీని ఉపయోగించి కింది వేటిని తయారుచేయలేరు?
   ఎ) కృత్రిమ చర్మం బి) కృత్రిమ రక్తం
   సి) ఇన్సులిన్ డి) ఇంటర్‌ఫెరాన్స్
   1) బి, సి, డి 2) సి, డి
   3) ఎ, బి 4) ఎ, సి
10. బయోటెక్నాలజీ పద్ధతుల ద్వారా తయారుచేసిన కిందివేటిని వైద్య, ఆరోగ్య రంగంలో వాడుతున్నారు?
    ఎ) సూక్ష్మ జీవనాశకాలు బి) వ్యాక్సిన్లు
    సి) క్యాన్సర్ ఔషధాలు డి) ఇన్సులిన్
    1) ఎ, బి 2) బి, సి
    3) సి, డి 4) ఎ, బి, సి, డి
11. కిందివాటిని సరైన క్రమంలో అమర్చండి.
    ఎ) పాలిలాక్టిక్ ఆమ్లం 1) సూక్ష్మవ్యాప్తి
    బి) పపాయిన్, రెనిన్ 2) జీవులను చంపే రసాయనాలు
    సి) బయోసైడ్స్ 3) ఎంజైములు
    డి) కిణ్వ ప్రక్రియ 4) బయోప్లాస్టిక్స్
    ఇ) కణజాల వర్ధనం 5) ఆల్కహాల్ తయారీ
    1) ఎ-4, బి-3, సి-2, డి-5, ఇ-1
    2) ఎ-3, బి-2, సి-1, డి-4, ఇ-5
    3) ఎ-5, బి-3, సి-2, డి-1, ఇ-4
    4) ఎ-1, బి-2, సి-4, డి-5, ఇ-3
12. కింది వాటిలో బయోటెక్నాలజీ పద్ధతుల ద్వారా తయారుచేసిన వాటి గురించి సరైన వాటిని ఎన్నుకోండి.
    ఎ) ఫ్యాక్టర్ - 8, ఫ్యాక్టర్ - 9 అనేవి హీమోఫీలియా చికిత్సకు వాడతారు.
    బి) ఇన్సులిన్‌ను మధుమేహ చికిత్సకు ఉపయోగిస్తారు.
    సి) ఇంటర్‌ఫెరాన్‌లను వైరస్ వ్యాధుల చికిత్సలో వాడతారు.
    1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
13. బయోటెక్నాలజీని కింది ఏ విధంగా ఉపయోగించుకుంటాం?
    ఎ) పర్యావరణ రంగంలో కాలుష్యాన్ని తగ్గించడానికి
    బి) వ్యవసాయ రంగంలో అధిక దిగుబడి సాధించడానికి
    సి) వైద్యరంగంలో చికిత్సకు
    డి) జీవఇంధనాల ఉత్పత్తికి
    1) ఎ, డి 2) బి, డి
    3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
14. వ్యవసాయ రంగంలో బయోటెక్నాలజీ కింది ఏ విధంగా ఉపయోగపడుతుంది?
    ఎ) జీవ పురుగుమందుల తయారీకి
    బి) జీవ ఎరువుల తయారీకి
    సి) సూక్ష్మజీవులను కృత్రిమంగా తయారు చేయడానికి
    డి) జన్యుపరివర్తన జీవుల ఉత్పత్తికి
    1) ఎ, బి 2) ఎ, బి, డి 3) బి, సి 4) సి, డి
15. కింది వాక్యాలను పరిశీలించండి.
    ఎ) నేరస్థులను గుర్తుపట్టడానికి బయోటెక్నాలజీ ఉపయోగపడుతుంది.
    బి) డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ ప్రక్రియ ద్వారా వ్యక్తులను గుర్తుపట్టవచ్చు.
    పై వాక్యాల ఆధారంగా సరైన సమాధానాన్ని ఎంచుకోండి.
    1) ఎ, బి లు సరైనవి; ఇవి రెండూ ఒకే అంశానికి చెందినవి.
    2) ఎ సరైంది, బి సరికాదు.
    3) ఎ సరికాదు, బి సరైంది.
    4) ఎ, బి సరికావు ఇవి వేర్వేరు అంశాలు.
16. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
    ఎ) యూరోకైనేజ్ అనే ఎంజైమ్‌ను రక్తపుగడ్డలను కరిగించడానికి వాడతారు.
    బి) స్ట్రెప్టోమైసిన్, ఎరిథ్రోమైసిన్ అనేవి సూక్ష్మజీవనాశకాలు.
    సి) పాలిహైడ్రా ఆల్కనోయేట్స్ అనేది బయోప్లాస్టిక్.
    1) ఎ, బి 2) ఎ, బి, సి
    3) బి, సి 4) ఎ, సి
17. బయోటెక్నాలజీ కింది ఏ రంగంలో ఉపయోగపడుతుంది?
    ఎ) పట్టుపురుగుల పెంపకం బి) చేపల పెంపకం
    సి) తేనెటీగల పెంపకం డి) ఉద్యానవన రంగం
    1) ఎ, బి, సి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి, డి
18. క్లోనింగ్ ద్వారా వీటిని ఇప్పటివరకు సృష్టించలేదు.
    ఎ) గొర్రె బి) కోతి సి) పిల్లి
    డి) ఏనుగు ఇ) మానవుడు ఎఫ్) ఒంటె
    1) డి, ఇ 2) సి, డి
    3) ఎ, బి 4) సి, ఎఫ్
19. క్లోనింగ్ ద్వారా సృష్టించిన జీవి ఎవరిని పోలి ఉంటుంది?
    1) తల్లి జీవి 2) తండ్రి జీవి
    3) కేంద్రకం దానం చేసిన జీవి
    4) సరోగసిగా ఉన్న జీవి
20. క్లోనింగ్ ప్రక్రియ సహజంగా కింది వేటిలో ఉంటుంది?
    ఎ) మొక్కలు బి) మానవుడు సి) శైవలాలు
    డి) సరీసృపాలు ఇ) పక్షులు
    1) డి, ఇ 2) ఎ, బి 3) ఎ, సి 4) బి, ఇ
21. క్లోనింగ్ ప్రక్రియలో ఇమిడి ఉండే సూత్రం?
    1) పిండ మార్పిడి
    2) దేహకణ కేంద్రక మార్పిడి
    3) సంయుక్త బీజమార్పిడి 4) ఫలదీకరణ
22. చికిత్సకు ఉపయోగపడే క్లోనింగ్ ప్రక్రియ ద్వారా కింది వేటిని పొందవచ్చు?
    1) మూలకణాలు 2) రక్తకణాలు
    3) కణజాలాలు 4) సంయోగబీజాలు
23. కిందివాటిలో సరైన వాటిని గుర్తించండి.
    ఎ) క్లోనింగ్ సహజ ప్రక్రియ
    బి) క్లోనింగ్ ద్వారా ఒక జీవిని పోలిన మరో జీవిని సృష్టించవచ్చు.
    సి) క్లోనింగ్ ద్వారా క్షీరదాలను సృష్టించవచ్చు.
    డి) బ్యాక్టీరియాలను ఉపయోగించి జన్యుక్లోనింగ్ జరపవచ్చు.
    1) ఎ, బి 2) బి, సి
    3) సి, డి 4) ఎ, బి, సి, డి
24. కింది వాటిలో సరికాని వాటిని గుర్తించండి.
    ఎ) మొదటి క్లోనింగ్ జంతువు డాలి అనే ఒంటె.
    బి) జాన్ గుర్డాన్‌ను క్లోనింగ్ పితామహుడు అంటారు.
    సి) క్లోనింగ్ ప్రక్రియ లైంగిక ప్రత్యుత్పత్తితో సమానం.
    1) ఎ, సి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ
25. భారతదేశంలో క్లోనింగ్‌పై పరిశోధన గురించి సరైన వాటిని గుర్తించండి.
    ఎ) నేషనల్ డైరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మొదటిగా క్లోనింగ్ జీవిని సృష్టించింది.
    బి) భారతదేశంలో మొదటి క్లోనింగ్ జంతువు సంరూప అనే పేరు గల గేదె.
    సి) క్లోనింగ్ ద్వారా సృష్టించిన మేక నోరి.
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి



రచయిత:
డాక్టర్ బి.నరేష్

సమాధానాలు

1-2; 2-1; 3-3; 4-1; 5-2; 6-1; 7-3; 8-4; 9-3; 10-4; 11-1; 12-4; 13-4; 14-2; 15-1; 16-2; 17-4; 18-1; 19-3; 20-3; 21-2; 22-1; 23-4; 24-1; 25-4.

భారతదేశంలో జరిగిన ముఖ్యమైన పర్యావరణ ఉద్యమాలు

స్టడీ - జోన్



మన చుట్టూ ఉండే ఆవరణ వ్యవస్థను పర్యావరణం అంటారు. ఇందులో జీవులు, నిర్జీవులు భాగం. సమస్త జీవరాశుల మనుగడకు ఇదే ఆధారం. ఎందుకంటే ప్రాణుల మనుగడకు అవసరమయ్యే బాహ్య పరిస్థితులన్నీ ఇందులో సహజ కారణాలుగా ఉంటాయి. పర్యావరణం అనేది 'ఎన్విరాన్' అనే ఫ్రెంచ్ పదం నుంచి వచ్చింది. దీని అర్థం 'చుట్టూ ఆవరించి ఉన్న'.

■ పర్యావరణంలో సహజ అనుఘటకాలతోపాటు మానవ నిర్మితమైనవి కూడా ఉంటాయి. ఆవరణ వ్యవస్థల సమతౌల్యాన్ని కాపాడటం అనేది పర్యావరణ వ్యవస్థ ముఖ్య లక్షణం.

■ అధిక జనాభా, వనరుల మితిమీరిన వినియోగం, పారిశ్రామికీకరణ, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం లాంటి కారణాల వల్ల పర్యావరణం క్షీణిస్తోంది. పర్యావరణంలో మార్పులు జరిగినప్పుడు, ప్రమాదకర పరిస్థితులు తలెత్తినప్పుడు వాటిని అధిగమించేందుకు చేపట్టే చర్యలను పర్యావరణ పరిరక్షణ అంటారు. ఇందులో భాగస్వాములయ్యే వారిని పర్యావరణవేత్తలు అంటారు. వారు పర్యావరణ రక్షణ కోసం ఉద్యమిస్తూ, స్థానికులతో కలిసి పోరాటాలు చేస్తూ, ప్రభుత్వాలను మేల్కొల్పి, ప్రజా సంక్షేమానికి, పర్యావరణ వికాసానికి కృషి చేస్తున్నారు.

భారతదేశంలో జరిగిన ముఖ్యమైన పర్యావరణ ఉద్యమాలు - వాటిని నిర్వహించిన పర్యావరణవేత్తలను పరిశీలిస్తే..

ఉద్యమం	జరిగిన ప్రదేశం	సంవత్సరం	నాయకత్వం వహించినవారు/ సంస్థ
బిష్ణోయి	ఖెజార్లీ, రాజస్థాన్	1730	అమృతాదేవి
చిప్కో	ఉత్తరాఖండ్	1973	సరళాబెహన్, మీరాబెహన్, సుందర్‌లాల్ బహుగుణ, గౌరీదేవి, చండీప్రసాద్ భట్ మొదలైనవారు
సైలెంట్ వ్యాలీ	పాలక్కాడ్, కేరళ	1973	కేరళ శాస్త్ర సాహిత్య పరిషత్తు రక్షణ
జంగిల్ బచావో	సింగ్భుమ్, బిహార్ (ప్రస్తుతం ఝార్ఖండ్‌లో ఉంది)	1982	సింగ్భుమ్ గిరిజనులు
నర్మదా బచావో ఆందోళన్	మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర	1985	మేధా పాట్కర్, బాబా ఆమ్టే, అరుంధతిరాయ్
తెహ్రీ డ్యామ్ వ్యతిరేక పోరాటం	తెహ్రీ, ఉత్తరాఖండ్	1980-2004	తెహ్రీబాంధ్ విరోధి సంఘర్ష్ సమితి

క్యాలెండర్

పోటీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

విషమ రోజులు వారానికి సూచికలు





రచయిత
బూసర గణేష్, విషయ నిపుణులు

రీజనింగ్ విభాగంలోని క్యాలెండర్ అనే అంశం నుంచి పోటీపరీక్షల్లో తరచుగా ప్రశ్నలు అడుగుతుంటారు. వీటికి సరైన సమాధానాలు గుర్తించాలంటే సాధారణ, లీపు సంవత్సరాలు, విషమ రోజులు, రోజులు, నెలలు, సంవత్సరాలకు సంబంధించిన కోడ్‌లపై అవగాహన ఏర్పర్చుకోవాలి.

☛ వారానికి ఏడు రోజులు, సంవత్సరానికి 12 నెలలు, 52 వారాలు ఉంటాయి. సాధారణ ఏడాదిలో 365 రోజులు ఉంటాయి. అదే లీపు సంవత్సరంలో 366 రోజులు (ఫిబ్రవరిలో 29) ఉంటాయి.

విషమ రోజులు: ఇచ్చిన రోజులను 7తో భాగించగా వచ్చిన శేషాన్ని విషమ రోజులు లేదా అదనపు రోజులు అంటారు.

నెలల కోడ్	
Jan	0
Feb	3
Mar	3
Apr	6
May	1
Jun	4
Jul	6
Aug	2
Sept	5
Oct	0
Nov	3
Dec	5

రోజుల కోడ్
0 - ఆదివారం
1 - సోమవారం
2 - మంగళవారం
3 - బుధవారం
4 - గురువారం
5 - శుక్రవారం
6 - శనివారం

సంవత్సరాల కోడ్
1600 - 1699 - 6
1700 - 1799 - 4
1800 - 1899 - 2
1900 - 1999 - 0
2000 - 2099 - 6
2100 - 2199 - 4

సూత్రం

$$\text{రోజు} = \frac{\text{తేదీ} + \text{సంవత్సరం} + \text{నెల కోడ్} + \text{సంవత్సరపు కోడ్} + \text{లీపు సంవత్సరాల సంఖ్య}}{7}$$

సూచన (ప్ర. 1 – 10): దిగువ ఇచ్చిన ప్రశ్నలకు సమాధానం గుర్తించండి.

1. ఒకవేళ ఈరోజు మంగళవారం అయితే 37 రోజుల తరువాత ఏ వారం అవుతుంది?
1) గురువారం 2) మంగళవారం 3) శనివారం 4) ఏదీకాదు

సాధన: $\frac{37}{7}$ = శేషం (2)

మంగళవారం + 2 = 2 + 2 = 4 (గురువారం)

సమాధానం: 1

2. ఒకవేళ ఈరోజు శుక్రవారం అయితే 24 రోజుల క్రితం ఏ వారం అవుతుంది?
1) మంగళవారం 2) బుధవారం 3) గురువారం 4) శనివారం

సాధన: $\frac{24}{7}$ = శేషం (3)

శుక్ర – 3 = 5 – 3 = 2 (మంగళవారం)

సమాధానం: 1

3. ఒకవేళ నిన్నటికి 3 రోజుల ముందు ఆదివారం అయితే రేపటికి 3 రోజుల తరువాత ఏ వారం అవుతుంది?
1) ఆదివారం 2) బుధవారం 3) మంగళవారం 4) సోమవారం

సాధన:

ఆది సోమ మంగళ బుధ గురు శుక్ర శని ఆది సోమ
(నిన్న) (నేడు) (రేపు)

లేదా 3 + 1 + 1 + 3 = $\frac{8}{7}$ = శేషం (1)

ఆది + 1 = సోమవారం

సమాధానం: 4

4. ఒకవేళ నిన్నటికి 5 రోజుల క్రితం శుక్రవారం అయితే రేపటికి 8 రోజుల తర్వాత ఏ వారం అవుతుంది?
1) సోమవారం 2) శుక్రవారం 3) ఆదివారం 4) శనివారం

సాధన: విషమ రోజులు ⇒ 5 + 1 + 1 + 8 = $\frac{15}{7}$ = 1 (శేషం)

శుక్రవారం + 1 = శనివారం

సమాధానం: 4

5. ఒకవేళ నిన్నటికి 10 రోజుల క్రితం సోమవారం అయితే ఈ రోజు నుంచి 5వ రోజు ఏ వారం అవుతుంది?
1) సోమవారం 2) మంగళవారం
3) గురువారం 4) బుధవారం

సాధన: విషమ రోజులు = 10 + 1 + (5 – 1) = $\frac{15}{7}$ = 1 (శేషం)

సోమవారం + 1 = మంగళవారం

సమాధానం: 2

6. రాజేష్ అనే వ్యక్తి 1996 సెప్టెంబరు 4న జన్మించాడు. అయితే 2020 ఆగస్టు 10 నాటికి అతడి వయసు ఎంత?
1) 23 సంవత్సరాల 11 నెలల 4 రోజులు
2) 23 సంవత్సరాల 10 నెలల 2 రోజులు
3) 23 సంవత్సరాల 11 నెలల 6 రోజులు
4) 23 సంవత్సరాల 10 నెలల 4 రోజులు

సాధన:

సంవత్సరం	నెల	రోజు
2020	8	10
1996	9	4
23 సంవత్సరాల	11 నెలలు	6 రోజులు

సమాధానం: 3

7. 2026వ సంవత్సరం ఏప్రిల్‌లో శుక్రవారాలు ఏయే తేదీల్లో వస్తాయి?
1) 3, 10, 17, 24 2) 4, 11, 18, 25
3) 1, 8, 15, 22 4) 2, 9, 16, 23

సాధన: ముందు 2026 ఏప్రిల్ 1న ఏ వారం వస్తుందో కనుక్కోవాలి.

$\frac{1 + 26 + 6 + 6 + 6}{7} = \frac{45}{7}$ = 3 (శేషం)

రోజుల కోడ్ ప్రకారం 3 అంటే బుధవారం. మనకు కావాల్సింది శుక్రవారాలు. కాబట్టి బుధవారానికి + 2 కలపాలి.

2026 ఏప్రిల్‌లో మొదటి శుక్రవారం 3వ తేదీన వస్తుంది. అంటే 3, 10, 17, 24 తేదీల్లో శుక్రవారాలు వస్తాయి.

సమాధానం: 1

8. 10-02-2020 నాడు ఏ వారం?
1) శుక్రవారం 2) శనివారం
3) ఆదివారం 4) సోమవారం

సాధన: రోజు = $\frac{10 + 20 + 3 + 6 + 5}{7}$

= $\frac{44}{7}$ = 2 (శేషం)

2 – 1 = 1 ⇒ రోజుల కోడ్ ప్రకారం 1 అంటే సోమవారం

గమనిక: ఇచ్చింది లీపు సంవత్సరమై, తేదీ జనవరి లేదా ఫిబ్రవరి నెలలో ఉంటే వచ్చిన శేషంలో నుంచి 1 తీసివేయాలి.

సమాధానం: 4

9. ఒకవేళ 10 ఆగస్టు 2020న సోమవారం అయితే 10 ఆగస్టు 2009న ఏ వారం అవుతుంది?
1) సోమవారం 2) శుక్రవారం
3) బుధవారం 4) ఆదివారం

సాధన: 2020 – 2009 = 11

లీపు సంవత్సరం = 3 (2012, 2016, 2020)

14

విషమ రోజులు = 0

సోమ + 0 = 1 (సోమవారం)

సమాధానం: 1

10. ఒక లీపు సంవత్సరంలో 9 జూన్ అనేది గురువారం అయితే అదే సంవత్సరంలో 17 ఫిబ్రవరి ఏ వారం అవుతుంది?
1) గురువారం 2) శనివారం
3) ఆదివారం 4) బుధవారం

సాధన:

ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్
12	31	30	31	9
5	3	2	3	2

మొత్తం విషమ రోజులు = $\frac{15}{2}$ = 1 విషమ రోజులు

గురు – 1 = 3 (బుధవారం)

సమాధానం: 4

Word of the Day

698

Semblance

Telugu meaning: సారూప్యత, భ్రాంతి

English meaning: The word Semblance (సెంబ్లన్స్) is a noun that describes the outward appearance or apparent form of something, especially when the reality is different.

Synonyms: Appearance, Illusion

Antonyms: Reality, Truth

Usage: **1.** He managed to maintain a semblance of calm even though he was extremely nervous inside.

2. The village had only the semblance of peace while tensions simmered beneath the surface.

కరెంట్ అఫైర్స్



కేరళ డీజీపీగా ఆంధ్రప్రదేశ్‌కి చెందిన రావాడ అజాద్ చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఆయన స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం. చంద్రశేఖర్ 1991వ బ్యాచ్‌కు చెందిన కేరళ కేడర్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసుల్లో కొనసాగుతూ, ఇంటెలిజెన్స్ బ్యూరోలో (ఐబీ) స్పెషల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.




ఐక్యరాజ్యసమితి, స్పెయిన్ సంయుక్త ఆధ్వర్యంలో "ఫైనాన్సింగ్ ఫర్ డెవలప్‌మెంట్" 4వ అంతర్జాతీయ సదస్సు (ఎఫ్‌ఎఫ్‌డీ4) 2025, జూన్ 30న ప్రారంభమైంది. జులై 3 వరకు జరగనున్న ఈ సదస్సుకు స్పెయిన్‌లోని సెవిల్లే నగరం ఆతిథ్యమిస్తోంది. ప్రపంచ పేదరికంపై పోరాడే సమున్నత లక్ష్యంతో దీన్ని నిర్వహిస్తున్నారు.

✦ ఎఫ్‌ఎఫ్‌డీ4 సదస్సు సన్నాహక సమావేశాన్ని జూన్ 17నే నిర్వహించారు. పేద దేశాలకు ఏటా 4 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.340 లక్షల కోట్లు) ఆర్థిక సహాయాన్ని అందించే ప్రతిపాదనలతో ఐరాసలోని 193 సభ్యదేశాలు సంయుక్తంగా రూపొందించిన 38 పేజీల పత్రంపై ఆ సమావేశంలో చర్చించారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

షెడ్యూల్డ్ కులాలు, తెగల కార్పొరేషన్లు



షెడ్యూల్డ్ కులాలు, తెగలు, బలహీన వర్గాలు, మహిళలు, మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. దీని కోసం అవసరమైన చట్టాలు రూపొందిస్తున్నాయి. ఆయా వర్గాల ఉన్నతి కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తున్నారు. సాంఘిక, సంక్షేమ పథకాలను రూపొందించి అమలుపరుస్తున్నారు.

షెడ్యూల్డ్ కులాలు – సంక్షేమం

2001 జనాభా లెక్కల ప్రకారం, దేశంలో 16 కోట్ల 66 లక్షల మంది, 2011 లెక్కల ప్రకారం, 20 కోట్ల 13 లక్షల మంది షెడ్యూల్డ్ కులాలవారు ఉన్నారు. వీరి అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది.

విద్యాభివృద్ధి చర్యలు

షెడ్యూల్డ్ కులాల్లో అక్షరాస్యత, విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు వివిధ చర్యలు చేపడుతున్నాయి.

■ అపరిశుద్ధ రంగాల్లో పనిచేసే కార్మికులు, చిన్నారులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందజేయడం. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా నిధులు కేటాయిస్తాయి.

ఆర్థికాభివృద్ధి చర్యలు, ప్రత్యేక ప్రణాళిక, స్వచ్ఛత ఉద్యమి యోజన, గిరిజన తెగలు - సంక్షేమం, షెడ్యూల్డ్ ప్రాంతం - ప్రత్యేక సదుపాయాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కార్యక్రమాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Reading Comprehension

Bank Exams
English

Directions (Qs. 1 - 10): Read the following passage carefully and answer the questions given after reading it. Certain words/phrases have been printed in bold to help you locate them while answering some of the questions.

India's tribal communities, comprising nearly 8.6% of the nation's population, have played a profound role in shaping the country's cultural heritage, ecological balance, and social **diversity**. Spread across various states, particularly in regions like Chhattisgarh, Odisha, Jharkhand, Madhya Pradesh, and the Northeastern states, these communities represent a wide spectrum of languages, traditions, art forms, belief systems, and sustainable living practices. Tribes in India have preserved ancient customs, folklore, music, and rituals that reflect the country's deep-rooted diversity. Tribal art, such as Warli, Gond, and Pithora paintings, and crafts made from bamboo, clay, and natural dyes, continue to enrich India's artistic landscape. Festivals like Karma, Hornbill, and Sarhul showcase their deep spiritual connection with nature and community life. Their knowledge systems-ranging from herbal medicine to rainwater harvesting, forest conservation, and rotational farming-embody a model of sustainable living that modern societies increasingly seek to replicate. **Their coexistence with nature and reverence for forests and animals have contributed significantly to preserving India's .... wealth, particularly in forested and biodiverse regions.** In addition to their cultural contribution, tribal communities have historically supported the nation's economic development through forestry, handicrafts, agriculture, and mining labour. Many tribal-dominated areas are rich in mineral resources, and tribal populations have often been at the forefront of labour in mines, plantations, and infrastructure projects. However, despite their contributions, tribal communities in India face **persistent** challenges that hinder their overall development and integration into the mainstream economy. One of the foremost issues is the loss of land and displacement due to industrial projects, deforestation, and infrastructure development. Many tribal families have been forced to relocate without adequate compensation or rehabilitation, leading to disruption of their traditional ways of life and livelihoods. Displacement not only severs the tribal link with ancestral lands but also contributes to socio-economic vulnerability.

Education remains another critical concern. The literacy rate among tribal populations is significantly lower than the national average, especially among tribal girls. Poor access to quality schools, lack of culturally sensitive curricula, and language barriers discourage regular attendance. Health indicators among tribal groups also remain worrying, with limited access to healthcare services, high malnutrition levels, and prevalence of diseases such as malaria and tuberculosis. Malnutrition among tribal children and maternal mortality rates continue to be disproportionately high. Furthermore, many tribes face social exclusion and **discrimination**, especially when they migrate to urban areas in search of a livelihood. Government initiatives like the Forest Rights Act (2006), Eklavya Model Residential Schools, and tribal sub-plans under national development schemes have aimed to improve tribal welfare. However, gaps remain in implementation, monitoring, and addressing local-specific needs. Some tribal areas are also affected by left-wing extremism, partly fuelled by long-standing neglect and grievances, further **complicating** development efforts. Language preservation is another challenge, as many tribal dialects are endangered, with younger generations shifting to dominant regional languages for economic survival.

1. What could be a suitable title for the passage?
A) Tribal India: Heritage, Challenges, and the Path to Inclusive Development
B) Ancient Tribes and Their Role in Indian Economy
C) Mining and Industrial Impact on Tribal Lands
D) Tribal Languages and Their Global Significance
E) Tribal India: Festivals of Tribal Communities in Northeast India

2. Which of the following are traditional contributions of tribal communities to India's cultural heritage, as per the passage?
I. Preservation of folk music and festivals
II. Development of modern education systems
III. Use of sustainable natural resource practices
A) I and II only B) II and III only
C) I and III only D) All of the above
E) None of the above

3. Choose the word that best matches the meaning of "**diversity**" in the passage.
A) Simplicity B) Uniformity
C) Boredom D) Variety
E) Repetition

4. What word represents the opposite of "**persistent**" as used in the passage?
A) Ongoing B) Occasional
C) Recurring D) Constant
E) Continuous

5. Select the word that appropriately fills the blank in the sentence:
Their coexistence with nature and reverence for forests and animals have contributed significantly to preserving India's .... wealth, particularly in forested and biodiverse regions.
A) minimal B) economical
C) casual D) financial
E) ecological

6. Which of the following best describes the relationship between tribal communities and the environment?
A) Exploitative use of forest resources
B) Coexistence and reverence for nature
C) Destruction of natural habitats
D) Plantation of a single crop every year
E) Creation of plastic-based goods

7. According to the passage, which of the following are major issues currently faced by the tribal communities in India?
I. Displacement due to deforestation and development
II. Poor access to healthcare and education
III. Social exclusion in urban migration
A) I and II only B) II and III only
C) I and III only D) All of the above
E) None of the above

8. Choose the word most synonymous with "**complicating**" as used in the passage.
A) Simplifying B) Worsening
C) Obstructing D) Clarifying
E) Easing


9. What word represents the opposite meaning of "**discrimination**" as used in the passage?
A) Prejudice B) Segregation
C) Exclusion D) Injustice
E) Equality

10. What efforts have been made by the Indian government to support tribal development?
I. Establishment of Eklavya Model Residential Schools
II. Implementation of Forest Rights Act (2006)
III. Construction of luxury resorts in tribal lands
A) I and II only
B) II and III only
C) I and III only
D) All of the above
E) None of the above

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

బ్యాంకులు పిలుస్తున్నాయి!



వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు, స్పెషలిస్ట్ ఆఫీసర్ల భర్తీ కోసం ఐబీపీఎస్ నోటిఫికేషన్లు విడుదల చేసింది. వీటి ద్వారా 5208 ప్రొబేషనరీ ఆఫీసర్లు, 1007 స్పెషలిస్ట్ ఆఫీసర్ల పోస్టులు భర్తీ చేస్తారు. ఎక్కువ సంఖ్యలో బ్రాంచీలున్న ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంకులు ఖాళీల వివరాలు ఇంకా పేర్కొనలేదు. అందువల్ల తుది నియామక సమయానికి పోస్టుల సంఖ్య పెరగొచ్చు.

పరీక్ష విధానంలో స్వల్ప మార్పులు: గత సంవత్సరం జరిగిన ఐబీపీఎస్ పీవో ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలతో పోల్చితే ఈ సారి ప్రిలిమ్స్, మెయిన్స్‌ల్లో స్వల్ప మార్పులు చేశారు. ప్రిలిమ్స్ అంశాలు, ప్రశ్నల సంఖ్యల్లో మార్పులేమీ లేకున్నా వాటికి కేటాయించిన మార్కుల్లో వ్యత్యాసాలున్నాయి. రీజనింగ్‌కు 5 మార్కులు పెంచి (40 మార్కులు), ఆప్టిట్యూడ్‌కు 5 మార్కులు (30 మార్కులు) తగ్గించారు. మెయిన్స్ పరీక్షలో కంప్యూటర్ ఆప్టిట్యూడ్ విభాగాన్ని తొలగించి, జనరల్ అవేర్‌నెస్ విభాగంలో కొత్తగా డిజిటల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్, ఆర్‌బీఐ సర్క్యులర్స్ టాపిక్స్ చేర్చారు. ప్రశ్నల సంఖ్య, మార్కులు, సమయంలోనూ స్వల్ప మార్పులు చేశారు. రీజనింగ్‌కు ఎక్కువ మార్కులు కేటాయించారు.

సబ్జెక్టులు - ముఖ్యమైన టాపిక్స్

ఆప్టిట్యూడ్/ డేటా ఇంటర్‌ప్రిటేషన్: సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేషన్స్, నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, అరిథ్‌మెటిక్ టాపిక్స్ (పర్సంటేజ్, ఏవరేజెస్, ప్రాబ్లమ్స్ ఆన్ ఏజెస్, రేషియో, ప్రాఫిట్-లాస్, టైమ్-డిస్టెన్స్, మిక్చర్-అలిగేషన్, మెన్సురేషన్ మొదలైనవి), దీనితోపాటు మెయిన్స్ కోసం.. హైలెవెల్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (మిస్సింగ్ డీఐ, మిక్స్‌డ్ (గ్రాఫ్‌లు, కేస్‌లెట్స్), పర్ముటేషన్-కాంబినేషన్, ప్రాబబిలిటీ, డేటా సఫిషియన్సీలను బాగా సాధన చేయాలి.

రీజనింగ్: సీటింగ్ అరేంజ్‌మెంట్స్, పజిల్స్ (లీనియర్, సర్క్యులర్ సీటింగ్, బాక్స్ పజిల్, ఫ్లోర్ పజిల్, డ్యూయల్ అండ్ కాంప్లెక్స్ పజిల్స్), కోడింగ్-డీకోడింగ్, డైరెక్షన్ సెన్స్, సిలాగిజమ్, బ్లడ్ రిలేషన్స్, ఇనీక్వాలిటీ, ఆర్డర్ అండ్ ర్యాంకింగ్, ఆల్ఫాన్యూమరిక్ సిరీస్ మొదలైనవి. వీటితోపాటు మెయిన్స్ కోసం ఇన్‌పుట్-అవుట్‌పుట్ (మోడరేట్ నుంచి హైలెవెల్) కోటెడ్ ఇన్‌ఈక్వాలిటీ, డేటా సఫిషియన్సీ, లాజికల్ రీజనింగ్‌లోని కాజ్-ఎఫెక్ట్స్, స్టేట్‌మెంట్-కన్‌క్లూజన్స్/అసెంప్షన్స్/ కోర్సెస్ ఆఫ్ యాక్షన్స్ మొదలైనవి బాగా చదవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్: ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, సినానిమ్స్, యాంటనిమ్స్‌తోపాటు వ్యాకరణ సంబంధిత ప్రశ్నలు ఉంటాయి. వాటిలో క్లోజ్‌టెస్ట్, పారాజంబుల్స్, ఎర్రర్ డిటెక్షన్, ఫిల్లింగ్ ది బ్లాంక్స్, సెంటెన్స్ కరెక్షన్స్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, వర్డ్ యూసేజ్ మొదలైన మోడల్స్ ఉంటాయి. వీటితోపాటు మెయిన్స్ పరీక్షలో ఉండే డిస్క్రిప్టివ్ ఇంగ్లిష్ కోసం లెటర్ రైటింగ్ (ఫార్మల్ అండ్ ఇన్‌ఫార్మల్), ఎస్సే రైటింగ్ (బ్యాంకింగ్, ఎకనామిక్, సోషల్ ఇష్యూస్) బాగా సాధన చేయాలి.

జనరల్/ బ్యాంకింగ్/ ఎకనామిక్ అవేర్‌నెస్: ఈ విభాగంలో ఇంతకు ముందు సంవత్సరం ఉన్న కంప్యూటర్ ఆప్టిట్యూడ్ తొలగించి.. కొత్తగా డిజిటల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్, ఆర్‌బీఐ సర్క్యులర్స్ చేర్చారు. దీని కోసం అభ్యర్థులు డిజిటల్ బ్యాంకింగ్‌కు సంబంధించినవి చూసుకోవాలి. యూపీఐ, డిజిటల్ వ్యాలెట్స్ (గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం మొదలైనవి), సైబర్ సెక్యూరిటీ, క్రిప్టో కరెన్సీ, ఆర్‌బీఐ సర్క్యులర్స్, రెపోరేటు మార్పులు, వార్షిక రిపోర్టులు, సూచనలు, అప్‌డేట్స్ మొదలైన వాటి నుంచి ప్రశ్నలు ఉండవచ్చు. వీటితోపాటు రెగ్యులర్‌గా ప్రశ్నలుండే బ్యాంకింగ్ సిస్టమ్, ఆర్‌బీఐ, మానిటరీ పాలసీ, ఇండియన్ ఎకానమీ, బడ్జెట్, ప్రభుత్వ పథకాలు, నీతి ఆయోగ్, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, ముఖ్యమైన వ్యక్తులు, ప్రదేశాలు, జాతీయ/అంతర్జాతీయ దినోత్సవాలు మొదలైనవి బాగా చూసుకోవాలి. వీటన్నింటికీ ప్రాధాన్యమిస్తూ గత ఐదారు నెలల తాజా పరిణామాలను చదవాలి.

ప్రొఫెషనల్ నాలెడ్జ్: స్పెషలిస్ట్ ఆఫీసర్ల పరీక్ష మెయిన్స్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసే పోస్టుకు సంబంధించిన సబ్జెక్టుపై పరీక్ష ఉంటుంది. ఉదాహరణకు అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ పరీక్షకు.. క్రాప్ సైన్స్, సాయిల్ సైన్స్, హార్టికల్చర్, అగ్రి ఎకనామిక్స్, యానిమల్ హస్బెండరీ వీటిని బాగా చదవాలి.

సన్నద్ధత: ఐబీపీఎస్ పీవో, ఎస్‌వో రెండు నోటిఫికేషన్లు ఉన్నాయి. కాబట్టి రెండిటికీ అర్హత ఉన్న వాళ్లు సన్నద్ధతను కలిపే కొనసాగించాలి. ప్రిలిమ్స్ పరీక్ష కోసం రెండింటికీ ఒకటే సన్నద్ధత సరిపోతుంది. కింది సూచనలను పాటిస్తే పరీక్షకు బాగా సన్నద్ధం కావొచ్చు.

సిలబస్ బాగా అర్థం చేసుకోవడం: ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో ఉన్న ఉమ్మడి విభాగాలు చూసుకోవాలి. పీవో, ఎస్‌వో రెండు పరీక్షలూ రాస్తుంటే.. ఆ రెండింటిలో ఉన్న ఉమ్మడి విభాగాలు చూసుకుని వాటిలో ఏ టాపిక్స్ నుంచి ప్రశ్నలు వస్తున్నాయో తెలుసుకోవాలి.

స్టడీ టైమ్‌టేబుల్ సన్నద్ధం చేసుకోవడం: రోజుకు ఎన్ని గంటలు కేటాయించగలరో నిర్ణయించుకుని, ఆ వ్యవధిని వివిధ విభాగాల సన్నద్ధత కోసం విభజించుకోవాలి. ప్రతీరోజూ ఏ విభాగాల్లో ఏ టాపిక్స్ పూర్తిచేయ దలుచుకున్నారో రాసుకోండి. ఇదేవిధంగా వారానికి టైమ్ టేబుల్ తయారుచేసుకోండి. దాని ప్రకారమే సన్నద్ధత ఉండేలా చూసుకోండి.

బేసిక్ కాన్సెప్ట్‌లపై పట్టు: ఆప్టిట్యూడ్, రీజనింగుల్లో గట్టి పట్టు ఉండాలి. కాన్సెప్టులను బాగా అర్థం చేసుకోవాలి. ఆంగ్ల వ్యాకరణంపై అవగాహన అవసరం.

స్టడీ మెటీరియల్: సాధన బాగా కొనసాగడానికి, నేర్చుకోవడానికి సరైన స్టడీ మెటీరియల్ సేకరించాలి.

మాక్‌టెస్టులు రాయాలి: టాపిక్స్ పూర్తవగానే వాటిలో వివిధ తరహా ప్రశ్నలు సాధన చేయాలి ఆ తర్వాత టాపిక్‌వారీ టెస్టులు రాయాలి. వారానికి ఒకటి లేదా రెండు ఫుల్‌లెంగ్త్ మాక్ టెస్టులు రాయాలి. అప్పుడే ఎంత సమయంలో ప్రశ్నలు సాధించగలుగుతున్నారో తెలుస్తుంది. అదేవిధంగా బలంగా/బలహీనంగా ఉన్న టాపిక్స్ కూడా తెలుస్తాయి. వాటిని సరిదిద్దుకునేలా సన్నద్ధత కొనసాగించాలి. త్వరగా సాధించడానికి వీలైనన్ని ట్రిక్స్, షార్ట్‌కట్లు ఉపయోగించండి.

పునశ్చరణ తప్పనిసరి: ప్రతిరోజూ పునశ్చరణ కోసం కొంత సమయం కేటాయించాలి. టాపిక్‌లను పాయింట్ల వారీగా నోట్ చేసుకుంటే పునశ్చరణ తేలికవుతుంది.

టాపిక్స్ ప్రాధాన్యం: పరీక్షలో వివిధ విభాగాల్లో ఎక్కువ ప్రశ్నలు వచ్చే టాపిక్స్‌ను గుర్తించి.. వాటిని ముందుగా పూర్తిచేయండి.

సరైన స్టడీప్లాన్‌తో రోజూ సాధన చేస్తూ శ్రమిస్తే తప్పనిసరిగా విజయం సాధించవచ్చు. ఇప్పుడు ఎస్‌బీఐ పీవో వంటి ఇతర నోటిఫికేషన్లూ ఉన్నాయి. వీటన్నింటికీ ఈ సన్నద్ధత ఉపయోగపడుతుంది.



- డా. జి.ఎస్. గిరిధర్
డైరెక్టర్, రేస్ ఇన్‌స్టిట్యూట్

నోటిఫికేషన్ వివరాలు

	పీవో	ఎస్‌వో
పోస్టుల సంఖ్య	5208	1007
విద్యార్హత (21.07.25 నాటికి)	ఏదైనా డిగ్రీ	పోస్టుబట్టి ఉంటుంది
వయసు (01.07.25 నాటికి)	20–30 సం. (జనరల్‌కు)	20–30 సం. (జనరల్‌కు)
దరఖాస్తు ఫీజు	రూ.850 రూ.175(ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు)	రూ.850 రూ.175 (ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు)
చివరి తేదీ	21.07.2025	21.07.2025
పరీక్ష తేదీ	ప్రిలిమ్స్: ఆగస్టు	ప్రిలిమ్స్: ఆగస్టు

వెబ్‌సైట్: https://www.ibps.in/

సాఫ్ట్‌వేర్‌లో ఫ్రెషర్‌గా అవకాశం?



పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో 11 ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్నా. ఈ పని నచ్చటం లేదు. బీటెక్ (ఐటీ) 2012లో చేశాను. సాఫ్ట్‌వేర్ రంగంలో ఫ్రెషర్‌గా అవకాశం ఉంటుందా? జాబ్‌లో నిలదొక్కుకునేంతవరకూ మూన్‌లైట్ మోడ్‌లో పనిచేయొచ్చా?

- డి. నిరంజన్ రెడ్డి

■ మీ ప్రస్తుత వయసు 32-33 ఏళ్లు ఉండే అవకాశం ఉంది. మీ ఉద్యోగానుభవం అంతా పోలీస్ విభాగంలోనే ఉంది కాబట్టి.. మీ వయసు, అనుభవం రీత్యా ఇప్పుడు సాఫ్ట్‌వేర్ కొలువు అంత సులభం కాదు. అవకాశం ఉంటే పోలీస్ శాఖలోనే కంప్యూటర్ విభాగానికి బదిలీ అయి, అక్కడ ఐటీ రంగంలో కొంత అనుభవం పొందండి. తర్వాత సాఫ్ట్‌వేర్ కోర్సులు నేర్చుకొని, ఐటీ రంగంలో ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ మూన్‌లైట్ పద్ధతిలో పనిచేయాలనుకోవడం మంచి ఆలోచన కాదు. అలా చేసినట్లు రుజువైతే మీపై శాఖాపరమైన చర్యలు తీసుకోవచ్చు.

ప్రస్తుతం ఉద్యోగ మార్కెట్‌లో దాదాపు 70 శాతం మంది ఇంజినీరింగ్ పట్టభద్రులు కంప్యూటర్, ఐటీ, ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్ రంగాలకు సంబంధించిన వారే ఉన్నారు. చాలా ఐటీ ఉద్యోగాలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారానే భర్తీ అవుతున్నాయి. ఐటీ రంగంలో ఉద్యోగానుభవం లేకుండా ఫ్రెషర్‌గా కొలువు పొందడం చాలా కష్టం. అవకాశం ఉంటే మీ ప్రస్తుత ఉద్యోగానికి సెలవు పెట్టి డేటాసైన్స్/ ఏఐ/ ఎంఎల్‌లలో ఎంటెక్ లేదా కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఎమ్మెస్సీ లేదా ఎంబీఏ బిజినెస్ అనలిటిక్స్ రెగ్యులర్ విధానంలో చదివి ఉద్యోగ ప్రయత్నాలు చేయండి. పీజీ రెగ్యులర్‌గా చదవడం వీలుకాకపోతే ఉద్యోగం చేస్తూనే కింది సాఫ్ట్‌వేర్ కోర్సుల గురించి ఆలోచించవచ్చు.



- ✦ ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్: జావా, జావా స్క్రిప్ట్.
- ✦ డేటా సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్: డేటా అనాలిసిస్, ప్రెడిక్టివ్ మోడలింగ్, మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్, పైతాన్, ఆర్ ప్రోగ్రామింగ్.
- ✦ క్లౌడ్ కంప్యూటింగ్
- ✦ సైబర్ సెక్యూరిటీ: నెట్‌వర్క్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్.
- ✦ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డీప్ లెర్నింగ్.

క్రమశిక్షణతో ప్రతి రోజూ 3-4 గంటలు సాధన చేస్తే, మీ నైపుణ్యాలు మెరుగై, సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం పొందే అవకాశాలు ఉంటాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఏఐలో ఇంకొంచెం..

ఏఐ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ రంగాల్లో లాంగ్ చెయిన్, లాంగ్ గ్రాఫ్ టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తోంది. ఇప్పటికే ఈ తరహా ఉద్యోగాల్లో ఉన్నవారు, కొత్తగా ఏఐలో అడుగు పెట్టాలనుకునేవారు.. ఈ టెక్నాలజీ నేర్చుకోవడం ద్వారా మరింత సమర్థంగా రాణించగలరు. ఎందుకంటే వివిధ ఏఐ ఏజెంట్స్‌ను తయారుచేయడంలో ఇవి కీలకంగా మారుతున్నాయి. ఏఐ ఉత్పత్తుల తయారీని ఇవి సులభతరం చేస్తున్నాయి.

తేడా ఏమిటి?

లాంగ్‌చెయిన్.. ఒక లంకె మాదిరి చేయదగిన పనులకు ఉపయోగంగా ఉంటుంది. లీనియర్ చెయిన్స్, రిట్రైవల్ ఫ్లో ఉపయోగించి ఇంటర్‌ఫేస్ అందిస్తుంది. నేరుగా, స్పష్టంగా ఉండే టాస్కులకు ఇది బాగుంటుంది.

కానీ లాంగ్‌గ్రాఫ్ ఇలా కాదు. ఇది సైకిల్ (గ్రాఫ్) వేస్తుంది. ఒక దాన్నుంచి మరోచోటికి వెళ్లే టాస్కులకు ఉపయోగపడుతుంది. ఈ ఫీచర్ వల్ల వినియోగదారులకు ఇంటరాక్షన్స్ మీద పూర్తిస్థాయి నియంత్రణ ఉంటుంది. అడ్వాన్స్‌డ్ ఏజెంట్ ఆధారిత సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌కు ఇది అత్యంత అనుకూలం. ఒక్కమాటలో చెప్పాలంటే లాంగ్‌చెయిన్ ఒకదానికి ఒకటి అనుసంధానంగా, తేలికగా ఉండే టాస్కులకు ఉపయోగపడితే.. లాంగ్‌గ్రాఫ్ గజిబిజి పనులకు ఉపకరిస్తుంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఓ సముద్రం. ఎంత నేర్చుకున్నా కొత్త విషయాలు ఉంటూనే ఉంటాయి. నూతన అంశాలు వస్తూనే ఉంటాయి. దీన్ని ఉపయోగించడం తేలిక కావడం కోసం ఇప్పటికే అనేక అప్లికేషన్లు ఉన్నాయి.

ఈ జాబితాలో లాంగ్‌చెయిన్, లాంగ్‌గ్రాఫ్ కూడా వచ్చి చేరాయి. వీటి వినియోగం తెలుసుకోవడం ద్వారా మరిన్ని అవకాశాలు అందుకోవడమే కాదు, మరింత వేగవంతంగానూ, సమర్థంగా ఏఐతో పనిచేసే వీలుంటుంది.

● ఈ టెక్నాలజీ ఆధారిత ఉద్యోగాల్లో ఏఐ ఏజెంట్స్‌ను అభివృద్ధి చేయడం, పనితీరును పర్యవేక్షించడం, జెనరేటివ్ ఏఐ అనువర్తనాలు తయారు చేయడం, లార్జ్ లాంగ్వేజ్ మాడ్యూల్స్‌తో పనిచేయడం వంటి విధులుంటాయి.

● ఇప్పటికే చాలా కంపెనీలు లాంగ్‌చెయిన్ అండ్ లాంగ్‌గ్రాఫ్ తెలిసిన ఏఐ ఇంజినీర్లను కోరుకుంటున్నాయి. ఏఐ ఆధారిత సిస్టమ్స్, ఏజెంటిక్ వర్క్ ఫ్లోలను అభివృద్ధి చేయడం, ఎల్ఎల్ఎమ్స్‌ను ఇంటిగ్రేట్ చేయడం వంటి పనులు చేయగల నిపుణులు అవసరం అవుతున్నారు. డెవలపర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డేటా సైంటిస్టులు.. పైతాన్, జావాస్క్రిప్ట్, టైప్‌స్క్రిప్ట్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌లో పట్టు ఉన్నవారు.. ఆ లాంగ్వేజెస్‌లో ఉన్న లాంగ్‌చెయిన్ ప్యాకేజీలను వాడుకునే వీలుంటుంది.

● ఇది నిజానికి ఒక ఓపెన్‌సోర్స్ ఫ్రేమ్‌వర్క్. ప్రత్యేకమైన డిజైన్‌తో ఆసక్తికరంగా, క్లిష్టమైన అవసరాలకు ఉపయోగించుకునేలా ఉంటుంది. దీని సులభమైన ఇంటర్‌ఫేస్ ద్వారా వినియోగదారులు వివిధ ఎల్ఎల్ఎమ్స్ మధ్య సులభంగా మారేందుకు వీలుంటుంది. ఇంటిగ్రేషన్‌లోని క్లిష్టతను తగ్గిస్తుంది. లాంగ్‌గ్రాఫ్‌ను లాంగ్‌చెయిన్‌కు ఒక కొనసాగింపుగా చెప్పవచ్చు.

ఎలాంటి ఉద్యోగాలు

చాలా ఇంజినీరింగ్ ఉద్యోగాల్లో ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. డిప్లాయ్‌మెంట్ ఇంజినీర్, ఫ్రంట్ఎండ్ ఇంజినీర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీర్, ప్రొడక్ట్ డిజైనర్, ఫుల్‌స్టాక్ ఇంజినీర్, టెక్నికల్ డాక్స్ రైటర్, ఏఐ ఇంజినీర్, ఏఐ-ఎంఎల్ బ్యాక్ఎండ్ డెవలపర్, ప్రాంప్ట్ ఇంజినీర్, పైతాన్ డెవలపర్, జెనరేటివ్ ఏఐ ఇంజినీర్.. ఇలాంటి ఎన్నో ఉద్యోగాల్లో ఈ స్కిల్‌తో మెరుగైన ప్రదర్శన ఇవ్వవచ్చు.

ఎక్కడ..

వీటి గురించి లాంగ్‌చెయిన్ అధికారిక వెబ్‌సైట్ నుంచి చాలా వివరాలు తెలుసుకోవచ్చు. యుడెమీ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫాట్స్‌లో ప్రత్యేక కోర్సులున్నాయి. యూట్యూబ్‌లోనూ ఉచితంగా సమాచారం లభిస్తుంది.



నేర్చుకోవడం..

1 ముందుగా ఈ రెంటికీ ప్రధానమైన తేడాలు, ప్రాథమికంగా చేసే పనుల గురించి తెలుసుకోవాలి. వీటిలో ఉండే ప్రతి ఫ్రేమ్ వర్క్ గురించి ట్యుటోరియల్స్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. ముందు సింపుల్ అప్లికేషన్ నుంచి ప్రారంభించి తర్వాత కష్టతరమైనవి చేయడం నేర్చుకోవచ్చు.

2 లాంగ్‌చెయిన్‌లో అయితే చెయిన్స్, ప్రాంప్ట్స్, మోడల్స్ వంటి ప్రాథమిక అంశాలతో ప్రారంభించాలి. దీని అధికారిక డాక్యుమెంటేషన్, ట్యుటోరియల్స్ నుంచి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. తొలుత చాట్‌బోట్స్ తయారీ, క్వశ్చన్ ఆన్సరింగ్ సిస్టమ్స్ వంటి వాటి నుంచి నేర్చుకుని.. ఆపైన రిట్రైవల్ ఆగ్‌మెంటెడ్ జనరేషన్ (ఆర్ఏజీ), ఎల్ఎల్ఎమ్ టూల్స్ వినియోగం నేర్చుకోవాలి.

3 లాంగ్‌గ్రాఫ్‌ను నేర్చుకునేందుకు దీని గ్రాఫ్ స్ట్రక్చర్ మీద అవగాహన పెంచుకోవాలి. ఎందుకంటే అప్లికేషన్స్ తయారీలో ఇది ప్రధానం. గ్రాఫ్ స్టేట్స్‌ను తెలియజేయడం, నోడ్స్, ఎడ్జెస్‌ను కలపడం, ట్రాన్సిషన్స్‌ను నిర్వహించడం వంటివి తెలుసుకోవాలి. ఇక్కడ కూడా చాట్‌బోట్స్ వంటి ప్రాథమిక అంశాలతో మొదలుపెట్టి మెమొరీ, టూల్ యూసేజ్ వంటివి తెలుసుకోవాలి. విభిన్నమైన కేస్ స్టడీల ఆధారంగా సాధన చేయాలి.

వర్క్ ఫ్రమ్ హోమ్

డేటా ఎంట్రీ

సంస్థ: ఈపీపీ కాంపోజిట్స్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం గూగుల్ షీట్స్
స్టైపెండ్: రూ.5,000-7,000
☛ https://lnk.ink/TIxJi

టెక్నికల్ స్క్రమ్ మాస్టర్

సంస్థ: రిజల్యూట్ ఏఐ సాఫ్ట్‌వేర్ ప్రై.లి.
నైపుణ్యాలు: అమెజాన్ వెబ్ సర్వీసెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్, మైక్రోసాఫ్ట్ అజ్యూర్, స్క్రమ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లైఫ్ సర్కిల్ స్ట్రాటజీ స్టైపెండ్: రూ.5,000-8,000
☛ https://lnk.ink/Zc3Xf

ఇంటర్న్‌షిప్స్

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: రెయిన్‌బో ఎంటర్‌ప్రైజ్
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.5,000-6,000
☛ https://lnk.ink/3GZzO

ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్

సంస్థ: స్పార్క్‌లైన్ మార్కెటింగ్
నైపుణ్యాలు: కంటెంట్, పర్ఫార్మెన్స్, సోషల్ మీడియా మార్కెటింగ్, కోఆర్డినేషన్, మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.5,500-17,500
☛ https://lnk.ink/Rkf0D

మార్కెట్ రిసెర్చ్

సంస్థ: సాస్కార్ప్ హోల్డింగ్స్ (ఫ్యామిలీ ఆఫీస్) నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-వర్డ్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్
స్టైపెండ్: రూ.5,000
☛ https://lnk.ink/cQNrO

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: గ్రోత్ సర్కిల్ క్రియేటివ్స్
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, కేన్వా
స్టైపెండ్: రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: జులై 27
☛ https://lnk.ink/bco41

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: వెబ్‌ఫాస్ట్ టెక్నాలజీ
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.3,000-5,000
☛ https://lnk.ink/cyniA

వీడియో ఎడిటింగ్/ మేకింగ్

సంస్థ: దేవ్‌పుణ్య ఎంటర్‌ప్రైజ్ ప్రై.లి.
నైపుణ్యాలు: వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ స్టైపెండ్: రూ.10,000
☛ https://lnk.ink/Xkwrx

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: జులై 27

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

ఎస్ఎస్‌సీ 1340 జూనియర్ ఇంజినీర్లు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) 1340 జూనియర్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
విభాగాలు: జూనియర్ ఇంజినీర్: సివిల్/ మెకానికల్/ఎలక్ట్రికల్
అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా లేదా డిగ్రీ ఉండాలి.
వయసు: 01.01.2026 నాటికి 30 ఏళ్ల లోపు ఉండాలి. కొన్ని పోస్టులకు 32 ఏళ్ల వరకూ అవకాశం ఉంది. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10-15 ఏళ్ల వరకు గరిష్ఠ వయసులో సడలింపు ఉంది.
వేతన శ్రేణి: రూ.35,400 రూ.1,12,400.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ పరీక్షలతో.
పేపర్–I: జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఇంజినీరింగ్ (సివిల్/ఎలక్ట్రికల్/మెకానికల్)- 200 మార్కులు
పేపర్–II: జనరల్ ఇంజినీరింగ్ (ఎంచుకున్న స్పెషలైజేషన్)- 300 మార్కులు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21.07.2025.
దరఖాస్తు ఫీజు: రూ.100. మహిళలు, ఎస్సీ/ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు ఫీజు ఉండదు.
పేపర్–I పరీక్ష తేదీలు: అక్టోబరు 27 నుంచి 31 వరకు
పేపర్–II పరీక్ష: జనవరి - ఫిబ్రవరి 2026లో
వెబ్‌సైట్: https://ssc.gov.in.

పీఎఫ్ఆర్‌డీఏలో 40 అసిస్టెంట్ మేనేజర్లు

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) 40 అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
● ఆఫీసర్ గ్రేడ్-ఏ (అసిస్టెంట్ మేనేజర్): 40
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో యూజీ/పీజీతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 31.07.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
వేతన శ్రేణి: నెలకు రూ.44,500 - రూ.89,150.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 06.08.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.1000. ఎస్టీ, ఎస్సీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు ఉండదు. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://www.pfrda.org.in/

మేనేజ్‌లో జూనియర్ స్టెనోగ్రాఫర్లు

హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 7 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● జూనియర్ స్టెనోగ్రాఫర్- 02 ● అప్పర్ డివిజన్ క్లర్క్: 01
● జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్: 01 ● మల్టీ-టాస్కింగ్ స్టాఫ్: 03
అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, సంబంధిత విభాగాల్లో ఇంటర్మీడియట్, బ్యాచిలర్ డిగ్రీ, ఇంగ్లిష్ టైపింగ్, కంప్యూటర్ పరిజ్ఞానం.
వేతనం: నెలకు జూనియర్ స్టెనోగ్రాఫర్, అప్పర్ డివిజన్ క్లర్క్‌లకు రూ.25,000- రూ.81,000; జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.19,000- రూ.63,200; మల్టీ-టాస్కింగ్ స్టాఫ్‌కు రూ.18,000- రూ.56,900.
వయసు: పోస్టును అనుసరించి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: విద్యార్హతలు, రాత పరీక్ష, టైప్ టెస్టులతో.
దరఖాస్తు ఫీజు: జూనియర్ స్టెనోగ్రాఫర్, అప్పర్ డివిజన్ క్లర్క్‌కు రూ.500. ఇతర పోస్టులకు రూ.350. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ఎక్స్‌సర్వీస్‌మెన్/మహిళలకు రూ.150. **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 28.07.2025.
చిరునామా: 'ది డిప్యూటీ డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్), రాజేంద్రనగర్, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://www.manage.gov.in/

వాక్–ఇన్స్

సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐలో..

సీఎస్ఐఆర్- నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్ 10 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
● ప్రాజెక్ట్ అసిస్టెంట్-2: 03 ● సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: 02
● ప్రాజెక్ట్ అసోసియేట్-1: 01 ● ప్రాజెక్ట్ అసోసియేట్-2: 04
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఎంటెక్, డిప్లొమాతో పాటు పని అనుభవం ఉండాలి.
గరిష్ఠ వయసు: ప్రాజెక్ట్ అసిస్టెంట్-2కు 35 ఏళ్లు, ప్రాజెక్ట్ అసోసియేట్-1, 2కు 35 ఏళ్లు, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 40 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, మహిళలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది.
వేతనం: నెలకు ప్రాజెక్ట్ అసిస్టెంట్-2కు రూ.20,000, ప్రాజెక్ట్ అసోసియేట్-1కు రూ.25,000-రూ.31,000, ప్రాజెక్ట్ అసోసియేట్-2కు రూ.28,000-రూ.35,000, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000.
ఎంపిక: ఇంటర్వ్యూతో. **ఇంటర్వ్యూ తేదీలు:** జులై 7, 8.
వేదిక: సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఉప్పల్ రోడ్, హైదరాబాద్, తెలంగాణ-500007.
వెబ్‌సైట్: https://www.ngri.res.in/openings-at-ngri.php

నాన్ టీచింగ్ పోస్టులు

గాంధీనగర్‌లోని కేంద్ర హోం మంత్రిత్వశాఖకు చెందిన నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ 3 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
● క్లర్క్: 02 ● మల్టీ టాస్కింగ్ స్టాఫ్: 01
అర్హత: మెట్రిక్యులేషన్, సంబంధిత విభాగంలో డిగ్రీతో పాటు పని అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం. **వేతనం:** నెలకు క్లర్క్ పోస్టుకు రూ.26,000. మల్టీ టాస్కింగ్ పోస్టుకు రూ.18,000. **వయసు:** క్లర్క్ పోస్టుకు 35 ఏళ్లు, మల్టీ టాస్కింగ్ పోస్టుకు 25 ఏళ్లు మించకూడదు. **ఇంటర్వ్యూ తేదీ:** 14.07.2025.
వేదిక: నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ, సెక్టార్ 9, గాంధీనగర్, గుజరాత్.
వెబ్‌సైట్: https://www.nfsu.ac.in/

హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్‌లో..

హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ & రిసెర్చ్ సెంటర్, టీఎంసీ బిహార్.. మెడికల్ ఫిజిసిస్ట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
● మెడికల్ ఫిజిసిస్ట్ - 02
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ(ఫిజిక్స్), డిప్లొమాతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 07.07.2025 నాటికి 35 ఏళ్లు ఉండాలి.
వేతనం: నెలకు రూ.55,000 - రూ.60,000.
ఎంపిక: ఇంటర్వ్యూతో. **ఇంటర్వ్యూ తేదీ:** 07.07.2025
వేదిక: హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్, శ్రీ కృష్ణ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ క్యాంపస్, ఉమానగర్, ముజఫ్ఫర్‌పూర్ (బిహార్)-842004. వెబ్‌సైట్: https://tmc.gov.in/m_events/events/JobDetail?jobId=35648

కెరియర్, ఉన్నత విద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: చదువు,
ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
edc@eenadu.in

ఆ 'అదృశ్య శక్తి' ఎవరు?

- మద్యం ముడుపుల సొత్తు ఎవరి ఆదేశాలతో వైకాపా అభ్యర్థులకు చేర్చారు?
- వైకాపా నేత చెవిరెడ్డి, వెంకటేశ్‌నాయుడులకు సిట్ ప్రశ్నలు
- జవాబులు చెప్పకుండా చెవిరెడ్డి దబాయింపు
- తనపై తప్పుడు కేసు పెట్టారంటూ కేకలు

ఈనాడు, అమరావతి: ఎవరి ఆదేశాలతో మద్యం ముడుపుల సొత్తును రాజ్ కెసిరెడ్డి మీకు అందజేశారు? వారి నుంచి ఎన్ని వందల కోట్ల రూపాయలు మీకు చేరాయి? ఆ ముడుపుల సొత్తును ఎవరెవరికి, ఎంతెంత, ఎప్పుడు ఇచ్చారు? గత సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన వైకాపా అభ్యర్థులకు ఈ ముడుపుల డబ్బులు చేర్చాలంటూ మిమ్మల్ని నిర్దేశించిన ఆ 'అదృశ్య' శక్తి ఎవరు? మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితులైన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి (ఏ-38), ఆయన సన్నిహితుడు వెంకటేశ్‌నాయుడు (ఏ-34)లపై సిట్ అధికారులు ఇలా ప్రశ్నల వర్షం కురిపించారు. వీరిని మూడు రోజుల కస్టడీ తీసుకున్న సిట్ అధికారులు.. తొలి రోజైన మంగళవారం దాదాపు 8 గంటల పాటు విచారించారు. ఇద్దర్నీ వేర్వేరుగా విచారించిన అధికారులు.. ఒక్కొక్కరికి 100కు పైగా ప్రశ్నలు సంధించారు. అయితే వారు విచారణకు ఏ మాత్రం సహకరించలేదు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రతిదానికి బుకాయింపు, దబాయింపు ధోరణితో వ్యవహరించినట్లు తెలిసింది. సిట్ అధికారుల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా.. తనపై తప్పుడు కేసు పెట్టారంటూ కేకలేస్తూ హడావుడి చేసినట్లు సమాచారం. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ సిట్ అధికారులు అడగ్గా తానెందుకు జవాబివ్వాలంటూ ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. వెంకటేశ్‌నాయుడు కూడా విచారణకు సహకరించలేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. తొలి రోజు విచారణలో సిట్ అధికారులు చెవిరెడ్డి భాస్కరరెడ్డిని అడిగిన ప్రశ్నలు, వాటికి ఆయన సమాధానాలివీ..

ముడుపులతో సంబంధం లేకపోతే... అక్కడికి పదే పదే ఎందుకెళ్లారు?

'మద్యం ముడుపుల సొమ్ము భద్రపరిచిన (క్యాష్ స్టాక్ పాయింట్) తాడేపల్లిలోని ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌కు పదే పదే ఎందుకెళ్లారు' అని సిట్ అధికారులు తొలుత చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ప్రశ్నించగా.. ఆ అపార్ట్‌మెంట్‌కు తానెప్పుడూ వెళ్లలేదని ఆయన జవాబిచ్చినట్లు తెలిసింది. 2023 జూన్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు పదే పదే ఆ అపార్ట్‌మెంట్‌కు వెళ్లినట్లుగా నిర్ధారించే సాంకేతిక ఆధారాల్ని చూపించి ప్రశ్నించగా 'ఆ మార్గంలో మా పార్టీ ముఖ్య నాయకుడుంటారు. ఈ క్రమంలో తరచూ అటు తిరిగేవాణ్ని. అంతమాత్రాన నేను అక్కడికి వెళ్లానని మీరెలా చెబుతారు' అంటూ దబాయించినట్లు సమాచారం.



విచారణ కోసం తనను తీసుకెళ్లడానికి విజయవాడ జిల్లా జైలుకు వచ్చిన సిట్ అధికారులకు శాపనార్థాలు పెడుతున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి

- 'ముడుపులతో ఏ సంబంధమూ లేకపోతే తాడేపల్లి ల్యాండ్‌మార్క్స్ అపార్ట్‌మెంట్‌లోని క్యాష్ స్టాక్ పాయింట్ హ్యాండ్లర్‌గా వ్యవహరించిన ప్రణోయ్ ప్రకాశ్‌తో ఎందుకు తరచూ భేటీ అయ్యారు' అని సిట్ అధికారులు ప్రశ్నించగా.. తానెప్పుడూ అతణ్ని కలవలేదని చెవిరెడ్డి బుకాయించారు. 2023, 2024ల్లో పలు తేదీల్లో ప్రణోయ్‌ను చెవిరెడ్డి కలిసిన ఆధారాల్ని చూపించి ప్రశ్నించగా ఆయన మౌనం వహించినట్లు తెలిసింది.
- 'ప్రణోయ్ ప్రకాశ్‌తో భేటీలు జరిగిన ప్రతిసారీ.. మీ మనుషుల్ని ల్యాండ్‌మార్క్ అపార్ట్‌మెంట్‌కు పంపించి తీసుకున్న ముడుపుల సొమ్ము ఎక్కడికి చేర్చారు?' అని అడగ్గా తనకేం తెలియదని దబాయించినట్లు తెలిసింది.

ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి పారిపోవాలని ఎందుకు ఆదేశించారు?

'సార్వత్రిక ఎన్నికల సమయంలో గతేడాది మే 9న గరికపాడు చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డ మద్యం ముడుపుల సొమ్ము రూ.8.36 కోట్లు ఎవరికి అందజేయటానికి తీసుకెళ్తున్నారు?' అని సిట్ అధికారులు అడగ్గా.. ఆ డబ్బులతో తనకెలాంటి సంబంధమూ లేదని చెవిరెడ్డి సమాధానమిచ్చినట్లు తెలిసింది. 'ఏ సంబంధమూ లేకపోతే ఆ లారీని అప్పటి మీ గన్‌మెన్ గిరిధర్, పీఏ నవీన్ ఎందుకు అనుసరిస్తున్నారు? ఆ డబ్బు పట్టుబడిన వెంటనే మీరు గన్‌మెన్ గిరికి ఫోన్ చేసి, ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి పారిపోవాలని ఎందుకు ఆదేశించారు' అని అడగ్గా.. మౌనం వహించినట్లు తెలిసింది.

◆ 'రాజ్ కెసిరెడ్డి ఇచ్చిన ముడుపుల సొమ్మును గత ఎన్నికల్లో ఏయే నియోజకవర్గాల్లోని వైకాపా అభ్యర్థులకు ఎంతెంత ఇచ్చారు?' అని అడగ్గా తాను ఎవరికీ డబ్బులు పంపిణీ చేయలేదని చెవిరెడ్డి సమాధానమిచ్చారు.

◆ చెవిరెడ్డి సన్నిహితుడు వెంకటేశ్‌నాయుడును సిట్ అధికారులు ఇవే ప్రశ్నలు అడగ్గా.. ఆయన అన్నింటికీ డొంక తిరుగుడుగా, తప్పించుకునే రీతిలో సమాధానాలిచ్చారు.

సిట్ అధికారులకు చెవిరెడ్డి శాపనార్థాలు

మూడు రోజుల కస్టడీ నిమిత్తం సిట్ అధికారులు మంగళవారం ఉదయం చెవిరెడ్డి భాస్కరరెడ్డిని విజయవాడ జిల్లా జైలు నుంచి బయటకు తీసుకొచ్చారు. అప్పుడు చెవిరెడ్డి పెద్దగా అరుస్తూ 'నాపై తప్పుడు కేసు పెట్టారు. అన్యాయంగా జైల్లో పెట్టారు. సిట్‌లో రాజగోపాల్, సుకుమార్ లాంటి గొప్ప గొప్ప దర్శకులున్నారు. మహానటులున్నారు. నాపై కేసులు పెట్టిన ప్రతి ఒక్కర్నీ దేవుడు శిక్షిస్తాడు. ప్రకృతి మిమ్మల్ని వదలదు' అంటూ సిట్ అధికారులకు శాపనార్థాలు పెట్టారు.

పేదల ఇళ్లపై హైడ్రా అరాచక పర్వం

- 'ఎక్స్'లో హరీశ్‌రావు పోస్ట్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పేదలు, మధ్యతరగతి ఇళ్లపై హైడ్రా అరాచకపర్వం కొనసాగించడం దుర్మార్గమని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్' మాధ్యమంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు తన పోస్టును ట్యాగ్ చేశారు. "హైకోర్టు స్టే ఉన్నా.. హైదరాబాద్, గుట్టల బేగంపేటలో ఇళ్ల కూల్చివేతకు పాల్పడటం న్యాయవ్యవస్థను అవమానించడమే. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి న్యాయస్థానాలపై ఉన్న గౌరవం ఇదేనా? ఒకవైపు ప్రతిపక్ష నేతగా రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా బుల్డోజర్ రాజ్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ ఉంటే.. మరోవైపు అదే కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం బుల్డోజర్ రాజ్ చేస్తూ పేదల ఇళ్లు కూల్చుతున్నారు. ఇది కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనం కాదా? తెలంగాణ సీఎంను రాజ్యాంగ విలువలకు, కాంగ్రెస్ పార్టీ చెబుతున్న సిద్ధాంతాలకు లోబడి నడుచుకునేలా ఆదేశించండి' అని హరీశ్‌రావు.. మీనాక్షి నటరాజన్‌కు సూచించారు.

పంట బీమా అమలు చేయకపోవడం అన్యాయం

పంట బీమా అంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన రేవంత్‌రెడ్డి నాలుగు సీజన్లుగా దాన్ని అమలు చేయకపోవడం అన్యాయమని హరీశ్‌రావు ఒక ప్రకటనలో ఆరోపించారు. గత బడ్జెట్‌లో రూ.1,300 కోట్లు కేటాయించి.. కేవలం కాగితాలకే పరిమితం చేశారు తప్ప రూపాయి విదిల్చింది లేదని విమర్శించారు. వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పెద్దలకో న్యాయం? పేదలకో న్యాయమా?: కేటీఆర్

పేదల ఇళ్లు కూల్చడంలో హైడ్రా ఎక్కువ ఉత్సాహం చూపిస్తోందని, ఈ విషయంలో పేదలకు ఒక న్యాయం? పెద్దలకు మరో న్యాయమా? అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్‌లో ప్రశ్నించారు. "బడా బాబులు చెరువులు ఆక్రమించి పెద్ద భవంతులు కట్టుకోవచ్చు. ఇవి హైడ్రాకు కనిపించవు. కానీ నిరుపేదలు తమ ఇళ్లు కూల్చొద్దని మొత్తుకున్నా ఈ ప్రభుత్వం కనికరం చూపకపోవడం అత్యంత దుర్మార్గం" అని ఆయన విమర్శించారు.

వైకాపా నేత వంశీకి షరతులతో బెయిల్

ఈనాడు, అమరావతి: వైకాపా నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి నకిలీ ఇళ్ల పట్టాల కేసులో బెయిల్ మంజూరైంది. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ పోలీసులు ఈ ఏడాది మే 16న ఈ కేసులో వంశీని నూజివీడు రెండో అదనపు న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నూజివీడు కోర్టులోనూ, హైకోర్టులోనూ పలుమార్లు బెయిల్ పిటిషన్లు వేసినా మంజూరు కాలేదు. ఇటీవల ఆయన తరఫు న్యాయవాదులు మరోసారి పిటిషన్ వేయడంతో మంగళవారం విచారణ జరిగింది. న్యాయాధికారి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. రూ.లక్ష చొప్పున రెండేసి పూచీకత్తులు సమర్పించడంతో పాటు, ప్రతి బుధవారం, శనివారం దర్యాప్తు అధికారి ఎదుట హాజరు కావాలని పేర్కొన్నారు.

మిగిలిన కేసుల్లో ఇప్పటికే బెయిల్

వైకాపా ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అరాచకశక్తిగా పేట్రేగిపోయిన వంశీపై.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పలువురు బాధితులు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయడంతో పాటు ప్రభుత్వం విచారణ చేపట్టడంతో వరసగా కేసులు నమోదయ్యాయి. అక్రమ మైనింగ్, ఓ మహిళ స్థలం అన్యాక్రాంతం చేసిన వ్యవహారం, అక్రమ మట్టి తవ్వకాలపై గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో, తేలప్రోలుకు చెందిన ఒకరి భూమిని బలవంతంగా విక్రయింపజేశారనే అభియోగంపై ఆత్కూరులో, మల్లవల్లి పారిశ్రామికవాడ భూసేకరణ సమయంలో పరిహారం రాకుండా మోసం చేశారని వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో, నకిలీ పట్టాలు, తెదేపా నాయకుడి దుకాణ సముదాయం కూల్చివేతపై హనుమాన్ జంక్షన్‌లో వంశీపై కేసులు నమోదయ్యాయి. గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్‌ను అపహరించి, దాడి చేసిన కేసులో ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లోని ఇంట్లో ఆయనను విజయవాడ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి విజయవాడలోని జిల్లా జైలులో గత 138 రోజులుగా రిమాండ్ ఖైదీగా ఉన్నారు. నకిలీ పట్టాల కేసు మినహా మిగతా వాటిలో గతంలోనే బెయిల్ వచ్చింది. ఈ కేసులో కూడా బెయిల్ వచ్చినందున బుధవారం ఆయన జైలు నుంచి విడుదలయ్యే అవకాశముంది.

లక్ష మంది మార్గదర్శులు... 15 లక్షల బంగారు కుటుంబాలు

- పేదలకు సాయం అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక
- 2029 నాటికి పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యం
- త్వరలో నిరుద్యోగ భృతి
- తూర్పుగోదావరి జిల్లా మలకపల్లి 'ప్రజావేదిక'లో ఏపీ సీఎం చంద్రబాబు

ఈనాడు, రాజమహేంద్రవరం, కాకినాడ; న్యూస్‌టుడే, తాళ్లపూడి: 'సామాన్య కుటుంబంలో పుట్టి అవకాశాలను అందిపుచ్చుకుని పైకి ఎదిగినవారు ఉన్నారు. వారిలో నేనూ ఒకడిని. రోజూ ఆరేడు కి.మీ. పాఠశాలకు నడిచి వెళ్లి చదువుకున్నాను. మనతో పాటు పుట్టిన వాళ్లలో కొందరు ఇంకా వెనుకబడి ఉన్నారు. వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచి పేదరికం నుంచి బయటకు తేవాలన్న లక్ష్యంతో పీ4 కార్యక్రమానికి రూపకల్పన చేశాం' అని సీఎం చంద్రబాబు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం మలకపల్లిలో మంగళవారం 'ప్రజావేదిక' సభలో ఆయన ప్రసంగించారు. 'ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించి లక్ష మంది మార్గదర్శుల చేత సాయం అందించే లక్ష్యం పెట్టుకున్నాం. 2029 కల్లా పేదరికం లేని సమాజ నిర్మాణం దిశగా ముందుకెళ్తున్నాం' అని సీఎం చెప్పారు. సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నామని.. నిరుద్యోగ భృతికి త్వరలో శ్రీకారం చుడతామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ఉంటుందన్నారు. 'అన్నదాతా సుఖీభవ' ద్వారా కేంద్రం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన రోజే తామూ వేస్తామన్నారు. తల్లికి వందనం కింద రూ.10 వేల కోట్లు ఖాతాల్లో వేశామని.. ఒకటో తరగతి, ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశాలు జరుగుతున్నాయని వారికీ లబ్ధిని చేకూరుస్తామని వివరించారు.

ఏ రాష్ట్రంలో లేనివిధంగా రూ.9.54 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని.. 8.50 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని.. లభిస్తాయని సీఎం చెప్పారు. ఇప్పటికే రూ.5 లక్షల కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయన్నారు. గత పదేళ్లలో ఎన్ని పెట్టుబడులు వచ్చాయో ఒక్క ఏడాదిలోనే అంతకంటే ఎక్కువ తెచ్చామన్నారు.

2027లో పోలవరం ప్రాజెక్టు అంకితం

పోలవరాన్ని ఐదేళ్లు ఏ విధంగా భ్రష్టుపట్టించారో చూశామని.. కక్ష తీర్చుకునే ధోరణిని వైకాపా ప్రభుత్వం అవలంబించిందన్నారు. ఇది 50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే ప్రాజెక్టు అని, దీనిని ప్రపంచస్థాయి నిపుణులు పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రాజెక్టును పూర్తిచేసి 2027లో జాతికి అంకితమిస్తామన్నారు.

'ఈ రోజు రౌడీలతో రాజకీయాలు చేయాల్సి వస్తోంది. గత ఐదేళ్లూ నేను ఎక్కడికి బయలుదేరినా.. బయటకు రానీయలేదు. గేట్లకు తాళాలు వేశారు. విశాఖ, తిరుపతికి వెళితే విమానాశ్రయాల నుంచే తిరిగి పంపించేశారు. ఇప్పుడు నేను అదే పనిని చేయదలుచుకోలేదు' అని చంద్రబాబు స్పష్టంచేశారు. 'జగన్ మొన్న రౌడీ షీటర్లను పలకరించడానికి వెళ్లి గందరగోళం సృష్టించారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు బలప్రదర్శనగా వెళ్లారు. ఆ సందర్భంలో జగన్ కారు కింద ఓ వ్యక్తి పడిపోతే మానవత్వం చూపకుండా ఈడ్చి పడేశారు. బాధితుడు వేరే కారు కింద పడినట్లు తప్పుడు సాక్ష్యాలు సిద్ధం చేశారు. ఫోరెన్సిక్ సాక్ష్యం కూడా జగన్ కారు వల్లే వ్యక్తి చనిపోయినట్లు తేల్చింది. 2019లోనూ ఇలానే మోసం చేశారు. వివేకానందరెడ్డి గుండెపోటుతో మృతి అని సాక్షి టీవీలో వస్తే నమ్మేశాం. వివేకానందరెడ్డి కుమార్తె సునీత శవపంచనామా చేయాలని కోరడంతో గొడ్డలిపోటని తేలింది. వివేకాను చంపిన వారందరినీ ఆ రోజే అరెస్టు చేస్తే రాష్ట్రానికి మంచి జరిగేది' అని సీఎం అన్నారు.



చర్మకారుడు పోసిబాబు ఇంటికి వెళ్లి ఆయనతో ముచ్చటిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు

చర్మకారుడి ఇంటికెళ్లి పింఛను పంపిణీ...

అంతకు ముందు మలకపల్లిలో చర్మకారుడు, డప్పు కళాకారుడు సనమంత్ర పోసిబాబు నివాసానికి చంద్రబాబు వెళ్లి రూ.4 వేల పింఛను అందించారు. కుటుంబ పరిస్థితి తెలుసుకోవడంతోపాటు చెప్పులు, టోపీ కొనుగోలు చేసి వారికి రూ.5 వేలు ఇచ్చారు. ఐటీఐ చదువుకున్న పోసిబాబు కుమారుడు మోహన్‌కు మెరుగైన ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. ఇంటి నిర్మాణానికి అభ్యర్థించగా రూ.3 లక్షల సాయం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. 3 నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని, దుకాణం ఏర్పాటుకు స్థలం కేటాయించి, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణ సదుపాయం కల్పించాలన్నారు. పోసిబాబు కుటుంబాన్ని తాను దత్తత తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రకటించడంతో సీఎం అభినందించారు.


- ప్రజావేదిక వద్ద ములపర్తి సూర్యారావు కుటుంబాన్ని రాగూర్ పరిశ్రమ ఎండీ పి.కాశీవిశ్వనాథరాజు దత్తత తీసుకున్నారు. సూర్యారావుకు ముగ్గురు కుమార్తెలు కాగా ఒకరు దివ్యాంగురాలు. ఆమె బాగోగులతోపాటు మిగతా ఇద్దరి చదువు, ఉద్యోగం, ఆ భార్యాభర్తలకు ఉపాధి కల్పిస్తామని కాశీ విశ్వనాథరాజు హామీ ఇచ్చారు. కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల్ని వైభవంగా నిర్వహిస్తాం

వచ్చే గోదావరి పుష్కరాలకు అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేస్తామని, వరుసగా మూడు పుష్కరాలను నిర్వహించే అవకాశం తమకే దక్కిందని సీఎం చంద్రబాబు చెప్పారు. కుంభమేళాలో అనుసరించిన విధానాలపై సమగ్ర అధ్యయనం చేసి.. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూస్తామన్నారు. దీనికి సంబంధించి మంత్రుల కమిటీని నియమించామన్నారు. కొన్ని పనులనూ ప్రారంభించామని వివరించారు. ఇప్పటికే రూ.95 కోట్లతో అఖండ గోదావరి ప్రాజెక్టు పనులకు మిత్రుడు పవన్‌కల్యాణ్, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ శంకుస్థాపన చేశారన్నారు. గత పుష్కరాలకు రాజమహేంద్రవరం, కొవ్వూరు వైపు అనేక ఆలయాలను నిర్మించినట్లు గుర్తుచేశారు. గోదావరి అందాలతోపాటు, కడియం నర్సరీలు, పోలవరం, పాపికొండలు, భద్రాచలం వెళ్లే మార్గంలో పలు అందమైన ప్రదేశాలున్నాయని వీటిని ప్రపంచస్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసి, అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వివరించారు.

దగ్గరకు పిలిచి.. పాపకు నామకరణం చేసి..

పోసిబాబు నివాసం నుంచి మలకపల్లిలో ప్రజావేదికకు వెళ్లే మార్గంలో మూడు నెలల పసిపాపను పట్టుకొని అభివాదం తెలుపుతున్న ఓ కుటుంబం కనిపించడంతో చంద్రబాబు కాన్వాయ్‌ను ఆపించి కిందికి దిగారు. ఆ పాపకు పేరు పెట్టాలంటూ వారు చంద్రబాబు చేతుల్లో పెట్టారు. మొదటి అక్షరం ఏం ఉండాలని ఆయన ప్రశ్నించారు. 'ఎస్' అక్షరం వచ్చేలా పెట్టండి సారూ అని వారు చెప్పారు. నాలుగు పేర్లు సూచించాలంటూ కలెక్టర్ ప్రశాంతిని సీఎం అడిగారు. ఆమె కొన్ని పేర్లు చెప్పడంతో చిరునవ్వు చిందించి పాపను ముద్దాడి 'షర్లిన్ ప్రశస్థ' అని నామకరణం చేశారు. పాపకు స్వయంగా ముఖ్యమంత్రి పేరు పెట్టారంటూ తల్లి అశ్విని, మేనమామ సునీల్ ఆనందం వ్యక్తంచేశారు. మరోచోట రోడ్డు పక్కన ఓ కుటుంబం దీనంగా నిల్చుని ఉండటాన్ని చూసిన సీఎం ఆగి వారి సమస్య తెలుసుకున్నారు. పక్షవాతంతో బాధపడుతున్న కుమారి అనే మహిళ తనకు రూ.6 వేలు పింఛను వస్తుందని చెప్పడంతో రూ.15 వేలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.



పసిపాపను ఎత్తుకొని నామకరణం చేస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి

కష్టాలు చెప్పుకొంటూ భావోద్వేగం

- ముఖ్యమంత్రితో కలిసి కారులో ప్రయాణించిన సామాన్యుడు

ఈనాడు, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వ పాలనలో సామాన్యులకు గౌరవం, గుర్తింపు లభిస్తున్నాయనడానికి, వారి సమస్యలు వెంటనే పరిష్కారం అవుతున్నాయనడానికి నిదర్శనం... ఈ ఉదంతం. మలకపల్లి పర్యటనలో సీఎం చంద్రబాబుతోపాటు చర్మకారుడు పోసిబాబు 15 నిమిషాల పాటు కారులో ప్రయాణించారు. సీఎంను తన ఇంటికి తీసుకెళ్లి కష్టాలను చెప్పుకొన్నారు. 'చెప్పులు కుడుతూ, డప్పులు, వెదురు బుట్టలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నా. 2016-17లో ఇల్లు మంజూరైంది. స్లాబ్ వరకు కట్టుకున్నా. వైకాపా ప్రభుత్వంలో బిల్లులు ఇవ్వకపోవడంతో ఇల్లు ఆగిపోయింది. ఇంకా సరిగా పూర్తికాని ఇంట్లోనే ఉంటున్నాం' అని ముఖ్యమంత్రి వద్ద పోసిబాబు వాపోయారు. తన భార్యకు డ్వాక్రాలో డబ్బులొస్తే నాలుగు మేకలు కొన్నామని.. ఇప్పుడవి ఎనిమిది అయ్యాయని వివరించారు. కుమారుడు ఐటీఐ చేశాడని, ఉద్యోగం ఇప్పించాలని కోరారు. కుటుంబ సభ్యులందరితో సీఎం చర్చించిన తర్వాత ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేసి, నిర్మాణం పూర్తి చేయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. 100 రోజుల్లో ఇంటిని పూర్తి చేస్తామని, గ్రామంలో అతని జీవనోపాధికి దుకాణం ఏర్పాటుకు స్థలం పరిశీలన చేస్తామని కలెక్టర్ తెలిపారు.



కారులో వెళ్తూ పోసిబాబుతో ముచ్చటిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబునాయుడు



దిల్లీలోని ఇండియాగేటు వద్ద నిర్వహించిన లాల్‌దర్వాజ బోనాల ఉత్సవంలో కళాకారుల సంప్రదాయ నృత్యం

దేశరాజధానిలో లాల్‌దర్వాజ బోనాలు

సందడి చేసిన విదేశీయులు

ఈనాడు, దిల్లీ: లాల్‌దర్వాజ బోనాలు దేశరాజధాని దిల్లీలో రెండో రోజు ఘనంగా జరిగాయి. మంగళవారం ఇండియాగేట్ నుంచి తెలంగాణభవన్ వరకు మహంకాళి అమ్మవారి ఘటాల ఊరేగింపు ధూంధాంగా జరిగింది. తొలుత సింహవాహిని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెసిడెంట్ కమిషనర్ శశాంక్‌గోయల్ ఇండియాగేట్ వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి 150 మంది సాంస్కృతిక కళాకారుల సంప్రదాయ డప్పు మోతలు, పోతురాజుల ఆటలు, ఒగ్గుడోలు నాట్యాలు, పూర్ణకుంభాల మధ్య అమ్మవారి ఘటాల ఊరేగింపు తెలంగాణ భవన్ వరకు సాగింది. ఈ కార్యక్రమం దేశరాజధానిలో వివిధ రాష్ట్రాల ప్రజలతోపాటు, విదేశీపర్యాటకులను విశేషంగా ఆకట్టుకొంది. పలువురు విదేశీయులు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా చూస్తూ భారతీయ సాంస్కృతిక రూపాలను, బోనాల పండగ వైభవాన్ని ఫొటోలు, వీడియోల్లో బంధించారు. ఊరేగింపు అనంతరం తెలంగాణ భవన్‌లో ఘటాల స్థాపన జరిగింది.

తెలంగాణ తరహాలో కర్ణాటకలో నీరా ప్రాజెక్టు

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో నారాయణగురు సంస్థాన్ బృందం భేటీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ తరహాలో కర్ణాటక రాష్ట్రంలో నీరా ఉత్పత్తుల తయారీని చేపడుతున్నట్లు ఆ రాష్ట్రానికి చెందిన నారాయణగురు సంస్థాన్ అధ్యక్షుడు సిద్ధప్ప తెలిపారు. ఆయన నాయకత్వంలోని బృందం మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసింది. ఆయన ఆబ్కారీ మంత్రిగా ఉన్న సమయంలో చేపట్టిన నీరా ప్రాజెక్టు గురించి వారు చర్చించి తెలుసుకున్నారు. కర్ణాటకలోనూ తాటి, ఈత, కొబ్బరి చెట్ల నుంచి నీరా తీసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సిద్ధప్ప తెలిపారు. తమ ప్రాజెక్టు సహకారం అందించాలని కోరారు. తాటి, ఈత, కొబ్బరి చెట్ల నుంచి వైన్, రమ్ తరహా ఉత్పత్తుల ప్లాంటు బెంగళూరులో ఇటీవలే ప్రారంభమైందని, దానిని సందర్శించాలని మాజీ మంత్రిని బృందం కోరగా.. ఆయన అంగీకారం తెలిపారు. అనంతరం బృందం సభ్యులు శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి నగర శివారులో నీరాను ఉత్పత్తి చేసే ఈత చెట్లను పరిశీలించారు.



ఈత చెట్టును పరిశీలిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, సిద్ధప్ప బృందం

కార్డేలియా విహార నౌక వచ్చేస్తోంది!

- 1,100 ప్రయాణికులతో నేడు విశాఖకు
- నౌకా పర్యాటకాన్ని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, విశాఖపట్నం: సాగర విహార ప్రపంచానికి విశాఖపట్నం మరోసారి స్వాగతం పలుకుతోంది. అలలపై ఆహ్లాదకర ప్రయాణాన్ని అందించే విలాసవంతమైన సముద్ర విహార నౌక కార్డేలియా బుధవారం విశాఖ చేరుకోనుంది. ఇక్కడి పోర్టులో కొత్తగా నిర్మించిన అంతర్జాతీయ క్రూజ్ టెర్మినల్‌కు 1,100 మంది పర్యాటకులతో ఈ నౌక రానుంది. చెన్నై నుంచి వచ్చే కొందరు పర్యాటకులు విశాఖలో దిగిపోతారు. విశాఖ నుంచి మరికొందరిని ఎక్కించుకుని బుధవారం సాయంత్రం 4గంటలకు పుదుచ్చేరికి కార్డేలియా పయనమవుతుంది. ఈ నౌకా పర్యాటకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా శ్రీకారం చుట్టనున్నారు.

షెడ్యూల్ ఇలా: కార్డేలియా విహార నౌక విశాఖ నుంచి ఈ నెల 2, 9, 16 తేదీల్లో ప్రారంభమవుతుంది. చెన్నై-విశాఖ- పుదుచ్చేరి-చెన్నై మధ్య మూడు సర్వీసులు ఈ నెలలో నడపనున్నారు. ఈ నౌక జూన్ 30వ తేదీ చెన్నైలో బయలుదేరింది. జులై 2వ తేదీ ఉదయం 8.30 గంటలకు విశాఖ పోర్టులోని టెర్మినల్‌కు చేరుకుంటుంది. అదే రోజు సాయంత్రం బయలుదేరి 4వ తేదీన పుదుచ్చేరికి చేరుకుంటుంది. మళ్లీ అదేరోజు అక్కడి నుంచి బయలుదేరి 5వ తేదీన చెన్నైకి చేరడంతో ఒక ట్రిప్పు పూర్తవుతుంది.

ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మి పిటిషన్‌పై విచారణ 3న

ఈనాడు, హైదరాబాద్: ఓఎంసీ కేసులో 6వ నిందితురాలైన ఐఏఎస్ అధికారి వై.శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణను ఈనెల 3వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో డిశ్చార్జి పిటిషన్‌ను సీబీఐ కోర్టు కొట్టివేయడంతో శ్రీలక్ష్మి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు అనుమతిస్తూ శ్రీలక్ష్మిపై కేసును కొట్టివేయగా తమ వాదన వినకుండా ఉత్తర్వులు జారీ అయ్యాయంటూ సీబీఐ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారించిన సుప్రీం కోర్టు తిరిగి హైకోర్టుకే పంపుతూ.. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకుని తేల్చాలని ఆదేశించింది. శ్రీలక్ష్మి పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కె.వివేక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ రికార్డులు ఎక్కువగా ఉన్నాయని, వాటిపై సిద్ధం కావడానికి కొంత సమయం కావాలని కోరారు. న్యాయమూర్తి అనుమతిస్తూ విచారణను వాయిదా వేశారు. సీబీఐ తరఫున శ్రీనివాస్ కపాటియా హాజరయ్యారు.

ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగో విమానం మంగళవారం రాత్రి అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన ఇండిగో సర్వీస్.. హైదరాబాద్‌లో వాతావరణం అనుకూలించకపోవడంతో విజయవాడకు దారి మళ్లించారు. సుమారు 20 నిమిషాల అనంతరం వాతావరణం సహకరించడంతో తిరిగి హైదరాబాద్‌కు పంపారు.

జైలు నుంచి నందిగం సురేష్ విడుదల

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్ గుంటూరు జిల్లా జైలు నుంచి మంగళవారం రాత్రి బెయిల్‌పై విడుదలయ్యారు. మే 17న ఉద్దండరాయునిపాలేనికి చెందిన తెదేపా కార్యకర్త ఇసుకపల్లి కృష్ణపై దాడి చేసి గాయపరిచిన కేసులో నందిగంను మే 18న అరెస్టు చేయగా కోర్టు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. బెయిల్ కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం దక్కలేదు. గుంటూరు జిల్లా అదనపు కోర్టు న్యాయమూర్తి వై.నాగరాజు సోమవారం షరతులతో బెయిల్ మంజూరు చేశారు. మంగళవారం రాత్రి జిల్లా జైలు నుంచి బయటకు వచ్చిన సురేష్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా పరామర్శించారు.

పాత్రికేయుడు కృష్ణంరాజు విడుదల

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: రాజధాని ప్రాంత మహిళల పట్ల మురికి వ్యాఖ్యలు చేసిన కేసులో నిందితుడైన పాత్రికేయుడు కృష్ణంరాజు మంగళవారం రాత్రి గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. సాక్షి ఛానల్ చర్చా కార్యక్రమంలో మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసేలా జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజును తుళ్లూరు పోలీసులు అరెస్టు చేశారు. ఆయనకు సోమవారం హైకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు.